# ద్రష్ట

నవల

## కస్తూరి మురళీకృష్ణ



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

కౌముది ప్రచురణలు - 122






ఒక్కమాట

దక్షిణ భారతం పైకి దండెత్తి వచ్చిన మొదటి ముస్లిం సేనాని మాలిక్ కాఫర్.

అల్లావుద్దీన్ ఖిల్జీ ఢిల్లీ పాలకుడిగా ఉన్న సమయంలో మాలిక్ కాఫర్ మలబారు తీరం వరకూ చొచ్చుకు వచ్చాడు. మధురపై దాడి చేశాడు. శ్రీరంగంలో మారణహోమం సృష్టించాడు. చిదంబర ఆలయాన్ని పునాదులతో సహా పెకిలించి వేశాడు. బోలెడంత సంపదను ఏనుగులపై మోసుకుని ఢిల్లీ తీసుకు వెళ్ళాడు. ఆ దండయాత్ర ఈ కథకు ఆధారం. మాలిక్ కాఫర్ దండయాత్ర వల్ల భారతీయ సమాజంలో జరిగిన అల్లకల్లోలాన్ని, భారతీయ మనస్తత్వం పై కలిగిన గాయాల ప్రభావాన్ని వర్ణించటం ఈ రచన ప్రధానోద్దేశ్యం.

మనకు సాధారణ చరిత్ర పుస్తకాలలో, కనబడని ఘోరమైన చేదు నిజాలు, మనల్ని మనం మరిచిపోతున్న తరుణంలో, మన పూర్వీకులు ఎన్ని దారుణమైన మారణకాండలను అనుభవిస్తూ కూడా ధర్మాన్ని పదిలంగా కాపాడాలో, ప్రజలకు తెలియ చెప్పాలన్న ఆశయంతో ఈ రచన సాగుతుంది. చరిత్రలో జరిగిన గాయాలను తిరిగి తోడటం కాదిది. మానని గాయాల స్వరూపాన్ని అర్థం చేసుకోవటం ద్వారా వాటి చికిత్సకు ఉపక్రమించుటంతో పాటు, భవిష్యత్తులో ఇటువంటి గాయాలు కాకుండా జాగ్రత్తలు పడేందుకు దేశ ప్రజలను ఉద్యుక్తులను చేయటం ఈ రచన లక్ష్యం. అనేక చారిత్రక ఆధారాలు, చారిత్రక పాత్రలు, కాల్పనిక పాత్రలలో కలగలిపి సాగించిన రచన ఇది.

మురళీకృష్ణ

‘ఓం న మఃశివాయ‘ తెలతెలవారుతోంది..

చిక్కటి చీకటి దుప్పటి కొద్ది కొద్దిగా తొలిగించుకుని, జగతి కళ్ళు తెరవాలని ప్రయత్నిస్తోంది. కానీ దట్టమైన బద్ధకంలాంటి పొగమంచు చైతన్యంలాంటి వెలుతురుకు అడ్డుపడుతోంది. చైతన్యం ఉండి, నిద్రణావస్థలో ఉన్న తెలివిలాగా, వెలుతురు ఉండి, ఎదురుగా

ఉన్నవేవి సరిగ్గా కనపడకుండా అడ్డుపడుతోంది పొగమంచు. "ఓ నమఃశ్శివాయ " మనస్ఫూర్తిగా మరోసారి ఉచ్చరించాడు భవానీ శంకరుడు.

"ఇప్పుడీ జగతిని చూస్తే ఇదంతా అభాస అని స్పష్టంగా తెలుస్తోంది " పొగమంచును చీల్చి చూడాలని ప్రయత్నిస్తూ అన్నాడు శివానందుడు.

"అంతేకదా మరి. పొగమంచు కరుగుతున్న కొద్దీ వెనక ఉన్న దృశ్యాలు స్పష్టమౌతాయి. అలాగే మెదడును ఆవరించిన అజ్ఞానమనే పొగమంచు కరిగితే కానీ జ్ఞానమనే దృశ్యాలు మనకు గోచరించవు" మృదువుగా చెప్పాడు భవానీ శంకరుడు.

అంతవరకూ మౌనంగా ఉన్న గంగాధర శర్మ నోరు విప్పాడు.

"పొగమంచుని అజ్ఞానపు తెరతో పోల్చడం బాగానే ఉంది. కానీ విశిష్టాద్వయిత సిద్ధాంతంతో ప్రజలలోకి చొచ్చుకుపోతున్న రామానుజాచార్యునితో వాదించి గెలవటం గురించి ఆలోచించండి. మనం గెలవగలమన్న ఆలోచన పొగమంచులాంటిది కాకుండా చూడండి! " అన్నాడు.

భవానీశంకరుడు చిరునవ్వు నవ్వాడు "గంగాధరా! సృష్టి స్థితి లయకారకుడయిన పరమశివుడి పరమభక్తులం మనం. మనకి ఎదురులేదు. మనకు ఓటమి రాదు! " అన్నాడు విశ్వాసంగా

"ఓం పూర్ణమధఃపూర్ణమిదం పూర్ణాత్ పూర్ణమదచ్యతే!

పూర్ణస్య పూర్ణ మాదాయ పూర్ణమే నావ శిష్యతే!!"

గంభీరంగా మంత్రం చదివాడు శివానందుడు.

గంగాధర శర్మ వైపు తిరిగి అడిగాడు "ఈ మంత్రం అర్థం తెలుసుకదా?

ఆ కనిపించింది అనంతం. ఆ అనంతం నుండి ఈ అనంత విశ్వం బహిర్గతమైంది. దాని నుండి వెలువడినా అనంతం అనంతంగానే ఉంది" గబగబా చెప్పాడు గంగాధర శర్మ.

"చాలు. మన సిద్ధాంతానికి దీన్ని మించి వేరు నిరూపణలు అవసరం లేదు. ఇతర వాదనలు అనవసరం. ఆ కనిపించని అనంతం సృష్టికర్త అయిన పరమేశ్వరుడు. ఈ కనిపించే విశ్వం కూడా పరమేశ్వరుడే ఈ ప్రపంచం పరమేశ్వరుడి నుంచే బహిర్గతమయింది. అర్థమయిందా, ప్రపంచమంతా పరమేశ్వరుడే అంటే ఈ ప్రపంచానికీ, పరమేశ్వరుడికీ తేడాలేదు. అంతా ఒకటే. 'ఈశావాస్య మిదం సర్వం'. ఈ ప్రపంచమంతా ఈశ్వరుడిచే ఆవరించి ఉంది. ఈ వాదన ముందు ప్రపంచం వేరు, భగవంతుడు వేరు అనే విశిష్టాద్వైతవాదన ఏం నిలబడుతుంది?" ప్రశ్నించాడు శివానందుడు.

గంగాధర శర్మ కాస్సేపు మౌనంగా ఉన్నాడు. చివరికి మెల్లగా అన్నాడు "ఈ ప్రపంచం పరమేశ్వరుడి నుంచి వెలువడుతుంది. అంటే పరమేశ్వరుడి నుంచి వేరు పడిందనే కదా అర్థం. మరి, పరమేశ్వరుడి నుంచి వేరుపడిన ప్రపంచం, పరమేశ్వరుడూ వేర్వేరు అవ్వాలి కానీ ఒకటే ఎలా అవుతారు? అంటే అర్థం, ప్రపంచం వేరు, పరమేశ్వరుడు వేరు అనే కదా! ప్రపంచం భక్తుడయితే, పరమేశ్వరుడు భగవంతుడయితే, భక్తుడూ, భగవంతుడూ వేర్వేరు అవ్వాలి కదా! అదే విశిష్టాద్వయితం!"

ఒక క్షణం సేపు గంగాధర శర్మ వైపు దెబ్బతిన్నట్టు చూశాడు శివానందుడు.

"గంగాధర శర్మా! నువ్వు ఎవరివైపు ఉన్నావో నాకు అర్థంకావటంలేదు" కోపంగా అన్నాడు భవానీ శంకరుడు.

"మనం రామానుజాచార్యులవారితో వాదనకు వెళుతున్నాం. రామానుజాచార్యులు దైవాంశ సంభూతులు. పార్థసారథి స్వామి స్వయంగా రామానుజాచార్యుల వారి అవతారం ఎత్తారంటారు. మనం మామూలు మనుషులం. ఆయనతో వాదనలో తలపడేందుకు వెళుతున్నాం. అటువంటప్పుడు విషయాన్ని మనం అన్ని కోణాల నుంచి విశ్లేషించాలి. ప్రత్యర్థిలా ఆలోచించాలి. ప్రత్యర్థి వాదనలను

ఊహించాలి. అన్ని వాదనలను పూర్వపక్షం చేసేందుకు సిద్ధంగా ఉండాలి. అయినా మన అహంకారం కానీ, మన పరిజ్ఞానం, రామానుజాచార్యుల వారితో ఏ రకంగానూ సరితూగదు. ఆయనతో మనం ఏం వాదించగలం? నా ఎదురు వాదనకే మనవద్ద జవాబు లేదు. ఆ దైవాంశ సంభూతినితో ఎలా చర్చిస్తాం?" ఆవేశంగా అడిగాడు గంగాధర శర్మ.

భవానీ శంకరుడూ, శివానందుడూ, గంగాధర శర్మ వైపు కోపంగా చూశారు.

"గంగాధర శర్మా నీకు చివరిసారి చెపుతున్నాను. నువ్వు అడుగడుగునా మమ్మల్ని నిరుత్సాహపరిచే ప్రయత్నాలు చేయకు. మనం ఇల్లు విడిచి బయలుదేరే ముందు చెప్పాను. వాదనలో మనం గెలవలేమని నమ్మకం లేకపోతే మాతో రానేవద్దని చెప్పాను. అయినా, ఏం జరిగినా మనం ముగ్గురం ఒకటి అని వెంట వచ్చాను. ఇప్పుడు శల్యసారథ్యం చేస్తున్నావు. మనం వాదనలో గెలవలేమన్న భయం నీకుంటే వెంటనే వెనుతిరిగి వెళ్ళిపో. వెంట వస్తూ మమ్మల్ని నిరుత్సాహపరచకు" కోపంగా అన్నాడు శివానందుడు.

"మేం రామానుజాచార్యుల వారిని వాదనలో ఓడించే ఇంటికి వస్తాం" నిశ్చయంగా అన్నాడు భవానీ శంకరుడు.

"గంగాధర శర్మా.... మనం రామానుజుల వారిని వాదనలో ఓడిస్తామని గురువుగారికి మాట ఇచ్చాం. మాట నిలబెట్టుకుంటాం. నువ్వు ఇలా అడుగడుగునా మనకు వ్యతిరేకంగా మాట్లాడితే ఎలా?" అడిగాడు శివానందుడు.

వంచిన తల ఎత్తలేదు గంగాధరుడు. కాస్సేపటికి మెల్లిగా, లోగొంతుకలో అన్నాడు.

"నేను మనకు వ్యతిరేకంగా మాట్లాడటం లేదు. అడుగు ముందుకు వేసేముందు ఆలోచించమంటున్నాను. మనం సామాన్యులం. ఆవేశం తప్ప ఆలోచన లేని వాళ్ళం. మిడిమిడి జ్ఞానంతో సంపూర్ణ జ్ఞానితో తలపడేందుకు వెళుతున్నాం. దివిటీలు సూర్యుడితో తలపడేందుకు ముందుకు దూకినట్లు మనం అడుగు ముందుకు వేస్తున్నాం. అందుకే దూకుడు తగ్గించి ఆలోచించమంటున్నాను. మన జ్ఞానాన్ని పునర్విమర్శించుకుని, అవసరమైతే మరికాస్త అధ్యయనం చేసి, మన జ్ఞానాన్ని మెరుగుపరచుకుని వద్దాం. లేకపోతే కోలాహలం పండితుడిలా భంగపడతాం!"

"కోలాహలం పండితుడా?" అడిగాడు భవానీ శంకరుడు.

"రామానుజాచార్యుల గురువు యమునాచార్యులు. ఆయన బాల్యంలోనే కోలాహల పండితుడనే మహాపండితుడని వాదనలో ఓడించాడు. కేవలం మూడు చిత్రమైన ప్రశ్నలతో అంత గొప్ప పండితుడి ఆట కట్టించాడు" అని చెప్పాడు గంగాధర శర్మ.

"ఏమిటా చిత్రమైన ప్రశ్నలు?" కుతూహలంగా అడిగాడు శివానందుడు.

"యమునాచార్యులు మూడు ప్రతిపాదనలు చేశారు. వాటిని తిరస్కరించి, నిరూపించటం కోలాహలం పండితుడి పని. తిరస్కరించి, నిరూపిస్తే కోలాహలుడు గెలిచినట్టు. లేకపోతే యమునాచార్యులు గెలిచినట్టు".

"ఇంతకీ ఏమిటా ప్రతిపాదనలు? " ఆత్రంగా అడిగాడు భవానీ శంకరుడు.

"మొదటి ప్రతిపాదన, కోలాహల పండితుడి తల్లి సంతానవతి కాదు. రెండవ ప్రతిపాదన పాండ్య రాజు అసత్యవాది. మూడవ ప్రతిపాదన, పాండ్య రాణి పతివ్రత కాదు వీటిని కాదని నిరూపించాలి."

పిచ్చివాడిని చూసినట్టూ అతడివైపు చుశారు మిగతా ఇద్దరూ.

"ఈ ప్రతిపాదనలు అర్థంలేనివి. కోలాహల పండితుడికి జన్మనిచ్చింది కాబట్టి అతని తల్లి సంతానవతి. కాదనటంలో అర్థం ఉంటుందా? " అడిగాడు భవానీ శంకరుడు.

"పాండ్యరాజు ఆస్థానంలో ఉంటూ, ఆయన అసత్యవాది అని నిరూపించటం మూర్ఖత్వం కాదా? " అరిచాడు శివానందుడు.

"నిండు రాజసభలో, రాజు భార్య పతివ్రత కాదని, వాదించి నిరూపించటం మరణ సదృశం. ఇవేం పనికి రాని పిచ్చి ప్రతిపాదనలు? " అన్నాడు భవానీ శంకరుడు.

గంగాధర శర్మ నవ్వాడు.

''చూశారా...! యమునాచార్యుల తెలివి. మామూలు మాటలతో అంత పెద్ద పండితునితో సహా అందరినీ బోల్తా కొట్టించాడు. ఈ ప్రతిపాదనలను శాస్త్రాల ఆధారంగా అత్యంత చమత్కారంతో సమర్థించవచ్చు. మనుధర్మ శాస్త్రం ప్రకారం. ఒకే సంతానం ఉన్న స్త్రీ, గొడ్రాలితో సమానం. కోలాహలుడి తల్లికి అతనొక్కడే సంతానం. కాబట్టి. అతని తల్లి సంతానవతి కానట్టే! ''

దెబ్బతిన్నట్టూ చూశారిద్దరూ గంగాధర శర్మవైపు.

''మిగతా ప్రతిపాదనలనెలా సమర్థిస్తావు? '' అడిగాడు భవానీ శంకరుడు కుతూహలంగా.

''కలియుగంలో ధర్మం ఒక పాదం మీద, అధర్మం మూడు పాదాల మీద నడుస్తుంది. ప్రజలను పాలించే రాజువారి దోషాలలో ఆరవవంతు పొందుతాడు. కాబట్టి కలియుగంలో రాజు ఎంత సత్యవంతుడయినా, అసత్యవంతుడే అవుతాడు. మునుపు ప్రకారం రాజు, అగ్ని, వాయువు, సూర్యుడు, చంద్రుడు, యముడు, కుబేరుడు, వరుణుడు, ఇంద్రులకు ప్రతిరూపం రాజును పెళ్ళాడటం అంటే రాజుతో పాటుగా ఈ ఎనిమిది మందినీ పెళ్ళాడటమే. ఇంత మందిని పెళ్ళాడిన రాణి పతివ్రత ఎలా అవుతుంది?''

''ఇది అన్యాయం''

''ఇది మోసం'' ఇద్దరూ ఒకేసారి అన్నారు.

గంగాధర శర్మ నవ్వాడు.

''ఇది తర్కం. వాదనలో తర్కం ప్రాణం వంటిది. తర్కించాలంటే శాస్త్రాల గురించి సంపూర్ణంగా, లోతైన జ్ఞానం ఉండాలి. పలు అర్థాలనిచ్చే ఒకే పదాన్ని. ఒకే సందర్భంలో పలు అర్థాలతో విశ్లేషించగలగాలి. ఆ జ్ఞానంలేని మనం యమునాచార్యులకు తగ్గ శిష్యుడయిన రామానుజుల వారితో వాదించటానికి పరుగెడటమటే, దీపంలో పడి మాడేందుకు పరుగిడే శలభం గుర్తుకు రావటం లేదూ?'' అడిగాడు గంగాధర శర్మ.

చాలా సేపు ముగ్గురూ మౌనంగా ఉన్నారు వాళ్ళ కాళ్ళ క్రింద నలుగుతున్న ఆకుల శబ్దం తప్ప మరో శబ్దం వినిపించటం లేదు. చివరికి గంగాధర శర్మ మౌనాన్ని భంగం చేశాడు.

''మనం ముగ్గురం ఒక జట్టు. మీ ఉత్సాహాన్ని కాదనలేక నేనూ మీతో వచ్చాను. మీ ఆవేశాన్ని అడ్డుకోలేకపోయాను. కానీ మనకు సరైన పాండిత్యం లేదు. సరైన విజ్ఞానం లేదు. కనీసం మన ప్రత్యర్థి శక్తియుక్తుల గురించి అవగాహన కూడా లేదు. అటువంటప్పుడు గుడ్డివాడిలా ముందుకు దూసుకుపోవటం అనర్థదాయకం. ఇందువల్ల మనం మన గురువుగారికి పేరు కన్నా అపఖ్యాతి తెచ్చిన వారమవుతాము. కాబట్టి, ఆలోచించండి. ఇంకా సమయం ఉంది. వెనక్కు తిరిగి వెళదాం. శాస్త్రాల అధ్యయనం తీవ్రంగా చేద్దాం. రకరకాల వాదనలను క్షుణ్ణంగా పరిశీలిద్దాం. అప్పుడు మళ్ళీ వాదనకు వద్దాం.'' బ్రతిమిలాడుతున్నట్టు అన్నాడు గంగాధర శర్మ.

మిగిలిన ఇద్దరూ అడ్డంగా తలలూపారు.

''ఇంత దూరం వచ్చి వెనక్కు తిరగటం వ్యర్థం. మేము రామానుజులతో వాదించే తీరతాం. నువ్వు మాతో రావాలనుకుంటే రావచ్చు. లేకపోతే వెనక్కి తిరిగి వెళ్ళిపోవచ్చు. మా నిర్ణయం మారదు. శంకరాచార్యులపై మాకున్న విశ్వాసమే మమ్మల్ని కాపాడుతుంది'' ఇద్దరూ విశ్వాసంగా అన్నారు.

గంగాధర శర్మ ఏమీ మాట్లాడలేదు. మౌనంగా వారిని అనుసరించాడు. కాస్సేపు మౌనంగా నడిచిన శివానంద వెనుతిరిగి చూశాడు.

''వెంట వస్తున్నావేం?'' అడిగాడు.

గంగాధర శర్మ నవ్వాడు. ''కలిసి బయలుదేరాం. కలిసి వెనుతిరుగుదాం. గెలుపైనా ఓటమి అయినా మీతోనే'' అన్నాడు

ముగ్గురూ మౌనంగా నడవసాగారు.

కాస్సేపటికి దూరంగా మిల మిల మెరుస్తూ కావేరీనది కనపడింది. ముగ్గురూ ఆ నదీ సౌందర్యానికి అప్రతిభులై నిలిచిపోయారు.

"ఆ ప్రవహిస్తున్నది నదికాదు ముత్యాల స్రవంతి" అన్నాడు భవానీశంకరుడు ఆనందంతో.

"అనంతుని పడగలపై నున్న అనంత మణుల ప్రకాశమిది" అన్నాడు శివానందుడు.

గంగాధర శర్మ కళ్ళు మూసుకుని మిల మిల మెరుస్తున్న నీటి ప్రవాహాన్ని గుండెలనిండా నింపుకున్నాడు. మనఃస్ఫూర్తిగా నమస్కరించాడు.

"శ్రీరంగం చేరుకున్నామన్నమాట" అన్నాడు శివానందుడు ఎదురుగా వస్తున్న మనుషులను చూస్తూ.

వాళ్ళందరి నుదిటిపైన తిరునామాలున్నాయి.

ముగ్గురూ కావేరీ నదీ నీటిలో స్నానమాడి పరిశుద్ధులయ్యారు. తమకు జయం కలిగేట్టు దీవించమని కావేరీ మాతను ప్రార్థించారు.

"మన జయం నిశ్చయమనిపిస్తోంది" అన్నాడు భవానీశంకరుడు.

ముగ్గురూ భగవంతుడిని స్మరిస్తూ ముందుకు నడిచారు. ఇంతలో ఎదురుగా ఓ బ్రాహ్మణుడు వస్తూ కనిపించాడు. అతడిని చూస్తుంటేనే ముగ్గురిలో పవిత్ర భావన జాగృతమయింది. సూర్యుడు మానవుడి రూపంలో భూమిపై నడచివస్తున్నట్టు అనిపించింది ముగ్గురికీ. అతని కళ్ళు కలువల్లా ఉన్నాయి. వెన్నెలను ప్రతిఫలిస్తున్నాయి.

సూర్యకాంతితో ఉన్న ఆయన వదనం ప్రశాంత సరోవరంలా ఉంది. మండించే సూర్య కిరణాలను గ్రహించి, జగతికి శీతల కిరణాలను పంచే చంద్రుడిలా ఉంది ఆయన చిరునవ్వు. ఆయన దగ్గరకు రాగానే శివానందుడు చేతులు జోడించి అడిగాడు.

"స్వామీ, రంగనాథ మందిరం దగ్గరే ఉందా? " ఆయన ప్రశాంతంగా నవ్వాడు.

"వైకుంఠానికి దూరం ఎంతంటే ఏం చెప్పమంటారు? కళ్ళుమూస్తే మీ హృదయంలోఉంది. కళ్ళు తెరిస్తే ఎదురుగానే ఉంది" ఆయన మాటలు ముగ్గురికీ అర్థంకాలేదు.

అంతలో గంగాధర శర్మ దృష్టి గుడిగోపురంపై పడింది. నవ్వుతూ మిగతా వారికి గుడి చూపించాడు. ముగ్గురు ఆ బ్రాహ్మణుడికి నమస్కరించి, అడుగు ముందుకు వేశారు. ఎందుకో ముగ్గురికీ ఆ బ్రాహ్మణుడిని వదలి వెళ్ళాలనిపించటం లేదు. ఏదో మాట్లాడుతూ ఆయన సమక్షంలో ఇంకాస్సేపు ఉండాలనిపిస్తోంది.

"స్వామీ, రామానుజాచార్యుల వారు మందిరంలోనే ఉన్నారా?" అడిగాడు శివానందుడు. వారిని దాటి వెళుతున్న ఆ బ్రాహ్మణుడు ఆగాడు. వెనుతిరగకుండానే సమాధానం ఇచ్చాడు.

"ఆధారం మందిరంలో ఉంది. అధేయం ఎదురుగానే ఉంది. వీరిలో ఏ రామానుజుడు కావాలి మీకు? ఆధారమా? అధేయమా?" వెన్నెల ధ్వనిలా మారితే ఆయన స్వరంలానే ఉంటుందనిపించింది ముగ్గురికీ.

ఆయన మాటలు ముగ్గురికీ అర్థం కాలేదు.

రామానుజాచార్యుల వారి సిద్ధాంతం ప్రకారం భగవంతుడికీ జీవులకూ నడుమ సంబంధం శరీరి - శరీర, శేష - శేషి, విశిష్ట విశేషణాల వంటిది. శరీరి అంటే ఆత్మ. భక్తుడు శరీరం అయితే భగవంతుడు ఆత్మ, ఇలాంటిదే ఆధార, అధేయ సంబంధం. అధేయం అంటే ఆధారాన్ని అందుకుంటున్నది.

నడుస్తున్న ముగ్గురు ఆగిపోయారు. వెనక్కు తిరిగి చూశారు. బ్రాహ్మణుడు దూరంగా వెలుగుచుక్కలాగా కనిపిస్తున్నాడు.

"ఆధారం మందిరంలో ఉంది అంటే రంగనాధుడు మందిరంలో ఉన్నాడు. అధేయం అంటే ఆ ఆధారం ద్వారా నిలిచి ఉన్న శరీరం, రామానుజుల వారు మన ఎదురుగానే ఉన్నారు. మనం మాట్లాడింది రామానుజుల వారితోనే" ఆనందంగా అరిచాడు శివానందుడు.

"ఆహా.. రామానుజుల వారు భగవంతులు. ఆయనతోనా మన వాదన. ఆయన దర్శనంతోనే నాకు జ్ఞానోదయమయింది. నాలో అజ్ఞానం సంపూర్ణంగా నశించే వరకూ ఈ దారినే ఎదురుచూస్తుంటాను. " కంటనీరు పొంగుతుండగా అలౌకికానందంతో అన్నాడు శివానందుడు.

అక్కడే కూలబడిపోయాడు.

అతడి దృష్టి రామానుజులు వారు వెళ్ళిన వైపే ఉంది. "ఆహా! ఈ మహాత్ముడితోనా వాదించాలని వచ్చింది` నా మూర్ఖత్వం ఈ జన్మకు వదలదు. కనీసం వచ్చే జన్మలోనయినా నాకు జ్ఞానం ప్రసాదించు దేవా! " అంటూ పిచ్చిపట్టిన వాడిలా కావేరి వైపు పరుగెత్తాడు భవానీశంకరుడు. అలా కూలబడిపోయిన శివానందుడు, పరుగెత్తిన భవానీశంకరుడు నడుమ నిలిచిపోయాడు గంగాధర శర్మ.

శివానందుని వదిలి వెళ్ళలేడు. భవానీశంకరుడి వెంట పరుగిడలేడు.

రామానుజుల వారి దర్శనమాత్రం తోటే తన తనువు అణువణువుతో కలిగిన దివ్యానందానుభూతిని అనుభవించి అర్థం చేసుకోవాలని సతమతమవుతూ చాలాసేపు అలాగే నిలబడి ఉండిపోయాడు గంగాధర శర్మ.

చాలాసేపటికి అతడికి స్మృతి వచ్చింది.

జరిగింది గుర్తుకు వచ్చింది. శివానందుడు లేడు. భవానీశంకరుడూ అదృశ్యం అయిపోయాడు.

నెమ్మదిగా ఒంటరిగా ఇంటిదారి పట్టాడు గంగాధర శర్మ.

ఇంటికి వచ్చిన భర్తను చూసి సంతోషించాలో, దుఃఖించాలో అర్థం కావటం లేదు గంగాదేవికి.

ఊరు తిరిగివచ్చిన గంగాధర శర్మ ఏదో లోకంలో ఉన్నట్లున్నాడు. ఎవరితో ఏమీ మాట్లాడటం లేదు. ఏం జరిగిందో చెప్పడం లేదు. అసలు అతడు భౌతికంగా ఈ లోకంలో ఉన్నా మానసికంగా మరో ప్రపంచంలో ఉన్నట్లనిపిస్తోంది. ఎవరు పలకరించినా పలకటం లేదు. ఎంత మాట్లాడించిన మాట్లాడటం లేదు. పనులు యాంత్రికంగా చేస్తున్నాడు తప్ప వాటిపై శ్రద్దలేదు. అర్ధరాత్రి అందరూ పడుకున్న తరువాత మాత్రం భర్త తనలో తాను గొణుక్కోవటం గంగాదేవి విన్నది. అతడేమి గొణుగుతున్నాడో జాగ్రత్తగా విన్నది.

"మహాత్ముడిని చూసి ధన్యమయిన కళ్ళతో ఈ ప్రపంచాన్ని చూడలేను. కానీ నా గురువు బోధించి, మనసుకు నచ్చిన సిద్ధాంతాన్ని కాదనలేను. నమ్మినదాన్ని కాదనలేక, చూసినదాన్ని ఒప్పుకోలేక ఎలా బ్రతకాలి?"

భర్తను చూస్తుంటే ఆమెకు భయం పెరిగిపోసాగింది. కానీ ఏం చేయాలో తోచటం లేదు. వైద్యులు అతడికి ఎటువంటి సమస్యలేదని అంటున్నారు. కొన్నాళ్ళయితే మాములుగా అయిపోతాడంటున్నారు. కానీ ఆమెకు కంగారుగా ఉంది.

ఓరోజు అర్ధరాత్రి ఆమెకు నిద్రపడుతుండగా గంగాధర శర్మ వచ్చి ఆమెను లేపాడు.

"గంగా నాకో వాగ్దానం చేయాలి" అన్నాడు.

ఆమె భర్తవైపు అయోమయంగా చూసింది.

"ఇంతరాత్రి ఇదేమిటి?" అంది.

"నాకు సమయం లేదు. గంగా, నేను అయోమయంలో ఉన్నాను. మనసు భావించేదానికి, బుద్ధి చెప్పేదానికి నడుమ సమన్వయం కుదరటం లేదు" అన్నాడు.

"మీరేమంటున్నారో నాకు అర్థంకావటంలేదు" అంది గంగాదేవి.

ఆమె మాటలు విన్నట్టు లేదు గంగాధర శర్మ. తన ధోరణిలో చెప్పుకుంటూ పోయాడు.

"గంగా, తండ్రి ఋణం తనయుడు తీర్చాలంటారు. నేను నా గురువుకిచ్చిన వాగ్దానం నెరవేర్చుకోలేను. కనీసం నా సంతానం అయినా, ఈ వాగ్ధానం నెరవేచాలని నా కోరిక. ఒకవేళ నా సంతానానికి సాధ్యం కాకున్నా, మన వంశంలో ఎవరయినా ఎన్నడయినా విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ఖండించాలి. అంతవరకూ నా ఆత్మకు శాంతిలేదు. నా కోరిక నెరవేర్చేందుకు ప్రయత్నిస్తానని వాగ్దానం చెయ్యి గంగా" ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

అప్రయత్నంగా "అలాగేనండీ. మీ మాట పాటిస్తాను" అంది గంగాదేవి.

"చాలు.. ఈ జన్మకిది చాలు. నేను కాకున్నా నా తరువాత తరాలవారెవరయినా నా మాట నిలిపితే చాలు" గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు గంగాధర శర్మ.

అంతే ఆ తరువాత గంగాధర శర్మ ఎవరికీ కనబడలేదు. ఎటువెళ్ళాడో తెలియదు. ఏమైపోయాడో తెలియదు.

కానీ అతని వంశంలో ఇదొక సాంప్రదాయమయింది. ఒక తరం నుంచి మరొక తరానికి గంగాధర శర్మ కోరికను అందచేయటం అలవాటయింది. ఆ తరువాత అతని వంశంలో వారు అనేకులు విశిష్టాద్వైతాన్ని ఖండించాలని ప్రయత్నించారు. విఫలులయ్యారు. వారు ఈ బాధ్యతను తరువాత తరానికి అందించారు.

ఇప్పుడు ఆ వంశం వారు దక్షిణ భారతం వదిలి వారణాసిలో స్థిరపడ్డారు.

దేశం మారింది కానీ వారి పట్టుదల మారలేదు. పిల్లవాడికి ఊహ రాగానే గంగాధర శర్మ గురించి చెప్పటం, పాండిత్యంతో శ్రీవైష్ణవాన్ని గెలవమని ప్రోత్సహించటం ఆనవాయితీగా మారింది.

మన కథాకాలం నాటికి అంటే పదమూడవ శతాబ్దం చివర్లో ఆ వంశంలో కవలలు జనించారు. ఊహరాగానే వారికి పెద్దలు ఈ కథ వినిపించారు.

'మా పూర్వీకుల ప్రతిజ్ఞను మేము నెరవేరుస్తాం' ప్రతిజ్ఞ పట్టారు కవలలు ఉపనయనం నాడు.

✡ ✡ ✡

## 2

'**గంగాధరా!. సమయమౌతోంది.** తొందరపడు. వేగిరం వేగిరం' ఉత్సాహంగా పిలుస్తున్నాడు చంద్రశేఖరుడు.

గంగాధరుడు పలకలేదు. ధ్యానం నుంచి కదలలేదు.

చంద్రశేఖరుడు అసహనం ప్రదర్శించాడు.

''అమ్మా! కాలయాపన జరుగుతోంది. ఇవాళ శూరవర్మ మాకు కత్తియుద్ధం నేర్పుతున్నాడు. ఎప్పుడూ మంత్రాలు వల్లెవేసి విసుగొస్తోంది. కత్తి యుద్ధానికి రమ్మంటే అన్నయ్య కదలటం లేదు.'' అమ్మ దగ్గరకు వెళ్ళి అన్నయ్యపై పితూరీ చెప్పాడు.

చంద్రశేఖరుడు, గంగాధరులిద్దరూ కవలలు. చంద్రశేఖరుని కన్నా ఒక క్షణం ముందు పుట్టినందుకు గంగాధరుడు అన్నయ్య అయ్యాడు.

సాధారణంగా సోదరుల నడుమ ఉండే పోటీవీరిద్దరి నడుమ కూడా ఉంది.

తనకన్నా ఒక్క క్షణం ముందు పుట్టటంతో జీవితాంతం అన్నయ్యగా గంగాధరుడి అధిక్యాన్ని ఒప్పుకునేందుకు చంద్రశేఖరుడి మనస్సు ఒప్పుకోవటం లేదు. ప్రతివిషయంలో అగ్రజుడికి ఉండే ప్రాధాన్యం ఒక్క క్షణంలో తనకి తప్పిపోవడం ఉక్రోషంగా ఉంటుంది.

'అమ్మా.. వాడు చూడు! రోజూకన్నా ఎక్కువసేపు ధ్యానం చేస్తున్నాడు. అవతల కత్తియుద్ధం నేర్పే సమయం మించిపోతోంది' ఇంకా గట్టిగా ఫిర్యాదు చేశాడు చంద్రశేఖరుడు.

వారి తల్లి నవ్వింది 'తొందరలేదు. నువ్వు అనవసరంగా కంగారుపడకు. మీరు వెళ్ళేదాకా పాఠం ఆరంభం కాదులే.'

'లేదమ్మా, సమయపాలన చాలా అవశ్యకం, కాలం ఎవరి కోసం ఆగనట్టే పాఠం కూడా ఎవరికోసం ఆగదన్నారమ్మా గురువర్యులు' గబగబా చెప్పాడు చంద్రశేఖరుడు.

'చూడమ్మా! ఒక్కరోజు కూడా చంద్రుడు పాఠానికి సరిగ్గా రాలేదు. పాఠంపై శ్రద్ధ చూపలేదు. ఈ వాళ కత్తి యుద్ధం అనేసరికి తొందరపడుతున్నాడు' ధ్యానం ముగించుకునివస్తూ అన్నాడు గంగాధరుడు.

అది విని చంద్రశేఖరుడు బుంగమూతి పెట్టాడు.

వాళ్ళిద్దరినీ దగ్గరకు తీసుకుంది వాళ్ళమ్మ.

'వెళ్ళండి! బాగా చదువుకుని రండి' అంది.

చివరిమాటలు అంటున్నప్పుడు ఆమె కళ్ళు గంగాధరుడి కళ్ళతో కలిసి విడిపోయాయి. ఎప్పుడు వారిని చదువుకోమని ఆశీర్వదించినా ఆమె మనస్సులో ఓ భీతి భావన మెదులుతుంది. ఎందుకంటే, వారి ఇంట్లో, ఎవరు ఎంత పాండిత్యం సంపాదించినా అది జీవితం కోసం కాదు. శ్రీవైష్ణవాన్ని ఖండించేందుకే. వారి వంశంలో అనేకులు శ్రీరంగం వెళ్ళి వైష్ణవ పండితులతో వాదించారు. ఓడిపోయి ఆత్మత్యాగం చేశారు అదీ ఆమె భయం.

గంగాధరుడికి ఆరంభం నుంచి శాస్త్ర పఠనం పట్ల అత్యంత శ్రద్ధాసక్తులు ప్రదర్శిస్తాడు. ఎటువంటి పాఠ్యాంశాన్నయినా సులభంగా గ్రహిస్తాడు. ఒకే అంశాన్ని పలుకోణాల్లో విశ్లేషించి వివరిస్తాడు, తర్కిస్తాడు. పురాణ పఠనం, శాస్త్ర పఠనాలో పడి సర్వం మరచిపోతాడు.

చంద్రశేఖరుడు ఇందుకు భిన్నం. అతడికి పాఠాలు వెల్లెవేయటం అంటే ప్రాణాంతకంగా ంటుంది. శ్లోకాలు గుర్తుపెట్టుకోవడం పెద్దగండంలా అనిపిస్తుంది. అలాగని తెలివిశూన్యుడుకాదు. ఏదయి ఒక్కసారి వింటే ఎప్పటికీ మరచిపోడు. పాఠ్యాంశాలపై శ్రద్ధ పెట్టకపోవటం వల్ల అవి రావటం లేదు. శ్రద్ధ పెడితే నేర్చుకోవటం అతడికి కష్టంకాదు.

చంద్రశేఖరుడికి ఆటపాటలంటే అమిత ఇష్టం. అల్లరి చేయటమంటే అమితాసక్తి. అతడికి ఊరినిండా మిత్రులే. వర్ణబేధం లేకుండా అందరితో అల్లరిచిల్లరిగా తిరుగుతాడు, అడవులో తిరుగుతాడు, కొండలెక్కుతాడు, కర్రయుద్ధం చేస్తాడు మల్లయుద్ధం చేస్తాడు, సాముగారడీలు నేర్చుకున్నాడు

గంగాధరుడు ఎంత నిశ్శబ్దంగా, క్రమశిక్షణతో, గంభీరంగా ఉంటాడో, చంద్రశేఖరుడు అంత అల్లరిగా, అడ్డూ అదుపూ లేకుండా ఆకతాయిలా ఉంటాడు.

అందుకే వారి తల్లికి చంద్రశేఖరుడి గురించి బెంగలేదు. ఎట్టి పరిస్థితులలో శ్రీరంగం వెళ్ళాలన్న ఆలోచన కూడా అతడికి కలగదని ఆమెకు తెలుసు.

ఆమె బెంగ అంతా గంగాధరుడి గురించే.

తమ పూర్వీకుల 'ఆజ్ఞ' విన్నప్పటి నుంచీ గంగాధరుడి ప్రవర్తనలో మార్పు వచ్చింది. అంతకు ముందుకన్నా శ్రద్ధగా శాస్త్రాలు చదవటం ఆరంభించాడు.

కేవలం గురువు చెప్పిన అంశాలే కాక ఇతరాలపై కూడా దృష్టి సారించాడు. విభిన్నవాదాలను వినటం, తర్కించటం చేసేవాడు. ఎవరు ఏం చెప్పినా వింటాడు. దాన్ని ఖండించాలని తొందరపడడు. వారు చెప్పేది తనకు నచ్చకున్నా సావధానంగా వినటం అలవాటు చేసుకున్నాడు.

******

తమ పూర్వీకులు గంగాధర శర్మకు రామానుజుల వారితో కలిగిన అనుభవం ఎంత విన్నా అతడికి తనివి తీరదు. 'ఎంత సులభంగా ఒక్క వాక్యంతో రామానుజులవారు తన తత్వాన్ని వివరించారు!' అని ఆశ్చర్యపోతుంటాడు. గురువుగారితో ఆ వాక్యం గురించి ఎంతో తర్కించాడు, చర్చించాడు. రామానుజులు జీవిత విశేషాలు తెలుసుకుంటూ, అడుగడుగునా ఆ వాక్యాన్ని అన్వయిస్తూ వచ్చాడు. చివరికి ఇప్పుడు శంకరాచార్యులు, రామానుజాచార్యులు అతడి రెండు కళ్ళుగా మారారు. అదే ఆమె భయం.

శ్రీరంగం వెళ్ళి వాదించగలిగే సత్తా గంగాధర శర్మకు ఉంది. వాదించాలన్న ఉత్సాహం అతడికి ఉంది. వాదనలో గెలిస్తే ఫరవాలేదు. కానీ ఓడితే.. ఈ ఆలోచన ఆమెని వణికిస్తున్నది.

అందుకే వారు కనుమరుగయినా ఆ వైపే దిగులుగా చూస్తూ కూర్చున్నది. ఏదో ఒకరోజు తాను శ్రీరంగం వెళతానని గంగాధర శర్మ నోట వినాల్సి వస్తుందని ఆమె భయం.

******

'ఏమిటీ ఇంకా గురువర్యులు రాలేదా?' ఆశ్రమంలో అడుగు పెడుతూ ఉత్సాహంగా అడిగాడు చంద్రశేఖరుడు.

విద్యార్థులంతా పాఠాలు వల్లె వేస్తున్నారు. అది చూడగానే తానింత ఆత్రపడి రావటం వ్యర్థమై పోయిందన్న బాధ చంద్రశేఖరుడికి కలిగింది. ఒకవేళ కత్తియుద్ధం నేర్పటం లేదంటే అడవిలో కాస్సేపు ఆడుకునేవాడినే అన్న ఆలోచన వచ్చిందతనికి.

'కుమార సంభవంలో షోడశ సర్గ అప్పచెప్పిన వారికే కత్తి యుద్ధం నేర్పుతారట. అందుకే మేము గబగబా నేర్చుకుంటున్నాం', గబగబా చెప్పి మళ్ళీ శ్లోకం వల్లె వేయటం ఆరంభించాడో విద్యార్థి.

'ఛీ' కాలితో నేలను గట్టిగా తన్నాడు చంద్రశేఖరుడు.

'ఏమయింది?' శాంతంగా అడిగాడు గంగాధరుడు.

'కుమారసంభవంలో షోడశ సర్గ దేనిగురించి?' అడిగాడు చంద్రశేఖరుడు.

'దేవతలు, తారకాసురల నడుమ యుద్ధ వర్ణన' వెంటనే చెప్పాడు గంగాధరుడు.

'నీకు వచ్చా?'

తల ఊపాడు

'ఏదీ నాకు ఒక్కసారి చెప్పు' అడిగాడు చంద్రశేఖర్

'అథాన్యోన్యం విముక్తాస్త్ర శస్త్ర జాలైర్భయం కరైః

యుద్ధ మా సీత్సునాసీ రసురారిబల యోర్మత!!

స్పష్టంగా, గంభీర స్వరంతో రాగయుక్తంగా చెప్పటం ఆరంభించాడు గంగాధరుడు. అతని స్వరమాధుర్యానికి ప్రకృతి పులకరించింది. విద్యార్థులు తమ చదువు ఆపి గంగాధరుడి గానం వింటూ మైమరచిపోయారు. పశువులు, జంతువులు సైతం గంగాధరుడు చదువుతున్న శ్లోకాల అర్థాన్ని గ్రహించి పరవశించి మంత్రముగ్ధులైనట్లు నిలిచిపోయాయి. కాళిదాసు పదాల ద్వారా ప్రదర్శించిన భీకర యుద్ధానికి బెదిరినట్టు ప్రకృతి స్థంభించిపోయింది.

'దేవతలు అసురులు ఇలా భయంకర యుద్ధం జరుపుతున్నారు. రక్తపు టేరులు పారుతున్నాయి. ఆ రక్తపుటేరుల్లో ఏనుగులు సైతం మునిగిపోతున్నాయి. ఇది చూసి ఎర్రబడ్డ కళ్ళతో క్రోధంతో తారకాసురుడు యుద్ధసన్నద్ధుడై అడుగు ముందుకు వేశాడు'. ఆ సర్గలో చివరి శ్లోకం, అర్థం చెప్పి ఊపిరి పీల్చుకున్నాడు గంగాధరుడు.

ఏకాగ్రతతో నిన్న చంద్రశేఖరుడు ఒకటొకటిగా మొదటినుంచీ శ్లోకాలను అప్పచెప్పటం ఆరంభించాడు. అక్కడున్న అందరూ అతడు ఏకసంధాగ్రహి అని గ్రహించి ఆశ్చర్యపోయారు. అయితే భీకర యుద్ధవర్ణన సమాప్తయిందని సంతోషించిన ప్రకృతి, మళ్ళీ ఉలికిపడింది. చంద్రశేఖరుడి స్వరంలో ధ్వనిస్తున్న కర్కశత్వానికి గడగడ వణకసాగింది.

చివరి శ్లోకం అప్పచెప్పి కళ్ళు తెరిచాడు చంద్రశేఖరుడు. విద్యార్థులంతా కళ్ళప్పగించి తనవైపే చూడటం గమనించాడు. అంతలో అతడి దృష్టి ఎదురుగా ఉన్న గురువుపై పడింది.

ఒక్క ఉదుటున గురువును సమీపించి అతడికి పాదాభివందనం చేశాడు. 'గురువర్యా షోడశోధ్యాయం పూర్తిగా అప్పచెప్పాను. నాకు కత్తియుద్ధం నేర్పించండి' అన్నాడు. అతని మాటలు పూర్తయేలోపలే గుర్రపుడెక్కల ధ్వని వినిపించింది. అందరూ ఆ వైపు చూశారు.

కవచం ధరించిన ఓ అశ్వికుడు వేగంగా వచ్చి గుర్రం దిగాడు. పరుగున వచ్చి గురువు పాదాలు తాకాడు.

'ఆలస్యానికి క్షంతవ్యుడను. నేను సమయానికే వచ్చేవాడిని. కానీ దారిలో తురకల తండా ఎదురుపడింది వారిని దాటుకుని వచ్చేసరికి ఆలస్యమయింది.'

అప్పుడు గమనించారందరూ, అతడి ఒంటిపై అక్కడక్కడా కనిపిస్తున్న గాయాలను కవచంపై నుండి కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి గాయాలు.

అతడి మాటలకు గురువు ముఖంలో ఎటువంటి భావాలు కనబడలేదు. 'విద్యార్థులంతా సిద్దంగా ఉన్నారు. కాస్సేపు విశ్రాంతి తీసుకుంటావా, లేక...?' సందిగ్ధంగా ఆగారు.

ఆ వీరుడు నవ్వాడు.

'ఈ కాలంలో విశ్రాంతికి సమయం లేదు. తీసుకుంటే శాశ్వత విశ్రాంతి తీసుకోవాలి. అంతే' అని పెద్ద పెద్ద కళ్ళతో తనవైపు చూస్తున్న విద్యార్థుల వైపు తిరిగాడు వీరుడు.

'అందరూ సిద్ధమేనా..' అడిగాడు.

'ఓ' అన్నారందరూ ఉత్సాహంగా.

'అయితే ఒక్క పరుగున మైదానానికి రండి' అంటూ పరుగుతీశాడా వీరుడు. అతడిని దాటి పరుగుతీయాలన్న ఉత్సాహంతో విద్యార్థులంతా వేగంగా పరుగులు తీశారు.

వారిని చూస్తూ నిలబడ్డారు గురువుగారు. అతడి వదనంపై విషాదం గూడుకట్టుకుని ఉంది. అతడికి తెలుసు.. కలలాగా సాగుతున్న ఈ జీవితం ఇంత సౌఖ్యంగా, ఆనందంగా ఇంక ఎంతోకాలం ఉండదని!

*******

"నా పేరు శూరవర్మ. నేను మీకు కత్తి యుద్ధం నేర్పుతాను. ముందుగా కత్తి పట్టుకోవటం నేర్పుతాను. అయితే మీరొకటి గుర్తుంచుకోవాలి. కత్తిపట్టడం, యుద్ధం చేయటం మామూలు మాటలు చెప్పినంత తేలిక కాదు. దానికి శారీరక దారుఢ్యం అవసరం. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. కండలు పెంచాలి. అప్పుడే కొండలను పిండి కొట్టగలం" అంటు అందరి వైపు చూశాడు. అతడి దృష్టి గంగాధరుడిపై పడింది.

"నీ పరిచయం?" అడిగాడు.

"నన్ను గంగాధరుడంటారు. మా నాయనగారు నీలకంఠ శర్మగారు. మా తాతయ్య గంగాధర శర్మగారు. మేము వాదూలస గోత్రీకులం. మీకు నా ప్రణామాలు' చెప్పాడు గంగాధరుడు.

శూరవర్మ పెదవులపై చిరునవ్వు కదలాడింది. 'నీ కళ్ళలో ఏదో సంశయం కనిపిస్తోంది. ఏమిటది?' అడిగాడు.

'నేను బ్రాహ్మణుడిని. వేదాధ్యయనం, శాస్త్ర పాండిత్య సంపాదన నా విద్యుక్త ధర్మం. నేను కత్తి యుద్ధం నేర్చుకోవాల్సిన అవసరం ఉందా?' సూటిగా ప్రశ్నించాడు.

శూరవర్మ తీక్షణంగా చూశాడు అతడివైపు. ఆ తరువాత జరిగింది అక్కడి వారికి అర్థమయ్యే సరికి సమయం పట్టింది. అర్థమయ్యేసరికి హాహాకారాలు చేశారందరూ. మెరుపులా శూరవర్మ గంగాధరుడిపైకి దూకాడు. అతడిని ఒక్కదెబ్బతో క్రిందపడద్రోసి అతడి గుండెపై కాలుపెట్టి, మెడదగ్గర కత్తిని ఒత్తిపట్టాడు.

'ఇప్పుడు చెప్పు యుద్ధం నేర్చుకోవాలిసిన అవసరం ఉందా?

నిన్ను నువ్వు రక్షించుకోలేని స్థితిలో ఉన్నపుడు నీ ధర్మాన్ని నువ్వేం రక్షిస్తావు? నీ వారిని నువ్వేం కాపాడతావు? మనం ఎదుర్కొంటున్న శత్రువు కన్నా రాక్షసులు నయం. ఈ శత్రువులకొకే లక్ష్యం. గెలుపు, మతమార్పిడి. నువ్వు బ్రాహ్మణుడివా, క్షత్రియుడివా, వైశ్యడివా, శూద్రుడివా అని చూడడు. నీ కులగోత్రాలతో పనిలేదు. శత్రువు చూసేదల్లా నువ్వు తనకు లొంగుతావా, ఛస్తావా అన్నదే ప్రపంచాన్ని ఇస్లాం మయం చేయటం వాడి లక్ష్యం. ఇస్లామేతరులను మతం మార్చి ఇస్లామేయుడిగా చేయాలి.

లేకపోతే చంపేయాలి. ఇంతే శత్రువుకు కావాల్సింది. అర్థమయిందా? నువ్వింకా నీ కులాన్ని, పాండిత్యాన్ని పట్టుకుని వ్రేలాడితే లాభం లేదు. కత్తిపట్టి ఆత్మరక్షణకు సిద్ధంగా ఉండకపోతే నీ ఆత్మవంటి ధర్మాన్నే పోగొట్టుకుంటావు. ఆత్మరక్షణ, స్వీయధర్మ రక్షణను మించిన కర్తవ్యాలు లేవు. అర్థమయిందా! ' అంటూ లాగి గంగాధరుడిని నుంచోబెట్టాడు.

గంగాధరుడి తల తిరుగుతోంది. శూరవర్మ చెప్పిన సగం మాటలు అర్థమయ్యాయి. సగం అర్థం కాలేదు. ఎవరో అతడిని నీడన కూర్చోబెట్టారు. మంచినీళ్ళిచ్చారు.

ఇంతలో చంద్రశేఖరుడు, శూరవర్మ పైకి లంఘించాడు. అతడి చేతిలోని కత్తిలాక్కుని అతడిపైకి ఎగబడ్డాడు.

శూరవర్మ ఒడుపుగా పక్కకు తప్పుకుని, చంద్రశేఖరుడి మణికట్టుపై చేతితో మోదాడు. అతడి చేతి నుంచి కత్తి క్రిందపడిపోయింది. శూరవర్మ, చంద్రశేఖరుడిని కౌగిలించుకున్నాడు. 'భళి, ఇటువంటి ఆవేశం, శౌర్యం ఇప్పుడు కావాలి. ఈ శౌర్యానికి నైపుణ్యం తోడయితే ఇక ఎదురే లేదు' అంటూ చంద్రశేఖరుడి నుదిటిన చుంబించాడు.

గంగాధరుడి వైపు గర్వంగా చూశాడు చంద్రశేఖరుడు. అతడి కళ్ళు ఉత్సాహంతో మిలమిల మెరుస్తున్నాయి. ఉత్తేజంతో కళకళలాడుతున్నాయి.

## 3

'హా, హూ' అని అరుస్తూ కత్రతిప్పుతున్నాడు చంద్రశేఖరుడు.

లేని శత్రువును ఊహిస్తూ, ఊహాయుద్ధం చేస్తున్నాడు. ఎగిరే సీతాకోక చిలుకలపైకి కర్ర ఊపుతున్నాడు. పిట్టల వెంట పడుతున్నాడు. అరుస్తూ, అల్లరి చేస్తున్న చంద్రశేఖరుడి వైపోసారి చూసి, మళ్ళీ తన దృష్టిని తాటాకుల గ్రంథం వైపు మరల్చాడు గంగాధరుడు.

శూరవర్మ తమ ఊరు వచ్చి కత్తి యుద్ధంలోని మౌలికాంశాలను నేర్పి, వాటిని సాధన చేయమని చెప్పి వెళ్ళాడు. అప్పటి నుంచీ చంద్రశేఖరుడికి వేరే ప్రపంచం లేకుండా పోయింది.

'రేపు రఘువంశం చెప్పాలి. కాస్తయినా శ్లోకాలపై దృష్టి పెట్టవచ్చుగా' ఎంత ప్రయత్నించినా గంగాధరుడి దృష్టి శ్లోకాలపై నిలవటంలేదు. చంద్రశేఖరుడి అల్లరి వైపే మళ్ళుతోంది.

'శ్లోకాలు వల్లెవేయటం వల్ల ఏమొస్తుంది? కత్తి యుద్ధంలో ప్రావీణ్యం సంపాదిస్తే దేశమంతా గొప్పవీరుడిగా పేరు మారుమ్రోగిపోతుంది. శూరవర్మ చెప్పాడుగా, ఇది దేశమంతా క్షత్రియులమవ్వాల్సిన తరుణం అని'.

'శివశివ' చెవులు మూసుకున్నాడు గంగాధరుడు 'ఏదైనా వాక్యాన్ని ఉన్నది ఉన్నట్టు అర్థం చేసుకోకూడదు. వాక్య భావప్రయోగంలో పలుపద్ధతులుంటాయి. వివరించబోతున్న గంగాధరుడి మాటలకు అడ్డువచ్చాడు చంద్రశేఖరుడు.

'ఇక చాల్లే.. వాక్యం, వ్యాకరణము పాతాల బోధనం ఆపు! వచ్చి కాస్త నాతో కత్తి యుద్ధం సాధన చేయవచ్చుకదా! ఎప్పుడో ఎవరో రాసిన శ్లోకాల వెంటపడే బదులు, కాస్త కత్తి పట్టవచ్చుకదా!' విసుగ్గా అన్నాడు చంద్రశేఖరుడు.

'చంద్రా, నీకు ఆలోచన కన్నా ఆవేశం ఎక్కువ. ఆపై మొండితనానికి అంతులేదు. మన జీవితంలో మనకు బోలెడన్ని సామాజిక కర్తవ్యాలుంటాయి. వ్యక్తిగత ఇష్టాయిష్టాలుంటాయి. ఈ రెంటి మధ్య సంఘర్షణ ఉంటుంది. మనం వాటి మధ్య సమన్వయం సాధించాలి. అంతేకాని, వ్యక్తిగత ఇష్టాఇష్టాలకోసం సామాజిక కర్తవ్యాలను విస్మరించకూడదు. అవసరమైతే, సామాజిక కర్తవ్యాలకోసం, వ్యక్తిగత ఇష్టాఇష్టాలను త్యాగం చేయాలి. గురువుగారు, అందరూ క్షత్రియులవ్వాల్సిన తరుణం ఇది, అంటే అర్థం అన్ని మరచి కత్తి యుద్ధం చేయాలని కాదు..'

గంగాధరుడి మాట పూర్తికాకముందే చంద్రశేఖరుడు పెద్దగా అరచి, గంగాధరుడి చేతిలో ఉన్న తాళపత్రాల గ్రంథాన్ని లాగేసాడు. అది గాల్లోకి ఎగిరింది. పెద్దగా అరుస్తూ అక్కడి నుంచి పరుగెత్తాడు. అతడు పరుగెత్తిన వైపు చాలాసేపు నిస్సహాయంగా చూస్తూ నిలబడిపోయాడు గంగాధరుడు.

ఆ రోజు కత్తి యుద్ధం సమయంలో గురువుగారు పొగిడినప్పటినుంచీ చంద్రశేఖరుడు, గంగాధరుడుని లెక్కచేయటం లేదు. మాటమాటకీ చులకన చేస్తున్నాడు.

గాలికి తాటాకు గ్రంథంలోని ఆకులు కొట్టుకోవటంతో, నెమ్మదిగా వంగి గ్రంథాన్ని చేతిలోకి తీసుకున్నాడు గంగాధరుడు.

ఒక గ్రంథం అంటే అనేక విషయాల సమాహారం. దాన్లో జీవితాలుంటాయి. ఆలోచనలుంటాయి. తత్వం ఉంటుంది. వేదాంతం ఉంటుంది. శాస్త్రం ఉంటుంది. గ్రంథపఠనం అంటే ఎన్నో అనుభవాలను గ్రహించటం ఎంతో విజ్ఞానాన్ని తెలుసుకోవటం. భగవంతుడి సృష్టిని తన దృక్కోణంలో దర్శించి, అర్థం చేసుకుని వివరిస్తాడు గ్రంథరచయిత. దాన్ని తన మనోనేత్రంతో దర్శించాలి. తనదైన ప్రత్యేక దృష్టితో రచయిత భావాలను తన అనుభవాలుగా మార్చుకుంటాడు. ప్రపంచాన్ని అర్థం చేసుకుంటాడు. అంటే తన దృష్టికి, రచయిత దృష్టిని జోడించటం ద్వారా. రెట్టించిన దృష్టితో ప్రపంచాన్ని గ్రహిస్తాడన్నమాట. ఈ గ్రహింపు లేకుండా, గ్రంథమంటే తాటాకుపై, పనిలేనివారు రాసిన అక్షరాల సమూహంగా మాత్రమే అర్థం చేసుకుంటే...

గంగాధరుడి కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి. ఈ పని మరెవరో చేసి ఉంటే అజ్ఞాని, మూర్ఖుడు అనుకునేవాడు. కానీ తన స్వంత రక్తం ఈ పని చేయటం గంగాధరుడికి మరింత భాధ కలిగిస్తోంది. పైగా, ఆ గ్రంధానికి నకళ్ళు చేయమని గురువుగారు కోరారు. తన దగ్గర ఒకే ప్రతి ఉందన్నారు. దాన్ని అంత నిర్లక్ష్యంగా చంద్రశేఖరుడు కొట్టిపారేయటం భాధతో పాటు ఆవేశాన్ని కలిగిస్తోంది.

చంద్రశేఖరుడు గట్టిగా లాగిన పత్రం చిరిగిపోయింది. ఒక్కసారిగా గంగాధరుడి ఒళ్ళు చల్లబడింది.

ఇప్పుడేం చేయటం?

చిరుగు వల్ల కొన్ని అక్షరాలు పోయాయి. ఇప్పుడు ఆ శ్లోకాల నకళ్ళు చేయటం ఎలా? చంద్రశేఖరుడిపై పట్టరాని కోపం వచ్చింది గంగాధరుడికి. కోపంగా ఇంటివైపు అడుగులు వేయసాగాడు.

కాస్త దూరం వెళ్ళగానే ఇతర మిత్రులతో కత్తియుద్దం చేస్తున్న చంద్రశేఖరుడు కనిపించాడు. గంగాధరుడి కోపం మరింత ఎక్కువయిద్మి.

కానీ కోపం 'హానికరం' అని గంగాధరుడికి తెలుసు. ***కోపంలో మనిషి విచక్షణ కోల్పోతాడు. తనపై తనకే నియంత్రణ ఉండదు. అనరాని మాటలంటాడు. చేయకూడని పనులు చేస్తాడు. జీవితాంతం ఆ క్షణికావేశపు దుష్ఫలితాలను అనుభవిస్తాడు.***

అందుకే కోపాన్ని పళ్ళబిగువున అణచుకున్నాడు. 'చంద్రా' పిలిచాడు.

చంద్రశేఖరుడూ, ఈ వైపుకు చూశాడు. ఆ తరువాత తన స్నేహితులతో ఏదో అన్నాడు. అందరూ గంగాధరుడి వైపు చూసి పెద్దగా నవ్వారు.

ఆ నవ్వులో హేళన స్పష్టంగా కనిపిస్తోంది.

గంగాధరుడి పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

గట్టిగా ఏదో అనబోయాడు.

ఇంతలో అందరి దృష్టి పెద్దగా టముకు వినిపించడంతో ఆ వైపు మళ్ళింది.

తప్పెట్లు మోగిస్తూ బూరలు ఊదుతూ ఓ గుంపు వీధి గుండా వెళుతోంది. వాళ్ళ శబ్దాలు విని ఓ గుంపు వాళ్ళ చుట్టూ చేరగానే వాళ్ళ నడుమ గజ్జలు కట్టుకుని, తాళాలు పట్టుకున్న వ్యక్తి నృత్యం చేయటం మొదలు పెట్టాడు. అందరి దృష్టి తనపై ఉందనగానే పెద్ద గొంతుతో ప్రకటించాడు.

'సాయంత్రం శివాలయంలో మద్దెళ్ళ తాళాలు నిర్వహించబడతాయి. తమ్మట ధ్వనులతో ధర పిక్కటిల్లుతుంది. మంజలు, కైముళ్ళు, రుద్రవీణలు, సఫేరీలు తప్పెట్లు, నాగస్వరాలు నవ్యగీతాలు పాడతాయి. గాయకులు వీణలు పూని, తంత్రులు బిగించి, తగ్రశుతి చేసి, సరిగమేళనమైన సప్తస్వరాలతో బ్రస్తుతోక్తులతో గద్యపద్యకావ్యాలతో విస్తారంగా నాటి చరితను నేటి చరితను వినిపిస్తారు. నాటకాలలో నటిస్తారు. అందరూ రండి. రారండి' అంటూ శ్రావ్యంగా పిలిచాడు.

ఇంతలో వారిలో పండితుడి వేషంలో ఉన్న ఓ వ్యక్తి గంభీర స్వరంతో శ్రావ్యంగా రాగయుక్తంగా పద్యం పాడాడు.

శ్రీవాణీ గిరిజాశ్చిరాయ దధతో వక్షో ముఖాంగేషు యే
లోకానాం స్థితి మావహస్త్య విహతాం స్త్రీ పుంస యోగోద్భవాం
తే వేదత్రయ మూర్తయ స్త్రీ పురుషాస్యం పూజితా వస్సురై:
భూయాసుః పురుస్తోత్తమాంబుజ భవశ్రీ కంథరాః శ్రేయసే.

గంభీరంగా వెలువడుతున్న అతడి స్వరానికి ప్రకృతి మొత్తం స్థంభించినట్లు నిశ్శబ్దమయింది. మైమరచి నట్టు నిలిచి పోయింది.

ఆ స్వరమాధుర్యం నుంచీ, కవితలోని శబ్దాలు సృష్టించిన భావచిత్రాల నుంచి అందరూ తేరుకునేలోగా, గజ్జెలు ఘల్లు ఘల్లుమంటుండగా ఆ వ్యక్తి నృత్యం చేస్తూ ఆలపించసాగాడు.

దక్షిణాదిన సామాన్య జనుల భాషల్లో

వెలయుచున్నాయి అసామాన్య ఇతిహాసాలు

తెలుగులో నన్నయ తొలి కవిత ఇది

తెలుగు భాషోద్యాన వనాన పూసిన తొలిపుష్పమిది

మహాభారతాన్ని తెలుగులోకి అనువదిస్తున్నారు. ప్రజలంతా అది విని తరిస్తున్నారు. మీకోసం మేమూ భారతాన్ని నేర్చుకు వచ్చాం. సాయంత్రం రండి అందరికీ వినిపిస్తాం' టముకు వేసుకుంటూ ముందుకు సాగిపోయారు. కొందరు పిల్లలు వాళ్ళ వెంట పరుగెత్తుతున్నారు. వాళ్ళ వాయిద్యాల లయకనుగుణంగా నృత్యం చేస్తున్నారు.

ఆ ప్రకటన విన్న గంగాధరుడి మనస్సు అదోలా అయిపోయి, తన చేతిలోని తాటాకు గ్రంథం భారంగా అనిపించింది.

సంస్కృతంలో ఉన్న సౌందర్యం మరో భాషలో ఉంటుందా? సంస్కృతంలోని భావగాంభీర్యం అనువాదంలో పలుకుతుందా? దారిలో ఆవిరైపోదూ? అయినా అనన్య సామాన్యంగా వేద వ్యాసుడు రచించిన సంస్కృత గ్రంథాలను అనువదించటం అపచారంకాదా?

ఆలోచిస్తూ గురువుగారి కుటీరానికి వెళ్ళాడు.

ఆయన ధ్యానం చేస్తున్నారు. కుటీరం బయట కూచున్నాడు గంగాధరుడు.

ప్రకృతి ప్రశాంతంగా ఉంది. ఉండి ఉండి వీస్తున్న గాలికి వృక్షాల ఆకులు గలగలలాడుతున్నాయి. లయబద్ధంగా వినిపిస్తున్న ఆ స్వరం ప్రకృతి ఆలపిస్తున్న గేయంలా ఉంది.

అది చూస్తూ ఆనందిస్తున్న గంగాధరుడు, గురువుగారు రావటంతో నమస్కరించాడు. తన సందేహం వెలిబుచ్చాడు. సమాధానంగా గురువుగారు నవ్వారు.

'గంగానది ఆకాశంలోనే ఉండిపోతేలాభం ఉందా? అది భూమి పైకి దిగి రావాలి. పొంగి పొర్లాలి. దూరప్రాంతాల వరకూ ప్రవహించి సస్యశ్యామలం చేయాలి. ప్రజల దాహం తీర్చాలి. అనేక పాయలుగా చీలాలి. అనేక ఉపనదులను తనలో కలుపుకోవాలి. అప్పుడే నదికీ, నది నీటికీ సార్ధకత' అన్నారు.

గంగాధరుడు అర్ధం కానట్టు చూశాడు.

'గంగాధరా, నువ్వింకా చిన్నపిల్లవాడివి. పట్టుమని పదేళ్ళు లేవు. పెద్ద పెద్దవాళ్ళకే సరిగ్గా అర్ధం కావీ విషయాలు. మన భాష గంగానదిలాంటిది. సంస్కృతం పరిష్కృతమైన భాష, గంగానదిలా స్వచ్ఛమైనది. కానీ అలాగే ఉంటే ఆ భాషలో పొందుపరచి ఉన్న అంశాలు అందరినీ చేరవు. అవి అందరినీ చేరాలంటే గంగానది భువికి దిగిరావాలి. అనేక దారుల గుండా ప్రయాణించాలి. ఉపనదుల్లా చీలిపోవాలి. గంగాజలాన్ని దేశం నలుమూలలా విస్తరింపచేయాలి. ఇందువల్ల గంగానది విలువ పెరుగుతుందే తప్ప తరగదు. అదీకాక, సామాజిక పరిస్థితులు మారుతున్నాయి. ప్రతివారికీ సంస్కృతం నేర్చుకునే తీరిక ఉండని పరిస్థితి వస్తోంది. అటువంటప్పుడు మన మహాకావ్యాలను, శాస్త్రాలను అనువదించి అందరికీ చేర్చటం దైవకార్యమే అవుతుంది తప్ప దోషం కాదు. ఇది ప్రస్తుత పరిస్థితులలో అత్యంత అవసరమైన అంశం. నీకీ విషయాలు ఇపుడే కాదు ఇంకొన్నాళ్ళకి అర్ధమౌతాయి.' మృదువుగా వివరించారు.

గంగాధరుడికి అర్ధమయీ, అవనట్టుంది.

'సాయంత్రం మీరూ వసారా?' అడిగాడు.

'ఎందుకు రాను, నేనూ నన్నయ్య తెనిగిస్తున్న భారతం గురించి కర్ణాకర్ణిగా విన్నాను. దాన్ని చదివి, అనుభవించే అదృష్టం ఇంతవరకూ కలగలేదు. అందుకే సాయంత్రం భారతం వినటమే కాదు, వారు వినిపిస్తుంటారు, దాన్ని అలాగే రాసే వ్రాతగాళ్ళని కూడా నియమించాను. మీకందరికీ నేర్పిస్తాను' సంతోషంగా అన్నారు గురువుగారు.

గంగాధరుడు అయిష్టంగా ముఖం పెట్టాడు.

'వ్యాస విరచిత భారతాన్ని మాకు తెలుగులో నేర్పిస్తారా?' అడిగాడు.

అవును. భవిష్యత్తులో దేశం నలుమూలలా తిరుగుతూ నువ్వు ఓ వైపు వ్యాసభారతాన్ని మరోవైపు నన్నయ భారతాన్ని ప్రజలకు బోధించాలి. అది నా ఆలోచన.'

'అందువల్ల ఏం లాభం?'నిరసనగా అడిగాడు గంగాధరుడు.

'అది తరువాత చెపుతాను. ఇప్పుడు నా ఉహ ఇంకా సంపూర్ణాకృతి ధరించలేదు. అప్పుడు అన్నీ వివరిస్తాను.' మరో మాటకు ఆస్కారం ఇవ్వకుండా ఆయన ఇంట్లోకి వెళ్ళిపోయారు. కాస్సేపు అక్కడే కూర్చున్నాడు గంగాధరుడు. గురువుగారి మాటలు అర్థమయీ అవనట్టున్నాయి. తాను, ఇలా ఊరూరూ తిరుగుతూ భారతం సంస్కృతంలో, తెలుగులో ప్రచారం చేయటమా?

ఆ ఊహే గంగాధరుడికి నచ్చలేదు. తన లక్ష్య శ్రీరంగం వెళ్ళివాదనలో గెలవటం. ఆ తరువాతే మిగతావేవైనా?

కానీ.. ఇందాకే విన్న పద్యం ఎంతో బాగుంది. తెలుగు పద్యమయినా సంస్కృత శ్లోకగాంభీర్యంతో అలరారుతుంది. కానీ ఆ పద్యంలో 'చిరాయుదధతో' అనటం గంగాధరుడికి అర్థం కాలేదు. 'చిరాయుదధతో' అంటే చాలాకాలంగా ధరిస్తున్నారని అర్థం. మరో రకంగా చూస్తే 'గ్రంధ రచన పూర్తిచేయటానికి చాలాకాలం పడుతుందని అర్థం. 'కవి' ఇలా ఎందుకు రాశాడు? మహాభారత రచన పూర్తికాలేదా? ఈ విషయం గురువుగారిని అడగాలి.

ఎందుకో తలచుకున్న కొద్దీ ఆ పద్యంపై ప్రీతి పెరిగిపోతోంది. మళ్ళీమళ్ళీ వినాలనిపిస్తోంది. పదప్రయోగాలు, భావ గాంభీర్యం అత్యుత్తమ స్థాయిలో ఉండి ఎదలోతుల్లో ప్రకంపనలు కలిగిస్తున్నాయి.

అంతలో హఠాత్తుగా గంగాధరుడి మనస్సులోకి ఓ ఆలోచన ప్రవేశించింది. ఒక చెట్టు ఉంటుంది. దాని పళ్ళు తియ్యగా ఉంటాయి. ఆ పళ్ళలోని బీజాలనుంచి మరెన్నో చెట్లు ఉద్భవిస్తాయి. వాటి పళ్ళుకూడా తియ్యగానే ఉంటాయి. కానీ తరచి చూస్తే సూక్ష్మమైన భేదం ఉంటుంది. సంస్కృతం మొదటి చెట్టువంటిది. మిగతా భాషలు ఆ చెట్టు నుండి ఉద్భవించిన ఇతర స్వతంత్ర వృక్షాల వంటివి. దీన్లో హెచ్చు తగ్గుల ప్రసక్తి ఏముంది? భాష ఏదైనా భావం ఒక్కటే. అదీగాక, గురువుగారు చెప్పారు. భాష సరస్వతి స్వరూపం అని. కాబట్టి సంస్కృతమైనా, తెలుగు అయినా మరియే ఇతర భాష అయినా అది సరస్వతి స్వరూపమే అవుతుంది. సరస్వతీ దేవి గళాన పూలమాలలోని పుష్పమే అవుతుంది. అటువంటప్పుడు సంస్కృతం కాదని మరో భాషను చులకనగా చూడటం భావ్యమా? అన్ని భాషలు సరస్వతి అర్చన గీతాలే. దాన్లో ఉచ్చనీచాలు లేవు. హెచ్చు తగులులేవు. అవన్నీ తమమనస్సుకే, భాషకు కాదు. ఎందుకో ఈ ఆలోచన రాగానే గంగాధరుడి మనస్సుకు శాంతంగా అనిపించింది. ఏదో గొప్ప భావన కలిగినట్టనిపించింది. ఏదో సత్యాని కనుగొన్న భావన కలిగింది

ఇల్లు చేరగానే చంద్రశేఖరుడు గుర్తుకు వచ్చాడు.

వాడు చేసిన అల్లరి గుర్తుకువచింది. గబగబా అమ్మ దగ్గరకు వెళ్ళి జరిగింది చెప్పాడు.

గ్రంధం చూపించాడు.

అది చూసి అమ్మ కంట్లో నీళ్ళు తిరిగాయి 'అయ్యో' అంది.

'ఎక్కడున్నాడు వాడు?' అడిగాడు గంగాధరుడు.

'ఇంకెక్కడ ఉంటాడు, దేవాలయం దగ్గర ఉంటాడు. వాళ్ళ పాటలు, వేషాలు చూస్తుంటాడు' అంది అమ్మ నవ్వుతూ

'అమ్మా.. వ్యాస భారతాన్ని తెలుగు భాషలోకి అనువదిస్తున్నారట. నేను కూడా కుమార సంభవాన్ని తెలుగులోకి అనువదిస్తాను.' అన్నాడు గంగాధరుడూ.

అమ్మ నవ్వి అలాగే అని దగ్గరకు తీసుకుంది. నుదుటి పై ముద్దు పెటింది. 'వెళ్ళు చదువుకో' అంది.

కాస్సేపటికి ఆమె వచ్చి చూసేసరికి, గంగాధరుడు ఏకాగ్రతతో తాటాకు గ్రంధానికి నకలు రాస్తున్నాడు. ఉండి ఉండి ఏదో ఆలోచిస్తున్నాడు.

అతడి వైపు కాసేపు అలానే చూసింది ఆమె. అతడిని చూస్తే గర్వంగా ఉంటుంది. భయంగా ఉంటుంది. పిల్లల్ని కనటంతో పాటు వాళ్ళ భవిష్యత్తును కూడా తలిదండ్రులు దర్శించగలిగితే ఎంత బాగుంటుంది! అనుకుందామె.

ఇంతలో దూరంగా గుడిలో గంట మ్రోగింది. అక్కడ కార్యక్రమాలు మొదలవుతునట్టు పెద్దగా వాయిద్యాలు మ్రోగాయి.

గంగాధరుడు నిద్రలోంచి లేచిన వాడిలా తలెత్తి ఆవైపు చూశాడు.

ఏదో గుర్తుకు వచ్చిన వాడిలా లేచాడు.

తల్లికి చెప్పి దేవాలయం వైపు నడిచాడు.

## 4

**సూర్యుడు** నింగి సింహాసనం దిగి కొండచాటున విశ్రమించినప్పటి నుంచీ కృత్రిమ వెలుగుల ధగధగలు మెరిసి పోతున్నాయి. అంతవరకూ వెలవెలబోయిన దీపాలు తామే సూర్యలన్నట్టు వెలుగుతున్నాయి.

అది చూస్తుంటే గంగాధరుడి మనస్సు చిత్రంగా స్పందించింది.

ప్రతిభావంతుడు సూర్యుడయితే, సూర్యుడు ఉన్నంతవరకూ సగటు ప్రతిభలు దీపాల్లా వెలవెలబోతాయి. సూర్యుడు తెరమరుగయిన మరుక్షణం ఈ దివిటీలే ప్రధాన దీపాలవుతాయి. సూర్యుడిలా దిగంతాల వరకూ వెలుతురు విస్తరింపచేసే శక్తి వీటికుండదు. దాంతో అధికభాగం అజ్ఞానంలా చీకటి క్రమ్ముకుని ఉంటుంది. సూర్యుడు తెలియని వారికి ఈ దీపాలే సూర్యుళ్ళవుతాయి.

ఆ ఆలోచన రాగానే ఎందుకో గంగాధరుడి మనస్సును విషాదం ఆవహించింది.

ఆ పసిమనసులో అతడికి సంపూర్ణంగా అవగతం కాని ఓ సత్యం అస్పష్టంగా గోచరించింది.

ఏదైనా ఇంతే. సంపూర్ణ సత్యం తెలియనంత వరకూ మనిషి తనకు తెలిసిన అర్ధసత్యాన్నే అసలు సత్యం అనుకుని భ్రమ పడతాడు. అలాగే, అసలైన మాధుర్యం అనుభవించక ముందు, మనిషి, చిన్న చిన్న ఆనందాలనే శాశ్వతానందాలని పొరపడతాడు. అలాగే, నిజమైన నైపుణ్యం తెలియని మనిషి తక్కువ స్థాయి ప్రదర్శననే అసలు 'కళ' అనుకుని పొరబడతాడు.

ఒకవేళ అసలైన కళ అదృశ్యం అయితే? నీచకళే నిజమైన కళ అవుతుందా? విషాదంగా నడుస్తున్న గంగాధరుడికి గురువు ఆలోచన అప్పుడు అర్థమయింది.

సంస్కృతంలోని కావ్యం సూర్యుడయితే, అనువాద కావ్యం చంద్రుడు. అనువాద కావ్య మాధుర్యం అనుభవించిన వ్యక్తికి అసలు కావ్యం చదవాలన్న ఉత్సుకత కలుగుతుంది. చంద్రుడి వెన్నెలను అనుసరిస్తూ పోతే సూర్యుడు కనబడకమానడు.

అందుకే ప్రాంతీయ భాషలలోకి పురాణాలు, ఇతిహాసాలు అనువాదమవుతున్నాయి. వాటి ద్వారా ప్రజలు మళ్ళీ సంస్కృత గ్రంధాల వైపు ఆకర్షితులవుతారు. కానీ, ఇంతకాలం లేని అనువాదాల అవసరం ఇప్పుడెందుకు వచ్చింది?

దూరం నుంచి దేవాలయం దగ్గర జరుగుతున్న నృత్యాల లయ వినిపిస్తోంది. అస్పష్టంగా పాటలు వినిపిస్తున్నాయి.

తమకు కత్తియుద్ధం నేర్పుతున్న గురువు క్రూరమైన కొత్త శత్రువు గురించి మాట్లాడాడు. ప్రతివాడూ క్షత్రియుడిలా కత్తిపట్టి రక్షణకు సిద్ధమవ్వాలని అంటున్నాడు. దాని పర్యవసానమా ఈ అనువాదాలు?

కొత్త శత్రువు ఎంత శక్తివంతమయిన వాడంటే, తమ జీవితం మొత్తం చిన్నాభిన్నమవుతుందా? ప్రాచీన సంప్రదాయాలను నిలుపుకునేందుకు తాము పోరాటం జరపాల్సి వస్తుందా? ఓ వైపు నుంచి తమని తాము రక్షించుకునేందుకు కత్తిపట్టి పోరాడాలి. మరోవైపు తమ సంస్కృతి సంప్రదాయాలను కాపాడేందుకు అనువాద సాహిత్యం ద్వారా ప్రాచీన గ్రంధాలను సజీవంగా ఉండే సాహిత్యపోరాటం జరపాలి.

గంగాధరుడి తల తిరిగిపోతోంది. అతడి మెదడు అంత విస్తృతమైన ఆలోచనలను సంపూర్ణంగా అర్థం చేసుకోలేక సతమతమవుతోంది. ఎందుకంటే అసలు సమస్య ఏమిటో అతడికి ఇంకా తెలియదు.

గంగాధరుడు, దేవాలయం చేరేసరికి 'ఆట' నడుస్తోంది. ఊళ్ళోని ప్రజలంతా అక్కడకు చేరుకున్నారు.

దేవాలయ ప్రాంగణంలో వేదిక నడుమ ఓ పెద్ద తెర కట్టిఉంది.

వేదికపై నటనమాడేవారు తెరెకిరువైపులా తిరుగుతూ ఒకే వేదికపై పలు స్థలాలు చూస్తున్న భ్రాంతి కలిగిస్తున్నారు. తెర చుట్టూ ఉన్న దీపాలను సందర్భోచితంగా ఆర్పుతూ, వెలిగిస్తూండటం ద్వారా వేదికపై మెరుపులు సృష్టిస్తున్నారు. రాత్రింబవళ్ళు సృజిస్తున్నారు. అది చూస్తున్న ప్రేక్షకులు మరో లోకానికి వెళ్ళిన భావన ననుభవిస్తున్నారు. వేదిక పై ప్రదర్శిస్తున్న రంగంలో లీనమౌతున్నారు. తామే పాత్రలయిన అనుభూతి పొందుతున్నారు. దృశ్యాన్ని వివరిస్తున్న గానం, తగిన నాదం వారి ఎదుట మరో ప్రపంచాన్ని సృష్టిస్తోంది.

గంగాధరుడు అక్కడికి చేరే సరికి చరిత్ర గానం జరుగుతోంది. అది తోలుబొమ్మలాటల పద్ధతిలో ప్రదర్శిస్తున్నారు.

హర్షవర్ధనుడి కాలం అదృశ్యమయ్యే

పులకేశి కథలు కలల్లో మిగిలె

రాజ్యపాలుడి రాజ్యం రక్తపుటేరులాయె

మహమ్మద్ గజనీ మృత్యురూపమై ఎదుట నిలచె

భరతవర్షపు తలపైన గొడ్డలి దెబ్బపడింది.

ఆ చీలిక నుండి కారిన రక్తం దేశాన్ని ముంచెత్తుతోంది

అయ్యో! అయ్యో! అయ్యో! అయ్యో

అక్కడ చూస్తున్న వారి కంటనుండి నీరు పొంగసాగింది. మధ్యలో వచ్చినా గంగాధరుడి కళ్ళల్లో కూడా నీళ్ళు నిండాయి. అతడికి ఏదో అయిందని అర్థమయింది. కానీ ఏమైందో బోధపడటం లేదు.

'మహమ్మద్ గజనీ' అన్నదేమిటో బోధపడటం లేదు.

భారత చరితలోన ఆరంభమయింది రాక్షస పర్వం.

ఇక దేశానికి మిగిలింది అరణ్యకాండ, అజ్ఞాతవాసం

అయ్యో! అయ్యో! అయ్యో! అయ్యో!

'అయ్యో!' అన్నది పలుగొంతు కలు విహ్వలంగా, విషాదంతో, వేదన మిళితమైన స్వరంతో పెద్దగా రోదిస్తున్నట్టు పలకటంతో ఆ ప్రాంతమంతా భయంతో, విషాదంతో కంపిస్తోంది.

తమ కళాప్రదర్శన ప్రభావం ప్రజలపై ఎలా ఉంటుందో ఆ కళాకారులు గ్రహించినటున్నారు. అందుకే ఉత్తుంగ తరంగంలా ఆకాశాన్ని తాకే ఆ భయాన్ని, దుర్భర విషాదాన్ని వెంటనే విరిచి వేశారు. రసభంగం చేసి నూతన రసావిష్కరణం చేశారు.

ఒక్కసారిగా వేదికపై దీపాలన్నీ వెలిగాయి. అంతవరకూ చీకటిలో భయపెడుతున్న రాక్షసనీడలు అదృశ్యమయ్యాయి. సంగీతం ఆహ్లాదకరంగా మ్రోగసాగింది. చూస్తున్న ప్రేక్షకులు భయభావనను వదిలి ఈ సరికొత్త భావనను అనుభవించేందుకు కాస్త సమయం పట్టింది.

తెరపై రాజరాజ నరేంద్రుడు కనిపించాడు. నన్నయ భట్టును భారతాన్ని ఆంధ్రీకరించమని కోరాడు. నన్నయ భట్టు, నారాయణ భట్టు సహకారం కోరాడు. భారతాంధ్రీకరణ ప్రారంభించాడు. తెరపై ఒకటొకటిగా కదులుతున్న దృశ్యాలు. అవి ప్రదర్శిస్తున్న భావానికి అక్షరరూపం ఇచ్చిన పద్యాలు ప్రేక్షకులను ఆనంద పరవశులను చేస్తున్నాయి.

భారతాన్ని వారి ముందు నిలుపుతున్నాయి.

వింటున్న గంగాధరం ఓ విషయం గమనించాడు.

ఆంధ్రీకరణలో కవి భారతాన్ని అనుకరించలేదు. కథ అదే అయినా దాన్ని తన స్వంత బాణీలో చెపుతున్నాడు. ప్రతిభావంతుడయిన కవి అనువాదానికి కూడా స్వతంత్ర కావ్య స్థాయిని ఆపాదిస్తాడు. పైగా తెలుగు భాష అక్షరరమ్యత గంగాధరుడి మనస్సును దోచింది. 'నిజమే - భాష ఏదయినా అది సరస్వతీ కంఠాన్ని అలంకరించిన మాలలోని పుష్పమే' అనుకున్నాడు.

ఇంతలో హఠాత్తుగా తెరపై భారతం కథ ఆగిపోయింది. మళ్ళీ కళాకారులు రసభంగం చేసి, నూతన రసావిష్కరణం చేస్తున్నారని గంగాధరుడూ అనుకున్నాడు. కానీ సూత్రధారి తెరపై వచ్చి నిలబడ్డాడు.

'తీరాన్ని తాకిన అల తీరం దాటక వెనుతిరిగింది. భారత రచన పూర్తి కాకముందే నన్నయ మరణించాడు. వెనుతిరిగిన అలను ముందుకు తోసి మరింత ఎత్తుకు ఎగదోసి, తీరాన్ని మరింత శక్తివంతంగా తాకే అలను సృజించే కవి కోసం దేశం ఎదురు చూస్తోంది. మీలో ఈ ప్రతిభ, పాండిత్యాలున్నవారు భారతాంధ్రీకరణకు పూనుకోవచ్చు. నన్నయ ఆరంభించిన దైవకార్యాన్ని సంపూర్ణం చేయవచ్చు.'

సూత్రధారి మాటలు వింటున్న గంగాధరుడికి 'చిరాయుదధతో' పదం అర్థం అవగతమయింది. భారత రచన దీర్ఘకాలం సాగుతుందన్న మాట. కానీ కావ్యారంభంలోనే 'కవి' కి ఈ విషయం ఎలా తెలుస్తుంది.

ఇంతలో ఆ పద్యంలోని మరో పదం గంగాధరుడికి స్ఫురించింది. 'వేదత్రయ మూర్తయః' అంటే మహా భారత రచనను ముగ్గురు కవులు పూర్తిచేస్తారా? ఇకపై సమాజంలో వ్యక్తిగతాలు నశించి వ్యక్తుల సమిష్టి సృజనాత్మక కృషి ఫలితాలైన కళలు నిలుస్తాయా? కానీ మంగళశ్లోకంలోనే ఇంతగా ఊహించగలిగిన కవి ఋషి, ద్రష్ట కాక మరేమవుతాడు? ఎంత పుణ్యభూమి ఇది! ఎంతటి మహానుభావుల జన్మస్థల ఈ భూమి!

గంగాధరుడి మనస్సు గర్వంతో ఉప్పొంగింది.

ముగ్గురు కవులు భారతాంధ్రీకరణను పూర్తి చేస్తారని కవి సూచిస్తున్నాడు. నన్నయ తనవంతు బాధ్యత నిర్వహించాడు. మిగిలిన బాధ్యతను పూర్తిచేసే కవులెవరు?

గంగాధరుడి మనస్సులో తాను ఆ కావ్య రచన చేయాలన్న భావన కలుగుతుంది. అవును తానెందుకు ఆ పనికి పూనుకోకూడదు?

ఈ ఆలోచన వచ్చిన తరువాత అక్కడ నిలవలేకపోయాడు. కొత్తపాట మొదలయింది. కానీ, దానిపై ఆసక్తి నశించింది. భారత రచన సాగించాలి.

గంగాధరుడి మనస్సులో రకరకాల పదాలు మెదలుతున్నాయి. అనేక భావాలు ఉప్పెనలా ఎగసి పడుతున్నాయి. అతడి ప్రమేయం లేకుండా అడుగులు వేగంగా పడుతున్నాయి. అతడికి పట్టిన చెమటను తుడిచి సాంత్వన కలిగించేందుకు కాబోలు ఒక శీతల పవనం మృదువుగా అతడి శరీరాన్ని స్పృశించింది. చల్లదనానికి అతడి శరీరం జలదరించింది. నడుస్తున్నవాడు ఆగిపోయాడు.

కానీ... తాను భారత రచననెలా చేపడతాడు? శ్రీరంగ పండితులను వాదనలో ఓడించటం తన కర్తవ్యం.

వంశపారంపర్యంగా తనకు సంక్రమించిన బాధ్యత. దాన్ని వదలి తాను భారతాంధ్రీకరణను చేపడితే ఎలాగ?

'తన సంశయాన్ని గురువుగారే తీర్చగలరు', తనని తాను సమాధాన పరచుకున్నాడు గంగాధరుడు. కానీ అతడి అడుగుల వేగం తగ్గింది. ఆలోచనల వేగం పెరిగింది.

✡ ✡ ✡

ఆ రోజు ఉదయం నుంచీ చంద్రశేఖరుడు చదువుకు వెళ్ళేందుకు తహ తహలాడుతున్నాడు. ఆత్ర పడుతున్నాడు. అది చూసిన గంగాధరుడు, వాళ్ళమ్మల ఆశ్చర్యానికి అంతులేదు.

"ఏమిటీ, నీకు విద్య మీద ఇంత శ్రద్ధ ఎలా వచ్చింది?" అమ్మ ఎన్నోసార్లడిగింది. దానికి చంద్రశేఖరుడి చిరాకే సమాధానమయింది.

చివరికి ఉండబట్టలేక గంగాధరుడు అడిగేశాడు. "ఇవాళ్ళ నీకు కత్తికన్నా కలం ఎక్కువ ప్రీతిపాత్రమయిందేమిటి?"

గంగాధరుడి వైపు కోపంగా చూశాడు చంద్రశేఖరుడు. "నాకేమీ సోమరిపోతుల కలం పట్ల ఆసక్తి లేదు. పని లేని వాళ్ళు, పనికి రాని వాళ్ళే ఓ మూల మొద్దుల్లా కూచుని అక్షరమాలలు బట్టీ పడుతుంటారు" అని అరిచి బయటకు పరుగెత్తాడు.

నవ్వుతూ గంగాధరుడు అతడిని అనుసరించాడు. అయితే దారిలో అందరూ ఏదో ఉత్సాహంతో, ఉద్విగ్నతతో ఉండటం అతడిలో కుతూహలాన్ని మరింత పెంచింది.

తనకు సన్నిహితంగా ఉండే శివను అడిగాడు. "ఏమిటి, అందరూ ఇలా ఉన్నారు?"

శివ ఎగాదిగా చూశాడు గంగాధరుడిని "రాత్రి నువ్వు దేవాలయానికి రాలేదా?" అడిగాడు.

"వచ్చాను, కానీ తెలుగు భారతం అయిపోయిన తరువాత వెళ్ళిపోయాను."

"అయ్యో! ఆ తరువాతే అసలు నాటకం మొదలైంది"

"ఏమిటా నాటకం? ముందు ప్రకటించలేదు కదా!"

"అదే రహస్యం. 'ఆనందపాల పరాజయం' నాటకం వేశారు".

"ఆనందపాల పరాజయమా?"

"అవును. ఇవాళ 'సోమనాధ మందిర విధ్వంసం' ఉంది".

"శివ, శివ. సోమనాథ మందిర విధ్వంసం ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు గంగాధరుడు.

"అవును. మనం ఈ మారుమూల కొండల్లో ఉండటం వల్ల తెలియలేదు. దేశమంతా ఒక వింతరోగం వ్యాపిస్తోందట. అది మనిషి వేషంలో వస్తోందట."

"ఛీ! మనిషి వేషంలో వ్యాధి వ్యాపించటం ఏమిటి?"

"నిజం రాత్రి చూపించారు. మనుషులు మిడతల దండుల్లా విరుచుకుపడతారట. మెరుపువేగంతో దాడి చేస్తారట. ఓటమి అంచు నుంచి గెలుపు సాధిస్తారట. వాళ్ళు అసలు ఓడిపోనే పోరట. వాళ్ళ తాకిడికి ప్రపంచం గడగడలాడిపోతోందట." కళ్ళు పెద్దవి చేసి చెప్పాడు శివ.

"ఇదేమిటి? మనకి విషయం ఏమీ తెలియదే?" ఆశ్చర్యపోయాడు గంగాధరుడు.

"ఇవాళ గురువుగారు ఇదే విషయం చెపుతామన్నారు. మహమ్మద్ ఘజనీ అనే రాక్షసుడు మానవరూపంలో వచ్చాడట. వాడిని ఎదుర్కొని అడ్డుకునేందుకు ఆనందపాల మహారాజు ఇతర రాజులందరినీ కూడగట్టుకున్నాడట. ఉజ్జయిని, గ్వాలియరు, కాలుంజరు, కనోజ్ రాజులంతా కలిసి దూసుకు వస్తున్న గజనీ ప్రవాహానికి అడ్డుగా నిలుచున్నారట. కానీ వారి ధాటికి ఆగలేకపోయారట. మనవాళ్ళందరూ మారణ హోమంలో మరణించారట. మనదేవాలయాలు విరగ్గొట్టారట. విగ్రహాలను ముక్కలు చేశారట. నాకు భయం వేస్తోంది' అంటూ ఏడవసాగాడు శివ.

✡✡✡

**అతడు చెప్పేది** వింటుంటే గంగాధరుడి ఒళ్ళు కంపించింది. అతడికీ భయం వేసింది. మనకు అన్ని విషయాలు వివరిస్తాడట. కానీ ఎందుకో శివ మాటలపై అతడికి నమ్మకం కుదరటం లేదు.

'ఒకవేళ రాక్షసులు మనుషుల రూపం ధరించి ప్రవాహంలా ముంచెత్తుతూ వస్తుంటే తామింత ప్రశాంతంగా ఎలా ఉంటున్నారు? ఎవరీ ఘజనీ? రాజులు పోరాడుతుంటారు. గెలుస్తారు. ఓడతారు. కానీ దేవాలయాలు ధ్వంసం చేయటం ఏమిటి? విగ్రహాలు విరగ్గొట్టటం ఎందుకు? మహమ్మద్ ఘజనీ పేరు భలేగా ఉంది. విచిత్రంగా ఉంది.' ఆలోచిస్తూ నడవటం ఆరంభించాడు గంగాధరుడు.

'ఇవాళ శూరవర్మ వస్తాడట. మనకు అన్ని విషయాలు వివరిస్తాడట. అందుకే అందరూ గురువుగారి దగ్గరకు వస్తున్నారు.' కన్నీళ్ళు తుడుచుకుంటూ చెప్పాడు శివ.

ప్రొద్దుటి నుంచీ చంద్రశేఖరుడి ఆత్రానికి కారణం అర్ధమయింది. వడివడిగా అడుగులు వేస్తున్న గంగాధరుడి మదిలో ఓ ప్రశ్న తలెత్తింది. తామందరూ క్షత్రియులై కత్తి పట్టాల్సిన అవసరం వచ్చిందన్నారు శూరవర్మ. దాని అర్ధం ఇదేనా?

కత్తిపట్టి ఘజనీ ప్రవాహాన్ని ఎదుర్కోవాలా? వాడు రాక్షసుడే అయి, ఓటమి లేకుండా వరం పొందితే, వాడితో పోరాడటం మూర్ఖత్వం కాదా!

ఎందుకో గంగాధరుడి ఒళ్ళు జలదరించింది. తాను కత్తిపట్టి మరో వ్యక్తి తలను నరకటం ఊహించుకున్నాడు. అన్నీ విసిరేసి ఎక్కడికో పారిపోవాలనిపించింది. ఛ, తాను అటువంటి పనిచేయలేదు. రాక్షసుడయినా మనిషే కదా, వాడికి విషయాలు వివరించ వచ్చు. తర్కంతో వాదించి నిజా నిజాలు తెలియజేయవచ్చు. పాండిత్యం ప్రదర్శించి మనసు గెలవవచ్చు.

గతంలో ఎందరో పండితులు, తమ పాండిత్యంలో కరకు గుండెలను సైతం కరిగించారు. వారిని మెప్పించి దుష్ట మార్గంనుంచి మళ్ళించారు.

గంగాధరుడి మనస్సులో అశోక మహారాజు మెదిలాడు. కళింగయుద్ధం తరువాత, తన రాక్షసత్వం గ్రహించి, బుద్ధుడి శాంతి బోధనల ప్రభావంతో అశోకుడు ఆయుధాలు విసర్జించాడు. ప్రపంచంలో శాంతి సందేశాన్ని ప్రచారం చేశాడు.

ఈ ఆలోచన రాగానే గంగాధరుడి అడుగుల వేగం పెరిగింది. అతడి వెనకే, అతడి వేగాన్ని అందుకోలేక పరుగుతో రాసాగాడు శివ.

ఇద్దరూ గురువుగారి ఆశ్రమం చేరేసరికి అక్కడ విద్యార్ధులే కాదు, ఊరి ప్రజలంతా చేరి ఉన్నారు. పెద్దలు, పిల్లలు, స్త్రీలు, వృద్ధులు అందరూ ఆతృతగా అక్కడకు చేరారు. ఉద్విగ్నంతో ఎదురు చూస్తున్నారు.

అక్కడ లేనిది నాటకాల వాళ్ళే. వారి నాటకానికి ఊళ్ళోవాళ్ళ స్పందన చూసిన తరువాత వాళ్ళు చడీచప్పుడు లేకుండా పారిపోయారు. వారిని వెతికేందుకు యువకులు చాలాదూరం వెళ్ళివచ్చారు. కానీ వాళ్ళు దొరకలేదు. అందుకే, నిజం తెలుసుకునేందుకు అందరూ గురువుగారి ఆశ్రమం దగ్గర చేరారు. ఆత్రంగా ఎదురు చూస్తున్నారు.

అలా చూస్తున్న వారిలో గంగాధరుడు ఒకడయ్యాడు. అందరికీ ఎడంగా తన మిత్రులతో కూర్చుని చంద్రశేఖరుడు ఉత్సాహంగా చర్చిస్తున్నాడు. 'మనమంతా ఓ దండులా తయారవుదాం. కత్తి యుద్ధం చేసి రాక్షసుడిని చంపేద్దాం' అని అంటున్నాడు.'ఇంతలో అక్కడ చేరిన వారిలో కలకలం పెరిగింది. ఆశ్రమం తలుపు తెరచుకుంది. ముందుగా శూరవర్మ బయటకు వచ్చాడు. అతడి వెనకే గురువుగారు బయటకు వచ్చారు. అతడిని చూస్తున్న ప్రజలు తమ కళ్ళను తామే నమ్మలేకపోయారు. ఒక్క రాత్రిలో ఆయన వందేళ్ళ వృద్ధుడిలా అయిపోయారు. గురువుగారిని చూస్తూనే అంతా నిశ్శబ్దం అయిపోయారు. అందరివైపు చూసి ఆయన గొంతు విప్పారు.

## 5వ భాగం

‘మీరు విన్నది నిజమే. మరోసారి సోమనాథ మందిరంపై దాడి జరిగింది. మరోసారి పరమశివుడి పవిత్రలింగంపై శత్రువు కరవాలం కదను తొక్కింది‘ గురువుగారి గొంతు గాద్గదికమయింది. కంట నీరు పొంగింది

ఆ వార్త విని ప్రకృతి సర్వం స్థంభించినట్టు నిశ్శబ్దంగా అయిపోయింది. ఆకు కూడా కదలటం లేదు.

కొన్ని వార్తలు ఎన్నిమార్లు విన్నా, రక్తం గడ్డకడుతుంది. ప్రతిసారీ, తొలిసారి విన్నంత భయంకరంగానే అనిపిస్తుంది.

‘దుండగులు ఇలాంటి దుశ్చర్యలు చేస్తుంటే పరమశివుడు ఏం చేస్తున్నాడు? మూడో కన్ను తెరవలేదెందుకని?‘

ప్రజల గుంపులోంచి ఎవరో అడిగాడు.

‘తురుష్కులు రాక్షసులకన్నా హీనంగా ప్రవర్తిస్తూ దేవాలయాన్ని ధ్వంసం చేస్తున్నారు.

మతం మారని వారిని క్రూరంగా హింసించి చంపుతున్నారు. వాళ్ళ దేవుడి పేరున మారణ హోమం చేస్తున్నారు. ఏడీ మన దేవుడు?‘ ఎవరో అడిగారు.

ప్రజలు తమలో తాము రకరకాలుగా చర్చించుకోసాగారు.

గురువుగారు నిస్సహాయంగా అందరినీ చూస్తూ నుంచున్నారు. వీళ్ళ భయాలను ఎలా తగ్గించాలో ఆయనకు అర్థం కావటం లేదు.

అన్నిటికన్నా ఆయనను బాధిస్తున్న విషయం మరొకటి ఉంది.

వెంట వెంటనే తమ హృదయంలాంటి దేవాలయాలపై జరుగుతున్న దాడులు ప్రజల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. సమాజానికి దిగ్భ్రమ కలిగిస్తున్నాయి. దాని నుంచి తేరుకునే లోగా, మళ్ళీ కళ్ళు చీకట్లు కమ్మేట్టు మరో దెబ్బ తగులుతోంది. సమాజం నిరాశ, నిస్పృహలకు లోనవుతుంది. ఆత్మవిశ్వాసం దెబ్బతింటోంది. తమని తాము నమ్మలేని మనుషులు దేవుడిని ఎలా నమ్ముతారు?

దైవ భావన వ్యక్తుల ఆత్మవిశ్వాసం. వ్యక్తికి ఆత్మవిశ్వాసాన్నిచ్చేది దైవశక్తి. ఈ రెండూ పరస్పరం ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉంటాయి. ఒకటి దెబ్బతింటే మరొకటి దెబ్బతింటుంది. ఆత్మవిశ్వాసం దెబ్బ తిన్న జాతి దైవంపై విశ్వాసం కోల్పోతుంది. దైవంపై విశ్వాసం లేని జాతి ఆత్మవిశ్వాసం లేక దిగజారుతుంది.

‘మనకీ తురుష్కుల తండానుంచి విముక్తి లేదా?‘ గుంపులోంచి ఎవరో ఆవేదనగా అన్నారు.

గురువుగారు అందరివైపు చూశారు.

‘ఇటువంటి తుఫానులు ఈ దేశం అనేకం ఎదుర్కొంది. అన్నిటినీ తిప్పి కొట్టింది. ఈ తుఫాను కూడా తిప్పి కొడుతుంది. ఇది ఒక్క రోజులో అయ్యే పనికాదు. కొన్ని తరాలు ఒక ప్రణాళిక ప్రకారం ఒకే శక్తిలా కలిసి పనిచేయాల్సి ఉంటుంది.‘ తన విశ్వాసాన్నంతా స్వరంలో నింపి ప్రకటించారు గురువుగారు.

ఆయన మాటలు ఆందోళనలో ఉన్న వారికి స్వాంతన నివ్వలేదు. వారిలో ఒకడు గట్టిగా అడిగాడు.

‘ఏదీ పథకం? ఏదీ ప్రణాళిక? తుఫాను గాలికి ఎగిసిపోయే ధూళిలాగ మనమాంతా తురకల ధాటికి చెల్లా చెదరవుతున్నాం. ఒకే శక్తిలా పనిచేయటానికి మేము సిద్ధం‘.

‘కంగారుపడకండి. ఆద్యంతాలు లేని ధర్మం మనది. అనంతకాలం ప్రవహించే జీవనది మన ధర్మం. శత్రువులను ఎదుర్కొనే పథకాలు ప్రారంభమయ్యాయి. గ్రామం గ్రామం తిరిగి ప్రతి ఒక్కరికీ ఆత్మరక్షణలో శిక్షణనివ్వటం జరుగుతోంది. ప్రతి వ్యక్తినీ ఒక శక్తిలా

తీర్చిదిద్దే ప్రయత్నాలు ఆరంభమయ్యాయి. మీకు దేశ రక్షణ కోసం, ధర్మ రక్షణ కోసం పోరాడేందుకు పిలుపు వస్తుంది. అంతవరకూ నిశ్చింతగా ఉండండి.'

గురువుగారి మాటలు ప్రజలు అర్థం చేసుకున్నట్లే ఉన్నారు. తమ పిల్లలకు కత్తి యుద్ధం నేర్పటం వారికి తెలుసు. దాంతో వారికి గురువు మాటల్లో నమ్మకం కలిగింది. నెమ్మదిగా అందరూ ఒకరొకరుగా వెళ్ళిపోయారు.

నిట్టూర్చారు గురువుగారు. అంతలో ఆయన దృష్టి గంగాధర శర్మ పైన పడింది.

అందరూ వెళ్ళిపోయినా అతడు వెళ్ళలేదు.

'ఏం గంగాధర శర్మా... నీకు అనుమానం తీరలేదా?' అడ్డంగా తల ఊపాడు గంగాధర శర్మ.

'విదేశీయులెందుకు మనదేశంపై ఇలా దండెత్తుతున్నారు? వాళ్ళకి రాజ్యం కావాలంటే రాజ్యాలు రాజ్యాలు గెలుచుకోమనండి. దేవాలయాలెందుకు ధ్వంసం చేస్తున్నారు? ప్రజలను ఎందుకు హింసిస్తున్నారు?' అని ప్రశ్నించిన గంగాధర శర్మ వైపు జాలిగా చూశారు గురువుగారు. ఆయన మనసు జాలితో నిండిపోయింది. ఒకప్పుడూ శిశుజననం ఒక ఆనందకరమైన సంఘటన. శిశువు పుట్టిన తరువాత వాడి భవిష్యత్తు గురించి బెంగ ఉండేది కాదు. కాని ఇప్పుడు.. శిశువు పుట్టినప్పటి నుంచి ప్రతీ క్షణం భయపడాల్సి వస్తోంది. అన్నిటికన్నా ముఖ్యంగా వాడు తురుష్కుల చేతిలో పడతాడేమో అన్న భయం తల్లితండ్రులని పట్టిపీడిస్తోంది. తురకల చేతిలో తమ సంతానం పడేకన్నా వాడు చచ్చిపోతే తల్లిదండ్రులు స్మతోషించే రోజులివి. అతి భయంకరమైన రోజులు. ఈ విషయాలు, పిల్లవాడు, గంగాధరశర్మకు ఎలా చెప్పాలి?

గురువుగారి వైపే ఏకాగ్రతగా చూస్తున్న గంగాధర శర్మకు ఆయన మనస్సులో జరుగుతున్న సంఘర్షణ గ్రహించే శక్తిలేదు. కానీ గురువుగారెందుకో బాధపడుతున్నారని అతడికి అర్థమయింది. అందుకే మౌనంగా కూచున్నాడు.

ఒక ఉడత గబగబా పరుగెత్తుకు వచ్చి చకచకా తింటోందేదో. పక్షులు కిచకిచమంటూ ఎగురుతున్నాయి. రంగురంగుల సీతాకోకచిలుకలు అందంగా పువ్వు నుంచి పువ్వు పైకి పోతున్నాయి.

'సృష్టిలో ఏ జీవికీ ఏ బాధలేదు. మనిషికే అన్నీ బాధలు, భయాలు?' అనుకున్నాడు గంగాధర శర్మ.

అంతలో అతని కళ్ళముందు శివలింగంపై కదలాడుతున్న కత్తులు కనిపించాయి.

ముక్కలవుతున్న శివలింగం కనిపించింది.

'కిరాతకులు.. పాపభీతి లేకుండా ఎలా ప్రవర్తించారో?' అనుకున్నాడు మనసులో.

'గంగాధరా.. భగవంతుడి లీలలు మనకు అర్థం కావు. జననం వెంటే మరణం ఉంటుంది. అమృతం తోటే విషం ఉంటుంది. దేవతలు ఉంటారు. రాక్షసులూ ఉంటారు. అప్పుడప్పుడు మనుషులకు దైవం పరీక్షపెడుతుంది. ప్రస్తుతం మనల్ని దైవం పరీక్షిస్తుంటట్టుంది' మెల్లిగా అన్నారు గురువుగారు.

గురువుగారి మాటలు అర్థమయీ అవనట్టున్నాయి గంగాధరశర్మకు. తరువాత గురువుగారు ఏమైనా మాట్లాడతారేమోనని ఎదురు చూశాడు.

గురువుగారు ఇక మాట్లాడలేదు.

విసుగొచ్చే వరకు కూచున్నాడు గంగాధర శర్మ. సూర్యాస్తమయమవుతుంటే ఆయనకు నమస్కరించి లేచి వచ్చేసాడు.

ఆకాశం వింత వింత రంగులు ధరిస్తోంది. ఆ సూర్యకిరణాలు మేఘాలతో దోబూచులాడుతూ వాటికి హృదయాన్ని ఆనందింప చేసే సుందరమైన రంగులద్దుతున్నాయి.

'అసలీ రంగుల మిశ్రమం ఎలా వీలయిందో?' ఆకాశం వైపు చూస్తూ నిలబడ్డాడు గంగాధర శర్మ. ఇంతలో ఒక మేఘం శివలింగంలా అనిపించింది. నల్లటి మేఘం అది. అచ్చు శివలింగంలా ఉంది.

గంగాధర శర్మ మనస్సులోంచి భక్తిభావన అతనికే అర్థంకాని అక్షరాల రూపం ధరించాలని తపన పడుతోంది.

అంతలో గంగాధర శర్మ మనస్సు బాధతో విలవిలలాడింది. అతడు చూస్తుండగానే శివలింగ రూపంలోని మేఘం గాలికి చెదిరే దూదిపింజలా కరిగిపోయింది. చూస్తూ చూస్తుండగా కళ్ళ ముందు శివలింగం అదృశ్యమై అనంతమైన ఆకాశం నిలిచింది. జరిగింది అర్థమయ్యేలోపల ఆకాశం నల్లటి రంగులోకి మారింది. తనని చూసి తారలు పకపకమంటున్నట్టనిపించింది గంగాధరశర్మకు.

బరువెక్కిన హృదయంతో ఇంటిదారిపట్టాడు. దారిలో చీకటి పడ్డా కత్తి యుద్ధం చేస్తున్న చంద్రశేఖరుడు కనిపించాడు. ఆ వైపు వస్తున్న గంగాధర శర్మను చూసి అరిచాడు చంద్రశేఖరుడు.

'గంగా చూడు, శివలింగాన్ని ధ్వంసం చేసిన తురుష్కుడిని హతమారుస్తున్నాను' అని అరుస్తూ దెబ్బ గట్టిగా వేశాడు. అది తగలటంతో అతడి మిత్రుడికి కోపం వచ్చింది.

'నేను నీతో ఆడను పో' అని పరుగెత్తాడు.

అది చూసిన గంగాధర శర్మ మనస్సులో విచిత్రమైన భావన మెదిలింది.

'చంద్రా.. నాకూ కత్తి యుద్ధం నేర్పుతావా?' అడిగాడు గంగాధర శర్మ. అంతవరకూ ఎవరెంత ప్రయత్నించినా గంగాధర శర్మతో కత్తి సరిగ్గా పట్టించలేకపోయారు. ఇది చంద్రశేఖరుడికి తెలుసు. అందుకే పకపకానవ్వాడు.

**మసక మసక** చీకట్లో ఏం జరుగుతోందో సరిగ్గా అర్థం కావటంలేదు. కానీ వినిపిస్తున్న శబ్దాలను బట్టి, అని హాహాకారాలనీ, ఎవరో ప్రమాదంలో ఉన్నారనీ అర్థమౌతోంది.

శబ్దాలకు కాస్త దగ్గరగా వెళ్ళిన శూరవర్మ ఆగిపోయాడు.

కత్తి తీశాడు.

గంగాధరుడి వైపు చుశాడు.

గుసగుసగా చెప్పాడు.

'గంగాధరా, ఇన్నాళ్ళు నువ్వు శిక్షణ పొందావు. నువ్వు నేర్చిన దాన్ని ఆచరణలో పరీక్షించే సమయం వచ్చింది. జాగ్రత్త! తురుష్క తండాలు ఎవరినో వేధిస్తున్నట్టున్నాయి' అన్నాడు అరుపులను జాగ్రత్తగా వింటూ.

గంగాధర శర్మ గుండెలు దడదడలాడసాగాయి. శతృవుతో ఊహా యుద్ధం చేయటం వేరు. నిజంగా శత్రువు ఎదురు నిలిచి పోరాడటం వేరు. చీకట్లోకి కళ్ళు చికిలించి చూశాడు శూరవర్మ.

'సందేహం లేదు. ఏదో కుటుంబంపై తురుష్క మూక దాడి చేసింది. గంగాధరా సిద్ధంగా ఉండు. ఒకటి గుర్తుంచుకో. విజయమో, వీరస్వర్గమో అంటూ యుద్ధరంగంలో దూకకు. విజయమే అంటూ దూకు. తురుష్కులను తెగనరుకు. మనవారిని రక్షించి.' అంటూ శూరవర్మ పొదచాటు నుంచి కత్తి ఎత్తి పట్టుకుని తురుష్కుల పైకి దూకాడు.

గంగాధర శర్మ కాళ్ళు, చేతులు వణకసాగాయి.

ఇంతకాలం తురుష్కుల గురించి విన్నాడు. ఇప్పుడు చూస్తున్నాడు.

చీకట్లో వాళ్ళు రాక్షసుల్లా కనిపిస్తున్నారు. ఆరేడుగురున్నారు. పొడుగ్గా బలిష్టంగా ఉన్నారు. వాళ్ళ గడ్డాలు, మీసాల నడుమ వికటాట్టహాసాలతో, పచ్చగా, పుచ్చిపోయిన పళ్ళతో, వాళ్ళు మరింత భయంకరంగా కనిపిస్తున్నారు.

వాళ్ళని చూస్తుంటే గంగాధర శర్మను తెలియని భయం ఆవహించింది. పొడుగ్గా, రాక్షసుల్లో ఉన్న వాళ్ళతో తాను పోరాడగలడా? వాళ్ళ చేతుల్లో కత్తులు తమ కత్తుల్లా లేవు. తమ కత్తులకన్నా లావుగా, బలంగా ఉన్నాయి. చూస్తుంటే, అవి మనుషుల శరీరాల్లో దిగబడేందుకు తహ తహ లాడుతున్నట్టున్నాయి. ఇంతలో 'హరహర మహాదేవ్' అంటూ వారిపైకి దూకాడు శూరవర్మ. వెంటనే తురకవారి దృష్టి ఈ వైపు మళ్ళింది.

వారు ఈ వైపు పూర్తిగా మళ్ళేలోగా శూరవర్మ కరవాలం మెరుపులా ఒకడి గుండెలో దిగబడింది.

'యా అల్లా' అంటూ వాడు గుర్రం పై నుండి పడిపోయాడు. వెంటనే మిగిలిన అయిదుగురిలో ఒకడు, నాయకుడు కాబోలు, ఇస్కో జానేనదో' అంటూ ఆజ్ఞాపించాడు ఒకడిని.

"మిగతా వారితో 'యా అల్లా, కాఫిర్ కో ఖతం కర్దో' అంటూ కత్తిని గిరగిరా శూరవర్మ పైకి దూకాడు.

మిగతా వారు, బహుశా ముందే పథకం వేసుకున్నారేమో, శూరవర్మను చుట్టుముట్టారు.

ఇంకొకడు మాత్రం, తాము దాడి చేసిన కుటుంబ సభ్యులను ఒకచోట చేర్చి, వారి తలలపై కత్తిని ఎత్తి పట్టుకుని సిద్ధంగా నిలబడ్డాడు. ఆ కుటుంబ సభ్యులు గజగజ వణుకుతున్నారు. ఏడుస్తున్నారు.

జరుగుతున్నదంతా ఒక పీడకలలా ఉంది గంగాధర శర్మకు. ఇది నిజంగా జరుగుతున్నదన్న నమ్మకం కలగటంలేదు.

అతడు నిలుచున్న స్థానంలో స్థాణువులా నిలిచి పోయాడు. కాళ్ళు భూమికి అతుక్కుపోయినట్టున్నాయి. కలం పట్టుకుని, కావ్యాలు రచించి, ఆధ్యాత్మిక సిద్ధాంతాల చర్చలు చేయవలసిన తాను కత్తి పట్టుకుని పోరాడటమా? కుత్తుకలు కత్తిరించటమా ఒక రకమైన ఆవేశంలో గంగాధర శర్మ కత్తి యుద్ధం నేర్చుకున్నాడు. కానీ క్రౌర్యం, హింస అతని స్వభావంలో లేవు.

మౌలికంగా గంగాధర శర్మ సాత్వికుడు. ఎప్పుడయితే యుద్ధంలోని హింసలోని నిజం కళ్ళ ఎదుట నిక్కచ్చిగా నిలబడిందో, అప్పుడే అతడి ఆవేశం దిగిపోయింది. ఆలోచన కర్తవ్యానికి అడ్డుపడుతోంది.

తనని చుట్టుముట్టిన తురుష్కులను ఒక్క క్షణంలో పరిశీలించాడు శూరవర్మ. వీరు సుశిక్షితులైన సైనికులని, ఏదో కారణాని దారి దోపిడీకి పాల్పడుతున్నారని గ్రహించాడు. అంతలో అతడికి మరో ఆలోచన వచ్చింది.

వీళ్ళు దారి దోపిడీ గాళ్ళు కాకపోవచ్చు.

ఆ కాలంలో తురుష్కులింకా భారతదేశంలో స్థిరపడలేదు. అప్పుడప్పుడే వారు రాజ్యాలు గెలుచుకుంటూ, తమ శక్తిని ప్రదర్శించి, స్థిరపడే ప్రయత్నాలలో ఉన్నారు. అంతవరకూ తురుష్కులు రాజ్యాలు గెలుచుకుని, ప్రతినిదులకు రాజ్యం అప్పచెప్పి, అందినన్ని ధనరాసులను తమ దేశం పట్టుకుని పోయేవారు. అప్పుడు రెండవ తరం తురుష్కులు ఈ దేశంలో స్థిరపడటం ఆరంభమవుతోంది. ఇక్కడ జన్మించిన తరువాత తరాల వారు రాజ్యం కోసం ఆరాట పడటం మొదలయింది. దాంతో కొత్త రాజ్యాలు, ప్రాంతాలను వెతుకుతూ, తురుష్క సైనికులు దేశమంతటా విస్తరించటం ప్రారంభించారు. ఇలా, ఏదైనా కొత్త ప్రాంతం, అక్కడ అంతవరకు తురుష్కులకు తెలియనిది, గ్రామమో, నగరమో, రాజ్యమో కనబడగానే రాజు అనుమతితో ఆ ప్రాంతాన్ని గెలుచుకుంటారు. ఢిల్లీ రాజుకు సామంత రాజు అనగా ఆ ప్రాంతపై రాజ్యం చేస్తారు.

అలా 'కొత్త కొత్త ప్రాంతాలు వెతుకుతూ బయలుదేరిన తురుష్కులే వీరు' అన్న ఆలోచన శూరవర్మకి వచ్చింది. ఆ ఆలోచన రావటంతోటే అతనికి ప్రమాద తీవ్రత స్పష్టమయింది.

ఇన్నాళ్ళూ 'శివపురం' గురించి బయట ప్రపంచానికి తెలియదు. వారణాసికి దగ్గర్లోనే ఉన్నా, చుట్టూ అడవులు, కొండలు ఉండటంతో మెరుగు కాదు, చాలామంది స్థానికులకు కూడా ఈ గ్రామం గురించి తెలియదు. ఒక పద్దతి ప్రకారం, ఈ గ్రామం ఉనికిని బయట ప్రపంచానికి తెలియకుండా కాపాడుతూ వస్తున్నారు.

దాంతో ముంచు కొస్తున్న తురుష్క వెల్లువ తాకిడికి దూరంగా, ఎడారిలో ఒయాసిస్సులా, అనేకులకు ఆశ్రయం ఇస్తోందీ గ్రామం. ఇపుడీ గ్రామం గురించి తురుష్కులకు తెలిస్తే వీరి వెంట తురుష్క సైన్యం వస్తుంది.

అదే జరిగితే.. ఎందతో పండితులకు కళాకారులకు, వివిధ రంగాలలో నిపుణులకు ఆశయం ఇస్తున్న శివపురం తురుష్కుల పాలవుతుంది. ఇది జరగకూడదు.

ఈ ఆలోచన రావటంతోటే శూరవర్మలో నూతనోత్సాహం, పట్టుదలలు ప్రవేశించాయి.

చుట్టుముట్టిన తురుష్కులు బలాలను అంచనా వేస్తూ, వారి ప్రహారాలకు అందకుండా తప్పించుకోసాగాడు.

వారు గుర్రాలపై ఉన్నారు.

తాను నేలపై ఉన్నాడు.

దాంతో, వారు కత్తి ఝుళిపించినప్పుడల్లా, వొంగి, కూర్చుని, వారి కత్తి పరిధికి అందకుండా తప్పించుకుంటున్నాడు. ఎలాగయినా, వారిని అలవగొట్టాలన్నది శూరవర్మ ప్రయత్నం.

శూరవర్మ తెలివిగా తప్పించుకోవటం, తురుష్కులకు ఆగ్రహం కలిగించింది.

'కాఫిర్ హోషియార్ హై' అంటూ అరిచాడు నాయకుడు మిగతావారిని ఉద్దేశించి.

వారిలో ఒకడు బిగ్గరగా నవ్వుతూ 'తోక్లా... అఖిర్ కాఫిర్ అకేలా హై' అంటూ గుర్రం మీద నుంచి హఠాత్తుగా క్రిందకు వంగి శూరవర్మను పొడిచాడు చివరి క్షణంలో వాడి ఎత్తును గ్రహించాడు శూరవర్మ.

వాడికి వ్యతిరేక దిశవైపు దూకాడు.

కానీ వాళ్ళు అది ఊహించినట్టున్నారు. ఏ వైపు దూకాడో, ఆ వైపు వాడు తొంగి కత్తిని ఊపాడు.

'మహాదేవా' అరిచాడు శూరవర్మ బాధతో.

తురుష్కుడి కత్తి అతడి భుజానికి గాయం చేసింది. చిక్కని ఎఱ్ఱని రక్తం పొంగింది.

'కాఫిర్ ఘాయల్ హువా' అరిచాడొకడు సంతోషంగా.

ఇదంతా చూస్తున్న గంగాధర శర్మకు ఆవేశం వచ్చింది. తన చేతకాని తనం పట్ల అసహ్యం అనిపించింది. వెంటనే, ఎలా వచ్చిందో అతడికి, తెగింపు వచ్చింది. చావో, బ్రతుకో అన్న ఆలోచన లేదు. తాను గంగాధర శర్మను అన్న ఆలోచన లేదు తాను మనిషిని అన్న స్పష్టత లేదు. తానే ఒక ఆవేశం అయిపోయాడు. 'తురుష్కులను సంహరించాలి' అంతే. అది తప్ప మరో చైతన్యం లేదు.

'శంభోశంకర' అని అరుస్తూ వారిపై పిచ్చివాడిలా దూకాడు గంగాధరశర్మ! ఒక్క క్షణం తురుష్కులు విస్తుపోయారు.

వారు శూరవర్మ ఒంటరివాడనుకున్నారు. ఇంకొకడు హఠాత్తుగా దూకటం వారి ఆశ్చర్యం కలిగించింది. వారి దృష్టిని మళ్ళించింది.

శూరవర్మకు ఆ సమయం చాలు.

గంగాధర శర్మ తన వెంట వచ్చాడని శూరవర్మకు తెలుసు. అతడు ఇంతవరకు రంగంలో దూకకపోవటానికి కారణం కూడా అతడు గ్రహించాడు.

గంగాధర శర్మ కది తొలిపోరాటం.

ఎటువంటి మనిషి అయినా అసలు సమయం వచ్చినపుడు బెదురుతాడు. నిష్క్రియుడవుతాడూ. భారత యుద్ధం తరుణంలో, అంత వీరుడయిన అర్జునుడే యుద్ధ విముఖుడయ్యాడు. అయితే, అప్పుడు అర్జునుడికి ప్రేరణ నిచ్చేందుకు శ్రీకృష్ణుడున్నాడు.

ఇప్పుడు శ్రీకృష్ణుడు ఉన్నా, ప్రేరణ నిచ్చేంత సమయంలేదు.

వ్యక్తి ప్రేరణ అతడిలోంచే రావాల్సిన సమయం ఇది. అది వస్తే, వ్యక్తికి ఢోకా లేదు. లేకపోతే, అతడికి జీవించే అర్హత ఉండదు.

ఇది గంగాధర శర్మకు పరీక్ష.

అందుకే శూరవర్మ అతడిని పిలవలేదు. అతడు రంగంలోకి దూకేందుకు అతడిలోంచి ప్రేరణ వచ్చేందుకు నిరీక్షిస్తూ వచ్చాడు.

అందుకే, గంగాధర శర్మ రంగంలోకి దూరగానే, శత్రువు దృష్టి క్షణకాలం మరలగానే, అందుకోసమే ఎదురు చూస్తున్న శూరవర్మ, ఆ అవకాశాన్ని చక్కగా వినియోగించుకున్నాడు.

తనకయిన గాయాన్ని లెక్కచేయకుండా, కత్తితో, గుఱ్ఱం కాళ్ళు నరికాడు. దాంతో, గుఱ్ఱం పైనున్నవాడి పట్టు తప్పింది. వాడు నేలను తాకేలోగా, శూరవర్మ కత్తి వాడి ప్రాణాలను గాల్లో కలిపేసింది. రెండోవాడు ఆశ్చర్యం నుంచి తేరుకునేలోగా, శూరవర్మ కత్తి వాడి గుండెలో దిగబడింది.

గంగాధర శర్మ ఆవేశంతో, పిచ్చివాడిలా కత్తి తిప్పుతూ తనకు దగ్గరలో ఉన్న తురుష్కుడి పైకి లంఘించాడు.

యుద్ధంలో గెలవాలంటే ఆవేశం ఒక్కటే సరిపోదు. ఆవేశం ఒక్కటే అనర్థదాయకం కూడా.

ఆవేశం ఆలోచనను హరిస్తుంది. విచక్షణను చంపేస్తుంది. దాంతో ఆవేశం ఉన్న వ్యక్తి ఆలోచన లేకుండా గుడ్డిగా రంగంలోకి దూకుతాడు. ఎంత నైపుణ్యం ఉన్నా దెబ్బ తింటాడు.

గంగాధర శర్మకు ఇంకా ఈ గ్రహింపు లేదు. ఆవేశాన్ని నిర్మాణాత్మకంగా ఉపయోగించుకోవాలన్న విచక్షణ ఉన్న పరిణత కల యుద్ధవీరుడు కాడు గంగాధర శర్మ. దాంతో ఆవేశంగా, కత్తి తిప్పుతూ తురుష్కుడిపైకి లంఘించాడు గంగాధర శర్మ.

గంగాధర శర్మ ఆవేశ ధాటికి ఆశ్చర్యపోయాడు తురుష్కుడు.

జరుగుతున్నది గ్రహించేలోగా, గంగాధర శర్మ కత్తిపోటుకు అతడి గుఱ్ఱం చచ్చిపడింది.

తురుష్కుడు గుఱ్ఱం మీదనుంచి క్రిందపడ్డాడు.

వెంటనే గంగాధర శర్మ అతడిపైకి లంఘించాడు. కత్తిని తిప్పుతూ, కాలిని అతడి గుండెపై ఉంచి, కత్తిని బలంగా అతడి మెడపైకి విసరబోయాడు. అంతవరకూ గంగాధర శర్మలో ఉన్న ఆవేశం ఒక్కసారిగా అదృశ్యమయింది. గంగాధర శర్మలో ఆలోచన వచ్చింది.

ఏమిటిది? తానేం చేస్తున్నాడు?

ఒక సజీవుడయిన మనిషిని నిర్జీవుడిని చేయబోతున్నాడు. తనకీ హక్కు ఎవరిచ్చారు?

తన చేతిలోని నిర్జీవమైన ఆయుధానికి తాను శక్తినిచ్చి, దానిద్వారా, ఒక చైతన్యాన్ని హరించాలనుకుంటున్నాడు.

ఎంతఘోరం!

ప్రతి వ్యక్తిలో ఈశ్వరుడున్నాడంటారు.

తనలో ఈశ్వరుడున్నాడు.

ఇప్పుడు తాను చంపబోతున్న వ్యక్తిలో ఈశ్వరుడుంటాడు.

ఆ వ్యక్తిలోని ఈశ్వరుడిని వెడల నడిపే హక్కు తనకెవరిచ్చారు?

తన మెడపై కత్తి పెట్టి ఆలోచనలో పడ్డ గంగాధర శర్మని చూడగానే, తురుష్కుడి పెదవులపై వ్యంగ్యంతో కూడిన చిరునవ్వు కదిలింది.

'ఈ కాఫెర్‌ల బలహీనత ఇదే ప్రతిదాన్లో భగవంతుడిని చూసారు. చెట్టులో, పుట్టలో, గుట్టలో, శత్రువులో.. చేతకానితనంతో తామే హతులవుతారు' అనుకుంటూ ఒక్క ఉదుటున పక్కకు పొర్లాడు.

ఊహించని ఈ చర్యకు గంగాధర శర్మ ముందుకు తూలాడు.

వెంటనే తురుష్కుడు గంగాధర శర్మను కాలితో తన్నాడు.

గంగాధర శర్మ చేతిలోని కత్తి జారిపోయింది.

అది నేలను తాకేలోగా తురుష్కుడు ఆ కత్తిని అందుకున్నాడు. మరో చేత్తో, క్రింద పడుతున్న గంగాధర శర్మ జుట్టు పట్టుకున్నాడు.

'బోల్ కాఫిర్ సాలా, అల్లా కో కుబూత్ కరేగా యా మరేగా?' క్రూరంగా అడిగాడు. జరుగుతున్న దానికి గంగాధర శర్మ మెదడు మొద్దుబారిపోయింది. అతడికేమీ అర్థం కావటం లేదు. వెర్రివాడిలా తురుష్కుడి వైపు చూస్తుండిపోయాడు. తన జుట్టు వాడి చేతిలో ఉందని, వాడి కత్తి తన కుత్తుకను కత్తిరిస్తుందని కూడా అతడికి అర్థంకాలేదు.

ఇద్దరిని మట్టుబెట్టిన శూరవర్మ, గంగాధర శర్మ సహాయానికి రాబోయాడు. కానీ, మరో తురుష్కుడు అతడికి అడ్డుపడ్డాడు.

శూరవర్మ మనస్సుని నిస్సహాయ భావన ఆక్రమించింది.

ఏమిటీ జాతికింత బలహీనత?

ఎందుకింత నిర్వీర్యం, నిస్తేజం అవుతోంది జాతి?

గెలుపు అంచులనుండి ఓటమి కోరలకెందుకు దిగజారుతోంది జాతి?

అయితే అర్థంలేని ఆవేశం, లేకపోతే, చేతకాని బలహీనతలతో ఎందుకీ మహోన్నతమైన జాతి మరణం వైపు పరుగులిడుతోంది? శూరవర్మకు ఆవేశం హెచ్చింది.

కానీ అతడి ప్రత్యర్థి తురుష్కుల నాయకుడు. యుద్ధ విద్య నిపుణుడు. అతడికి విజయం తమదేనని అర్థమయింది. తన సహచరుడూ, ఆ బలహీన ప్రత్యర్థిని చంపిన మరుక్షణం తామిద్దరు, కాఫిర్ ఒకడే అవుతాడు.

తమలో ఒకడు కాపలాగా ఉన్నాడు. అంటే తాము ముగ్గురు.. విజయం తమదే!

అందుకే శూరవర్మను గంగాధర శర్మ వైపు పోనీయటం లేదతడు.

తురుష్కుడు తనదారికెంత అడ్డుపడుతున్నాడో, శూరవర్మలో అంతే నిస్పృహ పెరుగుతోంది. అది అతడిని బలహీనుడిని చేస్తోంది.

'బోలో.. అల్లా కో కుబూల్ కరేగా.. యా..' అంటూ వికటంగా నవ్వుతూ కత్తిని ఎత్తాడు తురుష్కుడు.

చీకట్లో తళతళ మెరుస్తున్న కత్తిని, వికటంగా నవ్వుతున్న తురుష్కుడిని చూస్తూ బిత్తరపోయి, స్థాణువైపోయాడు గంగాధర శర్మ.

అతడి మెదడు పనిచేయటం లేదు.

శరీరం నిస్త్రాణ అయిపోయింది.

కత్తి శరీరాన్ని తాకకముందే, ప్రాణాలు శరీరాన్ని వదలాలని, కళ్ళల్లో చేరినట్టు కళ్ళు మరింతగా విప్పారి అలాగే చూస్తుండిపోయాయి. ఇంతలో అనూహ్యమైంది జరిగింది...!!

✡✡✡

**వికటంగా నవ్వుతున్న తురుష్కుడి నోరు** అలాగే తెరచుకుని ఉండిపోయింది. గంగాధర శర్మ జుట్టుపై అతడి పట్టు సడలింది.

విజయగర్వంతో, తూష్ణీం భావంతో గంగాధర శర్మ వైపు చూస్తున్న తురుష్కుడి కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. అంతలోనే బాధతో కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. గంగాధర శర్మను పొడవాలని కత్తి ఎత్తిన చెయ్యి, అతడి శరీరం నుంచి వేరయింది. అతడి వెనకే 'జై శివశంకర' అని అరుస్తూ కత్తిని అంటిన రక్తాన్ని చూస్తూ వికటట్టహాసం చేస్తున్న చంద్రశేఖరుడు కనిపించాడు.

క్షణంలో పరిస్థితి మారింది.

తుఫానులా రంగంలోకి దూకిన చంద్రశేఖరుడు ప్రళయకాల రుద్రుడిలా విలయ తాండవం ఆరంభించాడు.

క్రింద పడిన తురుష్కుడు లేచేలోగా, అతని మీదకి దూకి ఒక్క వేటులో అతడి శరీరం నుంచి కంఠాన్ని వేరు చేశాడు. అదే ఊపులో ఆ కుటుంబానికి కాపలాగా ఉన్న తురుష్కుడిపై దూకాడు.

జరిగేది సంభ్రమంగా చూస్తున్న ఆ తురుష్కుడు, తేరుకుని, కత్తి పై చెయ్యి వేసేలోగా, చంద్రశేఖరుడి కత్తి పోటుకు అతడి తల రెండు వక్కలయింది. ఆ రెండు ముక్కలు వేరయి రక్తం చిందేలోగా, చంద్రశేఖరుడి మరో ప్రహారంతో అతడి తల విరిగిన బంతిలా గాల్లోకి ఎగిరింది.

ఇప్పుడు తురుష్కనాయకుడు ఒక్కడే మిగిలాడు. జరిగినదంతా చూస్తున్న అతడికి తన కాలం చెల్లిందని అర్ధమయింది.

తాను పోతే పోయాడు వీలయినంతమందిని వెంట తీసుకుపోవాలన్న కసితో, బలంగా శూరవర్మ పైకి లంఘించాడు.

చంద్రశేఖరుడి ఆగమనంతో పరిస్థితి మారిందని శూరవర్మకి అర్ధమయింది. ఆ తురుష్క నాయుడిని ప్రాణాలతో బంధిస్తే, అతడి ద్వారా తురుష్కుల కదలికలను గమనించవచ్చని శూరవర్మ ఆలోచన.

అందుకే మీదకు లంఘించిన ఆ తురుష్కుడి వేటునుంచి తప్పించుకున్నాడు శూరవర్మ. కానీ తిరిగి దాడిచేయలేదు. కేవలం ఆత్మరక్షణ చేసుకున్నాడు.

క్షణంలో శూరవర్మ పథకం అర్ధం చేసుకున్నాడా తురుష్కుడు. రెట్టించిన శక్తితో శూరవర్మ పైకి లంఘించాడు.

అయితే, మహోగ్ర తాండవం చేస్తున్న చంద్రశేఖరుడు పెద్దగా అరుస్తూ తురుష్కుడి గుండెల్లోకి కత్తి దింపాడు. విజయగర్వంతో వికృతంగా అరిచాడు.

జరిగింది చూస్తున్న శూరవర్మ విస్తుపోయాడు. గంగాధర శర్మ బ్రాన్పడిపోయాడు. ఆ కుటుంబం వారయితే వణికిపోతున్నారు.

తేరుకున్న శూరవర్మ చంద్రశేఖరుడిని శాంతింపచేశాడు. క్రిందపడి ఉన్న గంగాధర శర్మను లేవనెత్తాడు ఆ బందీలయిన కుటుంబం వైపు వెళ్ళాడు.

'మీకేం భయం లేదు. ఎవరు మీరు?' అడిగాడు శూరవర్మ.

'నా పేరు ధర్మరాజు. ఆమె నా ధర్మ పత్ని, వాళ్ళిద్దరూ నా సంతానం. నేను సౌరాష్ట్రకు చెందిన వాడిని. సోమనాథ మందిరం శుభ్రపరచే బాధ్యత నిర్వహించేవారిలో నేనొకడిని. సమయానికి శివుడు పంపినట్టే వచ్చి మా ప్రాణాలు కాపాడారు' అన్నాడతడు.

'సోమనాథ మందిరం' పేరు వినబడగానే శూరవర్మ అతడికి నమస్కరించాడు.

గంగాధర శర్మ, చంద్రశేఖరులు అతడి వైపు విప్పారితనేత్రాలతో చూశారు.

సోమనాథ మందిరంలో ఉండేవాడనగానే వారికి అతడిపై గౌరవభావం కలిగింది. తురకల దండయాత్రనుంచి బ్రతికి బయటపడ్డాడన్న నిజం అతడిని వాళ్ళ దృష్టిలో గొప్పవాడిని చేసింది.

'మేము కొన్ని వందల మందిమి సౌరాష్ట్ర నుంచి సురక్షితమైన స్థలం వెతుకుతూ బయలుదేరారు. అదేం పాడుకాలమో తెలియదు, దేశంలో ఎక్కడకు వెళ్ళినా తురకల తండాలు వెంటపడుతూనే ఉన్నాయి. దారిలో మాతో అనేకులు కలిశారు. ఒక దశలో మేమంతా ఏ అడవిలోనో ఓ కొత్త గ్రామాన్ని ఏర్పాటు చేసుకుని నివసిద్దామని కూడా అనుకున్నాం.'

'అంతమంది కలిశారా?' అడిగాడు చంద్రశేఖరుడు ఆశ్చర్యంగా.

'ఏం చేస్తాం బాబూ, ఇళ్ళల్లోకి పొగవచ్చినప్పుడు ఇళ్ళనుండి బయటకు రాక తప్పదు. తేనెగూడు క్రింద పొగపెట్టినప్పుడు తేనెటీగలు గూడును వదలి చెల్లాచెదురవుతాయి. తురకల సైన్యం తుఫానులా వచ్చిపడుతున్నప్పుడు ఏం చేస్తాం..!?'

'మరి వారంతా ఏరి?' అడిగాడు గంగాధర శర్మ.

విషాదంగా నవ్వాడు ధర్మరాజు.

'ముసలివాడిని ఓపిక లేదు. ఎన్ని నెలలుగా కాందిశీకుడిలా, గమ్యం లేకుండా తిరుగుతున్నానో నాకే తెలియదు. కాస్త విశ్రాంతి తీసుకున్న తరువాత అన్ని వివరాలు చెపుతాను' ఆయాసపడుతూ అన్నాడతడు.

'క్షమించండి.. యుద్ధం చేసిన ఉత్తేజం వల్ల మీ పరిస్థితి గురించి ఆలోచించలేదు. మా ఇళ్ళు దగ్గరలోనే ఉన్నాయి రండి' అన్నాడు శూరవర్మ.

వాళ్ళు తమ మూటలను ఏరుకుని కదలటానికి సిద్ధమయ్యేసరికి మేఘాల మాటునుండి చంద్రుడు వెలుపలకు వచ్చాడు. ఒక్కసారిగా ఆ ప్రాంతం వెన్నెల వెలుగుతో మెరిసిపోయింది. అంతవరకూ నీడల్లాగా, నల్లటి ముద్దల్లాగా ఒకరినొకరు సరిగ్గా కనిపించని వారు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నారు. అంతక్రితం జరిగిన బీభత్సం తాలూకు స్వరూపం స్పష్టంగా కనిపిస్తోంది. వెలుగులో చంద్రశేఖరుడు, గంగాధర శర్మలను చూడగానే ధర్మరాజు ఒక అడుగు వెనక్కు వేశాడు.

'తురకల తండాలతో పోరాడింది బ్రాహ్మణ బాలవాడి' అడిగాడు ఆశ్చర్యంగా.

శూరవర్మ నవ్వాడు.

'వాళ్ళు సూతన ధర్మానుయాయులు. ధర్మ రక్షణ కోసం ఆయుధాలు చేపట్టారు.'

'ఎంతటి పరిస్థితి వచ్చింది! శాస్త్రాలు వల్లెవేసి, విజ్ఞానం గ్రహించి, దేవతార్చన చేయవలసిన హస్తాలు, కరవాలాలు ధరించి కుత్తుక కత్తిరించవలసి వస్తోంది! ఏమైపోతోంది మన ధర్మం?' ధర్మరాజు కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

అతడి భుజంపైన చెయ్యివేశాడు శూరవర్మ.

'అత్యవసర పరిస్థితిలో అనూహ్యమైన నిర్ణయాలు తీసుకోవటం తప్పనిసరి. అవసరమైతే పరశురాముడు గండ్రగొడ్డలి ధరించలేదా? మహా విష్ణువు మత్స్యావతారం దాల్చలేదా? వాళ్ళు కత్తులు ధరించారు కాబట్టే మీ ప్రాణాలు నిలిచాయి. అలాగే సనాతన ధర్మం కూడా నిలుస్తుంది' అనునయంగా, బుజ్జగిస్తున్నట్టు అన్నాడు.

అపుడు గమనించారు వారు, చెట్టుచాటునుంచి ఒక యువతి బయటకు వచ్చింది. ఆమె రావటంతోటే, ఆ ప్రాంతంలో వెన్నెల విస్తరించిందన్న భావన కలిగింది అందరికీ. గంగాధర శర్మ మనసులో కాళిదాసు శ్లోకాలు మెదిలాయి.

ఉన్మీలితం తులికయేవ చిత్రం సూర్యం శుచర్భిన్న ముఖారవిందం!

బభువ తస్యాశ్చతు రస్త్ర శోభివపుర్విభక్తం నవయౌవనేన!

(యవ్వనం ఇచ్చిన అందం వల్ల, ఆమె, చిత్రకారుడు అతి జాగ్రత్తగా చిత్రించిన అందమైన చిత్రపటంలా ఉంది. కిరణాలు తాకటంతోటే వికసించిన కమలంలా ఉంది)

సర్వోపమాద్రవ్య సమాచ్ఛయేన యథాప్రదేశం వినికేశితేను

సా నిర్మితా విశ్వసృజా ప్రయత్నా కష్థ సౌందర్య దిక్షయేవ!!

(భగవంతుడు శ్రమకోర్చి, సృష్టిలోని అత్యుతమ ద్రవ్యాలన్ని ఒకచోట పేర్చి ఆమెని నిర్మించినట్టున్నాడు. ప్రపంచంలోని అందమంతా ఒకచోట కుప్పలా పోస్తే ఎలా ఉంటుందో చూడాలన్న కోరికతో ఆమెను సృజించినట్టున్నాడు)

అంతలోనే అతడికి తానున్న పరిస్థితి గుర్తుకు వచ్చింది.

తాను అడవిలో ఉన్నాడు. చుట్టూ శవాలున్నాయి. భీతి భ్రాంతులయి, నిరాశ్రయులై, అలసిపోయి ఉన్నారు వాళ్ళు. అయినా, ఈ అమ్మాయిని చూసి తన హృదయం ఎలా స్పందించగలుగుతోంది?

ఆమెని చూసిన చంద్రశేఖరుడి రుధిరం గంగా ప్రవాహమయింది.

ఎంత వేగంగా ప్రసరిస్తోందంటే, అతడికి, తాను తల తిరిగి పడిపోతాననిపిస్తోంది. తాను చదివిన అనేక సంస్కృత కావ్యాలలోని సుందరీమణుల వర్ణనలు అతడి మదిలో మెదిలాయి. కానీ ఈ అమ్మాయి అందాన్ని అవేవీ సరిగ్గా వర్ణించలేవనీ, ఈమె అందం ముందు ఆ వర్ణనలన్నీ దిగదుడుపేననీ అనిపించిందతనికి.

అయితే, ఆ ఇద్దరికీ, ఆ అమ్మాయిని చూడటం వలన తమలో కలిగిన సంచలన స్వరూపం నిర్దిష్టంగా ఇదీ అన్న గ్రహింపులేదు.

అంతలో వారి దృష్టి ఆ అమ్మాయి ఆధారంగా నిలబడి ఉన్న యువకుడిపై పడింది. అతడి ఒళ్ళంతా గాయాలున్నాయి. నిస్త్రాణగా ఉన్నాడు. దాదాపుగా స్పృహ తప్పిపోయేటట్టున్నాడు. వాళ్ళ దృష్టి ఆ అమ్మాయి, అబ్బాయిల మీద పడగానే ధర్మరాజువారిని పరిచయం చేశాడు.

'మాతో చేరిన అనేకులు తురకల బారిన పడగా మిగిలింది వీరిద్దరూ. అమ్మాయి పద్మిని. యువకుడు ప్రహరసింహ. మా కోసం తురకలతో ఈ యువకుడొకడే ఎదురు నిల్చిపోరాడాడు. ఆ గాయాలు అలా అయినవే!'

ఆ అమ్మాయి పక్కన యువకుడిని చూస్తూనే గంగాధర శర్మ మనసులో ఓ రకమైన ప్రశాంత భావన కలిగింది. ఆ అమ్మాయి అంటే కలిగిన సున్నితమైన భావన క్షణంలో పటాపంచలయింది.

'మీరెక్కడి వారు?' అడిగాడు శూరవర్మ.

'మేం జాహోర్ కు చెందిన వారం. అమ్మగారు మా సంస్థానాధీశుడి కూతురు. నేను ఆమె సేవకుడిని. అంగరక్షకుడిని. సోమనాధ దేవాలయాన్ని దోచుకుని, సౌరాష్ట్ర సౌభాగ్యాన్ని మట్టి పాలు చేసిన తురకల సైన్యం ఢిల్లీ తిరిగి వెళుతూ దారిలో ఉన్న గ్రామాలన్నిటినీ కొల్లగొట్టారు. అందిన వారిని అందినట్టే మతం మార్చారు. మారని వాళ్ళని చంపారు. ఆడవాళ్ళని చెరపట్టారు.

తురకలు వస్తున్నారనగానే అమ్మాయి గారిని రక్షించే బాధ్యత నాకు అప్పగించారు. సంస్థానం సరిహద్దులలో తురకలు చేరారని వినగానే అమ్మాయిగారిని, రాణిగారిని, ఇతర పరివార జనాన్ని తీసుకుని రహస్య మార్గం గుండా అడవులలోకి చేరుకున్నాను. దురదృష్టం.. చీకట్లో తప్పుడు మలుపు తిరగటం వల్ల తిన్నగా, మొహరించి ఉన్న తురకల సైన్యం మధ్యలో చేరాము. వాళ్ళు మమ్మల్ని బంధించటమే కాదు, మేము వచ్చిన రహస్య మార్గం గుండా రాజభవనం చేరారు' చెపుతుంటే ఆ యువకుడు స్వరం గాద్గదికమవుతోంది. ఆ అమ్మాయి కళ్ళల్లోంచి నీళ్ళు కారుతున్నాయి.

'నిజంగా మేము చూసింది, అనుభవించింది తలచుకుంటేనే నరకం గుర్తుకు వస్తోంది. ఇలా జరిగిందని చెపితే ఎవరూ నమ్మరు.'

'ఏం జరిగింది?' అడగకుండా ఉండలేక పోయాడు చంద్రశేఖరుడు.

'ఎప్పుడూ జరిగేదే ఆడవాళ్ళని పంచుకున్నారు. మగవాళ్ళని చంపారు.. వాళ్ళ నాయకుడు సుస్రత్ ఖాన్ దృష్టి అమ్మాయిగారిపై పడింది! '

చిగురుటాకులా వణుకుతూ భోరుమంటూ నేలపై పడింది పద్మిని.

ఆమె దుఃఖం అక్కడున్న వారి గుండెలు కరి గింపచేసింది.

'మనిషి దృష్టి సంకుచితం. అమ్మాయి అందాన్ని చూడగానే స్పందించారు. ఆమె అందమైన రూపం వెనక బాధామయ అనుభవాలుంటాయన్న ఆలోచన కూడా దరిదాపులకు రాలేదు. అంటే, మనిషి ప్రతి అంశాన్ని తన ఆధారంగా దర్శిస్తాడు. ' అనుకున్నాడు గంగాధర శర్మ మనసులో.

ప్రహరసింహుడు చెపుతూ పోతున్నాడు.

'ఒక రకంగా అదే మమ్మల్ని బ్రతికించింది. మిగతా అందరినీ చెరిచారు చంపారు. అమ్మాయి గారిని నుస్రత్ ఖాన్ డేరాలోకి తీసుకెళ్ళారు. ఇంతలో తురక సైనికుల మధ్య ధనం పంచుకోవటం విషయంలో ఏకాభిప్రాయం కుదరలేదు. వారిలో వారికి పోరు జరిగింది. కొత్తగా మతం మారిన వారికి తక్కువ వాటా ఇచ్చి అన్యాయం చేస్తున్నారంటూ కొందరు సైనికులు తిరుగుబాటు చేశారు. నుస్రత్ ఖాన్ సోదరుడిని, ఢిల్లో సుల్తాన్ అల్లుడిని చంపేశారు. దాంతో నుస్రత్ ఖాన్ తన విధేయులందరినీ పిల్చి తిరుగుబాటుదార్లతో తలపడ్డాడు. ఈ గందరగోళంలో, అయోమయంలో, నేను నుస్రత్ ఖాన్ డేరాలో దూరి, అమ్మాయిగారిని తప్పించాను. వాడినీడ అమ్మాయిగారిపై పడేలోగా తప్పించుకున్న సంతృప్తి నాకుంది. దారిలో వీరు కలిశారు....'

'మరి మగవాళ్ళనందరినీ మతం మార్చి, లేకపోతే చంపేసేట్టయితే, నిన్నెలా వదిలారు?' ప్రశ్నించాడు చంద్రశేఖరుడు.

ప్రహర సింహుడు మౌనంగా ఉండిపోయాడు. తలవంచుకున్నాడు.

'మౌనంగా ఉన్నావేమిటి?' అడిగాడు ధర్మరాజు.

ప్రహరసింహుడు తలెత్తి పద్మని వైపు చూశాడు.

ధర్మరాజు వెనుక ఉన్న ఆడవారి వైపు చూశాడు.

'ఫరవాలేదు చెప్పు. చూడకూడని ఘోరాలన్నీ చూస్తున్నాం. ఇక వినకూడనివి, చూడకూడనివి అంటూ ఏమీ మిగలలేదు' నిస్పృహ ధ్వనించింది ధర్మరాజు స్వరంలో.

'వారు కొందరు ఎంపిక చేసిన యువకులను పక్కన ఉంచుతారు. అంతా నన్నుకూడా పక్కన ఉంచారు.'

'ఎందుకని?'

తలదించుకుని లో గొంతుకలో చెప్పాడు ప్రహరసింహుడు.

'తురకవాళ్ళనేకులకు స్త్రీలతో సంతృప్తిలేదు. వారు స్వలింగ సంపర్కానికి ఇష్టపడతారు. '

'శివ శివ' ధర్మరాజు చెవులు మూసుకున్నాడు.

శూరవర్మ నిర్భావంగా చూస్తున్నాడు.

గంగాధర శర్మ అసహ్యంగా ముఖం పెట్టాడు.

చంద్రశేఖరుడు కుతూహలంగా చూశాడు ప్రహరసింహుడి వైపు.

'అందుకోసం నన్ను ఎంచుకున్నారు. నాలా కనీసం వందమంది యువకులున్నారు. అందరం కలిసి తిరగబడదాం అన్నాను నేను.

కానీ మాలో ఉన్న ఓ బ్రాహ్మణ యువకుడు ఒప్పుకోలేదు. అతడు సోమనాధ మందిరం దాడిలో పట్టుబడ్డాడు. బలవంతంగా ఆవు మాంసం నోట్లో కుక్కి మతం మార్చేశారు.

ఎలాగొలా వాళ్ళ దగ్గరనుంచి తప్పించుకుని తన వారి దగ్గరకు వెళితే వాళ్ళు దగ్గరకు రానీయలేదు. అసహ్యించుకుని దూరం పొమ్మన్నారు. దాంతో మళ్ళీ వచ్చి తురకల సైన్యంతో కలిశాడు.

అతడిని చూసి సైన్యాధికారి మోజుపడ్డాడు. ఇప్పుడతడిని సుల్తాన్ అల్లాఉద్దీన్ ఖిల్జీకి కానుకగా తీసుకువెళుతున్నాడు.'

'ఏమిటీ? సుల్తాన్ కూడానా?' ఆశ్చర్యపోయాడు చంద్రశేఖరుడు.

'దేవుడా.. ఎటువంటి రోజులొచ్చాయి నా భారతదేశానికి' వాపోయాడు ధర్మరాజు. 'ఆ యువకుడికి మనవారంటే తీవ్రమైన కోపం. మనవాళ్ళు తనని రానిచ్చి ఉంటే తనకీగతిపట్టేది కాదని అందరినీ ద్వేషిస్తున్నాడు. అతడు మాతో కలవటానికి ఇష్టపడలేదు. సైన్యాధికారికి మా గురించి ఫిర్యాదు చేశాడు. ఈలోగా పంపకాల గొడవ వల్ల బ్రతికిపోయాను.'

'బ్రాహ్మణ యువకుడు తురకలతో ఉండిపోవాలని అనుకున్నాడా?' అడిగాడు చంద్రశేఖరుడు.

'అవును పాపం మానసికంగా చాలా గాయపడ్డాడతడు. ఎందుకో అతడిని చూస్తే జాలి అనిపించింది. మనపై ద్వేషంతో తురకలతో సహకరించాడు. ఏం చేసేందుకయినా సిద్ధంగా ఉండేవాడు'

'ఏం పేరతనది?' అడిగాడు శూరవర్మ.

'అసలు పేరు తెలియదు. అతడు వెయ్యి దీనారాలు ధర పలుకుతాడు కాబట్టి 'హజార్దీనారి' అనేవారు. ఆ పేరుతో సుల్తాన్‌కి సమర్పిస్తే బాగుండదని అతడికి మాలిక్ కాఫర్' అనిపేరు పెట్టారు.

'మాలిక్ కాఫర్' పైకే అన్నాడు గంగాధర శర్మ.

ఆ యువకుడి కథ వారిద్దరి మనస్సులో అలజడి కలిగించింది. ఎంత గాయపడి ఉంటుంది అతడి హృదయం!

తనపై జరుగుతున్న అత్యాచారాలకు, తనకు జరిగిన అన్యాయాలకు ఈ ధర్మాన్ని ఎంతగా తిట్టుకుని ఉంటాడో.. ఇప్పుడు తురకలతో కలిసి తన ద్వేషాన్ని ఏ రకంగా తీర్చుకుంటాడో!

'పదండి ఆలస్యమయిపోయింది. విశ్రాంతి తీసుకున్న తరువాత తీరికగా మాట్లాడుకోవచ్చు.' తొందరపెట్టాడు శూరవర్మ.

అతడి ఆలోచనలు అప్పుడే ఎక్కడికో వెళ్ళిపోయాయి. తురకలు ఇంత దగ్గరగా వచ్చారంటే ప్రమాదం దగ్గర పడ్డట్టే..... త్వరగా సురక్షిత స్థలానికి వెళ్ళాలి. ఆపై తాను వారణాసి వెళ్ళి అక్కడ పరిస్థితి గమనించాలి.

ఎవరికి వారు వారివారి ఆలోచనలతో నడవసాగారు. ప్రహరసింహుడికి ఆసరాగా చంద్రశేఖరుడు నిలబడ్డాడు.

✡ ✡ ✡

**సర్వం కోల్పోయి,** ప్రాణాలు అరచేత పట్టుకుని తమ ఊరు చేరుకున్న ఆ అభాగ్య కుటుంబాలను ఊళ్ళోవాళ్ళు అక్కున చేర్చుకున్నారు. ఖాళీ స్థలంలో వారికి ఇళ్ళు కట్టి ఇచ్చారు. వారికి అవసరమైన సదుపాయాలన్నీ అమర్చారు.

అయితే, అందరూ ఆతృతగా ఎదురు చూస్తున్నది వారి అనుభవాలు వినటానికి. ఎందుకంటే బయట జరుగుతున్న విషయాలు ఊరికి చేరేసరికి చాలాకాలం పడుతుంది. వార్తలు ఆలస్యంగా అందుతాయి. అందుకని వార్తలు, విశేషాలు వినటం కోసం ఊరివారంతా ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

అదీకాక, బయట తురకలు వీర విహారం చేస్తున్నారన్న వార్తలు నెమ్మదిగా అక్కడకూ చేరుతూండటంతో ఊళ్ళో ప్రజలను ఏదో భయ పట్టిపీడిస్తోంది.

***తెలిసింది భయం కలిగించదు. తెలియనిదే భయం కలిగిస్తుంది.*** ఇంతకాలం తురకల దాడులు, అత్యాచారాల గురించి వారూ, వీరూ చెప్తూంటే విన్నారు. ఇప్పుడూ తురకలను ప్రత్యక్షంగా ఎదుర్కొన్న వారిని చూడగానే వారిద్వారా విషయాలు గ్రహించేయాలని అందరికీ ఆత్రంగా ఉంది.

తురకలెవరు? ఎలా ఉంటారు? వారొక్కరొక్కరికి వెయ్యేనుగుల బలం ఉంటుందంట కదా? వారికి యుద్ధంలో వారి దేవుడు వెంటనంటి ఉండి సహాయం చేస్తూంటాడట కదా? అందుకే వారు ఓడిపోతూ కూడా, చివరి క్షణంలో, అనూహ్యంగా విజేతలు అవుతూంటారట కదా?

ఇలా రకరకాల సందేహాలు అక్కడి ప్రజల మనస్సులో మెదలుతున్నాయి. వాటికి సమాధానాలు ఈ కొత్తగా వచ్చిన కుటుంబం ద్వారా లభిస్తుందన్న ఆశతో అందరూ ఎదురుచూస్తున్నారు. అయితే, ఆ కుటుంబాలలోని వారు మాత్రం ఇంట్లోంచి బయటకు రావటం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చినా ఎవ్వరినీ కలవటంలేదు. ఎందుకో ప్రతిక్షణం చెదురుతూ, ప్రమాదం ఏ వైపునుంచి వచ్చి పడుతుందోనని భయపడుతున్నట్టే ఉన్నారు వారు. ఎవరయినా పలకరించి బెదిరిపోతున్నారు.

వాళ్ళింటికి స్వేచ్ఛగా వచ్చి పలకరించేది ఒక్క చంద్రశేఖరుడే!

ఊళ్ళోవాళ్ళందరికీ శూరవర్మతో కలిసి చంద్రశేఖరుడు ఎలా తురకలతో తలపడి వారిని మట్టి కరిపించాడో తెలిసింది. దాంతో అందరూ చంద్రశేఖరుడిని గొప్ప వీరుడిని చూసినట్టు చూడసాగారు. చంద్రశేఖరుడు సైతం జరిగినదానికి మరింత కల్పించి, అందరూ నోళ్ళు తెరచుకుని వినేట్టు కథలు కథలుగా తన వీరత్వం చెప్పుకోసాగాడు.

దాంతో గంగాధర శర్మ గురించి అందరికీ చులకన అభిప్రాయం ఏర్పడింది. కత్తి యుద్ధం ఉత్తుత్తిగా చేసేటప్పుడు అత్యంత ఆవేశం ప్రదర్శించి, నిజంగా శత్రువు ఎదురుగా వచ్చినప్పుడు, బెదిరిపోయి స్థాణువు అయిపోవటం హేళన పాత్రమయింది

అతడి పాండిత్యం చూసి గౌరవించిన వారు కూడా, ఇప్పుడతడిని గౌరవించటంలేదు. దానికి తోడుగా చంద్రశేఖరుడి కథలు అతడిని మరింతగా చులకన చేశాయి.

దాంతో గంగాధర శర్మ వీలయినంతవరకూ ఎవరినీ కలవకుండా అందరికీ దూరంగా ఉండటం ఆరంభించాడు.

అందరికన్నా ముందు లేచి కత్తియుద్ధం సాధన చేస్తాడు. గురువుగారి దగ్గరకు వెళ్ళి పాఠం చెప్పించుకుంటాడు. అంతే, ఆ తరువాత ఊరి చివరకు వెళ్ళి, ఒంటరిగా, నది ఒడ్డున కూచుంటాడు. గ్రంథాలు చదువుతూ ఆలోచిస్తూంటాడు.

ఎవరైనా ఆ వైపు వస్తూంటే అక్కడినుంచి లేచి వెళ్ళిపోతాడు.

ఓ రోజు అతడి తల్లి అతడిని నిలదీసింది.

"ఇలా ఎన్నాళ్ళు ముభావంగా ఉంటావు? నీలో నువు ఎన్నాళ్ళు కుళ్ళుతావు? జరిగిందేదో జరిగిపోయింది. దాన్నే తలచుకుంటూ క్రుంగుతూంటే మరింత దిగజారతావు తప్ప బయట పడటం అంటూ ఉండదు!"

ఆమె మాటలకు గంగాధర శర్మ సమాధానం మౌనమే.

ఓ రోజు గురువుగారు కూడా గంగాధరశర్మకు ఉచిత వచనాలు చెప్పారు.

"మనం మనుషులం. మనకు శక్తి ఉన్నట్టే బలహీనతలూ ఉంటాయి. పొరపాట్లు జరుగుతాయి. కానీ జరిగిన పొరపాట్లనే తలచుకుంటూ కూర్చుంటే లాభంలేదు. పొరపాట్లనుకోవాలి. ముందుకు సాగిపోవాలి. అయినా, నువ్వు పండితుడివి. మేధావివి. కాలాన్ని అనుసరించి యుద్ధం నేర్చుకోవటం తప్పనిసరి అయింది. నీ జీవలక్షణానికి సరిపడని పని చేయాలని ప్రయత్నించి, విఫలుడవటంతో

నువ్వు సిగ్గుపడాల్సిన అవసరం లేదు. నువ్వు చేయలేని పని చేయలేకపోవటం వల్ల బాధపడి లాభం లేదు. నీ తమ్ముడు శౌర్యంతో అలరిస్తే, నువ్వు పాండిత్యంతో ప్రపంచాన్ని మైమరపించు'' అన్నాడు అనునయంగా.

నీళ్ళు నిండిన కళ్ళతో రోషంగా తల ఎత్తాడు గంగాధర శర్మ. 'ఎవరిని మైమరపించాలి? తురకవాళ్ళనా? నేను నా పాండిత్యం ప్రసక్తి తెచ్చేలోగా వాడు నా మెడని కోసేస్తాడు. శరీరం నుంచి వేరైన నా తల వినిపిస్తుందా నా పాండిత్యాన్ని? అసలిదంతా వ్యర్థం అనిపిస్తోంది. నేనెందుకలా ఆగిపోయానో అర్థం కావటం లేదు. ఏమాత్రం అవకాశం దొరికినా, శత్రువు దెబ్బ తీస్తాడని తెలిసి కూడా, అడుగు ముందుకు వేసేందుకు భయపడ్డానో!'' ఆక్రోశించాడు గంగాధరశర్మ.

అతడి వేదనను తగ్గించలేక తల్లడిల్లిపోయారు గురువుగారు.

గంగాధరశర్మ ద్వారా ఆయన మహత్తర లక్ష్యం సాధించాలని ప్రణాళిక వేశారు. ప్రస్తుతం సమాజం అల్లకల్లోలమవుతోంది. ఈ సమయంలో గతంలోలా వేదాలు వల్లె వేసే తీరిక ఎవరికీ ఉండటం లేదు. దానికి తోడు వేదాలను వల్లెవేసి, కూలంకషంగా నేర్చుకున్నవారి ప్రాణాలకూ భరోసా లేదు. శాస్త్రాలు మౌఖికంగా ఇన్నాళ్ళూ చలామణీ అయ్యాయి. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపొయ్యాయి.

ఎవరి ప్రాణానికీ భద్రతలేదు. ఎవరికీ విలువలేదు. ప్రాణాలు కోల్పోయే ప్రతి వ్యక్తితో అపూర్వమైన ప్రాచీన విజ్ఞాన ధనం అదృశ్యమయిపోతోంది. ఒక్కసారి అదృశ్యమయిపోతే ఇక తిరిగి సంపాదించలేని అమూల్యమైన ధనం అది. ఇక ఆ శాస్త్రాలు లభ్యం కావు. ధర్మం అమూల్యమయిన ధనాన్ని కోల్పోతోంది.

ఒకప్పుడు జైనులకు ఇలాంటి పరిస్థితి వచ్చింది.

మహావీర జినుడు పరమపదించిన 160 ఏళ్ళ తరువాత పాటలీపుత్రం వద్ద జైనమునులు సమావేశమయ్యారు. ఈ సమావేశం జరగటానికి ముందు సుమారు పన్నెండేళ్ళు కరువు కాటకాలు దేశాన్ని పట్టి పీడించాయి. దాంతో అనేకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సమావేశంలో మునులు మహావీరుడి బోధనలను స్మరించారు. మహావీరుడు బోధించిన పన్నెండు రంగాలలో వీరు పదకొండు రంగాలను మాత్రమే గుర్తు చేసుకోగలిగారు. దాంతో జైన మునులలో కలకలం చెలరేగింది. పన్నెండవ రంగం తెలిసిన వారంతా కరువుకాటకాల్లో మరణించారు.

మహావీరుడు మరణించిన 160 సంవత్సరాలకే ఇలా అతని బోధనలో భాగం అదృశ్యమయిపోతే, అన్ని బోధనలూ కాలగర్భంలో కలిసి పోవటానికి ఎంతోకాలం పట్టదని అర్థం చేసుకున్నారు.

జైనుడు బోధించిన పన్నెండవ రంగం కాలగర్భంలో కలిసిపోవటానికి కూడా కారణం వారు గుర్తించగలిగారు.

ఇంతకాలం వారి బోధనలన్నీ సనాతన ధర్మ సంప్రదాయంలాగా మౌఖిక సంప్రదాయంలోనే ప్రచారంలో ఉన్నాయి. కరువు కాటకాల వల్ల ఆ బోధనలు తెలిసిన వారంతా మరణించారు. ఇప్పుడెవరికీ ఆ బోధనలు తెలియవు. దాంతో జైనుడి బోధనలు ఒక తరం నుంచి మరో తరానికి అంతరాయం లేకుండా నిరంతరం అందాలంటే, మనిషిపై ఆధారపడే మౌఖిక పద్ధతిపై ఆధారపడటం మంచిది కాదని గ్రహించారు. వ్రాతప్రతులు తయారు చేయటం ఆరంభించారు. నేపాలీ దేశంలో తపస్సు చేస్తున్న భద్రబాహుకు పన్నెండవ రంగం తెలుసునని తెలియగానే, అతని వద్దకు ఓ మునిని పంపి దాన్ని గ్రంథస్థం చేశారు. అలా జైనుడి బోధనలు ఇప్పటికీ సజీవంగా ఉన్నాయి.

ఇప్పుడు సనాతన ధర్మశాస్త్రాలను కూడా గ్రంథస్థం చేయాల్సిన తరుణం వచ్చిందని ఆయన గ్రహించారు. ఇప్పటికీ దేశవ్యాప్తంగా ఆ పని మొదలయింది. సామాన్య ప్రజల భాషల ద్వారా జైనులు, బౌద్ధులు ప్రజలలోకి చొచ్చుకు పోయిన విధం గమనించి శాస్త్రాలు సంస్కృతం నుంచి ప్రాంతీయ భాషలలోకి అనువదించటం జరుగుతోంది. ఇప్పుడసలు తీరికగా సంస్కృతం నేర్చుకునే వీలు ఉండటం లేదు.

అందుకే దొరికిన గ్రంధాలను దొరికినట్టు సేకరిస్తున్నారు గురువుగారు. వాటికి నకళ్ళు గంగాధర శర్మ ద్వారా చేయించాలని, వీలయినన్ని గంగాధర శర్మతో కంఠస్తం చేయించాలనీ ఆయనకోరిక.

గంగాధర శర్మలో నిజాయితీ ఉంది. చిత్తశుద్ధి ఉంది. పాండిత్యంతో పాటు సృజనాత్మకత ఉంది. నకళ్ళు చేసేవారనేకులు తమ స్వంతపైత్యాన్ని మధ్యలో జొప్పిస్తున్నారు. దాంతో శాస్త్రాలు, గ్రంధాలు అపార్ధాలకు గురయ్యే వీలు కలుగుతోంది. గంగాధర శర్మ అలాంటి పనులు చేయడు.

అందుకే గంగాధర శర్మ విషయంలో ఆయనకు మరో ఆలోచన ఉంది. ఉత్తర భారతమంతా అల్లకల్లోలంగా ఉంది. దక్షిణ భారతం ప్రశాంతంగా ఉంది. సేకరించిన గ్రంధాలతో గంగాధర శర్మను దక్షిణాదిన విస్తరింపచేసేందుకు అగస్త్యుడు ఉత్తరం వదలి వెళ్ళాడు. దక్షిణాదిన స్థిరపడ్డాడు. ఇప్పుడు సనాతన ధర్మాన్ని సజీవంగా నిలిపేందుకు గంగాధర శర్మను దక్షిణాదికి పంపాలని ఆయన ఆలోచన.

కానీ, తీరా చూస్తే, గంగాధర శర్మ ఇలా నిరాశలో నుగ్గుతున్నాడు. ఇప్పుడు ఏం చెప్పినా అర్ధం చేసుకునే స్థితిలో లేడు. అయితే, స్థాణువులా నిలబడినా తురకవాడి కత్తికి ఎరకాకుండా గంగాధర శర్మ బ్రతికి ఉండటం, అతడి జీవితానికి ఏదో పరమార్ధం ఉందన్న ఆలోచన గురువుగారిలో కలిగించింది. అందుకే శూరవర్మతో ఈ విషయం చర్చించారాయన.

ఆయన మాటలు విని తలపంకించాడు శూరవర్మ.

'గురువర్యా.. ఇంతకాలం మనం బయట దేశంలోని ఇతర ప్రాంతాలలో జరుగుతున్న దానితో సంబంధం లేకుండా భద్రంగా ఉన్నాం. కానీ, మనకీ రక్షణ ఇంకెంతో కాలం లభించదనిపిస్తోంది. ఇంతకాలం, యుద్ధం, రాజులకూ, సైనికులకూ మాత్రమే సంబంధించిన అంశం. కొత్త శత్రువు వల్ల యుద్ధప్రభావం సామాన్యులనూ చేరుతోంది. ప్రతివ్యక్తీ ఓ సైనికుడయి, స్వీయ రక్షణతోపాటు, సమాజ రక్షణ కూడా చేయాల్సిన పరిస్థితి వస్తోంది. కాబట్టి, గంగాధర శర్మ కత్తి యుద్దమే కాదు, ఆత్మరక్షణకు అవసరమైన ప్రతి అంశమూ నేర్వాల్సిందే '

'నేను కాదనటం లేదు. కానీ చూశావుగా, ఎంత అభాసుపాలయ్యాడో! మానసికంగా అది అతడిని కృంగదీస్తోంది. ఎందుకూ పనికిరాడేమోనని భయంగా ఉంది'

గురువుగారివైపు నిశితంగా చూశాడు శూరవర్మ.

'మీకు చెప్పేంతటి వాడిని కాను. కానీ, బలహీనులకు బ్రతికే అర్హతలేని కాలం వస్తోంది. మన సమాజంలో లాగా, అందరూ ఈశ్వరాంశ కలవారేనని, పరస్పరం గౌరవించుకుంటూ, సహకారంతో బ్రతికే రోజులు కావివి. ఎవరికి వారు స్వయంరక్షణకోసం అనుక్షణం పోరాడాల్సిన రోజులు. వీరులు, శూరులే పిట్టల్లా రాలిపోతున్నారు. మతం మారిపోతున్నారు. ఇలాంటి సమయంలో బలహీనతలకు తావులేదు. ప్రతి వ్యక్తీ ఉక్కు నరాలతో, ఆత్మ విశ్వాసంతో పరమశివుడి రుద్రతాండవం చేయాల్సిన తరుణం ఇది. బలహీనుడనని తప్పించుకునే వీలులేదు.'

గురువుగారు మౌనంగా ఉండిపోయారు. వారిమధ్య మాటలు కరువయ్యాయి. ఆ నిశ్శబ్దాన్ని శూరవర్మ భగ్నం చేశాడు.'వారణాసి పై కూడా తురకల సైన్యం దాడి చేస్తుందన్న వార్తలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే మనకు ప్రమాదం రెండింతలు అవుతుంది! '

'అయ్యో.. కాశీ కూడానా?' గురువుగారి కళ్ళల్లో నీళ్ళు కదిలాయి.

అదిచూడలేక శూరవర్మ ముఖం తిప్పేసుకున్నాడు. ఆకాశం వైపు చూస్తూ, మృదువుగా అన్నాడు.

'ఆకాశాన్ని క్రమ్మివేసే కాలకరాళ మేఘాలు సూర్యుడిని వదులుతాయా? శత్రువు దృష్టిలో సోమనాధుడయినా, విశ్వేశ్వరుడయినా ఒకటే. వారికి అక్కడ దైవం కనబడదు. ధనధాన్యాలే కనిపిస్తాయి. మణిమరకత మాణిక్యాలే కనిపిస్తాయి.'

'ఎలాంటి కాలం వచ్చిపడింది! ఈ తుఫానును మనం ఎలా తట్టుకుంటాం?' బేలగా అన్నారు గురువుగారు.

'మీలాంటి విజ్ఞులే ఇలా నిరాశకు లోనయితే ఎలాగ? కష్టకాలం వచ్చినప్పుడే మనిషి వ్యక్తిత్వం తెలిసేది. నిప్పులో కాలిస్తేనే బంగారానికి మెరుపు వస్తుంది. ఈ కష్టకాలం గడచి, కాల మేఘం అడ్డుతొలిగిన తరువాత మన ధర్మం మరింత ప్రకాశవంతమవుతుంది.' శూరవర్మ స్వరంలో విశ్వాసం ప్రస్ఫుటంగా ధ్వనించింది.

గురువుగారు నీరసంగా నవ్వారు.

'నేను మీ శిష్యులను తీసుకుని వారణాసి వైపు వెళుతున్నాను. దానికి మీరు అనుజ్ఞ ఇవ్వాలి.'

'యుద్ధానికా?' సూటిగా అడిగారాయన.

'కావచ్చు. కాకపోవచ్చు' అంత నిర్మొహమాటంగా చెప్పాడు శూరవర్మ.

'నీ శిష్యులను మృత్యుముఖానికి తీసుకు వెళుతున్నాను. అనుజ్ఞనివ్వండి అనవచ్చుగా?'

'ఏం, శత్రువుతో యుద్ధం అంటే మృత్యువేనా? ఎందుకీ పరాజయ భావన?'

గురువుగారేమీ మాట్లడలేదు. అక్కడనుంచి లేచి వెళ్ళిపోయారు. ఆయన వెళ్తూంటే చెప్పాడు శూరవర్మ 'గంగాధర శర్మను నాతో తీసుకువెళుతున్నాను.'

గురువుగారు వెనక్కు తిరిగి చూశారు. అతడన్న మాటలతో తనకు సంబంధం లేనట్టు వెళ్ళిపోయారు. ఆలోచిస్తూ అడుగు ముందుకు వేశాడు శూరవర్మ.

⁂⁂

ప్రహర సింహుడికీ, చంద్రశేఖరుడికీ మంచి స్నేహం కుదిరింది. ఎక్కడ చూసినా ఇద్దరూ తిరుగుతూ కనబడేవారు.

ప్రహర సింహుడి దగ్గర నుంచి ఖడ్గ విద్యలో అనేక మెళకువలు నేర్చుకున్నాడు చంద్రశేఖరుడు. అవి నేర్చుకున్నప్పటి నుంచీ వాటిని ప్రయోగించాలని ఆత్రపడసాగాడు.

చంద్రశేఖరుడికి, ప్రహరసింహుడి దగ్గర బాగా నచ్చింది అతడు చెప్పే కథలు.

రాజు ఆస్థానం ఎలా ఉంటుంది, అక్కడ ప్రవర్తన ఎలా ఉండాలి, అన్న విషయాలు చంద్రశేఖరుడికి బాగా నచ్చాయి.

'నిజంగా, రాజులు అంత వైభోగంగా ఉంటారా?' ఆశ్చర్యంగా అడిగాడు చంద్రశేఖరుడు.

'రాజులకన్నా వైభోగంగా ఉండేది మన దేవతలు. అందుకే అందరికళ్ళూ దేవాలయాలపైన పడుతున్నాయి. కానీ, మన దేవాలయాలపై కన్నేసిన వాడెవడూ ప్రశాంతంగా బతకలేడు' చంద్రశేఖరుడీ మాటలు వినటంలేదు.

'అన్ని రత్నాలు, మణిమరకత మాణిక్యాలు ఒక్కచోట రాసిగా పోస్తే ఎంత గొప్పగా ఉంటుంది కదా!' అన్నాడు.

అతడి కళ్ళముందు ఏనుగుల మీద తురుష్కులు తరలించుకుపోతున్న విలువైన వజ్రాలు కదులుతున్నాయి.

'నిజంగా ఢిల్లీ సుల్తానులు ఎంత శక్తిమంతులో' అనుకున్నాడు. 'అంత ధనం తన దగ్గర ఉంటే తనకేలోటుండదు' అనుకున్నాడు.

అతడికి తురకలు ఎలా ఉంటారో తెలుసుకోవాలని ఉంది. అదే అడిగాడు ప్రహరసింహడిని

'ఆ రాక్షసుల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. నీతి, జాతి లేదు. నియమం నాగరికతలు లేవు. జాలి కరుణలు లేవు. శుచీ శుభ్రతలు లేవు.' ఈసడించాడు ప్రహరసింహుడు.

'కానీ, మన గురించి వాళ్ళూ అలాగే అనుకుంటుండవచ్చుకదా!' అడిగాడు చంద్రశేఖరుడు.

'అవును.. నేను వాళ్ళదగ్గర బందీగా ఉన్నప్పుడు తులిస్తాన్ నుంచి వచ్చి తురక వాళ్ళు కొత్తగా మతం మారిన వారిని హేళన చేస్తూ అన్న మాటలు కొన్ని విన్నాను. వాళ్ళు మనం ఆకుల్లో తిని పారేయటాన్ని గురించి వింతగా చెప్పుకుంటున్నారు. మనం చెవుల్లో పోగులు పెట్టుకోవటాన్ని కడియాలు ధరించటాన్ని, దోషం అన్నట్టు మాట్లాడారు. అంత కాదు. మనం మన స్త్రీలకు గౌరవమిచ్చి, ప్రధాన నిర్ణయాలలో వారి సలహాలను తీసుకోవటాన్ని గురించి కూడా చులకనగా మాట్లాడారు. వాళ్ళల్లో స్త్రీ 'శక్తి' అని, ఆమె లేకుంటే పురుషుడు ఎందుకూ పనికిరాడన్న భావన లేనట్టుంది. ఇలా, వాళ్ళ పద్ధతులు మనకు రోతగా అనిపిస్తే, మన పద్ధతులు వాళ్ళకు వింతగా ఉంటాయి' ఆలోచిస్తూ చెప్పాడు ప్రహరసింహుడు. అవన్నీ ఎంతో ఆసక్తిగా విన్నాడు చంద్రశేఖరుడు.

'నాకు మన పద్ధతులే తెలుసు. వాళ్ళ పద్ధతుల గురించి చెప్పు' అడిగాడు.

✡✡✡

**'వాళ్ళ గురించి ఎందుకంత ఆసక్తి?** వాళ్ళకి ఎదరు పడకపోవటమే మంచిది. వాళ్ళకి చిక్కిన తరువాత మనం ఎలా మిగులుతామో తెలియదు' అన్నాడు ప్రహరసింహుడు.

ఇంతలో చంద్రశేఖరుడి దృష్టి ఆ వైపుగా వస్తున్న పద్మినిపై పడింది. అతడి కళ్ళు మెరిశాయి.

పద్మిని నడకలో వేగంలేదు. విషాదం ఉంది. ఎంతో భారంగా పడుతున్నాయి అడుగులు. ఆమె చూపులు దిగంతాల్లో శూన్యాన్ని వెతుకుతున్నట్టున్నాయి. ఆమెని చూస్తున్న ప్రహరుడి కళ్ళల్లో నీళ్ళు కదిలాయి.

'మా పద్మిని అమ్మగారు ఎంత చలాకీగా ఉండేవారనుకున్నావు, ఆమె నడుస్తూంటే నదీ ప్రవాహం తలుపుకు వచ్చేది. నవ్వితే హరివిల్లు విరిసినట్టుండేది. మాట్లాడితే వీణ వాయించినట్టుండేది'

'మరి ఇపుడు ఇలాగయిపోయిందేమిటి?' ఆమె నుంచి దృష్టి తిప్పకుండా అడిగాడు చంద్రశేఖరుడు.

'తురకల బారిన పడిన తరువాత బ్రతికి ఉండటమే అద్భుతం. బ్రతికినా జీవచ్చవంలా మిగలటం సామాన్యం' అన్నాడు ప్రహరుడు.

'ఎందుకు?' అడిగాడు చంద్రశేఖరుడు.

'ఎందుకేమిటి, పద్మిని అమ్మగారి కళ్ళముందే వాళ్ళమ్మ, మా సంస్థానానికి రాణిగారిని, తురకలు చెరిచారు. మా రాజుని, నరికి పోగులు పెట్టారు. మతం మారేందుకు ఇష్టపడని మంత్రిని ఏం చేశారో తెలుసా?'

'ఏం చేశారు?'

చంద్రశేఖరుడి గొంతు తడి ఆరిపోతుంది. కానీ కళ్ళల్లో ఉత్సాహం స్పష్టంగా తెలుసోంది. ప్రహరుడి మాటలు అతడిని ఉత్తేజితుడిని చేస్తున్నాయి.'

'మతం మారుతావా?' అని అడిగారు.

మంత్రి ఒప్పుకోలేదు.

'ఒకడు అతడి కూతురిని ఎత్తుకుపోయాడు. ఇంకొకడు భార్యను ఎత్తుకుపోయాడు. అయినా అతడు మతం మారనన్నాడు. గోమాంసం అతడి నోట్లో కుక్కారు. అతడు వెంటనే బలవంతంగా వాంతి చేసుకున్నాడు. 'పాలు తాగుతావు కానీ మాంసం తినవెందుకు?' అని అడిగాడు తురకల సేనాని.

'నిజమే, పాలు కూడా శరీరంలోంచి వచ్చేవేకదా!' ఆలోచనగా అన్నాడు చంద్రశేఖరుడు. చంద్రశేఖరుడిమాటలు విననట్టే చెప్పుకుంటూ పోయాడు ప్రహరసింహుడు.

'తల్లి పాలు తాగుతాం? తల్లి మాంసం తింటామా? మేము తినం. మీరు తింటే తినండి' అన్నాడు మంత్రి తురక సేనాని ప్రశ్నకు సమాధానంగా'

'బాగుంది' అన్నాడు చంద్రశేఖరుడు.

'దానికి ఆ తురక సేనాపతికి ఎంత కోపం వచ్చిందనుకున్నావు! మంత్రిని కట్టేసి కళ్ళు పీకించారు. పడుకోబెట్టి, కత్తులు వేడిచేసి చర్మం ఒలిపించాడు. దురదృష్టవంతుడా మంత్రి. అయినా ప్రాణాలు పోలేదు. శరీరంలో ఒకో అంగం కోస్తూ చిత్రహింసలు పెట్టి చంపేశారు.

ఇదంతా పద్మిని అమ్మగారు చూశారు. ఇలా మంత్రిని చంపిన తరువాత పద్మిని అమ్మగారిని సేనాపతి తన గుడారానికి తీసుకువెళ్ళాడు.'

వింటున్న చంద్రశేఖరుడు ఊపిరి బిగపట్టాడు. 'తరువాత ఏం జరిగింది?'

'ఇదంతా ప్రత్యక్షంగా చూసిన ఎంతటి ధైర్యవంతుడికయినా గుండెలదిరిపోతాయి. ఇక సున్నిత మనస్కులయిన యువతుల గురించి ఏం చెప్పాలి? అందుకే అమ్మగారు అలా అయిపోయారు' దిగులుగా అన్నాడు ప్రహరుడు.

'కానీ.. ఒకరిని అలా చిత్రహింసలు పెట్టాలంటే కూడా ఎంతో ధైర్యం అవసరం కదా!' అన్నాడు చంద్రశేఖరుడు పెదిమలు తడుపుకుంటూ.

చంద్రశేఖరుడి వైపు నిశితంగా చూశాడు ప్రహరుడు.

'అందుకు ధైర్యం అవసరం లేదు. రాక్షసత్వం పుష్కలంగా ఉంటే చాలు. నిస్సహాయుడిని బంధించి హింసించేందుకు ధైర్యం ఎందుకు?'

'నీ కర్థం కాదులే' అంటూ లేచాడు చంద్రశేఖరుడు.

అతడు వెళ్ళిపోయిన చాలా సేపటి వరకు ప్రహరుడు కదలలేదు. అతడిలో ఏదో అలజడి జరుగుతోంది.

తాను చెపుతున్న విషయాలు చంద్రశేఖరుడి మెదడులో కలగకూడని ఆలోచనలు కలుస్తున్నాయేమోనన్న అనుమానం కలుగుతోంది అతడికి.

***********

ప్రవహిస్తున్న నది నీళ్ళను చూస్తూ కూచున్నాడు గంగాధర శర్మ.

సాధారణంగా ప్రవహించే నీళ్ళను చూస్తూ తన్మయుడైపోతాడు గంగాధర శర్మ. సృష్టిలోని అద్భుతాలలో నీరు అగ్రస్థానం వహిస్తుందనిపిస్తుందతనికి.

నీరు జీవాలకు ప్రాణం. జీవసృష్టి ఆరంభమయింది నీటిలోనే. నారములపై అధినేత నారాయుణుడు. నారముల నుంచి జనించినవాడు నరుడు. అందుకే వేదఋషులను నదులను మాతలుగా భావించి కొలిచారు.

ఋతం దేవాయ కృణ్వతే సవిత ఇన్ద్రాయాహిఘ్నేన రమన్తః ఆపః!

పరహర్యుత్యక్తు రసాం కియాత్యా, ప్రథమః సర్గ ఆసామ్"

నిరంతరం నీరు ఇంద్రుడి వైపు పరుగిడుతుంటుంది. ఉరకుల పరుగుల మెరిసే నీరు పరుగిడుతూనే ఉంటుంది. తొలిసారిగా నీరు ప్రవహించటం ఎప్పుడు ఆరంభమయిందో ఎవరికి తెలుసు?

నీటిని చుస్తుంటే గంగాధర శర్మ మనస్సు సృష్టి ఆరంభమైన తరువాత నీరు ప్రవహించటం మొదలయిన క్షణాల దగ్గరకు పరుగిడుతుంది.

ఎలా ఉండి ఉంటుంది సృష్టి అప్పుడు? జల జల జాలువారుతున్న నీరు జీవాన్ని మోసుకొస్తుందని సృష్టికి తెలుసా?

కానీ ఇప్పుడు నీటిని చూస్తుంటే ఎందుకో, అతడి మనస్సులో ఆనందం కలగటం లేదు. సుళ్ళు తిరిగే నీటిలో అందాలు చూడలేకపోతున్నాడు. తన ఎదలోని విషాదం ద్రవీభవించి నీటి రూపం ధరించి ప్రవహిస్తున్నట్టనిపిస్తోంది.

ఇంతలో పక్కన అలికిడి అయితే చూశాడు.

ఎవరిని కలవకూడదని అందరినీ తప్పించుకుని తిరుగుతున్నాడో, అతడు ఎదురుగా నిలబడ్డాడు. శూరవర్మ ఎదురుపడాలంటే గంగాధర శర్మ సిగ్గుపడుతున్నాడు. ఆ రోజు తనమీద నమ్మకంతో శూరవర్మ ఒక్కడే తురకలతో ప్రాణాలకు తెగించి యుద్ధానికి సిద్ధపడ్డాడు. తాను వెంటవస్తానని అనుకున్నాడు. కానీ తాను యుద్ధంలో పాల్గొనలేక పోయాడు. తన ప్రాణాన్నే కాదు, శూరవర్మ ప్రాణాన్ని కూడా ప్రమాదంలోకి నెట్టాడు.

ఈ తురకలే శివలింగాన్ని తుత్తునియలు చేసిన ధూర్తులన్న ఆలోచన ఆ క్షణంలో తనకెందుకు ఆవేశాన్ని ఇవ్వలేదు? సోమనాథం పై దాడి చేసిన వారు వేరు, తన ఎదురుగా ఉన్నవారు వేరు అనుకున్నాడు. ఒకడు పొరపాటు చేశాడని అందరూ అలాంటి వారేనని భావించటం పొరపాటని అనుకున్నాడు. అది దోషమా!

గంగాధర శర్మ మనసులో జరుగుతున్న అలజడి స్వరూపం శూరవర్మకు తెలుసు. గంగాధర శర్మ గురవుతున్నలాంటి అలజడికి సమస్త భారతీయ సమాజం గురవుతోందనీ అతడికి తెలుసు. ఇది అతడిలో బాధనూ, వేదననూ కలిగిస్తోంది.

సమాజం ఒకరకమైన జీవన విధానానికి అలవాటు పడుతుంది. ఆ జీవన విధానంలో మార్పు హఠాత్తుగా సంభవిస్తే, మారిన పరిస్థితులకు అనుగుణంగా వెంటనే మారటం కుదరదు. ఈ సంధి సమయం ఏ సమాజానికయినా అత్యంత ప్రమాదకరమైనది. నాగరికతలే అదృశ్యమైపోతాయి. ఈ మార్పును భారతీయ సమాజం ఎలా తట్టుకుంటుందో? ఈ పెనుముప్పు నుంచి చేయాల్సి ఉంటుందో అనంతకాలం నుంచీ అలుపు సొలుపు లేకుండా నిరంతరం సంస్కృతి పరిరక్షణ కోసం పోరాడుతూ వస్తున్న భారత జాతి ఈ పోరాటాన్ని ఎలా సాగిస్తుందో?

శూరవర్మ మనసులో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి.

ఇంతకు ముందు శత్రువులు వేరు. ఇప్పటి శత్రువులు వేరు. గతంలోని శత్రువులు రాజ్యాలకోసం పోరాడేవారు. గెలిస్తే రాజ్యం చేసేవారు. నెమ్మది నెమ్మదిగా భారతీయ సంస్కృతీ సాగరం కలసి పోయేవారు.

కానీ ఇప్పుడు శత్రువు వచ్చింది రాజ్యం కోరో, ధనాశతోనో కాదు. ఈ కొత్త శత్రువుల దాడుల వెనుక మత విస్తరణ ఆకాంక్ష ఉంది. తాము పూజించే దేవుడినే అందరూ పూజించాలి, లేకపోతే చావాలి, అన్న పట్టుదల ఉంది.

నీరు, నూనె కలవనట్టు ఈ శత్రువు, ఈ సంస్కృతి సాగరంలో మిళితమవుతాడన్న ఆశలేదు. ఈ శత్రువు సాగరాన్ని మింగుతాడు. లేకపోతే సాగరంలో మునిగిపోతాడు. ఇలా శత్రువు తాకిడితో సమాజం తల్లడిల్లుతోంది. దానికి గంగాధర శర్మ ఒక ప్రతీక.

గంగాధర శర్మ పక్కన కూచున్నాడు శూరవర్మ.

గంగాధర శర్మ తల దించుకున్నాడు.

'నీటిని చూస్తున్నావు కదా, నీకది ఏం నేర్పిస్తోందో గమనించావా?' మృదువుగా అడిగాడు శూరవర్మ.

గంగాధర శర్మ మాట్లాడలేదు.

'ప్రకృతిలోని అణువణువూ మనిషికి బోలెడంత నేర్పాలని తహ తహలాడుతూంటుంది. తమలో నిక్షిప్తమై ఉన్న విజ్ఞానాన్ని మనిషికి నేర్పాలని తపన పడుతూంటుంది. ప్రకృతి నిర్జీవం కాదు. సజీవం. మన పూర్వీకులు ప్రకృతిలో మమేకం చెందారు. ప్రకృతి నుంచి విజ్ఞానాన్ని గ్రహించారు. ప్రకృతి మన ముందు ఉన్నప్పుడు మన సర్వేంద్రియాలకూ, ప్రకృతి నేర్పే పాఠాలను గ్రహించటం వైపు కేంద్రీకరించాలి. అది నేర్పే విజ్ఞానాన్ని అర్థం చేసుకోవాలి.'

గంగాధర శర్మ తల ఎత్తలేదు.

'ప్రవహించే నీరు ఏం చెపుతోంది?'

గంగాధరుడు మాట్లాడలేదు.

'నీరు చూడు, ఎలా ప్రవహిస్తోంది?'

నవ్వాడు శూరవర్మ.

'ప్రవహించే నీటి లక్షణం ఏమిటి?' అడిగాడు.

ఆలోచించి చెప్పాడు గంగాధర శర్మ.

'నీరు పల్లానికే ప్రవహిస్తుంది'

'ఈ నీటి గమ్యం ఏమిటి?'

'సముద్రంలో కలవటం'

'ఈ నది నీరు చూడు. వేగంగా ప్రవహిస్తోంది. అడ్డువచ్చిన దాన్ని కోసేస్తూపోతూంది. ఎప్పుడయితే కోయలేనంత శక్తిమంతమయిన బండరాళ్ళు అడ్డువస్తాయో, అప్పుడేం చేస్తుంది?. ఆగిపోతుందా? వంగి పక్కనుండి ప్రవహిస్తుంది. అలాగని

బండరాయిని వదలదు. తన నీటి ప్రవాహ వేగంతో దాన్ని కోస్తూనే ఉంటుంది. అది పది సంవత్సరాలు కావచ్చు, వేల వేల సంవత్సరాలు కావచ్చు. కానీ, ఆ బండరాయి మట్టి మట్టి అయి నీటిలో కొట్టుకు పోయేంతవరకూ కోస్తూనే ఉంటుంది. ఇప్పుడు మనం చూస్తున్న లోయలు, కొండల దారులు ఇలా నీటి కోతవల్ల ఏర్పడినవే.'

గంగాధర శర్మ తలెత్తి శూరవర్మ వైపు చూశాడు.

నీటి అలలపైని సూర్యకాంతి కిరణాల వెలుతురు శూరవర్మ ముఖంపై చిందులేస్తోంది. 'మనిషి కూడా నీటిలాంటి పట్టుదలను, దీక్షను, ప్రణాళికను ప్రదర్శించాలి. గమ్యం ఎంచుకోవాలి. ఆ దిశగా సాగిపోవాలి. అడ్డంకులెదురవుతాయి. తన పరిమితులను గుర్తించాలి. తన శక్తిని గ్రహించాలి. దాటగలిగిన అడ్డంకులను దాటి ముందుకు సాగాలి. దాటలేని వాటిని మొండిగా ఎదిరిస్తూ, ప్రయాణాన్ని నిలిపివేయాల్సిన అవసరం లేదు. అడ్డంకిని వదలి వంగి పక్కకు తొలగాలి. వీలున్నప్పుడల్లా అడ్డంకిని బలహీనం చేస్తూ సాగాలి. గమ్యం చేరేవరకూ సాగుతూనే పోవాలి. దారిలో, తనలాగే గమ్యం వైపు ప్రయాణిస్తున్న వారితో చేయి కలపాలి. ముందుకు సాగాలి. ఒకక్సారి, ఇద్దరిదీ ఒకే గమ్యం అని తెలిసి చేయి కలపాలి. ముందుకు సాగాలి. ఒక్కసారి, ఇద్దరిదీ ఒకే గమ్యం అని తెలిసిన తరువాత ఇక అహంకారాలు, అస్తిత్వాల ప్రసక్తి రాకూడదు. కలసి ముందుకు సాగుతూనే ఉండాలి. అవకాశం దొరికితే జలపాతంలా దూకుతూ, హోరుగా సాగిపోవాలి. లేనప్పుడు మంద్రంగా ప్రవహించాలి. పరిస్థితికి తగ్గట్టు ప్రవర్తించి విచక్షణ ప్రదర్శించాలి. కానీ గమ్యం చేరేవరకూ ఆగకూడదు.'

విప్పారిత నేత్రాలతో శూరవర్మ మాటలు వింటున్నాడు గంగాధర శర్మ.

'అధిగమించలేని అడ్డంకి ఎదురయితే ఆగిపోకూడదు. పక్కకు తొలిగి ప్రయాణించాలి. కానీ అడ్డంకిని నెమ్మది నెమ్మదిగా అధిగమించాలి. బలహీనతలను బలంగా మార్చుకుంటూ సాగాలి.'

గంగాధర శర్మను గమనిస్తున్న శూరవర్మ సంతృప్తిగా నిట్టూర్చాడు గంగాధర శర్మ ఆలోచనలో పడటం చూసి.

'త్వరలో నువ్వు నాతో పాటు వారణాసి వస్తున్నావు' అన్నాడు లేస్తూ.

తల ఊపాడు గంగాధర శర్మ.

ఇప్పుడతని కళ్ళల్లో దైన్యం లేదు. పట్టుదల ఉంది. ఆత్మ విశ్వాసం ఉంది.

✡ ✡ ✡

తెల్లవారుతోంది.

ప్రయాణానికి సిద్ధమౌతూ, యధాలాపంగా బయటకు చూసిన శూరవర్మ ఆశ్చర్యపోయాడు.

ఆయాసపడుతూ, అతికష్టంతో తనవైపే వస్తోంది, గంగాధర శర్మ, చంద్రశేఖరుడు మాతృమూర్తి.

ఆమెని చూడగానే చేస్తున్న పని వదిలి గబగబా బయటకు వచ్చి నమస్కరించాడు శూరవర్మ.

'మీరింత శ్రమపడి ఇంత దూరం రావాలా? కబురు పెడితే నేనే వచ్చేవాడిని కదా?' అన్నాడు గౌరవంగా.

శూరవర్మకు ఆమె అంటే అమితమైన గౌరవం. గంగాధర శర్మ తండ్రి శూరవర్మ గురువు. కత్తి యుద్ధంతో పాటు భారతీయ తత్వచింతనను కూడా నేర్పారు. ఆయన బోధించిన తత్వం శూరవర్మ జీవిత తత్వంగా మారింది. 'కత్తితో సాధించే విజయం భౌతికమయింది. మాటతో సాధించే విజయం మానసికమయింది. శాశ్వతమైనది. కానీ ప్రపంచం కత్తి విజయానికే ప్రాధాన్యం ఇస్తుంది. అందుకే వ్యక్తి మానసికంగా ఎంత దృఢ తరుడయినప్పటికీ, శారీరకంగా కూడా అంతే దారుఢ్యం కలిగి ఉండాలి. దెబ్బకు దెబ్బ సమాధానం ఇచ్చి, మాటతో మనసు గెలవగలిగి ఉండాలి.' అని బోధించాడు. ఆ మాటలు శూరవర్మ మనసుకు హత్తుకుపోయాయి.

అందుకే తన గురువుగారి భార్య తన వద్దకు వచ్చే సరికి ఉబ్బితబ్బియ్యాడు. గౌరవ వినయాలు ప్రదర్శించాడు.

ఆమె ఆయాసపడుతూ రాయిపైన కూచుండిపోయింది.

శూరవర్మ ఆమె పాదాల చెంత, తలవంచి కూర్చున్నాడు.

'శూరవర్మా.. నువ్వు చేస్తున్న సాహసం, త్యాగాలు నాకు తెలుసు' నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ అంది.

శూరవర్మ తలఎత్తలేదు. మౌనంగా ఉన్నాడు.

గురుపత్ని తల్లితో సమానం. ఆమె ముందు తలెత్తి కూచోవటం, దర్పం ప్రదర్శించటం కూడని పని.

'నువ్వు వారణాసి ప్రయాణం ఒక పై తొడుగు మాత్రమే. నిజాని, నువ్వు వెళుతున్నది వారణాసి దేవాలయాల సంరక్షణ కోసమని, దేవాలయాలను ధ్వంసం చేసే తురకలతో పోరుకని నాకు అనిపిస్తోంది. నిజమేనా?' సూటిగా అడిగింది.

✡✡✡

**ఆశ్చర్యపోయాడు శూరవర్మ.**

అతి గోప్యమయిందీ విషయం. వారణాసి పై తురకల కన్ను పడింది. చిన్న చిన్న తండాలు దాడులు చేసి దేవాలయాలను ధ్వంసం చేస్తున్నాయి. అలాంటి తండాలను వెతికి వేటాడేందుకు తాను సైన్యాన్ని సమీకరిస్తున్నాడు తనకు తప్ప మరెవరికీ తెలియదీ విషయం. ఈమెకు ఎలా తెలిసింది?

అదే అడిగాడు.

ఆమె నవ్వింది.

'శూరవర్మా! ఇంట్లో కూచునే స్త్రీలకు ప్రపంచం ఏమీ తెలియదని మూర్ఖులు భావిస్తారు. అందులో సర్వ స్వతంత్రురాలయిన భారతీయ మహిళలు అణిచివేతకు గురవుతున్నారని, వారు నాలుగు గోడలకే పరిమితమై అంధకారంలో బ్రతుకు ఉన్నారనీ ప్రచారం చేస్తున్నారు. ఇలా ప్రచారం చేయటం వల్ల భారతీయ సమాజంలో ఆత్మన్యూనతా భావం పెంచాలని, తద్వార తమ ఆధిక్యతను నిరూపించుకోవాలన్నది వారి ప్రయత్నం. అందులో సర్వ స్వతంత్రురాలయిన భారతీయ మహిళ గురించి అలా భావించటం తగదు కదా!'

శూరవర్మ తలవంచుకున్నాడు. నిజమే, ప్రస్తుతం సమాజం అల్లకల్లోలంగా ఉంది. ఈ అల్లకల్లోల స్థితిలో విదేశీయులు, భారతీయ మహిళలు అణిచివేతకు గురవుతున్నారని, వారు నాలుగు గోడలకే పరిమితమై అంధకారంలో బ్రతుకుతున్నారనీ ప్రచారం చేస్తున్నారు. ఇలా ప్రచారం చేయటం వల్ల భారతీయ సమాజంలో ఆత్మన్యూనతా భావం పెంచాలని, తద్వారా తమ ఆధిక్యతను నిరూపించుకోవాలన్నది వారి ప్రయత్నం.

అయితే శత్రువులు కావాలని తమను దెబ్బతీసేందుకు, దుష్ప్రచారం విస్తృతంగా చేస్తున్నారనీ, సమాజంలో బలహీనులు, విజ్ఞానం లేని వారు ఈ ప్రచార ప్రభావానికి లొంగుతున్నారనీ తెలిసినా, ఎవరి ప్రాణ రక్షణలో వారు మునిగి ఉన్న స్థితిలో నిజానిజాలు వివరించే తీరిక ఎవరికి ఉంటుంది? ఒక అబద్ధమే నిజమై పోవటంలో ఆశ్చర్యం ఏముంది?

ఆ అబద్ధం ప్రభావం తనపై కూడా పడుతోంది అనుకున్నాడు శూరవర్మ.

పైకి 'వారణాసి వెళ్ళటం మాత్రం నిజం. కానీ ఎవరెవరు నా వెంట వస్తున్నారన్న విషయంలో నేనేమీ చెప్పలేను' అన్నాడు, తన మనసులో ఆలోచనలు పైకి తెలియజేయకుండా.

'నువ్వు, గంగాధర శర్మ, చంద్రశేఖరులనిద్దరినీ వెంట తీసుకువెళుతున్నావా?' అడిగింది.

'లేదు, గంగాధరుడినే రమ్మన్నాను'

'చంద్రశేఖరుడు ఊరుకుంటాడా?' సూటిగా అడిగింది.

శూరవర్మ మాట్లాడలేదు.

'శూరవర్మా, నీకు మానవ మనస్తత్వం గురించి తెలుసుకదా? ***మనస్తత్వం తెలియని వాడు మనుషులను కూడగట్టుకుని ధర్మకార్యం సమర్ధవంతంగా నిర్వహించలేడు.*** నువు గంగాధరుడిని మాత్రమే వెంట తీసుకుని వెళ్ళటం వెనుక ఉన్న అర్ధం నేను గ్రహించగలను. చంద్రశేఖరుడి అహంకారాన్ని అణచాలని అనుకుంటున్నావు' అంది ఆమె.

నవ్వాడు శూరవర్మ.

'గంగాధరుడి సాహసం ప్రదర్శించలేకపోయాడు. అతడిలో ఆగ్రహం ఉంది. ఆవేశం ఉంది. కానీ వ్యక్తి 'హింస' జరపాలంటే ఆగ్రహావేశాలు, ఆలోచనను అది ముంచి వేయాలి. గంగాధరుడి ఆవేశాన్ని ఆలోచన అధిగమించింది. అందుకని యుద్ధనైపుణ్యం ఉన్నా ప్రదర్శించటంలో విఫలమయ్యాడు. ఆత్మవిశ్వాసం కోల్పోయాడు. అతడు కోల్పోయినా తిరిగి సాధించేందుకు అతడిని నాతో తీసుకువెళుతున్నాను.'

'కానీ, మరోసారి గంగాధరుడు విఫలమయితే, అది అతడి విశ్వాసాన్ని శాశ్వతంగా దెబ్బతీస్తుంది. ఇది ఆలోచించలేదా?'
శురవర్మ మౌనంగా ఉండిపోయాడు.

'వ్యక్తిలో ఎంత ప్రతిభ వున్నా నైపుణ్యం ఉన్నా తగిన మానసిక పరిణితి లేకపోతే ఆ నైపుణ్యం మేఘాలు కప్పిన సూర్యుడిలాంటిదని నీకు తెలియదా? సూర్యుడయినా తెల్లవారితే కానీ వెలుగులు ప్రసరించలేడు కదా! అప్పటికే మేఘాలు అడ్డు ఉండకూడదు కదా! అర్ధరాత్రి ఎంతగా రమ్మన్నా సూర్యుడు రాలేడు కదా. గంగాధరుడు యుద్ధానికి మనసికంగా సిద్ధంగా లేడు. ఇప్పుడు

నువ్వు అలాగని బలవంతంగా యుద్ధరంగంలో దింపితే పరాభవం పొంది సంపూర్ణంగా మానసిక స్థైర్యం కోల్పోతాడు. లేకపోతే ప్రాణాలు కోల్పోతాడు..'

శూరవర్మ ఏదో అనబోయాడు. కానీ ఆమె కొనసాగించటం గమనించి ఆగిపోయాడు.

'నువ్వు గంగాధర శర్మ ఆత్మవిశ్వాసం పెంచాలని నీతో తీసుకువెళుతున్నావు? మరి చంద్రశేఖరుడి సంగతి ఆలోచించలేదు? చంద్రశేఖరుడు సాహసం ప్రదర్శించాడు. ఉత్సాహంగా ఉన్నాడు. మరింత సాహసం ప్రదర్శించాలని ఉవ్విళ్ళూరుతున్నాడు. అటువంటప్పుడు, సాహసం చూపని గంగాధరుడిని వెంట తీసుకువెళ్ళి, సాహసం చూపిన చంద్రశేఖరుడిని వదిలేస్తే, చంద్రశేఖరుడి ఉత్సాహం నీరుకారిపోదా? ఆ నిరుత్సాహం నిరాశ నిస్పృహలై కసిగా మారి వ్యతిరేక భావనగా రూపాంతరం చెందితే? రక్తం రుచి చూసిన పులిని, వేటకు వెళ్ళకుండా నిర్బంధించటం వల్ల లాభం ఉంటుందా? అలా చేయటం వల్ల ప్రతిభను ప్రదర్శించిన తనని విస్మరించి, చేతకాని వాడికి పట్టం గట్టిన భావన చంద్రశేఖరుడిలో జనిస్తుంది. అందువల్ల తనకు అన్యాయం జరిగిందని నిస్పృహకు గురయితే పనికి రాకుండా పోతాడు. ఇది నీకు తెలియదా?' కత్తులలా ఆమె మాటలు శూరవర్మ మనసును తాకాయి.

తాను సాధించిన విజయం గురించి చిలవలు పలువలుగా చెప్పుకుంటూ, అహంకరిస్తూ తిరుగుతున్న చంద్రశేఖరుడిని పట్టించుకోకుండా గుణపాఠం నేర్పాలనుకున్నాడు. అతడి అహంకారాన్ని దెబ్బతీయాలనుకున్నాడు. అందుకే చంద్రశేఖరుడిని వదలి, గంగాధర శర్మను వెంట తీసుకువెళ్ళాలనుకున్నాడు. కానీ తన చర్య ఫలితాల గురించి లోతుగా ఆలోచించలేదు. తల వంచుకున్నాడు శూరవర్మ.

ఆమె నవ్వింది.

'శూరవర్మా! నీ ఆలోచన నేను గ్రహించాను. కానీ, చంద్రశేఖరుడు అహంకరించటంలో అతిశయోక్తి లేదు. పరిణతి పొందనివాడు విజయం సాధిస్తే ఇలాగే ఉంటుంది. నిండుకుండ తొణకదు. ఏమీ చేతకాని వారే గొప్పలు చెప్పుకుంటూంటారు. అటువంటిది తాను చేసిన పనే చెప్పుకుంటున్నాడు. చంద్రశేఖరుడు. అహంకారానికి ప్రతిభ ప్రదర్శనకు దగ్గిర సంబంధం ఉంది. అహంకారం ఉన్నవాడే ప్రతిభను ప్రదర్శించగలడు. ప్రతిభను ప్రదర్శిస్తున్న కొద్దీ అహంకారం పెరుగుతుంది. కానీ ఒక స్థాయిలో అహంకారానికీ ప్రతిభకూ నడుమ సమన్వయం సాధించినవాడు విజేతగా నిలుస్తాడు. ప్రతిభను మించి అహంకారం ప్రదర్శించినవాడు పతనమవుతాడు. అహంకారం కన్నా ఎక్కువ ప్రతిభను చూపినవాడు అందరి మన్ననలందుకుంటాడు. అలాంటివాడు సమాజంపై తన ముద్ర వేస్తాడు. కాబట్టి చంద్రశేఖరుడి అహంకారాన్ని ఈ స్థాయిలో దెబ్బతీస్తే, అతడి ప్రతిభను దెబ్బతీసినట్టు అవుతుంది. ఇది గ్రహించు. ప్రతిభ ఉన్న చోట అహంకారముంటుంది. ఇతరులకన్నా తాను అధముడిని అనుకోందే వ్యక్తి ఏమీ సాధించలేడు. ఎదుగుతున్న కొద్దీ పరిణతి వస్తుంది. అహంకారాన్ని అవగాహన కప్పేస్తుంది. కాబట్టి చంద్రశేఖరుడిని వెంట తీసుకు వెళ్ళు. గంగాధరుడిని వదిలెయ్. వారిలో పరిణతి, అవగాహనలు స్వతహాగా రాని. కృత్రిమంగా సాధించే ప్రయత్నం అనర్థదాయంకం!

'గంగాధరుడిలో కూడా ప్రతిభ ఉంది. దాన్ని వెలికి తేవాలని నా ప్రయత్నం' మెల్లిగా అన్నాడు శూరవర్మ.

'గంగాధరుడికీ, చంద్రశేఖరుడికీ మౌలికమైన తేడా ఉంది. ఇద్దరూ జలపాతంలా దూకే ధార వంటి వయసులోనే ఉన్నా, గంగాధరుడి మనస్సు పరిణతి పొందిన నదీ ధారవంటిది. చంద్రశేఖరుడి మనస్సు దూకే జలపాత ధార మాత్రమే. అందుకే, గంగాధరుడికి పరిస్థితి వివరిస్తే అర్థం చేసుకుంటాడు. చంద్రశేఖరుడు అర్థం చేసుకోలేడు. గంగాధరుడికి నేను చెపుతాను. అతడిని ఉండనీ. చంద్రశేఖరుడిని వెంట తీసుకు వెళ్ళు' ఆమె చివరిమాట అభ్యర్థనలా లేదు. ఆజ్ఞాపనలా ఉంది!

ఆ ఆజ్ఞను శిరసావహిస్తున్నట్టు శూరవర్మ తలవంచి వందనం చేశాడు.

✡✡✡

పదిమంది యువకులతో గ్రామం వదలి బయలుదేరాడు శూరవర్మ.

గుర్రాల పద ఘట్టనలతో ఎగసిన ధూళి మళ్ళీ నేల్రవాలేవరకూ తదేకంగా ఆ వైపే చూస్తుండిపోయాడు గంగాధర శర్మ.

శూరవర్మతో వెళ్ళాలని ఉంది. కానీ, వెళ్ళాలనీ లేదు. ఈ ద్వైదీ భావననుంచి శూరవర్మ నిర్ణయం అతడిని విముక్తుడిని చేసింది.

'గంగాధర శర్మా! చంద్రశేఖరుడు ఉత్సాహం చూపుతున్నాడు. నువ్వు గ్రామ రక్షణ కోసం ఉండిపో' అన్నాడు శూరవర్మ.

ఇంతలో పక్కన అలికిడి అయింది. ఆ వైపు తిరిగి చూశాడు. తనలాగే, ఆకాశం నుండి నేలవాలుతున్న దూళిని తదేకంగా చూస్తూ పద్మిని కనిపించింది. తల తిప్పుకుని అక్కడినుంచి కదలివెళ్ళిపోయాడు గంగాధరుడు.

కాస్త దూరం వెళ్ళి వెనక్కు తిరిగి చూశాడు. ఆ అమ్మాయి ఏదో కోల్పోయినదానిలా ఆ వైపు చూస్తూ నిలబడి ఉంది.

✡ ✡ ✡

ఇంకా తెలవారలేదు

ఆకాశంలో తారకలు వెలుగులు తగ్గిపోతున్నాయి. నల్లటి దుప్పటిని కొద్దికొద్దిగా తెరుచుకుంటూ ఉదయం జగతిని తొంగి చూడాలని ప్రయత్నాలు ఆరంభించింది. కానీ, బద్ధకం వల్ల దుప్పటిని మళ్ళీ ముఖంపైకి లాక్కుంటున్నట్టుంది.

కొండల నడుమ బండరాళ్ళు, అంత చీకటిలోనూ ఖణేలు ఖణేలుమని నిప్పురవ్వలు వెదజల్లుతున్నాయి.

కత్తియుద్ధం సాధన చేస్తున్న గంగాధర శర్మ అత్యంత ఆవేశంతో బండరాళ్ళను, కొండల్లాంటి కండలున్న తురుష్కులుగా భావించి, కత్తితో వాటిని వేగంగా తాకుతున్నాడు. బండలను ముక్కలు చేయాలన్నంత శక్తిని, ఆవేశాన్ని ప్రదర్శిస్తున్నాడు.

తెల్లారేసరికి ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. కత్తిని పక్కన పెట్టి, నదిలో ప్రవహించే నీటిలో అలసట తీరా స్నానం చేశాడు.

ఆపై శుభవస్త్రాలు ధరించి గ్రంధ పఠనం ప్రారంభించాడు.

అంతవరకూ అతడిలో ఉన్నక్రోధం, ఆవేశం గ్రంధ పఠనారంభంతో అదృశ్యమై పోయింది. చదువుతూన్న గ్రంధంలోని భావాలు అతడి మదిలో నిండిపోయాయి. అక్షరాల ద్వారా ఏర్పడిన పదాలు సృష్టించిన దృశ్యాలు అతడి కళ్ళు ముందు నిలిచాయి.

సంగ్రామానంద వర్ధిష్ణో విగ్రహే పులకాంచితే!
ఆసీత్కవచ విచ్ఛేదో వీరుణామ్ మిలతాం మిథః!!

కుమార సంభవంలో దేవదానవుల సంగ్రామాన్ని వర్ణించే శ్లోకాలలోనిది ఇది.

యుద్ధోత్సాహులైన వీరులు అత్యంత ఉత్సాహంతో ఒకరినొకరు తాకుతారు. ఈ ఉత్సాహంతో, ఆనందంతో వారి శరీరాలు పులకాంకితమయి ఉబ్బటం వల్ల వారి కవచాలు బద్దలవుతున్నాయి.

గంగాధర శర్మ కళ్ళముందు కత్తియుద్ధం చేస్తున్న సైన్య సమూహాలు నిలిచాయి. వీరుల ముఖాలలో యుద్ధోత్సాహం కనిపిస్తోంది. కత్తులకు తెగిన కవచాలు గాల్లో ఎగుర్తూ కనిపిస్తున్నాయి.

ఖడ్గారుధార సంవిప్తాశ్చంగా శిశుకర భాసురాః!
ఇతస్తోపి వీరుణాం విద్యుతాం వైభవం దధుః"

కవచాలు తెగిన తరువాత మానవుల శరీరాలను కత్తులు చీలుస్తాయి. మాంసం ఖండాలయి గాలిలోకి ఎగుస్తుంది. రక్తంతో తడిసిన కత్తులు, సూర్య కిరణాలలా తోస్తాయి. మెరుపుల్లా కదులుతాయి.

కళ్ళు మూసుకున్నాడు గంగాధర శర్మ.

ఇక్కడ కవి వర్ణిస్తున్నది దేవదానవ యుద్ధం. కానీ యుద్ధంలో ఎవరివైపు పక్షపాతం వహించకుండా కవి యుద్ధాన్ని నిష్పక్షపాతంగా వర్ణిస్తున్నాడు. రెండువైపుల ఉన్నా వీరులను గౌరవంతో ప్రదర్శిస్తున్నాడు.

యుద్ధ బీభత్సాన్ని వర్ణించేందుకు కవి చేస్తున్న వర్ణనలు పరమాద్భుతంగా ఉన్నాయి. కళ్ళముందు యుద్ధాన్ని నిలుపుతున్నాయి.

వీరుల బాణాల నుంచి వెలువడిన శరాలు ఉల్కలలా, భయంకరమైన సర్పాల్లా, అంబరాన్ని నింపుతున్నాయి. వారు ఆ కర్ణాంతం లాగి విడిచిన బాణాలు వీరులు రక్తదాహంతో తహ తహలాడుతున్నట్టు పరుగెత్తుతున్నాయి.

ఒరల నుంచి వెలుపలకు వచ్చి కదలుతున్న కత్తులు యుద్ధరంగంలో పోరు చూసి సంతోషం పట్టలేక కలకల నవ్వుతున్నట్టున్నాయి.

వీరుణాం శస్త్రభిన్నాని శిరాంసి నిపతంత్యపి!

అధావన్నన్తదష్టోష్ఠభీ మాన్యభిరిపు కృధా!!

ఆయుధాలు కత్తిరించిన వీరుల తలలు నేలపై పడికూడా శత్రువు వైపు, పెదిమలు కరచుకుంటూ క్రోధంగా చూపులతో వెంటాడుతున్నాయి.

గంగాధర శర్మ కళ్ళముందు తెగిపడిన తురుష్కుడి తల కనిపించింది. ఆ తల కళ్ళు తెరిచి క్రోధంగా తన వైపే చూస్తున్నట్టు అనిపించింది. దాని క్రూర ద్రుక్కులకు అతడి శరీరం కంపించసాగింది.

ఇక యుద్ధ వర్ణన చదవలేక పోయాడు గంగాధర శర్మ.

రెండు చేతులలో ముఖం దాచుకుని ఏడవటం ఆరంభించాడు.

అలా తెగిపడిన తల, దాని శరీరం, జీవంతో తొణికిసలాడేటపుడు ఎంతో మంది ప్రేమకు నోచుకుని ఉంటుంది. ఎన్నో సంతోషాలు అనుభవించి ఉంటుంది. ఆ మనిషిని ప్రేమించిన భార్య, తల్లి, చెల్లి, సంతానం... వారంతా మరణించిన వ్యక్తికోసం ఎంత కుములుతూ ఉంటారో?

ఎందుకని మనుషులు యుద్ధాలు చేస్తారు?

ఎందుకని ఒకరిని ఒకరు చంపుకుంటారు?

ఏం ఆనందం ఉంది సాటి మనిషిని పై ఆధిపత్యం చలాయించటంలో? ఏం సంతోషం ఉంది ఒకరినొకరు చంపుకోవటంలో?

సృష్టిలోని అణువణువులో అనంతమైన అద్భుతాలను పొందు పరచాడు భగవంతుడు. ప్రకృతి సర్వం విజ్ఞాన సర్వస్వం.

సృష్టి రహస్యాలు శోధిస్తూ, ప్రకృతిలో నిబిడీకృతమై ఉన్న విజ్ఞానాన్ని అన్వేషిస్తూ, తనలోని పశువుపైన విజయాలపై విజయాలు సాధిస్తూ గర్వించాల్సిన మానవుడూ, సాటి మనిషిని చంపి, తనలోని పశువును శక్తిమంతం చేస్తూ, ఏదో గొప్ప పని చేసినట్టు భావిస్తాడెందుకు?

సాటి మనిషిని చంపటం, నిర్దాక్షిణ్యంగా హింసించటం, క్రూరమైన రాక్షసచర్య, అలాంటి క్రౌర్యాన్ని ప్రదర్శించటం సాహసం అని ఎందుకనుకుంటాడు మనిషి?

అంతలో అతడి కళ్ళముందు, కదనరంగంలోకి దూకి శత్రువును సంహరిస్తున్న చంద్రశేఖరుడూ నిలిచాడు.

మనిషిని చంపటం అన్యాయం అంటున్నాడు తాను.

కానీ, చంద్రశేఖరుడు సమయానికి వచ్చి తురుష్కుడిని చంపకపోతే ఈ ఆలోచనలు చేసేందుకు తానుండేవాడా?

'పాము' గట్టిగా అరిచింది పద్మిని.

ఉలిక్కిపడి చుశాడు గంగాధర శర్మ.

'అయ్యో' అరిచింది పద్మిని.

ఒక పాము జర జర పాకుతూ గంగాధర శర్మ వైపు వస్తోంది.

అది ఎంత వేగంగా శరీరాన్ని మెలికలు తిప్పుతూ వస్తోందంటే, దాన్ని చూస్తుంటే కళ్ళు తిరుగుతున్నాయి.

కానీ, దాని కదలికలో ఎంతో అందం ఉంది. అది పక్కకు జరుగుతూన్నట్టే అనిపిస్తోంది కానీ, అది వెళ్ళాలనుకున్న దిశలోనే వెళుతోంది.

ఏ శక్తి ఈ జీవికెంత తెలివినిచ్చింది?

కానీ ఏ విషయం ఆలోచించే సమయం లేదు. అనూహ్యమైన వేగంతో అది గంగాధర శర్మ ఉన్న వైపు వస్తోంది.

ఆలస్యం చేయలేదు గంగాధర శర్మ. అస్సలు ఆలోచించలేదు. తన ప్రమేయం లేకుండానే వేగంగా కదిలాడు. క్షణం ఆలస్యం చేయకుండా పక్కనే ఉన్న కత్తిని తీసి పామును రెండుగా నరికివేశాడు.

రెండుగా తెగిన తరువాత చాలాసేపు విలవిలవాడింది. వేరయిన రెండు భాగాలు దేనికదే ప్రత్యేకమయినట్టు కొట్టుకున్నాయి. పడగవిప్పి కాస్తముందుకుపోతుంది ఒక ఖండం. తోక కొట్టుకుంటుండిపోయింది.

కాస్సేపటికి వాటిలోంచి చైతన్యం అదృశ్యమయింది. నిశ్చలమైపోయాయి.

గంగాధర శర్మ ఆ పాము ఖండాలవైపు చూస్తుండిపోయాడు.

క్షణం క్రితం వరకూ ప్రాణంతో ఉంది. జీవంతో జరజర పాకింది. క్షణంలో విగత జీవి అయింది.

భగవంతుడు ఎంతో శ్రద్ధగా, అందంగా తీర్చిదిద్దిన ఆ జీవిని అర్ధాంతరంగా తాను చింపేశాడు.

గంగాధర శర్మ శరీరం వణకసాగింది.

చేతులు శక్తిని కోల్పోయినట్టు నిస్త్రాణగా అయిపోయాయి. కత్తి జారి పడిపోయింది.

✡ ✡ ✡

**తాను ఒక జీవిని చంపాడు.**

కానీ చంపక తప్పని పరిస్థితి.

అది విషపు జీవి.

తాను చంపక పోయి ఉంటే తనని కాటేసి ఉండేది. కాబట్టి చంపటం తప్పని సరి. అది తనను కాటు వేస్తుందో, లేదో, నిర్ధారణగా తేలకున్నా, తనకు ప్రమాదం ఉన్నదనిపిస్తే, ఆత్మరక్షణ కోసం దాన్ని చంపటం ఆవశ్యకం...

అంతలో అతడికి తురుష్కులు గుర్తుకు వచ్చారు.

వారీ పాముకన్నా భయంకరులు. పాముపైనే జాలి చూపని తాను వారిని సంహరించాల్సి వస్తే బాధ పడాల్సిన అవసరం లేదు. సృష్టిలోని ధర్మం ఇది. ప్రాణరక్షణ కోసం తప్పని సరిగా చేయాల్సిన హింసను 'సాత్విక హింస' అంటారు. ఆత్మరక్షణ ప్రతి జీవి కర్తవ్యం.

తాను చంపకపోయి ఉంటే, పాము తనని కాటేసేది. 'కాటేస్తే వేయనీ' అని ఊరుకోవటం, ఆత్మద్రోహం అవుతుంది.

ఇది తురుష్కులకూ వర్తిస్తుంది.

ఎందుకో, గంగాధర శర్మలో ఏదో తెలియని వేదన మంచులా కరిగిపోతున్నట్టు అనిపిస్తోంది..

ఆత్మ రక్షణ తన కర్తవ్యం.. అనుకున్నాడు.

ఇంతలో అతని కళ్ళు వెడల్పయ్యాయి.

కళ్ళలో ఉత్తేజం అగ్నితేజంలా ప్రకాశిస్తూంటే, పద్మిని దగ్గరకు వచ్చింది. క్రిందపడ్డ కత్తి తీసి అతని చేతికి ఇచ్చింది.

'ప్రాణం తీసే శత్రువు దాడి చేసే వరకూ ఆగనవసరంలేదు. ఎదురు దాడి చేయటం శ్రేయస్కరం అంది.

ఆమె తనతో మాట్లాడుతున్నట్టు అనిపించలేదు గంగాధర శర్మకు. ఆమె కళ్ళు దిగంతాల వైపు చూస్తున్నాయి. ఆమె పలుకులు సకల భారత ప్రజలకు సందేశాన్ని ఇస్తున్నట్టున్నాయి

✡✡✡

కత్తియుద్ధ సాధన చేస్తున్న గంగాధర శర్మ అలుపు తీర్చుకునేందుకు ఆగాడు.

కానీ అతడిని అలుపు తీర్చుకోనివ్వలేదు.

కత్తిపట్టుకున్న ఒక ఆకారం అతడి వైపు దూకింది.

ఆమె పద్మిని!

గంగాధర శర్మ ఆశ్చర్యం నుంచి తేరుకునేలోగా, ఆమె అతడి పైకి దాడి చేసింది. వెంటనే ఆత్మ రక్షణ కోసం ఆమె దాడిని ఎదుర్కోక తప్పలేదు గంగాధర శర్మకు. ముందు ఆమెని తేలికగా తీసుకున్నాడు. కానీ యుద్ధం చేస్తున్న కొద్దీ ఆమె నైపుణ్యం అతడికి అర్థమవసాగింది. ఆమె సుశిక్షిత అని గ్రహించాడు. చివరికి అలసిపోయి ఆగింది ఆమె.

ఆమె అలసట తీర్చుకుంటూ కూడా చుట్టూ చూస్తూనే ఉంది.

'కాలం ఎటువంటిదంటే, ఇంట్లో ఉన్నా రక్షణ లేదు. అలసట తీర్చుకుంటూ కూడా అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి' అంది.

ఆమె వైపే చూస్తూండి పోయాడు గంగాధర శర్మ.

✡✡✡

'మనం చేస్తున్నది దారి దోపిడి' ఉత్సాహంగా అన్నాడు చంద్రశేఖరుడు.

'అలా అనవలసింది మనం కాదు, మన శత్రువులు' అన్నాడు శూరవర్మ.

'ఎందుకని?' ప్రశ్నించాడు చంద్రశేఖరుడు.

'తురకల తండాలు ఊళ్ళపై పడుతున్నాయి. సామాన్యులకు రక్షణ అన్నది లేకుండాపోతోంది. మన దేవాలయాలు వారి దాడులకు నేల కూలుతున్నాయి. దొరికిన వారిని మతం మార్చటంతో పాటు, వారికి కావాల్సిన మరో అంశం మన ఆలయాలలోని ధనం బళ్ళనిండా మన ధనాన్ని తరలించుకుపోతున్నారు. ఆ ధనంతో సైనికులకు జీతాలిచ్చి వారిని మనపై ఉసిగొల్పుతున్నారు. మరిన్ని దాడులు చేస్తున్నారు.

మన దేవాలయాల నుండి దోచుకున్న ధనంతో వారు మసీదులు కట్టుకుంటున్నారు. వారి మసీదుల ముడిసరుకు మన దేవాలయాల శకలాలే. మన నుండి దోచుకున్న ధనంతో మౌల్వీలను పోషిస్తున్నారు. అందమైన భవంతులు కట్టుకుని వైభవంగా కులుకుతున్నారు. రత్నాల అలంకరణలతో వైభవ మందిన మన దేవతా విగ్రహాలు వాళ్ళ దృష్టిలో రాళ్ళయి, మసీదు మెట్లయి, వాళ్ళ కాళ్ళ క్రింద నలుగుతున్నాయి. వాళ్ళ కాళ్ళ క్రింద నలుగుతున్నవి రాళ్ళు కాదు, మన హృదయాలు, మన ఆత్మగౌరవానికి ప్రతీకలు.

మన దేవాలయాలనుంచి వాళ్ళు కొల్లగొట్టి తీసుకుపోతున్న ధనాన్ని మనం వారి వద్దనుండి బలవంతంగా లాక్కుంటున్నాం. మన సమాజంలో సంఘటిత ప్రతిఘటన వ్యవస్థ లేకపోవటంతో ఇలా మెరుపుదాడులు చేస్తున్నాం. మనం లాక్కునే ధనం మనదే కాబట్టి, అది దోపిడీ కాదు.

కానీ, మన శత్రువులు మనల్ని దారి దోపిడీగాళ్ళంటారు. మనమూ అలా అనుకోకూడదు' ఆవేశంగా చెప్పాడు శూరవర్మ.

అతడి మాటలు విని ఆలోచనగా తలపంకించాడు చంద్రశేఖరుడు.

'కానీ వారి దృష్టిలో మనం దారి దోపిడీగాళ్ళమే. వాళ్ళు విజేతలు. మనం పరాజితులం. విజేతల మాటే చెల్లుబడి అవుతుంది కదా?'

నవ్వాడు శూరవర్మ.

'మన ధనంతో మనపై దాడి చేయటాన్ని మనం నిరోధిస్తున్నాం. మనం ఇంకా పరాజితులం కాలేదు. అప్పుడే మనల్ని మనం పరాజితులుగా భావించుకోవటం, మన మానసిక వ్యవస్థ ఎంతగా అస్తవ్యస్తమయిందో చూపిస్తుంది. ఇంకా మనం గెలిచే వీలుంది. తురుష్కులను హిమాలయాలయాలు దాటి తరిమే వీలుంది. ఒకవేళ ఇదే జరిగి భవిష్యత్తులో మనం విజయం సాధిస్తే మనం ధర్మ రక్షణ కోసం పోరాడిన వీరులమవుతాం. అయినా భవిష్యత్తు గురించి ఆలోచన అనవసరం. ఇప్పటి మన కర్తవ్యం పైనే దృష్టి పెట్టాలి. వేద పురాణాలను నాశనం చేసి, మన దేవాలయాల ధనాన్ని మోసుకెళుతున్న తురుష్క సేన ఈ వైపు నుంచే వెళుతుంది. ఆ సేనను అడవి దాటనివ్వద్దు. ఒక్క ఆభరణం కూడా ఢిల్లీ చేరనివ్వద్దు. అర్థమయిందా?' అడిగాడు.

అందరూ తలలూపారు.

మనం పదిమందిమే ఉన్నాం. తురుష్క సేనలో ఎందరున్నారో?' సందేహించాడో సైనికుడు. 'అటు చూడు' చూసాడు శూరవర్మ.

చెట్ల ఆకుల్లో, సందుల్లో, విల్లంబులు ధరించిన ఆటవికులు అనేకులున్నారు.

'ఈ దేశంలోని ప్రతివ్యక్తీ ఓ మహత్తర శక్తి. ధర్మ రక్షణ కోసం సర్వం పణంగా పెట్టే ఆరని జ్యోతి. తురుష్కులు ఎంత మంది ఉన్నా, మన ఆగ్రహ జ్వాలలో మాడి మసి అయిపోవలసిందే! '

ఇంతలో ఓ పక్షికూత విచిత్రంగా వినిపించింది.

'అప్రమత్తం. తురకల సేన వస్తోంది. సిద్ధంగా ఉండండి. సగం సేన వారణాసి వైపు వెళ్ళినా, సంఖ్య గణనీయంగానే ఉంది' హెచ్చరించాడు శూరవర్మ.

✡ ✡ ✡

పద్మిని కత్తి యుద్ధ ప్రావీణ్యం, గంగాధర శర్మను ఆశ్చర్య చకితుడిని చేస్తే, ఆమె శాస్త్రీయ పాండిత్యం అతడికి అత్యంత ఆనందాన్ని కలిగించింది.

కత్తి యుద్ధంతో అలిసి సొలసిన తరువాత, ఇద్దరూ చెట్టునీడన విశ్రాంతి తీసుకునేవారు.

అప్పుడు గంగాధర శర్మ మౌనంగా తాను తెచ్చుకున్న గ్రంథపఠనంలో లీనమయ్యేవాడు. కాస్సేపు కూర్చుని పద్మిని మౌనంగా వెళ్ళిపోయేది.

ఆమె అలా వెళ్ళటం మనసులో ఇష్టం లేకున్నా, గంగాధర శర్మ నోరు తెరచి ఆమెని ఉండమనే వాడు కాదు. ఆమెతో మాట్లాడాలని ఉన్నా, మాట్లాడలేక పోయేవాడు. మౌనంగానే ఉన్నా, ఆమె పక్కన ఉండటం అతడికి ఆనందంగా అనిపిస్తుంది.

ఆకుల గలగలలు తమ మనసులోపలి భావాల గానానికి తాళాలు వేస్తున్నట్టు తోచేది. వీచేగాలి, తమ మనసులోపలి భావాలను గాలి తరగల ద్వారా ఇరువురికి చేరవేస్తూ, అవి కేరింతలు కొడుతున్నట్టుండేవి ఆకుల గలగలలు.

ఒకరోజు పద్మిని అలా వెళ్ళిపోతూంటే, ధైర్యం చిక్కబట్టుకుని అడిగాడు.

'అలా వెళ్ళిపోతున్నావేం?'

పద్మిని నవ్వింది.

'మీరు గ్రంథ పఠనంలో మునిగితే నేనేం చేయాలి?'

తడబడ్డాడు గంగాధర శర్మ.

నేను పఠిస్తున్న వాటిలో సుందరమైన భావాలను మీకు వివరించాలనిపిస్తుంది. అప్పుడు మీరు అందుబాటులో లేక పోవటం బాధ కలిగిస్తుంది' నిజాయితీగా అన్నాడు గంగాధర శర్మ.

అతడి కళ్ళల్లోకి చూస్తూ నవ్వింది పద్మిని.

'మీరు పఠించే గ్రంథంలో సుందరమైన భావాలు ఎప్పుడు వస్తాయోనని ఎదురు చూస్తూ కూచోవాలా?'

గంగాధర శర్మ తల ఎత్తలేదు. అతడు మాట్లాడక పోవటం చూసి తనే అడిగింది.

'ఏం గ్రంథం పఠిస్తున్నారు?'

'ఋతు సంహారం. కాళిదాసు కవి. ప్రస్తుతం సమాజం అల్లకల్లోలంగా ఉంది. జీవితంలో ప్రశాంతత లోపించింది. అందుకని ఇంతకు ముందులా సంస్కృతం చదివి, అర్థం చేసుకుని అనుభవించే తీరిక ఉండని పరిస్థితులు నెలకొన్నాయి. కాబట్టి, మన ప్రాచీన సాహిత్య సంస్కృతి సజీవంగా తరువాత తరాలకు అందాలంటే, దాన్ని సులభంగా అందరూ అర్థం చేసుకోగల ప్రాంతీయ భాషలలోకి తర్జుమా చేయాలని, విస్తృత ప్రచారం ఇవ్వాలని గురువుగారు ఆజ్ఞాపించారు. అందుకే ఇష్టం లేకున్నా తెలుగు భాషలో ప్రావీణ్యం సంపాదించాను. సంస్కృతానికి అతి దగ్గరగా ఉన్న అత్యద్భుతమైన భాష అది. ఈ గ్రంథాన్ని తెలుగులోకి అనువదించే బాధ్యతను స్వీకరించాను' గబగబా చెప్పాడు గంగాధర శర్మ.

అందంగా నవ్వింది పద్మిని.

'ఇది కేవలం మీ గురువుగారే కాదు, దేశవ్యాప్తంగా ప్రజలు స్వచ్ఛందంగా చేపట్టిన ఉద్యమం' చెప్పింది పద్మిని.

'నీకెలా తెలుసు?' ఆశ్చర్యంగా అడిగాడు గంగాధర శర్మ.

పద్మిని ముఖంపై విషాద ఛాయ ఆకాశంలో నల్లటి మేఘంలా కదిలించింది.

'మా తండ్రిగారి సంస్థానంలో పలు ప్రాంతాల నుండి వచ్చి ఆశ్రయం పొందిన పండితులంతా ఈ పనిలోనే ఉండేవారు. రామాయణ, భారతాది పురాణాలను స్థానిక భాషలలోకి సరళంగా, సుందరంగా అనువదించటం వారి కర్తవ్యం. ఎలాంటి పాండిత్యం లేని సామాన్యుడికి సైతం బోధ పడేలా ఆకర్షణీయంగా రచించటం వారి బాధ్యత.

మా దగ్గర వీరబాహు అని ఓ యువ పండితుడు ఉండేవాడు. ఆయన స్థానిక భాషలో రామాయణాన్ని గేయ రూపంలో రచించాడు. చేసేది వాల్మీకి అనువాదమే అయినా, తన స్వీయ వర్ణనలను ఎంతో సుందరంగా రామాయణ కథలో చొప్పించాడు. రాముడి పాదాలు తాకిన గంగ, తాను భువిపై ఉన్నానని మరచి పోయిందట. విష్ణు మూర్తి అయిన శ్రీరామ చంద్రుడి రాకవల్ల భువి వైకుంఠంలా తోచిందట. గరిగ, విష్ణు పాదం నుంచి జనించిందంటారు కదా. అదీ కవి చమత్కారం!

ఆమె చెపుతుంటే, ముగ్ధుడయి విన్నాడు గంగాధర శర్మ.

అతడికి ఈ వర్ణన నచ్చింది. ఆ వర్ణన కన్నా ఆమె చెప్పిన విధానం నచ్చింది. చెపుతున్నప్పుడు ఆమె వదనంలో కనిపిస్తున్న ఆనందం మరింత నచ్చింది. అంతలో అతడికి ఓ సందేహం వచ్చింది.

చేసేది అనువాదం. దాన్లో స్వంత భావనలు జోడించటం సమంజసం, అన్యాయం కదా? అందువల్ల మూలకవి భావనలు అన్యాయం చేసినట్టు కాదా? కొన్నాళ్ళకు ప్రజలు మూలం మరచి, ఈ అనువాదంలోని కల్పననే నిజం అనుకుంటే?'

'మన సమాజం ఎదుర్కొంటున్న విపత్తు సామాన్యమైనది కాదు. మన సంస్కృతి, సామాజిక సాంప్రదాయాలే కాదు 'మనం' సమూలంగా నాశనమై పోయి, అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదకరమైన పరిస్థితి ఇది. మన సమాజం ముందు ఈ విపత్తు నుంచి తప్పించుకోవాలి, శక్తివంతమై నిలబడాలి. అందుకు ప్రజలకు ఆత్మవిశ్వాసం కలగాలి. ఆత్మగౌరవం నిలవాలి. అలా ప్రజలను ఉత్తేజితులను చేసి, ఉద్యుక్తులను చేసేందుకు సాహిత్యం ఒక మాధ్యమం.

మూలంలో ఎలాంటి కల్పనలు చేర్చినా, అది కథను శోభనిస్తుందే తప్ప అన్యాయం చేయదు. బంగారం ఏ రూపంలో ఉన్నా దాని విలువ తగ్గుతుందా? పైగా మన ప్రథమ లక్ష్యం రామాయణాన్ని సజీవంగా ఉంచటం. అది నెరవేరాలంటే ప్రాంతం, భాషలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ దాని గురించి తెలిసి ఉండాలి. వారికి అర్థంకావాలంటే, సులభంగా మనసుకు పట్టాలంటే సమకాలిక సామాజిక పరిస్థితులు కావ్యంలో కనబడాలి. అందుకోసం, ప్రాంతీయ పరిస్థితులకు, సమకాలిక పరిస్థితులకు తగ్గ అన్వయాన్ని జోడించటంలో తప్పులేదు. మాతృక అయిన నదినుంచి వెడిలే పిల్ల కాలువలెంత దూరం ప్రవహించినా, మాతృకను మించిపోలేవు. మాతృనది నుంచి వేరుపడి మనలేవు.'

విస్ఫారిత నేత్రాలతో ఆమె వైపు చూశాడు గంగాధర శర్మ.

'పద్మినీ, ఇవన్నీ నువ్వు ఎప్పుడు నేర్చుకున్నావు?'

పద్మిని ముఖం విషాదంగా అయింది.

'మా ఆస్థానంలో నాకు గురువు 'సరస్వతి' గారు. ఆయన నాకు సాహిత్య గ్రంథంతోపాటు సకల శాస్త్రాలు నేర్పారు.

కాల మేఘం, కలికాల మేఘమై
కణకణ మండే నిప్పుల వర్షం కురిపిస్తోంది
తురుష్క కరవాలాల నుండి కారే నెత్తుటి ధారలో
పరమ శివుడి మూడవ కన్నులో నిప్పు ఆరిపోతోంది. '

హఠాత్తుగా పాట ఆరంభించింది పద్మిని. చివరి పాదం పాడుతూ ఏడవసాగింది. గంగాధర శర్మకు ఏమనాలో తోచలేదు. ఏడుస్తూనే చెప్పటం ఆరంభించింది.

'మా గురువుగారు రాసిన గేయం ఇది. ఆయన నాకు అద్వైతం బోధించారు. విశిష్టాద్వైతం నేర్పించారు. తల్లి విజ్ఞానవంతురాలయితేనే పిల్లలు విచక్షణ నేర్చుకుంటారనేవారు. ' చెపుతూన్న ఆమె గంగాధర శర్మవైపు చూసి ఆగిపోయింది.

'విశిష్టాద్వైతం' అన్న పదం చెవుల్లో పడగానే గంగాధర శర్మ ముఖం మ్లానమైపోయింది. తాను కర్తవ్యం మరిచాడు.

తమ వంశంలో వారెవరయినా విశిష్టాద్వైతులను వాదనలో ఖండించి అద్వైత సిద్ధాంత వైశిష్ట్యాన్ని నిరూపించాలని తమ పూర్వికులు నియమం విధించారు. తండ్రి బాధ్యత తనయుడిదంటుంది శాస్త్రం.

అలా ఆ బాధ్యత తనదవుతుంది. తురుష్కుల గోలలో పడి, పద్మిని ధ్యాసలో పడి కర్తవ్యాన్ని మరచాడు. ఇప్పుడు పద్మిని మాటవల్ల హఠాత్తుగా అతడికి కర్తవ్యం గుర్తుకు వచ్చింది.

'ఏమైంది?' గంగాధర శర్మను పరిశీలనగా చూస్తూ అడిగింది పద్మిని.

'ఏమీలేదు. ' కప్పిపుచ్చుతూ అన్నాడు గంగాధర శర్మ.

'మరి మీ గురువు సరస్వతి, సభలో ఇతర పండితులు ఏమయ్యారు!? 'అడిగాడు, ఆమె దృష్టిని మళ్ళిస్తూ.

ఉన్నట్టుండి పద్మిని కళ్ళు నిప్పులు కురవటం ఆరంభమయింది.

'సరస్వతి, బలవంతాన సులేమాన్ అయ్యాడు. పండితులనేకులు ప్రాణాలు కోల్పోయారు. బ్రతికినవారు మతం మారారు. ఇప్పుడు వాళ్ళు.. ఖురాన్ పఠిస్తూ రామాయణాన్ని దూషిస్తున్నారు. తప్పులెన్నుతున్నారు.'

చివరి మాటలు దాదాపుగా అరుస్తున్నట్టుంది పద్మిని. ఆమె కోపాగ్ని తీవ్రతకు ప్రకృతి సర్వం వణికి పోతున్నట్టు తోచింది గంగాధర శర్మకు. ఇంతలో 'తురుష్కులు దాడికి వస్తున్నారు' ఓ పిల్లవాడు గట్టిగా అరుస్తూ పరిగెత్తాడు.

✡✡✡

'**తురుష్కుల తండా ఊరి** పైకి వస్తున్నది' ఆ పిల్లవాడు ఊపిరి పీల్చటం కోసం కుండా ఆగకుండా గబగబా చెప్పాడు.

గంగాధర శర్మ పద్మిని వైపు చూశాడు.

ఆమె కళ్ళు, వింత భావంతో ప్రకాశిస్తున్నాయి.

అటు చూస్తుంటే గంగాధర శర్మ శరీరం వణకసాగింది. ఆమె కళ్ళల్లో అదోరకమైన పైశాచిక ఆనందం కనిపిస్తోంది. ఆ ఆనందం వెనుక ఓ రకమైన భయం ఉంది. కానీ ఆ భయంలో నిర్లిప్తత ఉంది. అది చూస్తూంటే గంగాధర శర్మలో తెలియని భయం కలుగుతోంది.

మనిషికి ఏదో ఓ విషయంలో భయం ఉండాలి. కానీ ఎలాంటి భయాలు లేనివాడిని ఎవరూ నియంత్రించలేరు. అలాంటి వ్యక్తి తనపై తాను నియంత్రణ సాధిస్తే దైవం అవుతాడు. లేకపోతే రాక్షసుడవుతాడు.

ఇప్పుడు పద్మినిని చూస్తుంటే రక్తం తాగేందుకు తహ తహలాడుతున్న రాక్షసి గుర్తుకు వస్తోంది గంగాధర శర్మకు.

ఆ పిల్లవాడి మాటలు వింటూనే ఆమె వికృతంగా నవ్వింది. గంగాధర శర్మవైపు చూసింది.

'మనం అనుకున్నది అనుకున్నదానికన్నా తొందరగా వచ్చింది. మన సమాజానికి మనల్ని మనం అర్పించుకునే రోజు వచ్చింది.'

ఊళ్ళో యువకులధిక భాగం శూరవర్మతో వెళ్ళారు. రక్షణగా నిలిచింది గంగాధర శర్మతో పాటు మరికొంత మంది యువకులే. మిగతా వారంతా మహిళలు, వృద్ధులు. వీరితో తురకల తండాల దూకుడును ఎలా ఆపటం?

గంగాధర శర్మ కళ్ళల్లో సంశయం చూసిన పద్మిని నవ్వింది. వగరుస్తున్న పిల్లవాడివైపు చూసింది.

'భయం లేదు. ఊళ్ళో వారందరినీ సమావేశం అవమను. ఎవరెవరి దగ్గర ఏయే  ఆయుధాలు ఉన్నాయో వాటిని పట్టుకుని రమ్మను. ఎంత దూరంలో ఉంది తురకల తండా?' అడిగింది.

'చాలా దూరం నుంచే సమాచారం వచ్చింది' చెప్పాడు పిల్లవాడు వణుకుతూ. అతడి తల నిమిరింది పద్మిని.

'భయంలేదు. తురకలూ మనుషులే. కత్తి తగిలితే వాళ్ళ చర్మమూ చిట్లుతుంది. రక్తం కారుతుంది. భయపడకు.'

ఆ పిల్లవాడు పద్మిని పట్టుకుని హఠాత్తుగా ఏడవటం ఆరంభించాడు.

ఆ దృశ్యం చూస్తున్న గంగాధర శర్మ మనస్సు చిత్రంగా స్పందించింది.

*భయం మనిషి ఆలోచనలను నిర్దేశిస్తుంది. కానీ భయాన్ని అదుపులో పెట్టుకున్న వ్యక్తి మానవ సమాజాన్ని నిర్దేశించగలుగుతాడు.*

అంతవరకూ బేలగా కనిపించిన పద్మిని కత్తి పట్టుకోగానే వీరనారిలా అనిపించింది. తురకలు వస్తున్నారన్న వార్త వినగానే కాళికలా అనిపించింది. ఏడుస్తున్న పిల్లవాడిని దగ్గర తీసుకుని అనునయిస్తున్నప్పుడు 'మాత'లా తోస్తోంది.

పద్మిని ఇదంతా చేయగలటానికి కారణం, ఆమె భయంకర అనుభవాలను అనుభవించటమే. ఇక అంతకన్నా భయంకరమైన అనుభవం లేదన్న భావన ఆమెలో స్థిరపడటం ఆమెలో భయాన్ని తరిమివేసింది.

కానీ, తనకలాంటి భయంకరమైన అనుభవాలు లేవు. తాను, తన ఊరుదాటి బయట అడుగుపెట్టి ఎరుగడు. అందుకే, ఏం జరుగుతుందో, ఎలాంటి పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందోనన్న భయం తనని పట్టి పీడిస్తోంది.

హఠాత్తుగా గంగాధరశర్మకు ఏదో సత్యం అర్థమైన భావన కలిగింది.

*తెలియనిది భయం కలిగిస్తుంది. భయం మనిషిని బలహీనుడిని చేస్తుంది. బలహీనుడు సులభంగా తనని తాను మరచిపోతాడు. తన వ్యక్తిత్వం కోల్పోతాడు.* అందుకేనేమో, పూర్వకాలంలో గురువులు విద్యార్థులను అడవుల్లోనే ఒంటరిగా పంపేవారు. దేశయాత్రలు చేయమనేవారు. ఇందువల్ల వారికి ప్రపంచం తెలుస్తుంది ఎలాంటి పరిస్థితినయినా తట్టుకునే ధైర్యం వస్తుంది.

ఇందుకేనేమో, భారతీయ సిద్ధాంతంలో మానవుడు అనంతుడు. ఆత్మ స్వరూపుడు.

కత్తి అతడిని తాకలేదు. నిప్పుకాల్చలేదు. ఆత్మకు అది అంతం లేదు. ప్రపంచమంతా ఒక కల్పన. మనిషి భయాలనన్నీ అజ్ఞాన స్వరూపాలు. ప్రపంచంలో ఏం జరిగినా అది భగవత్సంకల్పం. తాము కేవలం తోలు బొమ్మల్లాంటివారు. తమని ఆడించేవాడు పైనెక్కడో ఉన్నాడు.

'ఎలా జరగాల్సింది అలా జరుగుతుంది. తమ కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వహించటమే తమ ధర్మం' గంగాధర శర్మ చేతులు కత్తిపై బిగుస్తున్నాయి.

✡ ✡ ✡

చంద్రశేఖరుడు కత్తిని గట్టిగా పట్టుకుని సిద్ధంగా ఉన్నాడు.

జరిగేదేదో జరిగిపోతే బాగుండునని ఉంది అతడికి. ఉద్విగ్నతను భరించలేకపోతున్నాడు.

తనతో పాటు గర్భగుడిలో ఉన్న పూజారివైపు చూశాడు.

పూజారి కళ్ళుమూసుకుని మంత్రాలు చదువుతున్నాడు. మాల తిప్పుతున్నాడు. అతడికి మరోవైపు తమవాడే మాధవుడు కత్తి పట్టుకుని సిద్ధంగా ఉన్నాడు. మాధవుడి దృష్టి మూసి ఉన్న గర్భగుడి తలుపుల పైనే ఉంది.

పూజారిని చూస్తూంటే చంద్రశేఖరుడికి నవ్వు వస్తోంది.

వారణాసి పొలిమేరలు చేరగానే శూరవర్మకు సమాచారం అందింది. ఆ రోజు రాత్రి తురకలు ఆ ప్రాంతంలోని స్వర్ణ శివాలయంపై దాడి చేయాలని నిశ్చయించుకున్నారని.

వార్త తెలియగానే శూరవర్మ హుటాహుటిన స్వర్ణదేవాలయం చేరుకున్నాడు. గుడి పెద్దలతో, గుడిలోని విలువైన వస్తువులను మరో సురక్షిత ప్రాంతానికి తరలించమని చెప్పాడు.

కానీ గుడిని చూసిన తరువాత ఆ మాటలు ఎంత అర్థ విహీనమో అర్థమయింది. ఎందుకంటే, ఆ గుడిని కట్టింది మట్టితో, రాళ్ళతో కాదు.. బంగారంతో. అడుగడుగునా బంగారమే! అణువణువునా బంగారమే. ఎటు చూస్తే అటు గోడలలో మణిమరకత మాణిక్యాలు, ఆకాశంలో తారల్లా మెరుస్తున్నాయి. విరగబూసిన మల్లె చెట్టులో మల్లెపూలులా తళతళలాడుతున్నాయి.

అది చూసి శూరవర్మ నిస్పృహతో నిట్టూర్చాడు.

'ఈ మందిరాన్ని రక్షించక తప్పదు.' అన్నాడు.

వెంటనే తన వెంట ఉన్నవారిని కొన్ని నిర్దిష్ట విభాగాలుగా విభజించాడు. తురకల సైన్యం సంఖ్య అసంఖ్యాకం అని వార్త అందింది. వారిలో సుశిక్షితులు ఉన్నారు. అప్పుడే కత్తి పట్టటం నేర్చుకున్నవారూ ఉన్నారు.

తురకల సైన్యం కొండలపైనుండి దొర్లే నీటి ప్రవాహంలా ఊళ్ళని ముంచెత్తుతూ వస్తోంది. ఎలాగయితే నీటి ప్రవాహం, దారిలో ఉన్న రాళ్ళనూ, చెట్లనూ, పుట్టలనూ తనలో కలిపేసుకుని వెంట తీసుకువస్తుందో అలాగే ఊళ్ళల్లో మతం మారిన వారినీ, యుద్ధ ఆకాంక్ష ఉన్న వారినీ తమలో భాగం చేసుకుంటూ సంఖ్య పెంచుకుంటూ వస్తోంది తురకల సేన. ఎలాగయితే చిన్నరాయి ముక్క అయినా, నీటి ప్రవాహ వేగం వల్ల మామూలు కన్నా శక్తివంతమై అధిక నష్టం చేయగలుగుతుందో, అలాగే, తురకల సేనలో చేరినవారు వీరులు కాకున్నా, యుద్ధంలో శిక్షణ లేకపోయినా, ఓ రకమైన శక్తిమంతులవుతున్నారు. ఆవేశంతో అనూహ్యమైన వీరత్వం ప్రదర్శిస్తున్నారు.

ఇది శూరవర్మకు తెలుసు.

అందుకే వందమాత్రమే ఉన్న తన సైన్యాన్ని పది విభాలుగా విభజించాడు.

'మనం కలసి కట్టుగా పోరాడటం కన్నా విభిన్న భాగాలుగా మారి ప్రణాళిక ప్రకారం దాడి చేయటం మంచిది. మనం ఒకటిగా ఉంటే, వారి ప్రవాహ వేగ ఉధ్ధృతికి ఒకేసారి కొట్టుకుపోతాం. అలాకాక పది భాగాలుగా ఏర్పడి పది మూలలుగా, పది వైపుల నుంచి దాడి చేస్తే, వారి దృష్టి ఒకచోట కేంద్రీకృతం కాకుండా మళ్ళించిన వాళ్ళం అవుతాం. మన విజయావకాశాలు మెరుగుపడతాయి. ఎందుకంటే, మనం పొంచి ఉన్నట్టు వారికి తెలియదు కాబట్టి' అని అందరి వైపు చూశాడు శూరవర్మ.

ఆపై పది విభాగాలలో కొందరిని గుడి చుట్టూ ఉన్న ఎత్తయిన భవంతులలో, చెట్లలో దాగుండమన్నాడు. బాణాలు సంధించి సిద్ధంగా ఉండమన్నాడు. మిగతా వారిని గుడిలో ఒక్కొక్క ప్రాంతానికీ, ఒక్కో మలుపులోనూ దాగుని కత్తులతో సిద్ధంగా ఉండమన్నాడు. ఇలా గుడిలో అందరినీ విస్తరింపచేశాడు.

శూరవర్మ ప్రణాళిక చంద్రశేఖరుడికి నచ్చింది. ఉన్నది తక్కువ మంది. అయినా వారిని ఇలా విభజించి ఒక్కక్కరికి ఒకో గోడ రక్షణ బాధ్యత అప్పగించటం వల్ల ఎక్కువ ప్రాంతాన్ని రక్షించే అవకాశం చిక్కుతోంది. ఈ పోరాటంలో ఏ ఒక్క విభాగం వారు విజయం సాధించినా, వారు ఇతరులకు సహాయంగా వెళ్ళగలటమే కాదు, అది అందరి మానసిక స్థయిర్యాన్ని పెంచుతుంది. ***జయం, అపజయం రెండూ అంటువ్యాధుల్లాంటివి. ఒక విజయం పది విజయాలకు దారి తీస్తుంది. ఒక అపజయం వంద పరాజయాలకు కారణమవుతుంది. అందుకే ఎంత చిన్నదయినా విజయం వైపే దృష్టిపెట్టాలి. ఎంత పెద్దదయినా పరాజయాన్ని విస్మరించాలి.***

శూరవర్మ ప్రణాళికలో చంద్రశేఖరుడికి నచ్చిందేమిటంటే, ఇలా విభాగాలుగా పోరాడడం వల్ల తాము ఎంతమందిమి ఉన్నామో శత్రువుకు తెలిసే అవకాశం లేదు. తను సంఖ్య అసంఖ్యాకం అని శత్రువు భీతిల్లే అవకాశం ఉంది.

అయితే, శూరవర్మకు నచ్చనిదేమిటంటే, అందరికీ అన్ని బాధ్యతలు అప్పచెప్పాడు కానీ చంద్రశేఖరుడికి ఎలాంటి బాధ్యత అప్పచెప్పలేదు.

చివరికి చంద్రశేఖరుడు నోరు విప్పి అడిగేందుకు సిద్ధమవుతూంటేణ శూరవర్మ అతడివైపు తిరిగాడూ.

'చంద్రశేఖరా, గర్భగుడిలో విగ్రహాన్ని రక్షించాల్సిన బాధ్యత నీది' అన్నాడు.

'చంద్రశేఖరుడు నిరాశగా చూశాడు శూరవర్మవైపు.

'మీరందరూ, బయట పోరాడుతూ ఉంటే, నేను చేతులు ముడుచుకుని లోపల నా వంతుకోసం ఎదురు చూడాలా?' కోపంగా అడిగాడు.

చంద్రశేఖరా.. నువ్వు నా సైన్యంలో అతి శక్తివంతమైన ఆయుధానివి. నిన్ను ఆరంభంలోనే ప్రయోగించి వ్యర్థం చేయదలచుకోలేదు. అన్ని ఆశలు అడుగంటిన తరువాతనే అత్యంత శక్తివంతమైన ఆయుధాన్ని ఉపయోగిస్తాం. అలా నిన్ను సుదర్శన చక్రంలా అత్యవసరానికే వాడదలచుకున్నాను. అదీగాక, నువ్వు మనల్నందరినీ రక్షించే భగవంతుడి ప్రతిమకే రక్షణవు. అంటే మన మానం, ప్రాణం, ధర్మం, సర్వం నీమీద ఆధారపడి ఉన్నాయన్నమాట. అన్ని ఆశలు ఆవిరైన తరువాత కూడా మిగిలే ఏకైక ఆశ. అన్నమాట నువ్వు!

చంద్రశేఖరుడు మాట్లాడలేకపోయాడు. కానీ అందరూ యుద్ధం చేస్తూనే తన వంతుకోసం ఎదురు చూస్తూండటం అతడికి అసంతృప్తిగా ఉంది. అవమానంగా ఉంది. తనంటే శూరవర్మకు ఇష్టం లేదన్న భావన బలపడింది. అసలు తననీ యుద్ధానికి తీసుకురావటమే శూరవర్మకు ఇష్టం లేదని చంద్రశేఖరుడికి తెలుసు. అందుకే గర్భగుడిలో ఉన్న అతడి సర్వేంద్రియాలు బయట కేంద్రీకృతమయ్యాయి. బయట నిశ్శబ్దంగా ఉంది.

దాడి ఎప్పుడు జరుగుతుందో తెలియదు. తన వంతు ఎప్పుడు వస్తుందో తెలియదు.

ఇలా తెలియని దానికోసం ఎదురు చూడటం దుర్భరంగా ఉంది. అయితే, ఈ ఉద్రిక్తతలు భయాలతో సంబంధం లేకుండా భగవధ్యానంలో సర్వం మరచిన పూజారిని చూస్తుంటే చంద్రశేఖరుడికి నవ్వు వస్తోంది.

అది మూర్ఖత్వమో, అమాయకత్వమో, చేతకానితనమో అర్థం కావటం లేదతనికి.

ముంచుకొస్తున్న ప్రమాదాన్ని నివారించాలని ప్రయత్నించే బదులు, దైవంపై భారం వేసి, మంత్రాలు వల్లె వేయటం అర్థం లేదనిపిస్తోంది చంద్రశేఖరుడికి.

విశ్వాసం వ్యక్తిని కార్యాచరణకు ప్రేరేపించాలి. నిర్వ్యాపారంగా ఉండటం వల్ల ఏమీ ఒనగూడదు. గాలిలో దీపం పెట్టి వెలగమంటే వెలగదు. అలాగే భగవంతుడిపై భారం వేసి రక్షించమంటే కుదరదు. మానవ ప్రయత్నం ఉండాలి.

మహాభారత యుద్ధంలో పాండవులు యుద్ధానికి సిద్ధమైన తరువాతనే కదా, శ్రీకృష్ణుడు సహాయం చేసింది. 'మీరు నన్ను ధ్యానించండి. నేను కౌరవులను చంపివస్తాన'ని అనలేదు కదా!

ఇలా రకరకాల ఆలోచనలతో ఉన్న చంద్రశేఖరుడు ఉలిక్కిపడ్డాడు. దూరంగా గుర్రపు డెక్కల చప్పుడు వినిపిస్తోంది.

అయితే, అది గుర్రాల సమూహం వస్తున్నట్టు లేదు. ఒకే గుర్రం వంటరిగా వస్తోంది.

చంద్రశేఖరుడు, మాధవుడి వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

గుర్రం చప్పుడు మాధవుడూ విన్నట్టున్నాడు. చంద్రశేఖరుడి వైపు చూశాడు. ఆ చప్పుడు గుడి బయట ద్వారం దగ్గరకు వచ్చి ఆగింది.

ఇద్దరూ ఊపిరి బిగపట్టారు కత్తులను గట్టిగా పట్టుకుని.

✡✡✡

ఊపిరి బిగబట్టాడు గంగాధర శర్మ.

పద్మినిని చూస్తుంటే ఆశ్చర్యంగా ఉంది అతడికి.

అంతవరకూ ఎవరితోనూ ఏమీ మాట్లాడని పద్మిని హఠాత్తుగా అందరినీ పలకరించసాగింది.

అందరూ సమావేశమవగానే, పద్మిని మాట్లాడటం ఆరంభించింది.

'తురకల తండాకు భయపడాల్సిన అవసరంలేదు. నేను వారిని చూశాను. వారూ మనుషులే. మనం చేయాల్సిందల్లా ధైర్యంగా చేయాలి. కాళికలా శత్రుసంహారం చేయాలి. రుద్రగణంలా శత్రువుపై విరుచుకుపడాలి. భయంలేదు. మీ దగ్గర ఉన్న ఆయుధం ఏదైనా, శత్రువును గాయపరచగలిగితే చాలు. సిద్ధంగా ఉండండి. అయితే ఒకటి గుర్తుంచుకోండి. మనల్ని మనల్ని మనమే రక్షించుకోవాలి. ఇది మన ఆత్మకోసం పోరాటం. ఇది మన ఊరి రక్షణ కోసం పోరాటం. ఇది మన ధర్మం కోసం పోరాటం' ఆవేశంగా చెప్పింది పద్మిని.

అదేం చిత్రమో ఊరివారంతా ఆమె నాయకత్వాన్ని మౌనంగా స్వీకరించారు. ఎదురు చెప్పకుండా ఆమె చెప్పినట్టు చేశారు.

భయం వల్ల ఏ మాత్రం ఆశ కలిగించినా వారి మాట వింటాడు మనిషి. అలా అందరూ పద్మిని మాట వినసాగారు.

ఊళ్ళో కాస్త ధైర్యం, శక్తి ఉన్నవారిని ఊరి చుట్టూ కాపలాగా ఉండమంది పద్మిని. మిగతావారిని వీధి వీధినా, ప్రతిమలుపులోనూ సిద్ధంగా ఉండమంది.

తురకలను మన ఊళ్ళో అడుగుపెట్టనివ్వకుండా మేము ప్రయత్నిస్తాం. ఒకవేళ మా ప్రయత్నం విఫలమైతే, ప్రతి ఒక్కరూ వీధి వీధినా, ప్రతి అంగుళానికీ తురకలతో తలపడాల్సి ఉంటుంది. ఒకవేళ మనం ఓడిపోయే పక్షంలో, వీలయిన వెంటనే ఊరు వదలి, గురువుగారు చూపిన గుహలో తలదాచుకోవాలి. పరిస్థితి చక్కబడిన వెంటనే వెనక్కురావాలి!

అందరూ తలలూపారు.

అలా అందరినీ నియమిత స్థానాలలో ఉంచింది గంగాధరశర్మతో ఇటూ తానూ వచ్చి ముందు వరుసలో నిలబడింది.

అందరూ ఊపిరి బిగబట్టి రాబోయే దాడికోసం ఎదురుచూడసాగారు.

ఒకే ఒక్క తురుష్కుడు, మందిరం ద్వారం దగ్గర గుర్రం ఆపాడు. చుట్టూ చూశాడు.

అతడిపైకి బాణం ఎక్కుపెట్టి సైనికుడిని ఆపాడు శూరవర్మ.

'వీడొక్కడే పరిస్థితి గమనించటానికి వచ్చాడు. తమ దాడిగురించి ఊళ్ళో ఎవరికీ తెలియదని, అంతా ప్రశాంతంగా నిద్రిస్తున్నారని నిర్ధారణ చేసుకోటానికి వచ్చాడు. వీడినేమైనా చేస్తే మిగతావారు పారిపోతారు. దాడి చేయరు. కాబట్టి వీడి నేను చేయవద్దు. వీడిని

పోనిద్దాం. ఆ తరువాత తురుష్క తండా వస్తుంది. అప్పుడు గుడి గోడలపై నుండి దాడి ఆరంభమౌతుంది. మనం వెనుక నుండి చుట్టుముడతాం. దాంతో వారి పని అడకత్తెరలో పోకలా అవుతుంది. ఆ తరువాత భగవదేచ్ఛ ఎలా ఉంటే అలా జరుగుతుంది'. గుసగుసగా చెప్పాడు శూరవర్మ. శూరవర్మ మాట పూర్తయ్యేసరికి, చుట్టూ చూసిన ఆ తురుష్కుడు మళ్ళా గుర్రం ఎక్కాడు.

వేగంగా వచ్చిన దిశలోనే పరుగెత్తించాడు. చీకట్లో కలిసి పోయాడు. 'దాడికి సిద్ధంగా ఉండండి' కబురు పంపాడు శూరవర్మ అందరికీ.

✡✡✡

గుర్రపు డెక్కల చప్పుడు దూరం వెళ్ళిపోవటం గమనించిన చంద్రశేఖరుడు మాధవుడి వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

మాధవుడు 'నిశ్శబ్దం' అన్నట్టు సౌంజ్ఞ చేశాడు.

ఇంతలో... చీకటిలోని నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ పొలికేక వినిపించింది. కొన్నివేల సముద్రాల తరంగాలు తీరాన్ని తాకినట్టు అనిపించింది. వేగంగా పరుగెత్తుతూ వస్తూ గుర్రాల డెక్కల అదరుకి భూమి కంపించసాగింది.

చంద్రశేఖరుడు కత్తి ఎత్తి పట్టుకున్నాడు. అతడి నరనరాన రక్తం ఉత్తేజంగా ప్రవహించసాగింది.

పూజారి పెదవులు కదిలే వేగం ఎక్కువయింది.

గుర్రాల సమూహం దగ్గరగా వస్తూన్న కొద్దీ వాటి శబ్దతీవ్రత పెరగసాగింది.

✡✡✡

**సూర్య కిరణాలు ప్రచండ శక్తితో భూమిని తాకుతున్నాయి.** వాటి వేడికి భూమి కరిగిపోతున్నట్టు, దూరంగా కనిపిస్తున్న కొండలు, ద్రవీభవిస్తున్న భ్రమ కలుగుతోంది కళ్ళుమూసుకుని తెరిచాడు గంగాధర శర్మ.

కనబడని శత్రువు కోసం కళ్ళు చించుకుని చూడటం కఠినంగా ఉంది. ముఖ్యంగా మధ్యాహ్నపు సూర్యుడి వేడి మాడ్చేస్తూంటే, ఎప్పుడు వస్తాడో తెలియని శత్రువు కోసం ఎదురు చూపులు చూడటం అత్యంత దుర్భరంగా ఉంది. ఇది కాకుండా గంగాధర శర్మను బాధిస్తున్న అంశం మరొకటి ఉంది.

గ్రంథాలు చదువుతూ, ఆలోచిస్తూండటం గంగాధర శర్మ జీవితం. అలాకాకుండా గడిపే సమయమంతా వ్యర్థం అన్న భావన అతడి నరనరాన జీర్ణించుకు పోయింది. కత్తి యుద్ధం సాధన చేస్తూ గడిపే సమయంలో కూడా అతడు సాహిత్యం గురించి ఆలోచిస్తూంటాడు.

ఇలా ఏ పనీ చేయకుండా ఎదురు చూస్తూండటం భరించలేనంత బాధగా ఉంది. ఎంతో సమయాన్ని వ్యర్థం చేస్తున్నట్టుంది. నిర్వ్యాపారంగా కూర్చుని కాలం గడిపేస్తున్నట్టుంది.

కానీ, తమ బ్రతుకే ప్రమాదంలో పడే సందర్భం ఇది.

రకరకాల ఆలోచనలతో సతమతమవుతున్న గంగాధర శర్మ అలికిడి అవటంతో తిరిగి చూశాడు.

ఓ పాప అన్నం మూట మోసుకు వస్తోంది. ఆమెను కాపలాగా ప్రహరసింహుడు ఉన్నాడు.

అప్పుడు గమనించాడు గంగాధర శర్మ, తమ ఊరిలోని చిన్న పిల్లలందరూ, శత్రువును ఎదుర్కోవటం కోసం బండల మాటున ఎదురు చూస్తున్నా వారికి ఆహారం మూటలను అందిస్తున్నారు.

ప్రహర సింహుడిని చూసి పలకరింపుగా నవ్వాడు గంగాధర శర్మ.

'ఎంతసేపీ ఎదురు చూపులు?' అడిగాడు.

'ఇంతకు ముందరి యుద్ధాలకు ఇప్పుడు పోరాటాలకూ ఇదే పెద్ద తేడా?'

గంగాధర శర్మ ఆహారం తీసుకునే సమయంలో అతని వంతకు నిఘాపనిచేస్తూ చెప్పాడు ప్రహర సింహుడు.

గంగాధర శర్మ మధ్యాహ్నపూజ చేశాడు. ఆహారం స్వీకరించటం ఆరంభించాడు. అతడికి ఇది కొత్తగా ఉంది.

ఆహారం స్వీకరించటమన్నది ఒక యజ్ఞం లాంటిది. తాను సేవిస్తున్న ఈ ఆహారం తన శరీరంలోని విభిన్న అంశాలలో కొలువై ఉన్న దేవతలకు, రాక్షసులకు శక్తినిస్తుంది. ఆపై తాను చేసే పనులు, ఆలోచనల ప్రకారం ఎవరో ఒకరిది పై చేయి అవుతుంది. అందుకని ప్రశాంత చిత్తంతో, శుభ్రమైన ఆహారాన్ని సక్రమంగా సేవించాలి. ఆహారం పరబ్రహ్మ స్వరూపం.

ఇంతవరకూ అలాగే సాగింది. కానీ ప్రతిసారి, ఇలా ఆరుబయట, హడావిడిగా ఆహారాన్ని సేవించటం జరుగుతోంది. అదీ శుభ్రమైన రీతిలో, సక్రమమైన మనస్సుతో తయారు చేసిందా, అన్న ప్రశ్నలేదు. ఆహారం దొరికింది. తినటం. అంతే!

ఆహారం స్వీకరించటం పూర్తయ్యేవరకూ మౌనంగా ఉన్నాడు గంగాధర శర్మ ఆ తరువాత చెరువు దగ్గరకు వెళ్ళి శౌచ్య కార్యక్రమాలు పూర్తి చేసుకుని వచ్చాడు.

'ఏమిటీ తేడా?' అడిగాడు.

నవ్వాడు ప్రహరసింహుడు.

'నీ భోజన స్వీకారంతో వచ్చిన తేడానే యుద్ధాలలో వచ్చింది'

అయోమయంగా చూశాడు గంగాధర శర్మ.

'ఇంతకు ముందు భోజనానికి నిర్ణీత సమయం ఉండేది. పద్ధతి ఉండేది. భోజనానికి ముందు తరువాత నిర్దిష్ట కృత్యాలు చేయాల్సి ఉండేది. ఇవాళ్ళ అలాంటివేవీ లేవు. భోజనం ఎప్పుడు వస్తుందో తెలియదు. స్వీకారంలో పట్టింపులు లేవు.పద్ధతులు లేవు. దొరికింది, దొరికినప్పుడు తినటమే. యుద్ధాలు అలాగే తయారయ్యాయి.' గంగాధర శర్మకు అర్ధమవుతోంది.

'ఇంతకుముందు రాజులు యుద్ధానికి ముహూర్తాలు నిర్ణయించేవారు. ఎక్కడ యుద్ధం చేయాలో నిర్ణయించేవారు. సూర్యోదయంతో ఆరంభమైన యుద్ధం సూర్యాస్తమయంతో పూర్తయ్యేది. యుద్ధంలో నియమాలు పాటించేవారు. వెన్ను చూపిన వాడిని వేటాడేవారు కారు. శరణన్నవాడి శిరస్సుకు భద్రత కల్పించేవారు. పరాజితిడయినా పరాక్రమం ప్రదర్శించిన వాడిని గౌరవించేవారు.

ఇప్పుడలాంటివి లేవు. ఎవరు బడితే వారు ఎక్కడ బడితే అక్కడ, ఎలా పడితే అలా ఆత్మరక్షణకు సిద్ధంగా ఉండాల్సి వస్తోంది ఎప్పుడు దాడి, ఏ వైపు నుంచి వస్తుందో తెలియని పరిస్థితి ఇది.'

అర్థమయినట్టు తల ఊపాడు గంగాధర శర్మ.

ప్రహరసింహుడి మాటలవల్ల గంగాధర శర్మకు ఒక విషయం అర్థమయింది. తమ జీవన విధానం తిరుగురాని రూపంలో రూపాంతరం చెందబోతోంది. అతడికి ఓ సందర్భంలో గురువుగారు తురుష్కుల గురించి చెప్పిన మాటలు గుర్తుకువచ్చాయి.

'తురుష్కులు గాలి, నీరు లాంటి పాకృతిక శక్తుల లాంటివారు. అవి ఓటమిని ఒప్పుకోవు. నిరంతరం తమకు అడ్డుగా ఉన్న వాటిని తాకుతూనే ఉంటాయి. ఆ నిరంతర తాకిడిని తట్టుకుని ఏ శక్తి అయినా ఎంతకాలం నిలవగలదు? ఏదో ఓ బలహీనత కనిపిస్తుంది. ఆ బలహీనత ఆధారంగా ప్రాకృతిక శక్తులు విజయం సాధిస్తాయి. అంతేకానీ, ఓటమిని ఒప్పుకోవు. తమ ప్రయత్నం మానవు. ఎంత పెద్ద పడవకయినా చిన్న చిల్లు చాలు దాన్ని నీటి గర్భానికి పంపటానికి!

గురువుగారి మాటలే నిజమయితే, ఇప్పుడు తమ గ్రామంపై జరిగే దాడిలో తాము విజయం సాధిస్తే, కొన్నాళ్ళకి రెట్టించిన శక్తితో తురుష్క తండాలు తమపై పడతాయి తాము లొంగిపోయే వరకూ దాడులు చేస్తూంటాయి. ఓడిపోతే.. ఆ ఆలోచనే గంగాధర శర్మకు చేదుగా అనిపించింది.

ఎందుకో అతడికి విరక్తిగా అనిపించింది.

'ఎందుకిలాంటి పరీక్షలు పెడతాడు భగవంతుడు?'

కత్తి తీసుకుని తన నిర్ణీత స్థానంలో నుంచున్నాడు గంగాధర శర్మ.

తన ప్రశాంత శాంత జీవనం ఇవాల్టితో భగ్నమవుతున్నట్టా? కత్తి పట్టుకున్న ఈ చేయి మళ్ళీ కలం పడుతుందా? శాస్త్రాలను పఠించే ఈ కళ్ళు శత్రువు కోసం ఎదురు చూడటం ఎప్పుడు మానేస్తాయి?

ఎందుకో వెళుతూ వెళుతూ ప్రహర సింహుడు తన వైపు జాలిగా చూసినట్టు అనిపించింది గంగాధర శర్మకు. అయితే ఆ విషయం గురించి ఆలోచించాలనిపించలేదు గంగాధర శర్మకు. అతని దృష్టి దట్టమైన అడవిలోని చెట్లను చీల్చుకుని అవతలివైపుకు కేంద్రీకృతమై ఉంది.

ఎందుకంటే, ఎలాంటి జీవ సంచారం లేని ఆ చెట్ల నడుమ నుంచే శత్రువు మృత్యువులా విరుచుకు పడతాడు. తన గ్రామంపై, తన జీవన విధానంపై, తన ధర్మంపై!

✡ ✡ ✡

బయట కోలాహలం లోపలకు వినిపిస్తోంది.

హాహాకారాలు వినిపిస్తున్నాయి. కత్తులు ఖణేల్ ఖణేల్ మంటున్న శబ్దాలు మేఘాలు ఉరుముల్లా ధ్వనిస్తున్నాయి.

గర్భగుడిలో సిద్ధంగా ఉన్న చంద్రశేఖరుడికి బయట ఏం జరుగుతోందో తెలుసుకోవాలని ఆతృతగా ఉంది.

బయట సాగుతున్న సమరంలో పాల్గొనాలని ఉత్సాహంగా ఉంది. ఉద్విగ్నతతో, ఉత్తేజంతో అతని రక్తం పరవళ్ళు తొక్కుతోంది.

అతని చేతివేళ్ళు కత్తిని ఎంత గట్టిగా పట్టుకున్నాయంటే, రక్తం నాళాలలో ఒత్తిడికి లోనయి చేయి ఎర్రగా కనిపిస్తోంది. ఇంతలో హాహాకారాలు దగ్గర నుండే వినపడటం ఆరంభమయింది. పద ఘట్టనలు ధడధడా వినిపిస్తున్నాయి.

చంద్రశేఖరుడు, మాధవుడి వైపు చూశాడు.

మాధవుడు నిర్భావంగా తలుపువైపే చూస్తున్నాడు.

చంద్రశేఖరుడు పూజారి వైపు చూశాడు.

అతడి పెదవులు వేగంగా కదలుతున్నాయి. చేతిలో మాల మరింత వేగంతో కదులుతోంది.

అంత ఉద్విగ్నతలోనూ చంద్రశేఖరుడికి నవ్వు వచ్చింది.

తురుష్కులు గర్భగుడి తలుపు తోసుకు వచ్చినప్పుడు ఈ పూజారి ముఖం చూడాలని ఉంది చంద్రశేఖరుడికి.

అంతలో శబ్దాలు మరింత దగ్గరగా వినిపించసాగాయి.

చంద్రశేఖరుడు దృష్టిని ఆ వైపు కేంద్రీకరించాడు, కత్తిని సిద్ధంగా పట్టుకుని అంతలో అతడికి, తమ పరిస్థితిలోని వ్యర్థత్వం గ్రహింపుకు వచ్చింది. గర్భగుడి చిన్నగది.

ఆ గదిలో పారిపోవటానికి స్థలం లేదు ఉన్నది ఒకే ద్వారం. గదిలో ఉన్నది ముగ్గురు. దాన్లో పూజారి ఎందుకూ పనికి రానివాడు అంటే, నిజానికి ఆ గదిలో యుద్ధం చేయగలవారిద్దరు మాత్రమే.

కానీ గర్భగుడి తలుపు తోసుకుని వచ్చే శత్రుసైనికుల సంఖ్య అపరిమితం వారందరినీ తాము మట్టుపెట్టటం సాధ్యం కాదు.

అంటే, బయట కనక తమ వారు ఓడిపోయి, శత్రువులు గర్భగుడి ద్వారం పగలకొట్టారంటే అర్థం, తమకు చావు తప్ప మరో గత్యంతరం లేదు.

'మరణం' అన్న ఆలోచన రాగానే చంద్రశేఖరుడి శరీరం జలదరించింది. తననిలాంటి తప్పని సరి మరణం లాంటి పరిస్థితిలో ఎందుకుంచాడు శూరవర్మ? అంత కోపంగా ఉందా తనపై?

తనపై అంత కోపం కలగటానికి తానేం తప్పు చేశాడు?

తను చేసింది ఒకటే తప్పు, తాను వీరుడనని నిరూపించుకున్నాడు. అది శూరవర్మలో అసూయ కలుగచేసిందా?

అరుపులు, కేకలు, పరుగెత్తుతున్న శబ్దాలు, పడిపోతున్న ధ్వనులు దగ్గరవుతున్నాయి. చంద్రశేఖరుడు, మాధవుడివైపు చూశాడు.

మాధవుడు నిర్భావంగా నిలబడి ఉన్నాడు.

అంతలో చంద్రశేఖరుడికో ఆలోచన వచ్చింది.

తాను విగ్రహానికి కాపలాగా నిలబడ్డారు.

అంటే, లోపల శత్రువు యధేచ్ఛగా రాగలగటమే కాదు, ఒకేసారి అయిదారుగురు లోపలకు చొచ్చుకుని వచ్చేవరకూ తాము నిర్లిప్తంగా నుంచుని ఉంటారు? కానీ అంతమందితో తాము తలపడి గెలవగలటం సాధ్యం కాదు. కనీసం వారి దూకుడును అడ్డుకోవాలంటే తమలో ఒకడు తలుపు దగ్గరే నిలబడాలి...

శత్రువు లోపలకు అడుగు పెడుతూంటేనే ఖండించాలి. దాంతో, లోపలకు వచ్చి దూకుడు తగ్గుతుంది. ఒకరొకరే లోపలకు రావాల్సి ఉంటుంది. అప్పుడు తమ పని సులువవుతుంది.

కానీ ఇదీ గెలుపుకు దారి తీయదు. పరాజయాన్ని కాస్త ఆలస్యం చేస్తుంది. కానీ ఇది తమకు ఎదురు నిలిచి పోరాడే వీలునే కాదు, తప్పించుకునే వీలునూ కనిపిస్తుంది. చంద్రశేఖరుడి కళ్ళు మెరిశాయి.

నిశ్శబ్దంగా తలుపుకు దగ్గరగా జరిగాడు.

కదులుతున్న చంద్రశేఖరుడిని నిర్భావంగా చూస్తూ నిలుచున్నాడు మాధవుడు

✡✡✡

నిస్సత్తువుగా అనిపిస్తోంది శూరవర్మకు.

తమ శౌర్యమంతా వ్యర్థమవుతోంది. తమ వీరత్వం వృధా అవుతోంది.

అలలు అలలుగా శత్రువు మందిరాన్ని తాకుతూనే ఉన్నాడు.

అడుగడుగునా శత్రువును ఎదుర్కోవాలన్న శూరవర్మ పథకం ఆరంభంలోనే చూసి కొట్టింది.

పెద్ద సంఖ్యలో శత్రువు గుడిని చేరగానే, ముందు నుండి కొందరు, వెనుక నుండి కొందరు శత్రువుపై దాడి చేశారు.

అంతలో ఓ పెద్ద అలలా శత్రుసేన వెనుక నుంచి వచ్చి తాకింది. దాంతో, శత్రువును అడకత్తెరలో ఇరికించాలనుకున్న వారు ఇరుక్కున్నారు. వేటగాడు వేట అయ్యాడు. అయినా మందిరాన్ని రక్షించాలని ప్రాణాలు పణంగా పెట్టి పోరాడుతున్నారు. కానీ, శత్రువు సంఖ్య బలం ముందు తమ భుజబలం ఎందుకూ పనికిరాకుండా పోతోంది.

పదిమందిని కత్తికి ఎరచేసి, ఒక్క క్షణం ఆగితే పదకొండోవాడు ముందుకు దూకుతున్నాడు. కత్తితో ఖండించి ముందుకు సాగుతున్నాడు.

ఓ వైపు శత్రువును ఎదుర్కుంటున్నా శూరవర్మ మనసులో రకరకాల ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి.

మందిర ప్రధాన ద్వారం ముక్కలయింది.

పడవకు చిన్న రంధ్రం ఏర్పడగానే నీరు వేగంగా లోపలకు దూకుతూ, చిన్న రంధ్రాన్ని పెద్దది చేసి పడవ మునకకు కారణమయినట్టు తురుష్కులు పెద్దగా కేకలు పెడుతూ మందిరంలోకి దూసుకు వెళుతున్నారు.

కొందరు తురుష్కులు గోడలపై ఉన్న శిల్పాలను అదేపనిగా కత్తులతో మోదుతూ వాటిని విరగ్గొట్టి ఆనందిస్తున్నారు.

దేవతా విగ్రహాలు ముక్కలు ముక్కలై పడుతున్నాయి. కాళ్ళు వేళ్ళాడి క్రిందపడుతున్నాయి. చేతులు చేవ చచ్చి ఛిద్రమవుతున్నాయి.

ఇది చూస్తూ అనేకులు ప్రతిఘటన మానేసి భయవిహ్వలై పారిపోవాలని ప్రయత్నిస్తున్నారు. వారిని వధించటమో, పట్టుకుని బంధించటమో చేస్తున్నారు తురుష్క సైనికులు.

కొందరు ఊరివైపు గుర్రాలను దౌడు తీయించారు.

తురుష్కులు మందిరంపై దాడి చేస్తున్నారన్న వార్త తెలియగానే, గ్రామంలోని ప్రధానులంతా ప్రాణాలు అరచేత పట్టుకుని అడవులల్లోకి పారిపోయారు. ఊళ్ళో వృద్ధులు, చేతకానివారు మిగిలి ఉన్నారు. కసితీరా వారిని హింసించి వధించి, ఇళ్ళల్లో ఉన్న విలువైన వస్తువులను దోచుకుంటున్నారు. అంతటితో ఆగక ఇళ్ళకు నిప్పు పెడుతున్నారు.

ఆ నిప్పులు నింగికెగిసి, స్వర్ణమందిరం గోడలపై చిత్రంగా ప్రతిఫలిస్తోంది. ఆ వెలుతురు, నీడలలో తురుష్కులు రాక్షసుల్లా మరింత భయంకరంగా కనిపిస్తున్నారు. జరుగుతున్న మారణకాండ మరింత ఘోరంగా కనిపిస్తోంది. తురుష్క సైనికులు గుడిలోపలకు ప్రవేశించటం చూసిన శూరవర్మకు నిస్సత్తువగా అనిపించింది.

లోపల ఉన్న సైనికులు తురుష్కులకు ప్రతిఘటన ఇవ్వటం తెలుస్తోంది. వారికి సహాయంగా వెళ్ళాలని ఉన్నా శూరవర్మ కదలలేక పోతున్నాడు. ఒక తురుష్కుడిని చంపితే, అతని స్థానాన్ని పదిమంది ఆక్రమిస్తున్నారు. ఎంతగా శూరవర్మ పోరాడుతూంటే, అంతగా తురుష్కుల దృష్టిని అతడు ఆకర్షిస్తున్నాడు. తేనెటీగల్లా వారు అతడిపై ముసురుకుంటున్నారు. అంతలో అతడికి ఓ ఆలోచన హఠాత్తుగా వచ్చింది.

గర్భగుడిలో చంద్రశేఖరుడు, మాధవుడు ఇద్దరే ఉన్నారు.

ఎంత పొరపాటు చేశాడు తాను!

చంద్రశేఖరుడిని భద్రంగా ఉంచాలన్న ఆత్రంలో అతడికి తిన్నగా మృత్యువు నోటిదగ్గర నిలిపాడు.

యుద్ధంలో శత్రువు గర్భగుడి వరకూ చేరడని ఎలా అనుకున్నాడు తాను?

తనలో చెలరేగుతున్న ఉద్విగ్నతను అదపులో పెట్టుకుని యుద్ధం వైపు దృష్టి నిలిపాడు శూరవర్మ. కానీ, అతడి మనసులో చంద్రశేఖరుడు మొదలుతూనే ఉన్నాడు.

✡✡✡

దూరంగా చెట్లలో కదలిక కనిపించింది.

గంగాధరుడి రోమాలు నిక్కపొడుచుకున్నాయి. ఆ వైపు కళ్ళు చిట్లించి చుశాడు. అడవిలో, చెట్ల చాటున ఏదో కదలతోంది.

ఊపిరి బిగబట్టాడు గంగాధరుడు.

అంతలో ఏదో మెరిసింది.

ఆ వైపు చూశాడు.

ఇంతలో మరో వైపు కదలిక కనిపించింది

ఎటు చూడాలో తెలియటం లేదు.

హఠాత్తుగా అడివి జాగృతమైనట్టు అనిపిస్తోంది. అడవిలోని ప్రతిచెట్టు, ప్రతి ఆకు, ప్రతి అణువు ఏదో దుష్ట శక్తితో చైతన్యవంతమై కదులుతున్నట్టు అనిపిస్తోంది.

తన వెనుక ఉన్న పిల్లవాడి వైపు తిరిగాడు గంగాధర శర్మ.

'అందరినీ సిద్ధంగా ఉండమన్న కబురు అందించు.' నోరెండిపోతూండగా చెప్పాడు.

ఆ పిల్లవాడు రివ్వున పరుగెత్తాడు.

తల తిప్పి మళ్ళీ అడవి వైపు చూశాడు.

చిత్రంగా అడవి మళ్ళీ చైతన్యం లేనట్టు నిశ్చలంగా ఉంది.

గాలికి ఆకులు కదులుతున్నాయి. అడవిలో సుళ్ళు తిరుగుతూ గాలి చేస్తున్న శబ్దం తప్ప మరో శబ్దం లేదు.

గంగాధర శర్మ ఒళ్ళు జలదరించింది.

శత్రువు మనిషా? దయ్యమా?

ఒక్క క్షణం ఎదురుగా ఉన్న భ్రమ కలిగించి, మరుక్షణం అదృశ్యమై పోవటం మానవ మాత్రులకు సాధ్యమా? ఇది సంభవమా?

ఇలాంటి ఇంద్రజాలం తెలిసిన శత్రువుతో, సామాన్యుడు, తాను ఎలా పోరాడగలడు? భయంతో గంగాధర శర్మ శరీరం కంపిస్తోంది.

చెమట వల్ల కత్తిపై పట్టు తప్పుతోంది.

తనపై తాను అదుపు తెచ్చుకునేందుకు భగవత్ప్రార్థన ప్రారంభించాడు.

కాసేపటికి అతడి శరీరం అదుపులోకి వచ్చింది. మనసు కుదుట పడింది. ఈ ప్రపంచం సర్వం భగవంతుడి ఆజ్ఞ ప్రకారం నడుస్తుంది. ఇప్పుడు తానిలా కత్తి పట్టుకుని, మృత్యువుతో చెలగాటమాడటం కూడా భగవంతుడి ఇష్టం ప్రకారం జరుగుతున్నదే. తన భవిష్యత్తు నిర్ణయం చేశాడు భగవంతుడు. ఇక తనకి ఎందుకు భయం? తనకెందుకు ఉద్విగ్నత? ప్రాణం పోతుందనా భయం?

ప్రతివాడిదీ ఎప్పుడో అప్పుడు పోవాల్సింది. ఆ పోవాల్సిన ప్రానం ఎలా పోతుందో కూడా భగవంతుడి ఇష్టానుసారం జరుగుతుంది. ఇందులో తనకు భయం ఎందుకు? ఉద్విగ్నత ఎందుకు?

ఇక్కడ తన ప్రమేయం కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వహించటం వరకే. ఆ తరువాత ఏం జరిగినా, ఎలా జరిగినా భగవదేచ్ఛ.

ఆ భావన రావటంతోటే గంగాధర శర్మలో ఉద్విగ్నత అదృశ్యమయింది. తెలియని ఉత్సాహం ప్రవేశించింది. శరీరం తేలికయింది. ఏదో అలివికాని శక్తితో అతని అణువణువూ ఎగిసిపడుతోంది.

భగవద్భావన వ్యక్తికి బాలహీనతగా మారుతుందా, అతడిని ఎదురులేని శక్తిగా నిలుపుతుందా అన్నది వ్యక్తి వ్యక్తిత్వంపై ఆధారపడి ఉంటుంది. ఏ సమాజమైతే భగవద్భావనను శక్తిగా మలుచుకుంటుందో ఆ సమాజం ఉచ్చస్థాయికి ఎదుగుతుంది. ఏ సమాజంలో భగవంతుడు బలహీనతగా మారతాడో, ఆ సమాజం దిగజారుతుంది. దైవత్వ భావన అభాసుపాలవుతుంది. మనిషిని దైవం స్థాయికి ఎదిగింపచేయాల్సి దైవ భావన మనిషిని రాక్షసుడిని చేస్తుంది. సమాజాన్ని అల్లకల్లోలం చేస్తుంది.

'జై శివశంకర్. శంభోశంకర. హరహరమహదేవ' తనలో తాను భగవన్నామస్మరణం ఆరంభించాడు గంగాధర శర్మ.

ఎందుకో సర్వప్రకృతి భగవన్నామ స్మరణకు లయిస్తున్నట్టు అనిపిస్తోంది. వీచేగాలి 'శివశివ' అంటున్నట్టుంది.

రాళ్ళ సందుల్లోంచి దూకే గాలి 'శంభో శంకర' అంటున్నట్టుంది.

తనలో తనకే తెలియని ఒక మహత్తరమైన ఆవేశానికి గురవుతున్నాడు గంగాధర శర్మ.

భగవంతుడి నామ జపం వ్యక్తిని సర్వం మరపింపచేసి ఉన్నత ఆధ్యాత్మిక శిఖరాలను అధిరోహింపచేస్తుంది. అదే భగవంతుడి నామజపం వ్యక్తి తనని తాను మరచిపోయేటంత ఆవేశం కలిగింపచేస్తుంది. అలాంటి ఆవేశాగ్నితో దగ్ధమై పోసాగాడు గంగాధర శర్మ.

✡ ✡ ✡

బయట శబ్దాలు మరీ దగ్గరగా వినిపిస్తున్నాయి. ఆర్తనాదాలు భీకరంగా వినిపిస్తున్నాయి. వీటికి తోడుగా, పెద్ద పెద్ద శబ్దాలు, ఎవరో బలమైన దానితో గోడలను మోదుతున్నట్టు వినిపిస్తున్నాయి.

బయట జరుగుతున్న గోలను వింటూ ఏం జరుగుతోందో ఊహిస్తున్న చంద్రశేఖరుడు గుడిలోని విగ్రహం వైపు చూశాడు.

పూజారి కళ్ళు మూసుకుని మంత్రాలు బిగ్గరగా ఉన్మత్తుడిలా చదువుతున్నాడు. తన మంత్రాల శబ్దంతో బయట నుంచి వినిపిస్తున్న హోరును ముంచెత్తి వేయాలన్నట్టుంది అతని ప్రవర్తన.

మాధవుడు నిర్భావంగా నిలుచుని ఉన్నాడు. అతడిని చూస్తుంటే, చావు తప్పదని తెలిసి, వధ్యశిల దగ్గర తన వంతు రావటం కోసం ఎదురుచూస్తున్న మనిషి గుర్తుకు వస్తున్నాడు.

ఇంతలో తలుపుపై ఎవరో బాదేరు.

తలుపు తెరవాలో, వద్దో తెలియదు. ఎవరు గెలుస్తున్నారో తెలియదు. తలుపు తెరిస్తే, ప్రళయజలంలా శత్రుసేనలు లోపలకు దూకుతాయేమో!

హఠాత్తుగా చంద్రశేఖరుడికి తనకు మరణ సమయం ఆసన్నమైందని అర్ధమైంది!

మరణం!

ఆ ఆలోచననే హఠాత్తుగా అతడి వెన్నునుంచి చలిభావనను శరీరమంతా పాకించింది. ఒళ్ళంతా చల్లబడిపోయినట్టయింది.

కత్తి పట్టుకున్న చేతులు రాళ్ళలా అనిపించాయి.

ఎలా ఉంటుంది మరణం? ఏమౌతుంది మరణిస్తే?

తనకింకా బోలెడంత జీవితం ముందుంది. అనుభవించాల్సింది ఎంతో ఉంది. ఇంకా తన జీవితం ఆరంభమే కాలేదు, అప్పుడే మరణమా?

'ధన్' పెద్ద శబ్దం అయింది.

మందిరం గోడ అదిరింది.

అప్పుడే అర్ధమయింది చంద్రశేఖరుడికి బయట ఏమవుతుందో...

ఇప్పుడు బయట యుద్ధం జరగటం లేదు. యుద్ధం అయిపోయింది యుద్ధంలో శత్రువును ఓడించిన సైనికులు ఇప్పుడు, మందిరం గోడలపై ఉన్న మణిమాణిక్యాలను తొలుచుకుంటున్నారు. బంగారం గోడలను విరిచి తీసుకుంటున్నారు.

ఇక శత్రువు తమ దగ్గరకు రావటానికి ఎక్కువ సమయం లేదు.

మొత్తం తాము మిగిలింది ముగ్గురు.

ముగ్గురిలో పూజారి పనికిరాడు. మాధవుడు, తాను ఎంతమందిని ఎదుర్కోగలరు?

చంద్రశేఖరుడు ఓ నిర్ణయానికి వచ్చాడు.

తాను బ్రతకాలి. ఎలాగయినా బ్రతకాలి.

తుఫాను గాలికి ఎదురు నిలిచినవి విరిగిపోతాయి. వంగిన గడ్డిపోచ, గాలి తగ్గగానే మళ్ళీ తలెత్తుతుంది.

తన జీవితం అమూల్యమైనది. దాన్ని 'విజయమో, వీరస్వర్గమో' అంటూ ప్రాణాలు పోగొట్టుకోవటం వల్ల స్వర్గం దక్కటం అటుంచి, ఈ జీవితం పోతుంది. ఒక నిర్ణయానికి వచ్చాడు చంద్రశేఖరుడు.

మాధవుడి వైపు చూశాడు. అతడు నిర్భావంగా తలుపువైపే చూస్తున్నాడు. దడదడమంటోంది తలుపు.

'దర్వాజా ఖోలో..' కర్కశంగా వినిపించింది స్వరం.

*****

గంగాధర శర్మ కళ్ళు గుంజుతున్నాయి అడవిలోకి తీక్షణంగా చూసి చూసి ఒక్కసారి కదలిక కనిపించింది. ఆ తరువాత ఏమీలేదు. ఏదో కావటం కోసం ఎదురు చూడటం దుర్భరంగా ఉంది.

ఇంతలో పద్మిని తన వైపు వస్తూ కనిపించింది. ఈమె ఎందుకు వస్తోంది?

ఊళ్ళో వాళ్ళ రక్షణ కోసం ఉండాల్సిన ఆమె ఇటువస్తోందెందుకు?

ప్రశ్నార్థకంగా చూశాడు ఆమెవైపు.

'ఎలా ఉంది పరిస్థితి?' అడిగింది పద్మిని.

'ఇలా ఉంది. ఏమీ లేదు.' నిరుత్సాహంగా చెప్పాడు గంగాధర శర్మ.

'ఏదో కదలిక కనిపించిందన్నావట?'

'అవును. కానీ ఇప్పుడు ఆలోచిస్తే భ్రమ అనిపిస్తోంది' అన్నాడు.

ఏదో ఆలోచిస్తూ నిలబడింది పద్మిని.

'అడవి చెట్ల నీడలో ఎవరో ఉన్నట్టు మీకు అనిపిస్తోందా?' మెల్లిగా అడిగింది. ఒక్క క్షణం ఆమె వైపు పరీక్షగా చూశాడు గంగాధర శర్మ. చివరికి నెమ్మదిగా చెప్పాడు.

'నా మనసుకయితే, అడవిలో అణువణువూ, ఆకులకూ శత్రువే అయినట్టు అనిపిస్తోంది. కానీ.. ఎవరూ ప్రత్యక్షంగా కనబడటం లేదు.'

తల పంకించింది పద్మిని.

'శత్రువు మాయగాడు. ఇక్కడ మీరు పొంచి ఉన్నట్టు పసికట్టి ఉంటాడు.'

'కానీ శత్రువు వస్తున్నదే దాడికి కదా? మేం ఉంటే నష్టం ఏమిటి? మాతో పోరాడవచ్చుకదా?'

'యుద్ధం అంటే కళ్ళు మూసుకుని కత్తి పట్టుకుని రంగంలోకి దూకి కనబడినవాడిని చంపటం, లేకపోతే చావటం కాదు. యుద్ధం కూడా ఒక సృజనాత్మక ప్రక్రియ. '

ఆశ్చర్యంగా చూశాడు గంగాధర శర్మ ఆమె వైపు.

'యుద్ధానికి వ్యూహం ఉంటుంది. ప్రణాళిక ఉంటుంది. తనూ తక్కువ నష్టంతో ఎక్కువ లాభం పొందే పథకాలు వేయటం ఉంటుంది. ముఖ్యంగా ప్రత్యర్థి మనస్తత్వాన్ని అంచనా వేసి, అతని బలహీనతలను పసికట్టి దాని ఆధారంగా విజయం సాధించటంలో అసలు నైపుణ్యం ఉంటుంది. అంతేతప్ప, చంపటం, చావటం యుద్ధం కాదు.'

'మరి మన ప్రణాళిక ఏమిటి?'

నవ్వింది. 'మనం యుద్ధం చేయటం లేదు'

'అదేమిటి?'

'మనం చావుకోసం ఎదురు చూస్తున్నాం. మన ప్రాణాల్ని కూడా రక్షించుకోవటం రాదు మనకు' అంది.

తన చేతిలో కత్తివైపు చూశాడు గంగాధరశర్మ. అది చూసిన నవ్వింది పద్మిని. 'మా తండ్రిగారు అంటూండేవారు. ఆద్యంతాలు లేనిది మనధర్మం. కానీ జీవన విధానం సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా మారుతూంటుంది. దానికి తగ్గట్టు. ధర్మం గురించిన అవగాహనలోనూ, ఆలోచనల్లోనూ మార్పులొస్తాయి. ధర్మం మౌలిక స్వరూపం మారకున్నా, స్థూలంగా మారుతుంది. రామాయణం, భారతం భారతీయ ధర్మానికే అయినా, జీవన విధానం, పరిస్థితులు, ధర్మాన్ని అర్థం చేసుకోవటంలో చాలా తేడాఉంది. అదంతే'

'అంతేకదా, నది జన్మస్థలంలో ఉన్నట్టే సమాజాన్ని చేరేవరకూ ఉండదు కదా! అది ప్రవహించే ప్రాంతం. కలిసే ఉపనదుల వంటి అనేక విషయాలు దాని లక్షణాన్ని నిర్ణయిస్తాయి.'

'ఒకప్పుడు మనం వీరులం. ఇప్పుడూ వీరులమే. అప్పటికే ఇప్పటికే మన వీరత్వంలో తేడా వచ్చింది. ఎక్కడో మన ప్రయాణంలో మనలో ఆత్మరక్షణకన్నా ఆత్మత్యాగానికే ప్రాధాన్యం వచ్చింది. ఆత్మనూన్యతా భావం ప్రవేశించింది. ఎదుటి వారిని గౌరవించటం, వారిని మనకన్నా అధికులుగా భావించి, మనల్ని మనం చులకన చేసుకోవటంగా మారిపోయింది. ఇది మొత్తం మన సమాజ మనస్తత్వంలోనే పరాజయ భావనను పెద్దపీట వేసింది.'

ఆమె మాటలు వింటూ ఆలోచిస్తున్నాడు గంగాధర శర్మ.

'కానీ ఇప్పటికీ మన రాజులు తురుష్కులతో పోరాడుతున్నారు. లొంగిపోలేదు.' ఇవాళ్ళ కాకుంటే రేపయినా లొంగుతారు ఎందుకంటే, మనలో ఐకమత్యం తక్కువ. అహంకారం ఎక్కువ. తాత్కాలిక ఆవేశాలకిచ్చిన ప్రాధాన్యం, శాశ్వత లాభంపై ఉండటం లేదు. అందుకే, గంపెడంత దేశంలోకి గుప్పెడంత మంది చొరబడి, రాజ్యాలను ఆక్రమిస్తూ, తమ సంఖ్య పెంచుకుంటూ వరదలా మనల్ని ముంచెత్త గలుగుతున్నారు. మనం ఒకే రకంగా, ఒకే కోణంలో ఆలోచిస్తున్నాం. మన గురించి మన అభిప్రాయం మారాలి. మనసుతో ఒకటై..'

ఆమె మాటలు పూర్తి కాలేదు.. ఊళ్ళోంచి ఆర్తనాదాలు వినిపించాయి. గంగాధర శర్మ పద్మిని వైపు చూశాడు.

పద్మిని విరక్తిగా నవ్వి, లేచి నిలబడింది. అంతలో ఓ పిల్లవాడు పరుగెత్తుకుంటూ వచ్చాడు.

'తురుష్కులొచ్చేశారు. వచ్చేశారు' ఆయాసంగా అరుస్తున్నాడు. మాట స్పష్టంగా లేదు. కళ్ళల్లో పిచ్చి చూపు ఉంది. చేతులు ఊపుతూ, అరుస్తూ పడిపోయాడు. ఒక్కసారిగా, రాళ్ళ చాటున మగ్గి ఉన్న వారంతా బయటకు వచ్చారు. ఊరివైపు పరుగెత్తసాగారు.

పరుగెత్తబోయిన గంగాధరశర్మ. పద్మిని వైపు చూసి ఆగిపోయాడు.

'నేను ఊరికి వచ్చినప్పటి నుంచీ చెపుతున్నాను. ఏదో ఒక రోజు తురుష్కులు మన ఊర్పై వచ్చి పడతారని. ఎవ్వరూ నా మాట వినలేదు. నా హెచ్చరికను పట్టించుకోలేదు. ఇప్పుడు హఠాత్తుగా ఆయుధాలు పట్టుకుని తమని తాము రక్షించుకోగలగటం ఎవరికయినా సాధ్యమా? ఇంత ఆద్యంతాలు లేని ధర్మానుయాయులయినా ఇలాంటి యుద్ధంలో గెలవగలమా?'

ఆమె మాటలు పూర్తి అవుతూండగా, ఆమె గంగాధర శర్మవైపు చూసింది. అతని చూపులు గడ్డకట్టుకు పోయినట్టు అడవి వైపు ఉన్నాయి.

ఆమె తనవైపు చూడగానే మౌనంగా అడవి వైపు వేలు చూపించాడు. ఆ వైపు చూసింది.

అడవిలో చెట్ల చాటు నుంచి వెలుపలకు వచ్చి, కేకలు పెడుతూ, గుర్రాల మీద కొందరు, పరుగెత్తుతూ కొందరు, కత్తులు ఊపుతూ వేగంగా తమ వైపే వస్తున్నారు.

నవ్వింది పద్మిని, కత్తి ఝళిపిస్తూ

'అదీ సృజనాత్మక యుద్ధం అంటే వారంతా చెట్ల చాటునే ఉన్నారు. కొందరు మాత్రం వేరే దార్లో రహస్యంగా ఊళ్ళో ప్రవేశించారు. అది చూసి, మనవాళ్ళు తమ స్థానాలు వదలి ఊళ్ళోకి పరుగెత్తారు. ఇప్పుడు అసలు సైన్యం వస్తోంది. ఆ సైన్యం నుంచి ఊరిని కాపాడటానికి నువ్వు, నేను మిగిలాం' అంది.

కత్తి ఎత్తి పట్టుకుని సిద్ధంగా నిలబడింది.

ఏం చేయాలో తెలియనట్టి అయోమయంగా నిలుచుండిపోయాడు గంగాధరశర్మ.

అన్నింటినీ తనలో కలిపేసుకోవాలన్న ఆత్రంతో ఎగిసిపడూతూ, దూకుతూ వస్తున్న మహా అలలా తురుష్కులు పరిగెత్తుకు వస్తున్నారు.

మాధవుడి వైపు చూశాడు చంద్రశేఖరుడు.

మాధవుడు నిర్భావంగా నిలుచున్నట్టున్నాడు. కానీ అతని పెదవులు నిశ్శబ్దంగా కదలుతున్నాయి.

తలుపు మీద బాదుడు పెరిగింది.

గోడలను మోదుతున్న బలమైన వస్తువుతో తలుపును తాకుతున్నారు.

బలమైన తాకిడికి తలుపు ఊగుతోంది.

చంద్రశేఖరుడు గర్భగుడిని పరిశీలనగా చూశాడు.

నేలతో సహా అణువణువూ రత్నాలు తాపడం చేసి ఉన్నాయి. శివుడి మూడో కన్ను ఎర్రగా వజ్రాలతో ధగధగలాడుతోంది.

శివలింగంలో సహస్ర లింగాలున్నాయి. ఒకో లింగం వజ్రంతో చేసింది. గోడలు, పైకప్పులు మణి మరకత మాణిక్యాలతో నిండి ఉన్నాయి.

ఇన్ని అలంకరణలు చేశారు. ఇంత భక్తితో ధ్యానిస్తున్నారు. ఈ కదలని రాయికోసం ప్రాణాలు అర్పిస్తున్నారు.

ఎందుకోసం?

తలుపు ఊగటం వేగవంతమయింది.

ఇంకా ఎంతోసేపు ఆగదు తలుపు.

గబగబా తన శరీరంపై తాను హిందువు అని గుర్తించే గుర్తులను తుడిపేయటం ఆరంభించాడు చంద్రశేఖరుడు.

నుదుటిపై ఉన్న విభూతిని తుడిపేశాడు. చేతికి ఉన్న కంకణం విప్పేశాడు. వేకికి ఉన్న ఉంగరాలు తీసేశాడు. జంధ్యం తీసేశాడు.

కత్తి పట్టుకుని సిద్ధంగా నుంచున్నాడు.

చంద్రశేఖరుడి చర్యలను గమనించినా మాధవుడు గమనించనట్టే ఉన్నాడు.

పూజారి ఇవేవీ గమనించే స్థితిలో లేడు.

భళ్ళున తలుపు విరిగింది.

*****

'నన్ను ప్రాణాలతో తురుష్కులకు చిక్కనివ్వను' పక్కనే ఉన్న గంగాధర శర్మతో అంది పద్మిని.

పద్మినిలానే తానూ సిద్ధంగా నుంచున్నాడు గంగాధర శర్మ.

ముంచెత్తే అలలాగా వచ్చేస్తున్నారు తురుష్కులు. వారివల్ల లేస్తున్న ధూళి ఆకాశానికి ఎగురుతోంది.

ఇంతలో ప్రహరసింహుడు వచ్చి పద్మినికి మరోవైపు నిలబడ్డాడు.

కత్తులు ఎత్తి పట్టుకుని ముగ్గురూ, తురుష్కుల తాకిడిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా నుంచున్నారు.

*****

దూరం నుంచి అంతా చూస్తున్న శూరవర్మ కంటనీరు కదలింది. కాస్సేపటి క్రితం బంగారంతో, పొదిగిన రత్నాలతో ధగధగలాడిన మందిరం ఇప్పుడు అస్థిపంజరంలా ఉంది. ప్రాణం లేని శరీరంలా ఉంది.

ఇంకా సైనికులు గోడల అణువణువూ వెతుకుతున్నారు.

ఎక్కడ ఏ విలువైనది కనిపించినా దాన్ని నిర్దాక్షిణ్యంగా పగలుగొడుతున్నారు. అది అందమైన స్త్రీ శిల్పం కావచ్చు, ప్రశాంతంగా ఆశీర్వదిస్తున్న దైవ శిల్పం కావచ్చు. అందంగా చెక్కిన లతలు, ఇతర చిత్రపటాలు కావచ్చు. వారి దృష్టి, డేగ దృష్టి ఆహారం పైనే ఉండేట్టు, విలువైన వాటిపైనే ఉంది.

అంతటితో ఆగటం లేదువారు. కసిగా గుడిని కుళ్ళబొడుస్తున్నారు. అది దేనిమీదకసో, ఎందుకని అంతకసో అర్థం కావటం లేదు.

దేన్నో సమూలంగా పెకిలించి వేయాలన్న కసి అది. నామరూపాలు లేకుండా చేయాలన్న కసి అది. అసలు తమను కాక మరొకరికి జీవించే హక్కులేవీలేదన్న విశ్వాసంతో, వాడు జీవించి ఉన్నందుకు వాడిని అంతం చేయాలన్న కసి అది.

పెద్ద శబ్దంతో ధ్వజ స్థంభాన్ని విరిచేశారు.

అది క్రింద పడుతూనే, ఈగలు మూగినట్టు సైనికులు దాని చుట్టూ మూగారు. దాన్ని ముక్కలు ముక్కలుగా విరిచేస్తున్నారు.

తననెవరూ పట్టించుకునే స్థితిలో లేరని నిర్ధారించుకున్న శూరవర్మ తనతో మిగిలిన అయిదారు గురిని తీసుకుని గుడి శిధిలాల దగ్గరకు వెళ్ళాడు. వాళ్ళంతా తమ హిందూ గుర్తింపు చిహ్నాలు వదిలివేశారు. చూస్తే వారు మతం మారి ఎక్కువ కాలం అవలేదని ఎవరయినా అనుకునేట్టున్నారు వారు. చకచకా గుడిలోపలకు అడుగు పెట్టారు.

లోపల కనిపిస్తున్న దృశ్యం వారికంట నీరు తెప్పించింది.

గుడి ఆవరణ అంతా ఎవరో రాక్షసులు కదం తొక్కుతున్నట్టుంది. వాళ్ళకి పవిత్రత, గౌరవం అన్న పదాలకు అర్థం తెలిసినట్టులేదు అనుకున్నాడు శూరవర్మ. కొందరు గోడలను విరగ్గొడుతున్నారు. ఇంకొందరు గోడలపైని విగ్రహాలను విరగ్గొడుతున్నారు.

అంతలో శూరవర్మ దృష్టి మరోవైపు మళ్ళింది.

వారి మతపెద్ద ఓ చోట నిలుచుని ఆదేశాలిస్తున్నాడు. కొందరు పట్టుబడ్డ హిందువుల్లా ఉన్నారు. వారు విరిగిన ఇటుకలను, రాళ్ళను మోస్తున్నారు. మౌల్వీ నిలబడి ఆ శిధిలాలతో వారితో తనకంటూ తాత్కాలికంగా వసతి నిర్మింపచేస్తున్నాడు.

ఎంతకసి! ఎంత అహంకారం! తమ గెలుపు సంపూర్ణం కావాలని, తమ ఆధిక్యాన్ని సంపూర్ణంగా ప్రదర్శించాలని ఎంత ఆత్రం!

ఇంతలో పెద్ద శబ్దంతో గర్భగుడి తలుపు విరిగింది. పెద్ద కేకలు వినిపించాయి.

తన తోటి వారికి సైగ చేరాడు శూరవర్మ.

వారూ ఆ వైపు కదిలారు.

✡ ✡ ✡

**దాదాపుగా యాభైమంది దాకా ఉన్నారు** తురుష్కులు. కేకలు పెడుతూ, గుర్రాలను కాళ్ళతో తంతూ, కత్తులు తిప్పుతూ వేగంగా వస్తున్నారు.

గంగాధర శర్మకు ప్రపంచమంతా అదృశ్యమైపోయింది. అన్ని శబ్దాలు అణగిపోయాయి. అతడి ప్రపంచం మొత్తం పరుగెత్తి వస్తున్న తురుష్కులయ్యారు. అతడి చెవులలో వారి కేకలు ప్రతిధ్వనిస్తున్నాయి.

ఇప్పుడతనికి తన పక్కన పద్మిని ఉందన్న ఆలోచనలేదు. తాము ముగ్గురమే అన్న ఆలోచనలేదు.

ఎందుకో ఎపుడూ అనిపించనంత ప్రశాంతంగా ఉంది. ఎలాంటి ఆందోళన కలగటం లేదు.

కత్తి స్థిరంగా పట్టుకున్నాడు.

తురుష్కులు దగ్గరకు వచ్చేస్తున్నారు. వాళ్ళ ముఖాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పెరిగిన గడ్డం, మీసాల వల్ల అదో రకమైన ఉన్మాదం, క్రౌర్యం వాళ్ళ ముఖాలలో స్పష్టంగా కనిపిస్తోంది.

హఠాత్తుగా గంగాధర శర్మకు అనిపించింది. ***ప్రపంచంలో మనుషులు, రాక్షసులు, దేవతలు అంటూ వేర్వేరుగా ఉండరు. అందరూ ఒకటే. ఒకటే మనిషిలో మంచి ఉంటుంది. అది దైవత్వం. చెడు ఉంటుంది. అది రాక్షసత్వం.***

ఇప్పుడు తమని చంపటానికి పరుగిడుతూ వస్తున్న ఈ తురుష్కులకూ కుటుంబాలున్నాయి. తల్లీ తండ్రి ఉంటారు. భార్యా, పిల్లలుంటారు. వారిపై ప్రేమ ఉంటుంది. తమని హింసించి చంపి, ఆనందించే వీరు తమవారు మరణిస్తే శోకిస్తారు. కన్నీరు మున్నీరుగా విలిపిస్తారు. కానీ ఇప్పుడు వీరు తమపై ఎలాంటి జాలి, కరుణ చూపించరు. ఎందుకని? ఇప్పుడు వీరు రాక్షసులు.

తాము వీరికి ఎలాంటి అపకారం చేయలేదు. అసలు వీళ్ళెవరో తమకు తెలియదు. అయినా వీరు తమపై దూసుకువస్తున్నారు. అందుకని ఇప్పుడు రాక్షసులు మిగతా సమయాల్లో వీరిలోని మానవత్వం, దైవత్వం బయటపడతాయి.

ఏమిటిదంతా? ఎందుకోసం?

తురుష్కులు దగ్గరకు వచ్చేశారు. అడ్డుగా ఉన్న వీరిని చూసి వారెవరూ గుర్రాల వేగాన్ని నిలుపు చేయలేదు.

‘శంకరా... మనం రక్తసంబంధీకులం. నేను నీ అన్నను‘ అన్నాడతడు.

‘అందుకే నిన్ను తురుష్కుడిని చేస్తున్నాను. ఇప్పుడూ మనం సోదరులమే‘ అన్నాడతడు వికటంగా నవ్వుతూ.

అతడిని లాక్కుపోయారు కొందరు తురుష్కులు. మిగతావారు ధనాల్ని మూటకట్టారు. అపుడు ఆ తురుష్కుడి దృష్టి పూజారిపై పడింది. వికటంగా నవ్వాడు.

‘ఏం నాన్నా.. నన్ను బ్రతిమిలాడు. నిన్ను వదిలేస్తాను. నీ శివుడిని వదిలేస్తాను‘ అన్నాడు. ఆ పూజారి మంత్రాలు వల్లివేస్తూనే ఉన్నాడు.

చూస్తున్న చంద్రశేఖరుడికి పరిస్థితి అర్థమవుతోంది. ప్రాణాలు పోతున్నపుడు పంతాలు పట్టుదలలు అనవసరం.

ఇంతలో హఠాత్తుగా మాధవుడు కత్తి తిప్పుతూ పూజారిని పట్టుకున్న తురుష్కుడి చెయ్యి నరికాడు. పిచ్చివాడిలా తురుష్కుల గుంపుపైకి దూకాడు ‘హరహరమహాదేవ‘ అని అరుస్తూ.

✡ ✡ ✡

‘మనం ముగ్గురం కలిసే ఉందాం. ఎట్టి పరిస్థితులలో విడిపోవద్దు‘ చెప్పింది పద్మిని.

ఊరు దగ్గర పడుతూంటే అక్కడ జరుగుతున్న మారణహోమం తెలుస్తోంది. ఊరు వదిలి పోని వారందరినీ ఒకచోట నుంచో బెట్టారు.

ప్రతి ఇంట్లోకి చొరబడుతున్నారు. విలువైన వస్తువులను దాస్తున్నారు. మిగతావాటన్నిటినీ ఓ చోట కుప్పలా పోసి తగలబెట్టేస్తున్నారు. అలా తగలబడుతున్న వాటిలో ప్రతి ఇంట్లో ఉండే గ్రంధాలు, శాస్త్రాలు, వంశవృక్షాలున్నాయి. ఇంటిని తవ్వి తవ్వి ధనాలు ఎక్కడయినా దాగి ఉన్నాయో వెతుకుతున్నారు. ఏమీ లేవని నిర్ధారించుకున్న తరువాత ఇళ్ళకి నిప్పుపెడుతున్నారు. ఒకటొకటిగా ఇళ్ళు తగలబడుతున్నాయి.

అక్కడ తగలబడుతున్నది ఊరు కాదు, తమ జీవితం అనిపిస్తోంది గంగాధరశర్మకు. అక్కడ పరుశురామునికి ప్రీతి అవుతున్నది తమ గతం మాత్రమేకాదు, తమ వర్తమానమూ, భవిష్యత్తూ ఆ నిప్పులో బూడిద అవుతున్నట్టు అనిపిస్తోంది.

✡ ✡ ✡

తురుష్కులు కేకలు పెడుతూ గదిలోకి ప్రవేశించగానే, ఆ హడావిడిలో వారిలో ఒకడై తాను బయటకు పారిపోవాలని చంద్రశేఖరుడి పథకం. అందుకే, రంధ్రం పడగానే పెద్ద ఎత్తున లోపలకు దూసుకు వచ్చే ధారలా లోపలకు వచ్చే ఘడియ కోసం ఎదురు చూడసాగాడు చంద్రశేఖరుడు. ఇది చాలా ప్రమాదంతో కూడకున్న పని. ఎవరికి ఏ అనుమానం వచ్చినా తన ప్రాణాలు పోతాయి. కానీ బ్రతకటానికి ఇది తప్ప మరో మార్గం లేదు. అయితే, చిత్రంగా, తలుపులు విరిగిన తురుష్కులు లోపలకు దూసుకురాలేదు. అందరూ బయటనే నిలబడ్డారు.

అర్ధమయింది చంద్రశేఖరుడికి వారికి లోపల ఎంతమంది విగ్రహాన్ని కాపాడుతూ ఉన్నారో తెలియదు. అందుకని లోపల వారు బయటకు పరుగెత్తుకు రావటం కోసం చూస్తున్నారు వారు.

అంతే పరిస్థితిలోనూ చంద్రశేఖరుడికి నవ్వు వచ్చింది.

ప్రతి వ్యక్తికీ ప్రాణ భయం. తన ప్రాణం పోతుందేమోనన్న భయం. కానీ ఎదుటి వాడి ప్రాణం తీయటానికి ఎలాంటి జంకు గొంకు లేదు పైగా అది ఒక ఆట. ఇలాంటి ప్రపంచంలో తన ప్రాణాలు తాను ఎలాగయినా రక్షించుకోవటంలో తప్పు లేదు' అనుకున్నాడు.

మరింత శిధిలాల చాటున నక్కాడు.

పొగ అణిగిపోయింది.

ఇపుడు బయట వారికి లోపల వారు కనిపిస్తున్నారు. లోపల వారికి బయట వారు కనిపిస్తున్నారు. వారికి కనబడకుండా నక్కాడు చంద్రశేఖరుడు.

చంద్రశేఖరుడు ఊహించినట్టు కాకుండా, జాగ్రత్తగా ముగ్గురు తురుష్కులు గదిలోకి అడుగుపెట్టారు.

వారి దృష్టి గదిని పరిశీలించింది.

వారికి శివలింగాన్ని అతుక్కున్న పూజారి, పక్కనే కత్తిపట్టుకుని నిలుచున్న మాధవుడు కనిపించారు.

వారి పెదవులపై వ్యంగ్యమైన నవ్వు కదిలింది.

'మాతో పోరాడితే ఛస్తావు. కత్తిపడేసి లొంగిపో'అన్నాడొకడు. గొంతు బొంగురుగా ఉంది. గర్భగుడిలో ఆ గొంతు భయంకరంగా ప్రతిధ్వనించింది.

గోడకు బల్లిలా కరచుకుని, దాదాపుగా నీడలలో ఒదిగి, అవకాశం కోసం ఎదురుచూడసాగాడు చంద్రశేఖరుడు.

ఆ ముగ్గురి చుట్టూ హేళనగా తిరుగుతున్నవారు, గంగాధర శర్మ హఠాత్తుగా తమపైకి దూకే సరికి ఒక్క క్షణం చెదిరారు. వారు ఊహించనిది అది.

అది గమనించిన ప్రహరసింహుడు వెంటనే కత్తి తిప్పుతూ వారిపైకి దూకాడు. మరోవైపు పద్మిని కాళీయమర్ధినిలా కత్తితో ఎదురుగా ఉన్న వాడితల నరికింది. క్షణంలో పరిస్థితి మారింది.

ఆగిన అయిదుగురు తురుష్కులు విగతజీవులైపడిపోయారు. వారి గుర్రాలు కకావికలై పరుగెత్తాయి.

గంగాధర శర్మ ఆశ్చర్యంగా తన కత్తికేసి చూసుకున్నాడు.

తురుష్కరక్తం ఎర్రగా ఉంది.

తాను మనుషులను చంపాడు. కానీ తనలో మార్పురాలేదు. తాను గంగాధర శర్మనే. కానీ ఏదో తెలియని ఉత్సాహం, ఉత్తేజం తనలో నిండుతున్నాయి. దాని వెనుకనే మెదడులో ఏదో స్తబ్దత అలుముకుంటోంది.

కత్తి తురుష్కుడి గుండెల్లో దిగబడుతున్నప్పుడూ ఏదో ఆవేశం ఆవరించింది. వాడు బాధతో గుర్రం మీద నుంచి క్రింద పడిపోతూంటే, విచిత్రంగా అనిపించింది. వాడి బాధ తనకు తెలియటం లేదు. కేవలం కత్తిపట్టిన చేయికి కత్తి బరువు తెలుస్తోంది. తాను మనిషికాదిప్పుడు. ఎదుటివాడి బాధను సానుభూతిగా అనుభవించలేడు తానిప్పుడు. ఎదుటివాడు బలహీనుడై, బాధతో క్రిందకు జారిపోతూంటే ఏదో ఆనందం, ఏదో రాక్షత్వం తనలో ప్రవేశిస్తోంది. ఉరకలు వేస్తోంది.

ఆ ఊపు, ఆ రాక్షసత్వంతో తాను మరో తురుష్కుడిని ఎదుర్కొన్నాడు. వాడు చెంగున దూకాడు. ఆ ఆశ్చర్యం లోంచి తురుష్కుల రక్తాలు తన ఖడ్గంపై కలసి పోయాయి. ఏది ఎవరి రక్తమో తెలియటం లేదు. రక్తం స్థాయిలో లేని భేదం మనిషి స్థాయిలో ఎలా వచ్చింది? గంగాధర శర్మ మనసులో ఏవేవో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. తాను హత్య చేశాడన్న భావనను అతడింకా జీర్ణించుకోలేకపోతున్నాడు కానీ తాను హత్య చేసినట్టు ఎలా అవుతుంది? తాను చంపకపోతే వాళ్ళు తనని చంపి ఉండేవారు. తురుష్కుల దృష్టిలో తాను చేసింది హత్య. తన దృష్టిలో ఆత్మరక్షణ. అందరి రక్తాలు ఒకే రంగులో ఉన్నట్టు అందరి దృష్టి ఒకటే ఎపుడవుతుంది?

'గంగాధరా.. మనం మనంకాదిపుడు. ఆలోచనలకు సమయంలేదు. అటుచూడు' అంటూ ఊరివైపు చూసింది పద్మిని.

ఊరినుంచి పొగలు లేస్తున్నాయి. నల్లటి పొగలు ఆకాశాన్ని తాకి నల్లటి మబ్బులయిపోతున్నట్టున్నాయి.

'పద... మనవారిని రక్షిద్దాం' అంటూ ముందుకు దూకింది పద్మిని. తాము ముగ్గురు, ఊరిని రక్షించగలరా? ఇప్పటికే అది కాలిపోతోంది. అంతలో గంగాధర శర్మకు 'అమ్మ' గుర్తుకు వచ్చింది.

ఆడవాళ్ళను, పిల్లలను, ముసలివాళ్ళను ఊరివెలుపల గుహలలో దాక్కోమన్నారు. వారు అక్కడికి చేరారా? చేరేలోగా, తురుష్కులు దాడి చేరారా?

గంగాధర శర్మ నడక పరుగయింది. అతడి రక్తం కుతకుత ఉడకసాగింది.

✡ ✡ ✡

తురుష్కుల ప్రశ్నకు మాధవుడిలో చలనం లేదు. కత్తి పట్టుకుని అలాగే నిల్చున్నాడు. తురుష్కుడు అడుగు ముందుకు వేశాడు.

'అనవసరంగా ప్రాణాలు పోగొట్టుకోకు. అదీ ఈ జీవంలేని రాయికోసం. అది నిన్ను రక్షించలేదు. అర్ధమయిందా? చూడు' అంటూ, శివలింగాన్ని కరచుకుని ఉన్న పూజారి జుట్టు పట్టుకుని లాగాడు.

పూజారి బాధతో అరిచాడు. మంత్రాలు మరింత పెద్దగా చదవటం ఆరంభించాడు. అక్కడున్న తురుష్కులంతా నవ్వారు.

ఇంతలో బయట ఏదో కలకలం వినిపించింది.

చంద్రశేఖరుడు జాగ్రత్తగా చూశాడు.

ఎవరో, ఊరిపెద్దలా ఉన్నాడు, తురుష్కుల నాయకుడి ముందు వంగి నిలబడ్డాడు. 'మీరు శివలింగాన్ని ఏమీ చేయకండి. మీకు ధనరాశులిస్తాను' అన్నాడు.

తురుష్క నాయకుడు నవ్వాడు.

'ఏవీ ధనరాశులు చూపించు.' అన్నాడు.

ఆ వచ్చినాయన తన భుజం మీద ఉన్న మూటను దింపి, ఆ తురుష్కుడి ముందు పోశాడు. దాన్లోంచి మణులు, మాణిక్యాలు దొర్లాయి. కళ్ళు జిగేల్‌మన్నాయి.

అందరూ గుమికూడారు.

చంద్రశేఖరుడు నెమ్మదిగా, పాకుతూ వచ్చాడు.

'ఇంతేనా? మీ దేవుడి విలువ ఇంతేనా?' అడిగాడు తురుష్కుడు వ్యంగ్యంగా. తలవంచుకున్నాడామనిషి.

'ఈ గోడలు విరగ్గొడితే, నువ్వు నా ముందుంచిన ధనం కన్నా ఎక్కువ దొరుకుతుంది. అంటూ దూరం నుంచే విగ్రహాన్ని పరీక్షగా చూసి నవ్వాడు. 'ఆ మూడో కన్ను చూశావా? ఆ మూడో కన్నుకి పొదిగిన విలువైన రత్నాలు చూశావా? వాటి విలువెంత?' అడిగాడు. అతడు మాట్లాడలేదు.

'వ్యాపారంలో లాభం ఉండాలి. ఈ గుడిగోడలు, విగ్రహాలపై ఉన్న మణులు అన్నిటికన్నా ఎక్కువ విలువైన ధనం ఇస్తే, నీ దేవుడిని వదిలేస్తాను' అన్నాడు.

అంతా చూస్తున్న చంద్రశేఖరుడికి తురుష్కుడి మాటలు నచ్చాయి.

'విజయం వీరభోజ్యం' అన్నారు. ఇక్కడ తురుష్కులు గెలిచారు. ఇదంతా వారి ఆధిపత్యం క్రిందకు వస్తుంది. వారికి ఈ దైవం మీద నమ్మకం లేదు. తమకది శివలింగం. వారికది నల్లటి రాయి. అలాంటపుడు వారిని బ్రతిమిలాడి లాభంలేదు. పోరాడి గెలవాలి లేదా, ఓటమి ఒప్పుకుని పక్కకు తొలగాలి.

అతడు నోరు విప్పాడు. 'శంకరా ... ఆ గతంలో పేరు శంకరుడని నాకు తెలుసు. నీ మంచితనాన్ని అభ్యర్థిస్తున్నాను. శివలింగాన్ని వదిలెయ్యి' అభ్యర్థించాడతడు. చంద్రశేఖరుడికి అర్థమయింది.

ఈ శంకరుడు తురుష్కుడయ్యాడు. అతడికి ఊరిపై ఏదో కోపమో, కక్షనో ఉండి ఉంటుంది. అందుకని తురుష్కులను గుడిలో దొరికే ధనం గురించి ఊరించి, ఇటు పట్టుకు వచ్చి ఉంటాడు.

తురుష్కుడు నవ్వాడు పెద్దగా. 'శంకరుడినే వదిలేశాను. ఇక శివలింగాన్ని వదులుతానా?' అంటూ తన అనుచరులకు సైగ చేశాడు.

వాళ్ళు అతడిని పట్టుకున్నారు.

'ఆ రోజు నేనెంత బ్రతిమిలాడాను నన్ను శుద్ధిచేసి స్వీకరించమని. అంటు శౌంఠు శాస్త్రం అంటూ నన్ను తరిమేశారు. ఇపుడు అవేవీ నిన్ను రక్షించలేవు. వీడినోట్లో గోమాంసం కుక్కి, సున్తీ చేసి వదిలేయండి. ఏం చేస్తాడో చూద్దాం' అన్నాడు.

అన్ని ముంచుకుంటూ వచ్చి ప్రళయ తరంగం దారిలో ఉన్న గడ్డిపోచను చూసి వాళ్ళు ఈ ముగ్గురి వైపు చూస్తున్నారు. వాళ్ళందరి మనుషులలో హేళనతో కూడిన నవ్వు ఉంది.

దగ్గరకు వస్తూండగానే వాళ్ళలో నాయకుడిలాంటివాడు అరిచాడు. 'అందరూ ఇక్కడ ఆగాల్సిన అవసరం లేదు. అయిదుగురు చాలు' అంటూ అరిచి తన గుర్రం ముందుకు దూకించాడు. వీళ్ళ వైపు చూడకుండా ముందుకు సాగిపోయారు.

పోతూ పోతూ వీరిని దాటేటప్పుడు కత్తి విసిరారు.

తన ప్రమేయం లేకుండా గంగాధర శర్మ కత్తి, అతడి ప్రహారాన్ని అడ్డుకుంది. వాళ్ళు దాటుతూండగానే కొందరు ఈ ముగ్గురిని చుట్టుముట్టారు. గుర్రాలతో వీళ్ళ చుట్టూ తిరగసాగారు.

వాళ్ళందరి దృష్టి పద్మినిపై ఉంది. మిగతా ఇద్దరినీ పట్టించుకోవటం లేదు వాళ్ళు. అంటే, వాళ్ళు విజయం సాధించినట్టే అనుకుంటున్నారన్నమాట.

గంగాధర శర్మకు వెర్రి ఆవేశం వచ్చింది. ముందు వెనక ఆలోచించలేదు. వాళ్ళు పద్మిని వైపు అలా చూస్తుంటే గంగాధరశర్మ భరించలేకపోయాడు. గట్టిగా అరుస్తూ ముందుకు దూకాడు.

✡✡✡

తలుపు కూలుతుండగానే, చంద్రశేఖరుడు జాగ్రత్తపడ్డాడు. తలుపుకు దూరంగా జరిగాడు.

మాధవుడు కత్తిని గట్టిగా పట్టుకుని నుంచున్నాడు. పూజారి శివలింగాన్ని గట్టిగా పట్టుకుని నుంచున్నాడు.

పూజారి శివలింగాన్ని గట్టిగా కౌగలించుకుని మంత్రాలు గబగబా వల్లెవేస్తున్నాడు. 'ప్రాణం లేని ఆ రాయి, లేని మూడో కన్ను తెరిచి, శత్రువులందరినీ భస్మం చేసేస్తుంది ఇంకా నమ్ముతున్నట్టున్నాడా అమాయక పూజారి' అనుకున్నాడు చంద్రశేఖరుడు. తలుపు బద్దలవగానే ఆ గదంతా దుమ్ము ధూళితో నిండిపోయింది. బద్దలయిన ఒక్క ఘడియవేపు ఆ ప్రాంతమంతా నిశ్శబ్దం ఆవరించింది. అంతే, ఆ తరువాత అరుపుల హోరుతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. చంద్రశేఖరుడు సరైన సమయం కోసం పొంచి ఉన్నాడు.

✡✡✡

ఇదే సరైన సమయం అని గ్రహించాడు చంద్రశేఖరుడు.

మాధవుడు పిచ్చివాడిలా పోరాడుతున్నాడు. తురుష్కుల దృష్టి చెదరి ఉన్న సమయంలో దాడి చేశాడు. దాంతో వారు బెదిరారు. అంతలోనే అయిదారుగురిని కత్తికి ఎరవేశాడు. మిగతా వారిపై విరుచుకు పడుతున్నాడు.

నిజానికి, చంద్రశేఖరుడు, మాధవుడికి సహాయంగా వెళ్ళవచ్చు. కానీ, మాధవుడి పోరాటం ఎంతోసేపు సాగదని చంద్రశేఖరుడికి తెలుసు. ఇప్పుడు పోరాటంలో దూకటం ఆత్మహత్య సదృశమే. కానీ, పారిపోవటానికి ఇదే అనువైన సమయం. అంతా గందరగోళంలా ఉంది.

చంద్రశేఖరుడు కదిలాడు. గోడ అంచులను, నీడలను నెమ్మదిగా గోడకయిన రంధ్రంలోంచి బయటకు పోయాడు.

అంతా హడావుడిగా ఉంది.

మాధవుడికి తోడుగా ఎవరో వచ్చినట్టున్నారు. ఇద్దరు ముగ్గురు తురుష్కులతో పోరాడుతున్నారు.

ఎవరూ తనను గమనించటం లేదు. ఇదే అదనుగా, ఒక్క ఉదుటున లేచి పరుగెత్తబోయాడు చంద్రశేఖరుడు. కానీ ఎవరిదో ఉక్కు పిడికిలి అతడి హస్తాన్ని పట్టుకుంది.

కదలలేకపోయాడు చంద్రశేఖరుడు.

✡✡✡

**ముందుకు దూకుతున్న గంగాధర శర్మను పట్టి ఆపాడు ప్రహరసింహుడు.**

'ఆవేశం అనర్థదాయకం. ఇలాంటి పరిస్థితిలో విచక్షణ ప్రధానం' అన్నాడు. దూరంగా, ఊరు పరశురామ ప్రీతి అవటం కనిపిస్తోంది. జనుల అరుపులు, కేకలు, ఆర్తనాదాలు వినిపిస్తున్నాయి.

ఎవరు అగ్నికి ఆహుతి అవుతున్నారో, ఎవరు కత్తులకు బలి అవుతున్నారో తెలియటం లేదు ఆలోచించాలంటేనే భయం వేస్తోంది.

'మనవారు ప్రాణాలు కోల్పోతూంటే, మనం చూస్తూ ఊరుకోవాలా?' కోపంగా అడిగాడు గంగాధర శర్మ.

'తప్పదు' అంది పద్మిని. దూరంగా ఆకాశానికి ఎగస్తున్న మంటలు, ఆమె కళ్ళలో ప్రతిబింబిస్తున్నాయి. 'సమయం అలాంటిది. కలసి కట్టుగా మనం వారిని ఎదుర్కొనాలంటే పరిస్థితి ఒకరకంగా ఉండేది. ఇప్పుడు ముగ్గురం మిగిలేం. వారిని మనమే ఎదుర్కోవటం మూర్ఖత్వం' అంది.

'అందుకని చూస్తూ ఊరుకుంటామా?' గంగాధర శర్మ ఆవేశం పెరుగుతోంది. అతడికి తన తల్లి విషయంలో ఆందోళనగా ఉంది.

'నువ్వొక్కడివి వారిని అడ్డుకోగలవా?' అడిగాడు ప్రహరసింహుడు.

'కానీ.. ఇందాక మనం ముగ్గురమే వారికి అడ్డుగా నిలబడలేదా?'అడిగాడు గంగాధర శర్మ.

'అలా, నిలబడ్డాం కాబట్టే కనీసం అయిదుగురిని సంహరించగలిగాం. ఇప్పుడు మనం చేసేదేమీ లేదు. వాళ్ళు వెళ్ళేవరకూ ఎదురుచూడటం తప్ప' అంది పద్మిని. గంగాధర శర్మకు ఆశ్చర్యంగా ఉంది. కాస్సేపటి క్రితం ప్రాణాలు త్యజించటానికి మొండిగా సిద్ధపడ్డ ఈమె ఇప్పుడు ప్రాణాలు కాపాడటం గురించి మాట్లాడుతోంది.

గంగాధర శర్మ ముఖంలో కనిపిస్తున్న అయోమయం, ఆందోళనలు అర్థం చేసుకుంది పద్మిని. అనునయంగా నవ్వింది.

'ప్రస్తుతం పరిస్థితిని బట్టి మనం మారాల్సి ఉంటుంది. లేకపోతే మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. పాతకాలం నాటి విలువలు, మర్యాదలు ఈకాలంలో పనికిరావు. ప్రాణాలు పోయినా ఫరవాలేదు, శత్రువులతో తలపడతాను అనే కాలం పోయింది. ఇప్పుడు ప్రాణాలు కాపాడుకోవటం ప్రథమ కర్తవ్యం. మనం బ్రతికి ఉంటే, మరో పదిమంది ప్రాణాలు కాపాడగలుగుతాం. అలాగని యుద్ధం నుంచి పారిపోవాల్సిన అవసరంలేదు. కానీ ఎప్పుడు ప్రాణాలు అర్పించాలి, ఎప్పుడు కాపాడుకోవాలి అన్న దానిలో విచక్షణ ప్రదర్శించాల్సి ఉంటుంది' మృదువుగా అంది. ఆమె వైపు అలానే చూస్తూండి పోయాడు గంగాధర శర్మ చాలాసేపు. చివరికి అన్నాడు. 'కానీ ఈ తురుష్కులు, మన గ్రామాన్ని ఆక్రమించుకోవాలనుకుంటే?' నవ్వింది పద్మిని.

'అందుకే మనం ప్రాణాలు కాపాడుకోవటం ఆవశ్యకం అంటున్నాను. ఈ ఊరు, ఈ కొండలు, కోనలు మనకు తెలిసినంతగా వాళ్ళకు తెలియదు. కాబట్టి మనం కొద్ది సంఖ్యలో ఉన్నా వాళ్ళని అధికంగా చికాకు పరచగలం. అదృష్టం బాగుంటే ఊరినుంచి తరిమివేయగలం. అందుకోసమైనా మనం ప్రాణాల్ని రక్షించుకోవాల్సి ఉంటుంది. ప్రాణాలు విలువ తెలిసేది ఇలాంటి కాలంలోనే' అంది.

●●●

ఒక్క క్షణకాలం చంద్రశేఖరుడికి ప్రాణాలు పోయినంత పని అయింది. ఎవరూ తనని చూడలేదనుకుని పిల్లిలా బయటకు పాకుతూంటే, ఎవరో అతడిని పట్టుకున్నారు. ఏం చేయాలో తోచలేదు. ఏం మాట్లాడితే ఏ ప్రమాదం ముంచుకు వస్తుందో. కళ్ళెత్తి తనను పట్టుకున్న వారిని చూడాలన్న భయం వేసి తల ఎత్తలేదు చంద్రశేఖరుడు.

'చంద్రశేఖరా.. నిశ్శబ్దం.. మాట్లాడకు' గుసగుసగా వినిపించింది స్వరం. తలెత్తి చూశాడు. ఎదురుగా శూరవర్మను చూడగానే ప్రాణాలు లేచి వచ్చాయి చంద్రశేఖరుడికి.

ఏదో అనబోయాడు సంతోషంగా..

'నిశ్శబ్దం' అన్నట్టు సౌంజ్ఞ చేశాడు శూరవర్మ. 'నాతోరా' అన్నాడు మెల్లిగా. శూరవర్మను అనుసరించాడు చంద్రశేఖరుడు.

కొన్ని అడుగులు ముందుకు వేయగానే వెనకనుంచి పెద్దగా, సంతోషంగా అరుపులు వినిపించాయి.

శూరవర్మ వెనుతిరిగి చూడలేదు.

చంద్రశేఖరుడు వెనక్కు చూడకుండా ఉండలేకపోయాడు.

ఎవరో శూలానికి మాధవుడు తలను గుచ్చి పైకెత్తారు. ఆ దృశ్యం చూస్తూంటే చంద్రశేఖరుడు రక్తం మరగసాగింది.

'మాధవుడిని చంపేశారు' శూరవర్మతో చెప్పాడు.

శూరవర్మ మాట్లాడలేదు. వెనుతిరిగి చూడలేదు. పరుగులాంటి నడకతో గుడి బయటకు నడుస్తూనే ఉన్నాడు.

వారి దారంతా దుమ్మూ, ధూళి, శవాలు పరచి ఉన్నాయి. ఇంకా కొందరు గోడలను పగలగొడుతున్నారు.

ఇంతలో లోపలనుంచి పెద్దగా కేకలు వినిపిస్తున్నాయి.

చంద్రశేఖరుడికి అర్ధమయింది, వెనక్కు తిరగకుండానే.

శివలింగాన్ని ముక్కలు చేస్తున్నారు.

ఎవరో ముక్కలయిన శివలింగాన్ని విసిరేశారు. కొందరు ఆ కన్నులపైన ఎక్కి తొక్కుతున్నారు. వారి దేవుడి పేరును పిలుస్తున్నారు పెద్దగా.

గుడి దాటారు.

బయట సిద్ధంగా ఉన్న గుర్రాలను ఎక్కారు. వేగంగా అడవి వైపుకు దారి తీశారు.

●●●

చీకటి పడింది.

జగతిపై నల్లటి తెర కప్పినట్టుంది.

ఆ నల్లటి తెరను చీలుస్తున్నట్టూ ఊరిలోంచి మంటల వెలుతురు కనిపిస్తోంది.

ఆ వెలుతురు వైపే చూస్తూ కూచున్నాడు గంగాధర శర్మ.

అతడికి కాస్త దూరంలో పద్మిని నిద్రిస్తోంది. ప్రహరసింహుడు కాపలాగా ఓ బండరాయిపై కూచుని ఉన్నాడు.

ఇదంతా నిజం అనిపించటంలేదు గంగాధర శర్మకు, ఇదొక పీడకలలా ఉంది.

తానున్న స్థలానికి కాస్త దూరంలో తన ఇల్లు ఉంది. తన పుస్తకాలున్నాయి. తాను బాల్యం నుంచీ ఆడుకున్న స్థలాలున్నాయి. తన జ్ఞాపకాలతో పెనేసుకున్న భూమి ఉంది.

కానీ ఇప్పుడు ఇల్లూ వాకిలీ లేని వాడిలా, అడవిలో నేలపై పడుకోవాల్సి వచ్చింది.

ఎందుకని? ఏమిటదంతా?

అసలిలా జరుగుతుందని తానెప్పుడన్నా ఊహించాడా?

ఇంతకీ తన తల్లి ఎలా ఉందో తెలియదు.

ఆమె గురువుగారితో, గుహను చేరుకుందా? దారిలోనే తురుష్కుల బారిన పడిందా? ఏమీ తెలియదు.

ఆమె కూడా ఎక్కడో నేలపై ఇలాగే పడుకుని ఆలోచిస్తూంటుందా?

చంద్రశేఖరుడు ఎలా ఉన్నాడో?

ఏవేవో ఆలోచనలతో గంగాధర శర్మ మనస్సు అతలాకుతలంలా ఉంది. అతడికి ఊళ్ళోకి పరుగెత్తాలని ఉంది. తన ఇల్లు, తనకు పరిచితుల ఇళ్ళను చూడాలని ఉంది. అందరూ ఎలా ఉన్నారో తెలుసుకోవాలని ఉంది.

చుట్టూ చూశాడు గంగాధర శర్మ.

పద్మిని గాఢనిద్రలో ఉంది.

ప్రహార సింహుడు వైపు చూశాడు.

అతడు కూచునే నిద్రపోతున్నాడు.

శబ్దం కాకుండా లేచాడు గంగాధర శర్మ. కత్తిని తీసుకున్నాడు. ఎవరి నిద్రభంగం కాకుండా, జాగ్రత్తగా అడుగులో అడుగువేస్తూ ఊరి వైపుకు నడవసాగాడు.

●●●

అడవికి చేరుకోగానే, ఓ పొదమాటున గుర్రం ఆపాడు శూరవర్మ.

అక్కడ పరిసరాలను జాగ్రత్తగా పరిశీలించాడు. 'ఈ రాత్రికి ఇక్కడ విశ్రమిద్దాం' అన్నాడు.

గుర్రం దిగుతూనే చంద్రశేఖరుడు, శూరవర్మ ఎదురుగా వెళ్ళి నిలబడ్డాడు.

'నన్ను మృత్యువు వైపు ఎందుకు నెట్టారు? మళ్ళీ వచ్చి ఎందుకు రక్షించారు?' అడిగాడు.

శూరవర్మ నవ్వాడు. 'నిన్ను మృత్యుముఖం వైపు నెట్టేట్టయితే, మళ్ళీ వచ్చి ఎందుకు రక్షిస్తాను?' అడిగాడు.

'మీకు నేనంటే ఇష్టంలేదు. మీకు గంగాధర శర్మ అంటేనే ఇష్టం. అందుకే మీతో నన్ను తీసుకు రావద్దనుకున్నారు. తీసుకు వచ్చినా నన్ను యుద్ధంలో పాల్గొననీయలేదు. నన్ను ఎలాంటి స్థానంలో నుంచో పెట్టారంటే, మరణం తప్పని స్థానం అది. ఎందుకని?' నిలదీశాడు చంద్రశేఖరుడు.

శూరవర్మ ముఖం గంభీరంగా అయింది.

'యుద్ధంలో ప్రణాళిక ఉంటుంది. కొందరికి కఠినమైన బాధ్యతలు లభిస్తాయి. ఆ బాధ్యతలను అప్పచెప్పటం, వారి ప్రతిభపైన ఆధారపడి ఉంటుంది. నువ్వూ, మాధవుడు తురకసేనలను గర్భగుడిలో అడుగుపెట్టనివ్వరనుకున్నాను. అసలు మీ వరకూ తురకసేనలను రానివ్వమనే అనుకున్నాను. కానీ అనుకున్నది, అనుకున్నట్టు జరగలేదు' చివరి మాటలంటూంటే శూరవర్మ గొంతు వణికింది.

'నేను సమయస్ఫూర్తి ప్రదర్శించకపోయి ఉంటే, మాధవుడిలా నా తల ఏ శూలానికో వేలాడుతూ ఉండేది' కోపంగా అన్నాడు చంద్రశేఖరుడు.

నిట్టూర్చాడు శూరవర్మ.

'మాధవుడు, ఒక్కడే పదిమందిని అడ్డుకున్నాడు.'

'అంటే, నేను కూడా మాధవుడిలా ప్రాణత్యాగం చేసి ఉండాల్సిందేనా?' అరిచాడు చంద్రశేఖరుడు సూటిగా, చంద్రశేఖరుడి కళ్ళల్లోకి చూస్తూ చెప్పాడు శూరవర్మ.

'మాధవుడు సనాతన ధర్మ భక్తుడు. అతడికి మనధర్మం ప్రాణాలకన్నా ఎక్కువ. అందుకే అతడిని గర్భగుడిలో శివలింగ రక్షణ కోసం ఉంచాను.'

'మరి నేను?'

'మాధవుడు ఒక్కడే పదిమంది పెట్టు అయితే, నువ్వు ఒక్కడివే వందమంది పెట్టు. అందుకే మాధవుడికి తోడుగా నిన్ను ఉంచాను.' అన్నాడు శూరవర్మ.

అతడి మాటలు వింటూనే చంద్రశేఖరుడి ముఖం ఎర్రబడింది. యుద్ధరంగం వదలి ప్రాణాలు రక్షించుకునేందు పారిపోయి వచ్చాడని తనని శూరవర్మ దూషిస్తున్నట్టు అర్థం చేసుకున్నాడు చంద్రశేఖరుడు.

'గెలవగలిగే యుద్ధమే చేయాలని మీరే చెప్పారు. ప్రాణాలు రక్షించుకోవటం అత్యంత ప్రాధాన్యం వహిస్తుందనీ చెప్పారు' కోపంగా అన్నాడు.

నవ్వాడు శూరవర్మ. 'నువ్వు చేసింది సరైన పనే. నేను, నాతో పాటు ఈ అయిదుగురూ వచ్చింది నీ రక్షణ కోసమే. నేను నిన్నేమీ అనటంలేదు. నా పథకం చెప్పాను. అంతే' అన్నాడు.

చంద్రశేఖరుడి కోపం తగ్గలేదు. 'ఇకపై నుంచీ నేను ఇలా గర్భగుడిలో కూచుని చావుకోసం క్షణాలు లెక్కపెట్టే బాధ్యతను నిర్వహించను. నేనూ యుద్ధంలో పాల్గొంటాను.' అన్నాడు.

'ఇది గడ్డు సమయం. మనం ఎవరికి వారుగా కాక, అందరం కలసి ఒకటిగా ఆలోచించాల్సిన సమయం' అన్నాడు.

చంద్రశేఖరుడు మాట్లాడలేదు. కానీ, అతడికి శూరవర్మ వాదన నచ్చలేదు.

●●●

ఊరు దగ్గరపడుతున్న కొద్దీ శబ్దాలు వినిపించసాగాయి.

ఊరిని పరశురామ ప్రీతి చేసిన తురుష్కులు ఊరు వదిలి పోలేదు. ఊళ్ళోనే ఉన్నారు. వాళ్ళ అరుపులు, కేకలు వింటూంటే, వారు ఏవో సంబరాలలో ఉన్నారని అర్థమవుతోంది. ఊరు ఇంకాస్త దూరంలోనే ఉందనగా, ఒక తురుష్క సైనికుడు పహరా కాస్తూ కనబడ్డాడు. గంగాధర శర్మ చీకట్లోకి నవ్వాడు.

ఆ సైనికుడు పహరా కాస్తున్నాడు. అటూ ఇటూ చూస్తున్నాడు. కాస్సేపటికి మరో సైనికుడు వచ్చి అతడి స్థానంలో ఆగాడు. అప్పుడు ఈ సైనికుడు కదిలాడు. వాళ్ళు పహరా కాసే విధానం గంగాధర శర్మకు అర్థమయింది.

సైనికులు ఊరి చుట్టూ ఉన్నారు. ఒకరొకరు తమ తమస్థానాల నుంచి కదలుతూ మరొకరి స్థానం చేరుకోగానే, వారు కదలి మరోస్థానానికి వెళుతున్నారు. ఈలోగా, ప్రమాదం ఏదైనా కనిపిస్తే, వారు ఇతరులను అప్రమత్తులను చేస్తూ గంగాధరశర్మ చీకట్లోకి నక్కాడు.

ఒకడి దృష్టిని మళ్ళిస్తే తాను సులభంగా ఊళ్ళోకి ప్రవేశించవచ్చు.

'ఊళ్ళోకి ప్రవేశించి?' ఆ ప్రశ్నకు సమాధానం ఆలోచించాలని లేదు గంగాధర శర్మకు. ఎలాగైనా ఊళ్ళో అడుగుపెట్టాలని ఉంది. అది తప్ప మరో ఆలోచనలేదు. ఇంతలో ఒక తురుష్కుడు వచ్చి అక్కడ నుంచున్న వాడితో ఏదో మాట్లాడేడు. ఆ తురుష్కుడు తల ఊపాడు.

కొత్తగా వచ్చివాడు సరిగ్గా గంగాధర శర్మ ఉన్న వైపుకే రాసాగాడు. గంగాధర శర్మ మరింతగా చీకట్లోకి ఒదిగాడు.

ఆ తురుష్కుడు వచ్చి చీకట్లోకి చూస్తూ అలాగే నిలబడ్డాడు.

గంగాధర శర్మకు ఏం చేయాలో అర్థం కాలేదు. తాను రాయి వెనక ఉన్నాడు. కానీ రాయి తనను సంపూర్ణంగా దాస్తోందో, లేదో తెలియటం లేదు.

రాయి వెనుక నుంచి లేచి పారిపోనూలేడు. ఎందుకంటే, తురుష్కుడు ఎంతో దగ్గరగా ఉన్నాడు.

వాడి చీకట్లోకి తీక్షణంగా చూస్తున్న విధానం గంగాధర శర్మలో కంగారు కలిగించింది. ఇక అటునుంచి లేచి పరుగెత్తాలని నిశ్చయించుకున్నాడు గంగాధర శర్మ. కానీ అంతలో అతడికి ఆ శబ్దం వినిపించింది.

క్షణంలో అతడి ఉద్విగ్నత హాస్యంగా మారింది.

ఆ తురుష్కుడు చీకట్లో నుంచుని లఘుశంక తీర్చుకుంటున్నాడు.

ఆ సైనికుడు కదిలాడు. వెళుతూ వెళుతూ కాపలాగా ఉన్న సైనికుడితో ఏదో మాట్లాడటం ఆరంభించాడు.

గంగాధర శర్మకు అదే సరైన సమయం అనిపించింది. చీకట్లో పిల్లిలా పాకుతూ ఆ ఇద్దరు తురక సైనికులకు దూరంగా వెళ్ళాడు.

ఇప్పుడు గంగాధర శర్మకు ఎదురుగా ఓ పెద్ద ఇల్లు ఉంది. అదంతా కాలిపోయి ఉంది. కానీ వేగంగా పరుగెత్తితే తానున్న స్థలం నుంచి ఇంటి కాలిన గోడల చాటుకు త్వరగా చేరవచ్చు. ఊపిరి గట్టిగా పీల్చుకున్నాడు. దేవుడిని తలచుకున్నాడు. వేగంగా పరుగెత్తాడు.

***

సైనికుడితో మాట్లాడుతున్న తురుష్కుడికి ఎవరో, ఏదో కదిలినట్టు అనిపించింది. వెంటనే వెనుతిరిగాడు.

ఎవరూ కనిపించలేదు. కానీ అతడికి ఏదో అనుమానం వచ్చింది. కత్తితీసి పట్టుకుని, కదలిక కనిపించిన వైపు అడుగులు వేశాడు. అతడితో ఉన్న సైనికుడు కూడా అనుసరించాడు.

●●●

గంగాధర శర్మ గుండెలు దడదడలాడుతున్నాయి. కానీ నిలిచే తీరిక లేదు. తురుష్కుల దృష్టి తనవైపు మళ్ళిందని గ్రహించాడు. తాను అక్కడ ఎక్కువసేపు ఉండటం ప్రమాదకరం అని అర్థమయింది.

గోడవెనక చీకటి మూల నక్కాడు. అంతలో అతడి దృష్టి ఆ ఒకప్పటి పెద్ద ఇంటి శిథిలాల నడుమ కనిపిస్తున్న శవాలపై పడింది.

ఎవరో కుటుంబంలోని వ్యక్తులు సజీవ దహనమైనట్టున్నారు. అంతా బూడిద అయిపోయారు. ఎముకలు కనిపిస్తున్నాయి. కానీ ఎముకలు, బూడిద కుప్పల్లోంచి గాజులు, మట్టెలు కనిపిస్తున్నాయి.

గంగాధర శర్మ గుండెలో ఎవరో శూలం గుచ్చినట్టయింది.

అది ఎవరి ఇల్లో గుర్తు తెచ్చుకోవాలని ప్రయత్నించాడు. కానీ ఊరు కొన్ని గంటలలో గుర్తుపట్టలేనంతగా మారిపోయింది. ఇళ్ళన్నీ కాలిబూడిదలయ్యాయి. రాళ్ళతో కట్టిన ఇళ్ళు నల్లగా మిగిలాయి.

ఊళ్ళోని గుళ్ళు ఊళ్ళో దారులు గుర్తు పట్టటానికి వీలుగా ఉండేవి. ఇప్పుడవి కనబడటం లేదు. దాంతో ఆ చీకట్లో తాను ఏవైపున ఉన్నాడో, ఎక్కడ ఉన్నాడో తెలుసుకోవటం కష్టంగా ఉంది. దానికి తోడు, క్షణక్షణానికి తురుష్కులు దగ్గరవుతున్నారు.

గంగాధర శర్మ మనస్సులో చిత్రవిచిత్రమైన సంచలనాలు కలుగుతున్నాయి.

ఒక వైపు తన ఊరు, తన స్నేహితులు, తన బంధువులు, తన సహచరులు, అందరూ ఏమైపోయారో నన్న బాధ తొలిచేస్తోంది. ఎవరెవరు ఏయే చిత్రహింసలు అనుభవించారో, ఎంత ఘోరమైన నరకాన్ని చవిచూశారో అన్న ఆవేదన బాధిస్తోంది. మరోవైపు తనవారు ఏమైపోయారో అన్న ఆలోచన నిలవనీయటం లేదు. ఇంకోవైపు, ఇదంతా ఏమిటి? అన్న ఆలోచన నిశ్చలంగా ఉండనీయటం లేదు.

ఎందుకోసం ఈ అత్యాచారం? ఎందుకోసం ఈ మారణ కాండ?

తాము ప్రశాంతంగా తమ జీవితం గడుపుతున్నారు. ఎవరికీ ఎలాంటి అన్యాయం చేయలేదు. ఎవరి జీవితాలలోనూ అనవసరంగా జోక్యం చేసుకోవటం లేదు. మరి, వీరెవరు, తమని వెతుక్కుంటూ వచ్చి తమ జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నారు?

వీరెవరు తమ గ్రామాలను దోచుకుని వెతుక్కుంటూ వచ్చి తమ జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నారు?

వీరెవరు తమ గ్రామాలను దోచుకుని, తమ ప్రాణాలను హరిస్తున్నారు?

ఎందుకని వీరికి తమపైన ఇంత ద్వేషం?

ఎంత ద్వేషమంటే, తామెవరో పరిచయం లేకున్నా, తమ గురించి సరిగ్గా తెలుసుకోకుండా, తమని సంహరించేంత ద్వేషం ఎందుకని?

గంగాధర శర్మకు నీడలలో దాక్కోవాలని లేదు. ఎదురు నిలిచి వారితో పోరాడాలనిలేదు.

వాళ్ళతో పరిచయం చేసుకోవాలని ఉంది. వాళ్ళ ఆలోచనలు గ్రహించాలని ఉంది. వాళ్ళ మనస్తత్వం తెలుసుకోవాలని ఉంది. వాళ్ళ ఆలోచనలు గ్రహించాలని ఉంది. వాళ్ళ మనస్తత్వం తెలుసుకోవాలని ఉంది. వాళ్ళ పాండిత్యాన్ని పరీక్షించాలని ఉంది. వారి నుంచి తానేమైన విషయాలు గ్రహించగలడేమో చూడాలని ఉంది. వారి వల్ల తాను తన గురించి, ప్రపంచం గురించి, భగవంతుడి గురించి ఏమైనా కొత్త విషయాలు సంగ్రహించగలడో చూడాలని ఉంది.

కానీ..

వాళ్ళిద్దరూ కత్తులు సిద్ధంగా పట్టుకుని గోడలలో వెలుతురు పడేవైపు నిలిచి, చీకట్లోకి చూస్తున్నారు.

వాళ్ళ కళ్ళల్లో కనబడే క్రౌర్యం, ముఖాలలో కనబడే ఉద్విగ్నతలు గంగాధరశర్మ మరింతగా చీకట్లో నక్కేట్టు చేశాయి.

'బద్మాషో మాన్తే నహీ' అన్నాడొక సైనికుడు మరొకడితో.

'కైసేమాన్తే' యే కాఫిర్ మర్తే లేకిక నహీ మాన్తే' అన్నాడింకొకడు.

వాళ్ళే మనుకుంటున్నాడో గంగాధర శర్మకు అర్థం కాలేదు. కానీ తాను ఎదురుపడితే మాత్రం వాళ్ళు మాట్లాడారన్నది స్పష్టంగా తెలుస్తోంది.

వాళ్ళు కాస్సేపు అలాగే నిలబడ్డారు.

ఇంతలో దూరం నుంచి మరో సైనికుడు పిలిచాడు 'క్యాహువా?' అంటూ. 'కుఛ్ నహీ' అన్నాడు వాళ్ళల్లో ఒకడు.

వాళ్ళ మాటలు వింటుంటే గంగాధర శర్మకు ఓ విషయం తెలుస్తోంది. అంతకు ముందు ఓ రోజు గురువుగారు గంగాధర శర్మతో ఈ విషయం చెప్పారు.

'ప్రస్తుతం దేశం అల్లకల్లోలంలో ఉంది. పరాయిదేశాలవారు తమ పరయిభాషను ప్రాధాన్యం లభిస్తోంది. ఇందువల్ల భాషలు సుసంపన్నమవుతాయో, కలుషితమవుతాయో, ఎదురు నిలిచి పోరాడి తమ అస్థిత్వాన్ని, పవిత్రతను కాపాడుకుంటాయో, ఏ భాష నిలుస్తుందో, ఏది అదృశ్యమవుతుందో, ఏ కొత్త భాష పుట్టుకొస్తుందో ఏదీ తెలియటం లేదు. ఇది భాషకే కాదు సంస్కృతికీ, సాంప్రదాయాలకూ వర్తిస్తుంది'

వీళ్ళ మాటలు వింటూంటే ఏదో కొత్త భాష పుట్టుకొచ్చినట్టు అనిపిస్తోంది గంగాధర శర్మకు.

మనుషులు మాట్లాడే భాషలలోనే మార్పులు వస్తూంటే, ఇక జీవిన విధానంలో మార్పులు రావటంలో ఆశ్చర్యమేముంది?

అంతలో గంగాధర శర్మకు గుర్తుకు వచ్చింది. తాను ఆరోజు సంధ్య వార్చలేదని. ప్రాణాలు ప్రమాదంలో ఉన్నవాడు. ఏ విషయం పట్టించుకుంటాడు? దేన్నని పట్టించుకుంటాడు? మతేకాదు, తాను అశుద్ధం లోంచి పాక్కుంటూ వచ్చాడు. శవాల బూడిదలో నక్కాడు. కానీ స్నానం మాట తలపెట్టటం లేదు. శుచి, శుభ్రత గురించి ఆలోచించటంలేదు. కొన్ని గంటలలో తనలోనే ఇంత మార్పు వస్తే, కొన్ని వందల ఏళ్ళలో సమాజంలో ఇంకెంత మార్పు వస్తుంది? ఎలాంటి మార్పు వస్తుంది?

ఎవరు అర్థం చేసుకుంటారు? ఎవరు ఈ మార్పులోని మంచిని స్వీకరించి, చెడును నిర్జించి సమాజానికి దిశను చూపిస్తారు?

వాళ్ళు కాస్సేపు చీకట్లోకి చూసి వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళిన చాలా సేపటివరకూ గంగాధర శర్మ కదలలేదు.

ఇప్పుడతనిలో ఏదో నిర్లిప్తత, ఏదో వైరాగ్యం నిండుతున్నాయి. అతనికే అర్థంకాని నిరాశ దట్టమైన పొగలా అతని హృదయంలో నిండుతోంది.

ఇలాంటి పరిస్థితులలో వ్యక్తులకు మార్గదర్శనం చేయాల్సిన భాధ్యత కళాకారులపై ఆధారపడి ఉంటుంది. కళాకారులు తమ కళాస్వజాన ద్వారా ప్రతిభావంతంగా ప్రజలకు విషయాలు వివరించవచ్చు. నిజానిజాలు బోధించవచ్చు. సమాజాన్ని ప్రభావితం చేయవచ్చు. కానీ మొత్తం వ్యవస్థకే విభిన్నమై, దాడికి గురవుతున్నప్పుడు కళాకారులు తమ భాధ్యతను ఎలా నిర్వహిస్తారు? వారి జీవితమే ప్రశ్నార్థకమైనప్పుడు సమాజం గురించి ఎలా ఆలోచిస్తారు? బాధ్యతలను ఎలా నిర్వహిస్తారు? కర్తవ్యం ఎవరికి గుర్తుంటుంది? కర్తవ్యం, బాధ్యతకర్తవ్యం, బాధ్యత అన్న పదాలు గుర్తుకురాగానే గంగాధర శర్మ విస్మృతిలో పడిన కర్తవ్యం, బాధ్యతలు గుర్తుకు వచ్చాయి.

తమ వంశంలోని వారెవరైనా శ్రీవైష్ణవాన్ని విజయవంతంగా ఖండించాలన్న నియమం ఉంది. ఆ బాధ్యత తనదేనని అమ్మ చాలా మార్లు తనతో అంది. ఇప్పుడు ఇలాంటి పరిస్థితులలో తాను తన పూర్వీకుల మాటను ఎలా నిలుపుతాడు? తానున్న స్థలంలోంచి జరిగి, ముందుకు తొలిగి చూశాడు గంగాధర శర్మ.

అంతా నిశ్శబ్దంగా ఉంది. నిర్మానుష్యంగా ఉంది. సైనికులు కూడా కాపలా తిరగటం మానేసినట్టున్నారు.

గంగాధర శర్మకు వెనక్కి వెళ్ళిపోవాలని ఉంది. ముందుకు వెళ్ళాలని ఉంది. తన ఇంటిని చూడాలని ఉంది. ఇంట్లో ఉన్న తన గ్రంధాల పరిస్థితి ఎలా ఉందో చూడాలని ఉంది. వీలయితే వాటిని తీసుకుని సురక్షిత ప్రాంతానికి వెళ్ళి దాచాలని ఉంది. మనిషి ప్రాణాల విలువ తెలియని వారికి ప్రాచీన గ్రంధాల ప్రాధాన్యం తెలుస్తుందా? నెమ్మదిగా గోడల చాటును వదిలి బయటకు వచ్చాడు గంగాధర శర్మ.

ఇంకా కొన్ని ఇళ్ళల్లో నిప్పుమండుతూనే ఉంది.

తురుష్కుల దాడికి ముందే ఊరంతా ఖాళీ అయిపోవటంతో ప్రాణనష్టం పెద్దగా లేదు అనుకున్నాడు గంగాధర శర్మ.

కానీ ఈ తురుష్క తండా ఎంత కాలం తమ గ్రామంలో తిష్టవేసుకుంటుందో తెలియదు. తెల్లారే వెళ్ళిపోతే సమస్యే లేదు. కానీ వీళ్ళు ఇక్కడే ఉంటే?

ఆ ఆలోచన గంగాధర శర్మకు రుచించలేదు. అయితే వీళ్ళు ఇప్పటికే ఊళ్ళో వాళ్ళు పారిపోయి, ఎక్కడో తలదాచుకున్నారని గ్రహించి ఉంటారు. అందుకని, ఎంతకాలం దాక్కుంటారో చూద్దామని ఎదురు చూస్తే?

భవిష్యత్తు ఎప్పుడూ ఇంత అగమ్యగోచంగా లేదు. ఏం జరుగుతుందో, ఏమౌతుందో ఏమీ తెలియని భయంకరమైన పరిస్థితి ఇది.

చీకటి చాటున నక్కి ఊళ్ళోకి వెళుతున్న గంగాధర శర్మకి దూరంగా వెలుతురు కనిపించింది పరీక్షగా చూశాడు.

ఊరిని తగలబెట్టిన తురుష్కులు ఊరి మైదానంలో గూడారాలు వేసుకున్నారు. నాటి చుట్టూ సైనికులు కాపలాగా ఉన్నారు.

గంగాధర శర్మను అంత బాధలోనూ నవ్వు వచ్చింది.

శుభ్రంగా ఉన్న ఇళ్ళను తగులబెట్టి, వీళ్ళు గుడారాలలో ఉంటున్నారు.

ఇంతలో మరో ఆలోచన వచ్చింది.

వీళ్ళు వంద సంఖ్యలో ఉన్నారు.

ఒకే ఇంట్లో ఉండటం కుదరదు. వేర్వేరు ఇళ్ళల్లో ఉంటే రక్షణ సమస్య అవుతుంది. కాబట్టి ఇలా అందరూ ఆరుబయట ఒకే దగ్గర ఉండటం మంచిది.

ఆలోచిస్తూ, నడుస్తున్న గంగాధర శర్మ కంట్లో నీళ్ళు ఉబికాయి.

అతడికి ఊహ తెలిసినప్పటి నుంచీ అదే ఇల్లు. ఆ ఇంటిలో అనేక స్మృతులు ముడిపడి ఉన్నాయి.

ఇప్పుడు ఆ ఇల్లు ముక్కలు ముక్కలయి ఉంది. కాలి మొండి గోడలతో నిలిచి ఉంది. బహుశా, ఇళ్ళల్లో ధనం ఎక్కడో దాచి ఉంటారన్న ఆలోచనతో కాబోలు, తురుష్కులు ఇళ్ళను తవ్వి మూలమూలలా వెతుకుతున్నారు. ఆపై నిప్పుపెడుతున్నారు. గంగాధర శర్మకు తాను వచ్చి తప్పు చేశాడనిపించింది.

తానిది చూడకపోయి ఉంటే, తన జ్ఞాపకాలతో ఇల్లు గత వైభవంతో, అందంగా నిలిచి ఉండేది.

ఇపుడు ఎంత ప్రయత్నించినా కాలిన గోడలు, కూలిన ఇల్లు తప్ప మరొకటి గుర్తుకు రావటం లేదు.

అతి అయిష్టంగా ఇంట్లో అడుగుపెట్టాడు గంగాధరశర్మ.

ప్రాచీన గ్రంథాలలో ఏనుగులు తొక్కిన తోటలు వర్ణనలు చదివాడు. ఇల్లు చూస్తుంటే ఆ వర్ణనలు గుర్తుకు వస్తున్నాయి.

విలువైన వస్తువులన్నీ ఎత్తుకుపోయారు.

దైవ విగ్రహాలను, ముక్కలు చేశారు. పూజా ద్రవ్యాలను మట్టిపాలు చేశారు.

ఇంట్లో ఉన్న మత గుర్తులన్నిటినీ చెరిపివేశారు.

ఓ మూల మిగిలిన వస్తువులన్నీ కుప్ప పోశారు. బహుశా వాటిని నిప్పుల పాలు చేయాలనుకుని ఉంటారు కానీ వేరే ఏదో వారి దృష్టిని మళ్ళించి ఉంటుంది.

ఆత్రంగా ఆ వస్తువుల గుట్టవైపు వెళ్ళాడు గంగాధర శర్మ.

వాటిని ఒకటొకటే తొలగించి చూడసాగాడు.

చల్లటి గాలి వీచింది.

ఏదో కాలికి తగిలినట్టయింది.

కంగారుగా కాలు విదిలించి చూశాడు.

వెంటనే వంగి, కాలికి తగిలిన దాన్ని చూశాడు.

దాన్ని చూస్తూనే గంగాధర శర్మ కంటనీరు పొంగింది. అక్కడే కూచుని బోరుమని ఏడవాలనిపించింది.

గురువుగారు తనకు ఇచ్చిన అరుదైన గ్రంథంలోని పత్రం అది. విక్రమాదిత్యుడి కాలానికి చెందిన కావ్యం అది.

మౌఖికంగా ప్రచార అవుతూ వచ్చి కావ్యం, మరుగున పడకూడదని ప్రతులు తయారు చేశారు. అన్ని ప్రతులు నాశనమైపోగా ఇదొక్కటి గురువుగారి దగ్గరకు వచ్చింది. దానికి నకలు తయారు చేయమని గంగాధర శర్మకు ఇచ్చారు గురువుగారు. ఇప్పుడది బూడిద అయింది.

శాశ్వతంగా ఆ కావ్యం అదృశ్యమైపోయింది. దాన్లో పొందుపరచి ఉన్న అనేక అద్భుతమైన విషయాలు శాశ్వతంగా తమకు దూరమైపోయాయి.

తనకు దొరికిన పత్రం కూడా సగం కాలి ఉంది.

దానిలోని అక్షరాలను చదవాలని ప్రయత్నించాడు గంగాధర శర్మ.

'ప్రాణ రహస్యాన్ని తెలుసుకున్నాను. ప్రాణులకు తెలుపుతున్నాను.' అంతే ఉంది ఆ పత్రంలో. మిగతా అంతా బూడిద అయిపోయింది.

'ప్రాణ రహస్యం తెలుపుతాడట'

ఆ బూడిదలో వెతికి, బూడిదను పత్రాలుగా మార్చి, ఆ కావ్యాన్ని తిరిగి రచించాలన్నంత ఆవేశం కలుగుతోంది గంగాధరశర్మకు.

ఎలా తెలుస్తుంది భవిష్యత్తు తరాలకు నందివర్ధనుడనే పండితుడి గురించి? ఆయన  కనుగొన్న అత్యద్భుతమైన విషయాల గురించి ఎవరికి తెలుస్తుంది?

తరతరాలుగా ధనాన్ని మించిన విలువైన ఆస్తిగా ఒకరి నుంచి మరొకరికి అందుతన్న విజ్ఞానం ఇక్కడితో అంతమైపోయింది.

ఈ జాతి ఎంతగా కోల్పోతోందో ఇలాంటి అద్భుతమైన విజ్ఞానాన్ని? ఇలాంటి విజ్ఞానాల్ని కోల్పోయి తాము ప్రపంచం ముందు మూర్ఖులా నిలుస్తారా? విజ్ఞాన శూన్యులలా నిలుస్తారా?

తమ విజ్ఞానం కరువైపోగా, పరాయి వారిని తమకన్నా విజ్ఞానవంతులుగా భావించి, వారే విజ్ఞానవంతులని పరిగణించి, వారి విజ్ఞానమే విజ్ఞానంగా భావించే ఘోరమైన, భయంకరమైన అజ్ఞానాంధకారంలోకి దిగజారతారా?

తమని తాము మరచిపోయి భౌతికంగా మానసికంగా దోపిడీదార్లకు బానిసలై పోతారా?

ఎలుగెత్తి పొర్లి పొర్లి ఏడవాలని ఉంది గంగాధర శర్మకు.

ఇంతలో 'కౌన్ హై?' అన్న కఠిన స్వరం వినబడింది గంగాధర శర్మకు.

●●●

'కౌన్ హై'? నిశ్శబ్దంలో, కర్ణకఠోరంగా ప్రతిధ్వనించింది శబ్దం.

'కోహం?' అనుకున్నాడు గంగాధరశర్మ. చీకట్లోకి నక్కాడు.

ఒక వైపు భయంతో శరీరం వణుకుతోంది. మరో వైపు తాను శత్రువుకు చిక్కిపోవటం తప్ప మరో మార్గం లేదన్న భావన తెలియని నిర్లిప్తత కలిగిస్తోంది. ఇంకోవైపు మెదడు ఆలోచిస్తోంది.

శబ్దాలు మనిషి మెదడులో ఆకారాలు సృష్టిస్తాయి. మనిషి బుద్ది ఆ ఆకారాలను గ్రహిస్తుంది. వాటి స్వరూపాన్ని అర్థం చేసుకుంటుంది.

ఇప్పుడా సైనికుడు ఏమన్నాడో తనకు అర్థం కావటంలేదు. కానీ అతడన్న మాటల భావం తన మనసు గ్రహించింది.

అతని స్వరంలో ధ్వనిస్తున్న ఆగ్రహ ప్రకంపనాలను తన మనసు, శరీరం స్వీకరించి స్పందిస్తున్నాయి. అతని ప్రశ్నలో దాగి ఉన్న భయాన్ని కూడా తాను గ్రహించగలుగుతున్నాడు.

అంటే, ప్రపంచ వ్యాప్తంగా మానవుడు ఏ ప్రాంతానికి చెందిన వాడయినా, వాడిది ఏ భాష అయినా, ఏ దైవం అయినా, వాడు ఎలాంటి వాడయినా మనసులలోని మౌలిక భావనలు, ఆవేదనలు, సంవేదనల స్వరూపం ఒకటేనా? చీకటిలో నక్కి ఉన్నాడు తాను. అతడికి చిక్కుతానేమోనన్న భయం తనది. అతడికి చిక్కితే తనని అతడేం చేస్తాడో తెలియదు. అతడెవరో తనకి తెలియదు. అందుకని తనకు భయం కలుగుతోంది.

చీకటిలో ఏముందో అతడికి తెలియదు. చీకటిలో దాగున్నదాని వల్ల ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనన్న భయం అతనిది. అందుకే, అతడి ప్రశ్నలోనూ భయకంపన వినిపిస్తోంది.

అంటే, మనిషిలో తెలియనిదేదయినా భయం కలిగిస్తుందా?

చీకట్లో ఏముందో తెలిస్తే అతడి భయం కరిగిపోతుంది.

అతడి వల్ల ప్రమాదం లేదని తెలిస్తే తన భయం కరిగిపోతుంది. అంటే అజ్ఞానం 'భయం', విజ్ఞానం 'విశ్వాసమా'?

ఇప్పుడు తాను చీకటిలోంచి, వెలుతురులోకి వెళ్ళి అతడితో సంభాషిస్తే అతడి బయం అదృశ్యమై పోతుందా?

కానీ, అతడు తనకు మాట్లాడే అవకాశం ఇస్తాడా? తనని చూడగానే భయంతో తనపై దాడి చేస్తాడు.

అంటే, మనుషుల నడుమ అపోహలు, ద్వేషాలు, భయాలు అన్ని ఒకరినొకరు సరిగ్గా అర్థం చేసుకోలేక పోవటం, ఒకరితో ఒకరు మనసు విప్పి మాట్లాడుకోలేకపోవటం వల్లనేనా?

'కోన్ హై?' మళ్ళీ అడిగాడతడు.

ఈసారి అతడి స్వరంలో మార్పు వచ్చింది. ఇంతకు ముందున్న భయం తగ్గింది. ఎంతకీ చీకటిలోంచి మరోసారి శబ్దం వినిపించక పోవటంతో అది తన భ్రమ అనుకున్నాడేమో!

గంగాధర శర్మ కదలలేదు.

ఇంతలో బయట నుంచి వేరే ఏదో గొంతులు వినిపించాయి.

ఒకడికి ఇద్దరూ తోడవుతున్నారు. అదీ వాడి ధైర్యానికి కారణం.

అంటే, ఒంటరి మనిషి బలహీనుడు. భయస్తుడు. సాటి మనిషి పక్కన ఉంటే ధైర్యం. అందుకేనా, మనిషి వ్యక్తిగతంగా ఒంటరితనాన్ని వాంఛించినా, ఒక సముహంలో భాగంగా ఉండటానికే ఇష్టపడతాడు? సమూహంలో భాగంగా ఉండేందుకు తన వ్యక్తిగత ఇష్టాఇష్టాలను పక్కన పెడతాడు!

బయట ఆ ముగ్గురూ కలసి ఏదో మాట్లాడుకుంటున్నారు. ఇది తన అంతమా?

తన జీవితం ఈ రకంగా అంతమవుతోందా?

గంగాధర శర్మలో విచిత్రమైన సంచలనం కలుగుతోంది.

అతడికి భయం కలగటంలేదు. తప్పని సరిగా అనుభవించాల్సిన, అనుభవాన్ని అనుభవించటానికి సిద్ధమవుతున్నట్టు అదోరకమైన నిర్లిప్తత అతడిని ఆవరిస్తోంది. ఏమిటీ జీవితానికి అర్థం?

పుట్టటం, ఆరాటపడటం, ఆపై హఠాత్తుగా మరణించటం! ఇంతేనా జీవితం? ఈ జీవితంలోనే మనిషి తనని తాను తెలుసుకోవాలా? సాటి మనిషికి సాయం చేయాలా? సత్యాన్ని అన్వేషించాలా?

ఎందుకో ఒక్కసారిగా సమయం ఎంత విలువైనదో తనకు అర్థమైన భావన కలిగింది గంగాధర శర్మకు.

మనిషి 'సమయం' ఎంత విలువైనదో అన్న ఆలోచనవైపు దృష్టిపోనే పోదు.

బాల్యంలో ఆలోచనలు ఉండవు. ఉన్న ఆలోచనలు తన చుట్టూ ఉన్న మనుషులను, పరిసరాలను, అర్థం చేసుకుని అనుకరించటంలో గడిచిపోతుంది.

ఎదుగుతున్న కొద్దీ వయసుకు తగ్గ ఆరాటాలు, ఆకర్షణలు, ఆవేశాల వెంట పరుగిడటం వైపు దృష్టిపోతుంది.

వయసుడిగిన తరువాత.. అప్పుడు అర్థమవుతుందేమో.. కాలం విలువ.

చేయగలిగిన వయసులో చేయగలిగి ఉండి చేయని పనులన్నీ అప్పుడు అర్థమౌతాయేమో.

బయట అడుగుల సవ్వడి వినిపించింది.

గంగాధర శర్మకు అర్థమయింది.

వారు, ముగ్గురు ఉండటంతో, బయట, ఇద్దరు కాపలాగా ఉంటున్నారు. ఒకడు తనని వెతకటానికి లోపలకు వస్తున్నాడు!

ఇప్పుడు తానేం చేయాలి?

లొంగిపోవాలా? నిలిచి పోరాడాలా?

అడుగుల శబ్దం దగ్గరవుతోంది.

గంగాధర శర్మ కత్తిని గట్టిగా పట్టుకున్నాడు. నీడలలోకి మరింతగా ఒదిగాడు. మనుషులు మాట్లాడుకుంటే అనుమానాలు తొలిగిపోతాయి.

కానీ మనుషులు మాట్లాడుకోగలరా?

తమ భయాలు, అపోహలు, అహంకారాలు కళ్ళపై క్రమ్మిన దట్టమైన పొరలను చీల్చుకుని వెలుతురును చూడగలరా?

●●●

'ఇప్పుడు మనం ఎటు వెళుతున్నాం?' తాము ఇంటిదారి పట్టటం లేదని గ్రహించిన చంద్రశేఖరుడు శూరవర్మని అడిగాడు.

'ఇక్కడికి దగ్గరలో 'విశ్వేశ్వరపాలెం' ఉంది. ఇటీవలె తురుష్కతండా ఆ గ్రామంపై దాడి చేసింది. వారి పరిస్థితిని సమీక్షించి, అవసరమైతే సహాయం చేసి వెళదాం' ముక్తసరిగా సమాధానం ఇచ్చాడు శూరవర్మ.

శూరవర్మకు చంద్రశేఖరుడంటే ఎందుకో తెలియని నిరసన కలుగుతోంది. చంద్రశేఖరుడు వీరుడే కానీ అతడి వీరత్వంలో రాక్షసత్వం మిళితమై ఉందనిపిస్తోంది.

సనాతన ధర్మం 'శక్తి'ని ఆరాధిస్తుంది. కానీ ఆ 'శక్తి' సత్కార్యాలకోసం వాడితేనే ఆ 'శక్తి'కి సార్థకత. దుష్కార్యాల కోసం వాడే శక్తి 'రాక్షసత్వం'.

'మనం తురుష్కులతో తలపడటం వ్యర్థం అనిపిస్తోంది' అన్నాడు చంద్రశేఖరుడు హఠాత్తుగా.

అతడి వైపు ప్రశ్నార్థకంగా చూశాడు శూరవర్మ. 'ఎందుకని?' అడిగాడు.

కాస్సేపు ఆలోచించాడు చంద్రశేఖరుడు చివరికి, ఆలోచనలను కూడదీసుకుంటున్నట్టు మెల్లిగా చెప్పటం ప్రారంభించాడు.

'ఒక చిన్న నీటి పాయ, పెద్ద నది ఎలా అవుతుంది?' ప్రశ్న అడిగాడు. సమాధానం కోసం ఎదురు చూడకుండా తానే చెప్పటం కొనసాగించాడు. 'నీటికి నీరు కలుస్తుంది. అలా నీరు కలుస్తూనే ఉంటే పాయ ధార అవుతుంది. ధార ప్రవాహం అవుతుంది. అలాంటి ప్రవాహం అడ్డంకులను అధిగమిస్తుంది. అన్నిటినీ తనలో కలిపేసుకుంటుంది. తురుష్కులు అలాంటి ప్రవాహ దశలో ఉన్నట్టనిపిస్తోంది'

శూరవర్మ నిశితంగా చూశాడు గంగాధర శర్మ వైపు.

'కొందరు తురుష్కులు హిమాలయాలు దాటి దేశంలో ప్రవేశించారు. రాజ్యాలు గెలుచుకోవటం ఆరంభించారు. వారు అంతటితో సంతృప్తిపడటం లేదు. రాజ్యాల ప్రజలనూ తమలో కలిపేసుకుంటున్నారు. ఆ ప్రజల ధర్మాన్ని తమ మతంలోకి వారిని కలిపేసుకుంటున్నారు. అంటే, తురుష్కులు కేవలం భౌగోళికంగా రాజ్యాలు విజయంతో సంతృప్తి పడటం లేదన్నమాట. వారు మానసికంగా కూడా, ధార్మికంగా కూడా, సాంస్కృతికంగా కూడా ప్రజలపై విజయం సాధిస్తున్నారన్నమాట. దాంతో ఎలాగయితే నది గర్భంలో కలిసిపోయిన తరువాత ఊరూ, వాడా, పుట్టా, గుట్టలన్నీ తమ అస్తిత్వాన్ని కోల్పోయి నీరయిపోతాయో, అలాగే, తురుష్కులు విజయం సాధించిన రాజ్యాలు, గ్రామాలు అన్నీ తమ అస్తిత్వం కోల్పోతున్నాయి. తురుష్కమయం అయిపోతున్నాయి. అంటే ఆ ప్రజలు తమ గతాన్ని త్యజించి, వర్తమానాన్ని స్వీకరిస్తున్నారు. వారికి కాలం తురుష్కులుగానే ఆరంభమవుతోంది. అంటే, ఇప్పుడు సనాతన ధర్మం, తురుష్క మతమనే మహా సముద్రపు వెల్లువ తాకిడికి గురవుతూ దాన్లో కలసిపోతోందన్నమాట. దీన్ని మనం అర్థం చేసుకోవాలి. ఈ వెల్లువను ఆపాలని ప్రయత్నించకుండా, దానితో చెలిమి చేయాలి. కలసి ప్రవహించాలి. దాన్ని అడ్డుకోవాలని ప్రయత్నించటం మూర్ఖత్వం అనిపిస్తోంది' స్పష్టంగా, నిశ్చయంగా చెప్పాడు గంగాధరశర్మ.

శూరవర్మకు ఏమనాలో తోచలేదు. చంద్రశేఖరుడి వైపే చూస్తూండిపోయాడు. ఆలోచనలలో మునిగి ఉన్న చంద్రశేఖరుడు, తల ఎత్తి శూరవర్మవైపు చూశాడు. అతడు తనవైపే చూస్తూండటం చూసి నవ్వాడు.

'నువ్వింతగా ఆలోచించటం ఎప్పటినుంచి ఆరంభించాలా అని ఆలోచిస్తున్నాను' అన్నాడు శూరవర్మ తానూ నవ్వేస్తూ.

'నేను గర్భగుడిలో నుంచుని ప్రాణాలు ఎప్పుడు పోతాయా అని ఎదురు చూస్తున్నప్పుడు ఈ ఆలోచన వచ్చింది. అవును, నేనెందుకు, పనికిరాని, నన్ను రక్షించని రాతి బొమ్మల రక్షణ కోసం నా ప్రాణాలు అర్పించాలి? మనమంతా మనుషులం. దేవుడు ఒక్కడే అంటాం కదా! అప్పుడు శివుడయితేనేమి? విష్ణువయితేనేమి! కాళి అయితేనేమి? అల్లా అయితేనేమి?' మనిషికి బ్రతకటం కావాలి. రామ, కృష్ణ అనే బదులు 'అల్లా' అంటాను. అంతకాదు! కానీ 'రామ' అంటే పోయే ప్రాణాలు 'అల్లా' అంటే నిలుస్తాయి. ఇప్పుడు మనల్ని ముంచెత్తుతున్న ప్రవాహానికి ఎదురీదేకన్నా ప్రవాహ వేగంతో జత కలపతం వల్ల ప్రాణాలు నిలవటమే కాదు, మరింత వేగంగా ప్రయాణిస్తాం అనిపించింది' శూరవర్మ ఆగాడు.

'అందరం ఇక్కడ విశ్రమిద్దాం' అన్నాడు

అందరూ దిగారు.

శూరవర్మ మాట్లాడకపోవటం చంద్రశేఖరుడికి అసంతృప్తి కలిగించింది. తాను ఎంతో గొప్ప సత్యాన్ని కనుగుంటే తనని అభినందించే బదులు శూరవర్మ మౌనంగా ఉండటం అతడి నిరసనను పెంచింది. ఇదేమాట, గంగాధర శర్మ అంటే, శూరవర్మ ఇలా మౌనంగా ఉండడు. ఏదో వివరిస్తాడు. చర్చిస్తాడు. కానీ అదే మాటలు తాను అంటే అవి పనికి రానట్టు ప్రవర్తిస్తున్నాడు.

తన ఆలోచనల్లో తప్పులేదు. తనలాగే ప్రాణాలు ప్రమాదంలో పడితే గంగాధర శర్మ కూడా ఇలాగే ఆలోచిస్తాడు. ఇంకా పిరికివాడిలా ఆలోచిస్తాడు. తాను ప్రాణాలు దక్కించుకుని వచ్చాడు. గంగాధర శర్మ అయితే చేతులెత్తి, శరణు వేడి అక్కడికక్కడే ఇస్లామీయుల పాదాలపై పడి, మతం మారి ప్రాణాలు దక్కించుకుంటాడు అనుకున్నాడు చంద్రశేఖరుడు. అలాంటిది జరగాలని మనసులో బలంగా అనుకున్నాడు. నవ్వుకున్నాడు.

ఆ సైనికుడు కత్తి ఎత్తిపట్టుకుని చీకట్లోకి చూస్తున్నాడు.

అతడివైపే చూస్తున్నాడు గంగాధర శర్మ స్థిరంగా.

తాను అతడికి కనిపించటం లేదని గంగాధరశర్మ గ్రహించాడు. అతడు తనకి స్పష్టంగా కనిపిస్తున్నాడు.

అతడి కళ్ళు మెరుస్తున్నాయి చీకట్లో. తలపై 'పాగా'లాంటిది ఉంది. గడ్డం ముఖం నిండా పెరిగి ఉంది. దుస్తులు మురికిగా ఉన్నాయి.

'కోయీ హైక్యా?' బయట నుంచున్న వారిలో ఒకడు అడిగాడు.

గంగాధర శర్మ ఎదురుగా ఉన్నవాడు మాట్లాడలేదు. చీకట్లోకి కళ్ళు చికిలించి చూస్తూనుంచున్నాడు.

గంగాధర శర్మ అతడివైపు నిశితంగా చూస్తూ చీకట్లోకి ఒదిగాడు.

ఒక మనిషి సాటి మనిషిని చూసి ఎందుకు భయపడాలి? అసలు మనుషులు ఎందుకని ద్వేషించుకోవాలి?

తన ఎదురుగా ఉన్నవాడిని చూస్తుంటే రాజపుత్ర వీరుల ఆకారాలు గుర్తుకు వస్తున్నాయి గంగాధర శర్మకు.

అతడికి ఒక ఆలోచన వచ్చింది.

బహుశా, తన ఎదురుగా ఉన్న తురుష్కుడు, నిజానికి తురుష్కుడు కాడేమో! యుద్ధంలో ఓడిపోయి, తురుష్కులు చిక్కి మతం మారి తురుష్కుడయ్యాడేమో!

మనిషి మతం మారినా అతనిలోని రక్తం మారదు కదా! తరతరాలుగా అతడిలో జీర్ణించుకున్న పూర్వీకుల సంస్కారాలు, వాసనలు అదృశ్యం కావుకదా!

మతం మారినా మనిషి మారడు కదా!

గంగాధర శర్మకు చీకటిలోంచి బయటకు వచ్చి ఆ వ్యక్తితో సంభాషించాలని బలంగా అనిపించింది.

'నువ్వూ నేనూ ఒకటే. నువ్వూ నేనేకాదు మనమంతా ఒకటి. ప్రతి వ్యక్తి 'అహం బ్రహ్మాస్మి' అనుకుంటాడు. అది వ్యక్తి అహంకారాన్ని సంతృప్తి పరుస్తుంది. వ్యక్తికి విశ్వాశాన్నిస్తుంది. ఆ వెంటనే 'త్వమేవాహం' అని ఎదుటివాడి నుండి సమాధానం వస్తుంది.

'నువ్వూ నేనూ ఒకటే'. నువ్వూ బ్రహ్మవే, నేనూ బ్రహ్మన్నే. మనమంతా మౌలికంగా ఒకటే. తేడాలు మన అహంకారాలు, అపోహలు కలిపించినవే. మనం కత్తిపట్టి ఒకరి కుత్తుకలు ఒకరం ఉత్తరించుకోవాల్సిన పనిలేదు. ఒకరితో ఒకరు చేయి కలిపి, హృదయాలకు హృదయాలు జతచేసి, మేధకు మేధతో చెలిమి చేసి మనలోని బ్రహ్మాన్ని కనుగొనాలి. అంతేకానీ ఈద్వేషాలు, అపోహలు, అహంకారాలు మనల్ని మనకు దూరం చేస్తాయి. మనల్ని మనుషులు కాకుండా చేస్తాయి. ' ఇదంతా కత్తిపట్టుకుని చీకట్లోకి చికిలించి చూస్తున్న అతడికి వివరించాలనిపించింది గంగాధరశర్మకు.

ఇంతలో తురుష్కుడి దృష్టిలో మార్పు వచ్చింది.

అతడి కళ్ళల్లో క్షణకాలం భయం కదిలింది. ఆ వెంటనే ఒక రకమైన సూరభావన కదిలింది.

అతడు మెల్లగా కత్తి ఎత్తటం ప్రారంభించాడు.

గంగాధర శర్మకు ఏం చేయాలో తోచలేదు.

అతడు తనని చూశాడా?

తనని చంపటానికే కత్తి ఎత్తాడా?

ఆ కత్తిని ఎదుర్కోవాలంటే తాను నీడల్లోంచి బయటకు రావాలి. కానీ తాను నీడలలోంచి బయటకు వస్తే, బయట వారిద్దరూ లోపలకు వస్తారు. వాళ్ళు ముగ్గురు తాను ఒకడు!

ఏం చేయాలి?

ఇంతలో ఆ తురుష్కుడి కత్తి వేగంగా కదిలింది.

**కత్తి గట్టిగా పట్టుకున్నాడు గంగాధర శర్మ.**

చీకట్లో తాను తురుష్కుడికి కనబడటంలేదని తెలుసు అతడికి. కానీ వాడి కత్తిని తనవైపే విసురుతున్నప్పుడు రక్షించుకోక తప్పదు. ఇందువల్ల తన ఉనికి వాళ్ళకు తెలుస్తుంది. అందువల్ల మృత్యువు తప్పదు. కానీ ఏమీ చేయకుండా ఊరుకున్నా మృత్యువు తప్పదు.

కానీ ఎందుకో ఆ తురుష్కుడు తనపై కత్తి ఎత్తలేదన్న అనుమానం గంగాధర శర్మలో కలిగింది. అందుకే, దైవంపై భారం వేసి మరింతగా చీకట్లోకి ఒదిగాడు. ఒకవేళ కత్తి తనపై దిగబడితే దాన్ని అడ్డుకునేందుకు కత్తిని సిద్ధంగా పట్టుకున్నాడు.

***

గంగాధర శర్మ అనుమానం అతడి ప్రాణాన్ని కాపాడింది.

కత్తిని తురుష్కుడు వేగంగా క్రిందకు రాసాడు. అయితే అతడు కత్తిని విసిరింది గంగాధర శర్మవైపు కాదు. అతడి పక్కనుంచి జర జర పాకుతూ వస్తూన్న పాము పైకి.

మిగిలిన ఇద్దరు తురుష్కులు పరుగెత్తుకు వచ్చారు.

'ఏమైంది?' అడిగాడు.

వారికి ముక్కలయిన పామును చూపించాడు తురుష్కుడు.

'పామా?' అని ఇద్దరూ నవ్వేశారు. 'ఎవడో కాఫిర్ అనుకున్నాం' అన్నారు.

'అయినా, ఊళ్ళోని వాళ్ళంతా పారిపోయారు. పారిపోని వారు పట్టుబడ్డారు. వీళ్ళకి పోరాడటం కూడారాదు' అన్నాడొకడు.

ఇంకొకడు నవ్వాడు. 'వీళ్ళకు సుఖజీవనం అలవాటయిపోయింది. ఏమన్నా అంటే మంత్రాలు వల్లె వేయటం, దేవుడొచ్చి రక్షిస్తాడనుకోవటం అలవాటయిపోయింది. సోమరిపోతులు' అన్నాడు.

ముగ్గురూ నవ్వుకున్నారు. వెనక్కి తిరిగారు.

వాళ్ళటు వెళ్ళగానే గంగాధర శర్మ నిట్టూర్చాడు.

కానీ వాళ్ళ మాటలు గంగాధర శర్మలో ఆలోచనలు రగిలించాయి. అవును. తను జీవనంలో ఓ రకమైన స్థబ్దత ఏర్పడింది. రకరకాల కారణాల వల్ల తామూ శారీరక వ్యాయామం కన్నా మానసిక వ్యాపారంపై దృష్టిని పెట్టారు. ఆలోచనకు ఇచ్చిన ప్రాధాన్యం స్వీయ రక్షణకు ఇవ్వలేదు.

ఇంతలో గంగాధర శర్మకు యుద్ధం నేర్చుకోమంటే తన ప్రవర్తన గుర్తుకు వచ్చింది.

తాను బ్రాహ్మణుడు. విజ్ఞానార్జన, ఆధ్యాత్మిక జీవనం తన లక్ష్యం అని తనకు నేర్పించారు. స్వీయ రక్షణ తన పని కాదు. తనను రక్షించేందుకు క్షత్రియులున్నారు.

డబ్బు సంపాదించటం తనపనికాదు. అది చేసేందుకు వైశ్యులున్నారు. ఇతర పనులు తనవికావు. దానికి శూద్రులు ఇతరులున్నారు. తన పని నిర్మిషంగా, నిష్కామంగా విజ్ఞానార్జన చేయటం. తన విజ్ఞానంతో సమాజాన్ని సుసంపన్నం చేసి, మార్గదర్శనం చేయటం. ఇందుకు ప్రతిఫలంగా సమాజంలో ఇతరులు తనని కాపాడతారు. తన అవసరాలు తీరుస్తారు.

అందుకే శాస్త్రం బ్రాహ్మణుల విధులు నిర్దేశించింది - వారికర్తవ్యాలను సూచించింది. వారు డబ్బు సంపాదించకూడదంది. వారు దేనికీ ఆశపడకూడదంది. నిస్వార్థంగా సమాజాభివృద్ధికి వారు పాటుపడితే వారి అవసరాలు సమాజం చూసుకుంటుందంది.

దాంతో తమలో, మొత్తం సమాజంలో ఓ రకమైన అలసత్వం ఏర్పడింది. ఎవరికి వారు బాధ్యతను ఎదుటి వారిపై పెట్టేయటం అలవాటయింది. అలాగ తమ నిర్ధిష్ట కర్తవ్యాలు తాము నిర్వహిస్తున్నారు! అంటే అదీ లేదు. చుట్టూ నిశ్శబ్ధంగా ఉంది. అలికిడి లేదు. తాను తప్పించుకోవటానికి ఇదే సరైన సమయం...

నిశ్శబ్ధంగా నీడలలోంచి బయటకు వచ్చాడు గంగాధరశర్మ.

బయట ఎవరూ కనబడటం లేదు.

వేగంగా పరుగు ఆరంభించాడు.

నీడలలోంచి, బండల చాటు నుంచి పరుగెత్తుతున్నాడు. ఓ వైపు అతను మెదడు ప్రమాదం కోసం జాగ్రత్తగా చూస్తోంది. మరో వైపు అతనికన్నా వేగంగా అతని ఆలోచనలు పరుగెత్తుతున్నాయి.

నిజానికి తాను బ్రాహ్మణులు, క్షత్రియులు అని ఆలోచిస్తున్నాడు కానీ సమాజంలో ఈ విభజన ఎన్నడూ నిర్దిష్టం కాదు.

నిజానికి వేదమంత్రాలు దర్శించిన వారు అనేకులు జన్మతో బ్రాహణులు కారు. కర్మ వల్ల బ్రాహ్మణులయ్యారు. రాజులయిన అనేకులు క్షత్రియులు కారు. వారు ఏ వర్ణానికి చెందిన వారయినా రాజ్యం సాధించిన తరువాత క్షత్రియులయ్యారు.

అంటే సమాజంలో ఈ వర్ణ విభజన అన్నది వ్యక్తి గుణగుణాలను ప్రవర్తనను బట్టి తప్ప, జన్మను బట్టి కాదు. కానీ సమాజం సుఖానికి, ప్రశాంతకి అలవాటు పడి అసలు ధర్మాన్ని విడచి, సంకుచితంతో సమాజంలో అడ్డుగోడలు నిర్మించుకుంది. ఆ అడ్డుగోడలను విరచి సమాజానికి అసలు ధర్మాన్ని నేర్పటం కోసం భగవంతుడు తురుష్కుల రూపంలో వచ్చాడా? సమాజాన్ని జాగృతం చేసి, మొత్తం సమాజాన్ని అల్లకల్లోలం చేసి, ఈ అల్లకల్లోలం నుంచి నూతన సమాజ సృష్టి కోసం ఇదంతా భగవంతుడు ఆడుతున్న నాటకమా?

గంగాధర శర్మలో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. అతడికి ఎక్కడికన్నా ప్రపంచానికి దూరంగా వెళ్ళి, ప్రశాంతంగా కూచుని తన ఆలోచనలను మథించాలని ఉంది. తనలో జరుగుతున్న మథనం స్వరూపాన్ని సంపూర్ణంగా గ్రహించాలని ఉంది.

గంగాధరశర్మ, చంద్రశేఖరుడూ ఏకగర్భ జనితులు. కానీ ఇద్దరి స్వరూప, స్వభావాలతో హస్తిమశకాంతరం ఉంది.

తాను పఠనం, అభ్యాసం, ఆలోచనలకు ప్రాధాన్యం ఇస్తాడు. తనది సాత్విక ప్రవృత్తి అని అంటారు గురువుగారు.

చంద్రశేఖరుడిది రాజసిక ప్రవృత్తి. వాడిది దుందుడుకు స్వభావం. అంటే ఏక గర్భ జనితులయిన తామిద్దరిలోనే ఇంత తేడా ఉన్నప్పుడు, కేవలం జన్మ ద్వారా వర్ణం నిర్ణయించి, వ్యక్తి కర్తవ్యాలను నిర్దేశించటం మూర్ఖత్వమే కాదు, అన్యాయం కూడా.

ఆలోచనల శిఖరాలను చేరుకున్న తన పూర్వీకులు, మానవ మనస్తత్వ లోతులను అందుకున్న తత్వవేత్తలు, మానవుడిలోని ఈ మౌలిక స్వభావాన్ని విస్మరించి జన్మతోనే మనుషుల ఎదుగుదలను నిర్దేశించే చట్రాల్లో బిగిస్తారా? సమాజ ఎదుగుదలకు అడ్డుపడతారా?

ఇది అసంభవం! లోపం పూర్వీకులు ఏర్పరచిన నియమాల్లో లేదు. సూత్రాలలో లేదు. వాటిని విశ్లేషించి, అనుసరిసున్న సమాజంలో ఉంది. తాను ప్రాణాలు పోతున్నా కత్తి ఎత్తటానికి ఆలోచిస్తాడు. మరొకడు కత్తి ఎత్తిన తరువాత కూడా ఆలోచించడు. అలాంటి వారిద్దరూ ఏక గర్భజనితులయినా ఒకే గుణాలు కలవారు ఎలా అవుతారు? ఒకే కర్తవ్యాన్ని ఎలా నిర్వహిస్తారు? అందుకే సమాజంలో స్తబ్దత ఏర్పడింది. ఘర్షణ జరుగుతోంది. ఈ సమయంలో తురుష్కులు ప్రవేశించారు. సమాజం కృత్రిమంగా నిర్మించుకున్న సరిహద్దులు చెరిపివేస్తున్నారు. ఇప్పుడు సమాజం తన అంతః శక్తిని ఉపయోగించి ప్రాణాలు విడిచి బ్రతికి కట్టగలదో లేదో? నామరూపాలు లేకుండా రూపాంతరం చెందుతుందా? అన్న సవాలు విసురుతున్నారు.

'గంగాధరా' పరుగెత్తుతున్న గంగాధరశర్మ ఆగాడు.

చెట్టు చాటు నుంచి ప్రహరుడు బయటకు వచ్చాడు.

'ఎటు?' అడిగాడు.

గంగాధర శర్మ నోటమాట రాలేదు. వెళ్ళి ప్రహరుడిని గట్టిగా కౌగిలించుకుని అతని చేతుల్లో వాలిపోయాడు.

●●●

శూరవర్మ, చంద్రశేఖరుడు తమ లక్ష్యం చేరేసరికి ఊరు బూడిదకుప్పలా ఉంది. స్మశానంలా ఉంది.

ఊళ్ళోకి అడుగుపెడుతూంటే ఇళ్ళు, శవాల కాలిన వాసన వారిని ఘాటుగా తాకింది.

ఎటు చూసినా శరీర అంగాలే. మాంసం ముద్దలే.

అదంతా చూస్తున్న శూరవర్మ కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

చంద్రశేఖరుడి కళ్ళల్లో అదొక ఆనందం కనిపిస్తోంది. అతడి కళ్ళు మెరుస్తున్నాయి. శూరవర్మ, అతడి అనుచరులు, శవాలని, శరీర అంగాలను ఒక చోట కుప్పలా పేర్చారు. వాటిన్నిటినీ తగలబెట్టారు.

ఇల్లిల్లూ తిరిగి చుశారు. ఎవరైనా కొన ప్రాణాలతో ఉంటే రక్షించాలని. అలా ప్రతి ఇల్లూ తిరుగుతూంటే వారికి, అక్కడ జరిగిన ఘోర మారణకాండ అర్థం కాసాగింది.

అంతే కాదు, ఆ ఊళ్ళో ఒక్కరు కూడా ప్రాణాలతో బ్రతకలేదని స్పష్టంగా తెలుస్తోంది ఊరి కేంద్రంలో ఉన్న గుడిలో అడుగు పెడుతూంటే వారికి అక్కడ జరిగింది అర్థమయింది.

బహుశా, ఊళ్ళోని ప్రజలంతా, అందిన ఆయుధాలతో గుడి రక్షణ కోసం అక్కడ చేరినట్టున్నారు.

అణువణువునా సంకుల సమరం జరిగినట్టు తెలుస్తోంది. గుడి ఆవరణ నిండా మాంసం ముద్దలు పడి ఉన్నాయి. ఒకో అడుగు లోపలకు వెళుతూంటే సమరం మరింత తీవ్రంగా జరిగినట్టు తెలుస్తోంది.

గర్భగుడిలో విష్ణువు విగ్రహం వెయ్యి ముక్కలయి ఉంది. ఒక్కో ముక్కకి పదిమంది ప్రాణాలు అర్పించినట్టుంది.

ఇక గుడి గోడలపైని విగ్రహాలతో కూడా తురుష్కులు సంకుల సమరం చేసినట్టుంది.

ఒక అప్సరస వక్షోజాలను కసిగా చెక్కేశారు. తీర్చిదిద్దినట్టున్న ముక్కును కోసేశారు. మరో అప్సరస కాళ్ళను విరిచేశారు.

గుడి గోడలపై, ఎంతో భక్తి భావంతో, అచంచలమైన విశ్వాసంతో, అపూర్వమైన కళా సంపదని దేవతార్చనలో భాగంగా, ప్రతిష్ఠించిన కళాకారుల కళాతపస్సు, సృజనాత్మక ఆవేశం సర్వం కరకు కత్తుల ముందు, విద్వేష జాలల తాకిడికి ఆవిరైపోయాయి. ఎన్నో ఏళ్ళుగా ప్రజల పూజలందుకుంటూ, వారికి విశ్వాసాన్నిస్తూ, అభయమిస్తూన్న దేవీదేవతలు, చివరికి రాతిముక్కలై విరిగి పోయాయి.

శూరవర్మ బాధతో కదలలేకపోయాడు. అక్కడే పడి ఉన్న ఓ రాయిపై కూచుండిపోయాడు. చేతుల్లో ముఖం దాచుకున్నాడు.

ఎలా తట్టుకోవాలి ఈ తాకిడిని? ఎలా ఎదుర్కోవాలి ఈ దాడిని?

ఇక్కడ జరిగిన పోరాటం, హింస, నాశనాలు చూస్తున్న ప్రతివాడిలో భయం కలుగుతుంది. విశ్వాసం సన్నగిల్లుతుంది. శత్రువు పేరు తలవాలంటేనే ప్రాణాలు గడ్డకడతాయి.

అలాంటప్పుడు, ఆ శత్రువుతో ఎదురు నిలిచి పోరాడి, తనని తాను రక్షించుకుంటూ, సమాజాన్ని పునరుజ్జీవితం చేసే ధైర్యం, సాహసం, ప్రేరణ, పట్టుదలా ఈ మనుషుల్లో ఎలా కలుగుతాయి? ఎవరు కలిగిస్తారు?

పక్కన అలికిడి అయితే చూశాడు. చంద్రశేఖరుడు వచ్చి నిలుచున్నాడు. శూరవర్మని చూసి నవ్వాడు.

'మొత్తానికి బ్రహ్మ మీ ఆసనమయ్యాడన్నమాట' అన్నాడు వ్యంగ్యంగా దిగ్గున లేచాడు శూరవర్మ. నిజమే.. తాను కూచున్నది విరిగిన బ్రహ్మ విగ్రహ శకలంపై.

శూరవర్మలో అపరాధ భావన కలిగించింది.

నవ్వాడు చంద్రశేఖరుడు.

'ఇదీ విజయం అంటే. శత్రువును భౌతికంగానే కాదు మానసికంగా, సాంస్కృతికంగా గెలవటం. విశ్వాసాన్ని దెబ్బతీసి తనపై తనకే అపనమ్మకం కలిగేలా చేయటం. నిర్జించిన వాడి నామరూపాలే కాదు గతం, వర్తమానం, భవిష్యత్తు లేకుండా చేయటం.' అన్నాడు శూరవర్మ కూచున్న బ్రహ్మ విగ్రహ శకలాన్ని కాలితో తంతూ.

శూరవర్మలో ఆవేశం పెల్లుబికింది. తనని తాను మరచిపోయాడు

'చంద్రశేఖరా' అరిచాడు కత్తి చేతపట్టుకుని.

చంద్రశేఖరుడు చెదరలేదు.

'ఇప్పుడది రాతిముక్క మాత్రమే. ఈ తేడాను అర్థం చేసుకోవాలి. జీవం ఉన్నంత కాలమే శరీరానికి గౌరవం. జీవం పోయిన తరువాత అది పనికి రాని కట్టె' అన్నాడు చంద్రశేఖరుడు.

శూరవర్మ చేతిలోంచి కత్తి జారిపోయింది.

'చంద్రశేఖరా' అన్నాడు. ఇప్పుడతని స్వరంలో ఆవేశం లేదు. అది అభ్యర్ధనలా ఉంది. ఆక్రందన ఉంది.

చంద్రశేఖరుడు ఒంగి, క్రిందపడ్డ శూరవర్మ కత్తిని అతని చేతికి ఇచ్చాడు.

అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

అతడు వెళ్ళిన వైపే చూస్తూండిపోయాడు శూరవర్మ.

ఎందుకో అతడికి భవిష్యత్తు గురించి ఆలోచించాలంటేనే భయంగా ఉంది.

●●●

కళ్ళు తెరిచాడు గంగాధర శర్మ.

ఎదురుగా తనవైపే ఆతృతగా చూస్తున్న పద్మిని, ప్రహరసింహుడు కనిపించారు. 'ఎలా ఉంది?' అడిగింది పద్మిని.

నీరసంగా తల ఊపాడు గంగాధర శర్మ 'బాగానే ఉంది' అన్నాడు.

'మనం ఇంకా ఊరి చివర గుట్టల్లోనే ఉన్నాం. తురుష్కులు ఊరు వదలి వెళ్ళేందుకు సిద్ధమవుతున్నారు' అంది పద్మిని.

గంగాధర శర్మ కళ్ళు మూసుకున్నాడు. కను కొసలనుండి సన్నధారగా నీరు కారింది.

అది చూసి పద్మిని నవ్వింది.

'నిన్ను ఎవరు వెళ్ళమన్నారు ఒంటరిగా ఊళ్ళోకి?'అడిగింది.

గంగాధర శర్మ మాట్లాడలేదు. నీళ్ళు నిండిన కళ్ళతో ఆమెవైపు చూశాడు.

'అంతా నాశనం అయిపోయింది' అన్నాడు అతికష్టం మీద.

'ఏమీ కాలేదు. మనం బ్రతికే ఉన్నాం. ఒక్కరు ప్రాణంతో ఉన్నా ఒక విశ్వం సజీవంగా ఉన్నట్టు' అంది పద్మిని.

'నీకు తెలియదు. ఊరంతా పోయింది. ఊళ్ళో వాళ్ళు పోయారు. నా గ్రంధాలు పోయాయి. వాటితో ఎంతో విజ్ఞానం పోయింది. మన వారసత్వ సంపద అదృశ్యం అయిపోయింది' అన్నాడు గంగాధరశర్మ విచారంగా.

'ఇది నీ మొదటి అనుభవం. ఇలాంటి కొన్ని అనుభవాలయితే రాటుదేలిపోతాయి, మాలాగా' అంది పద్మిని.

ఆమె వైపు పరిశీలనగా చూశాడు గంగాధర శర్మ.

చాలా అందంగా ఉంది. ఎలాంటి అలంకరణ లేకున్నా, ముఖమంతా దుమ్ము కొట్టుకుపోయి ఉన్నా, పద్మంలా ఉంది.

'పద్మినీ' పిలిచాడు గంగాధర శర్మ.

'తురుష్కులు వస్తున్నారు' చెప్పాడు ప్రహరసింహుడు.

అందరూ మౌనంగా వెళుతున్న తురుష్కుల తండాను చూసున్నారు. వారు గుర్రాలపై తాము దోచుకున్న మూటలను ఉంచుకున్నారు. కొందరు ఊళ్ళో పట్టుబడ్డ ఆడవాళ్ళను తమ గుర్రాల ముందు కూచోపెట్టుకున్నారు. ఆ ఆడవాళ్ళు ముఖాలపై కొంగు కప్పుకున్నారు. వారెవరో తెలియడంలేదు. వారి భావనలు తెలియటం లేదు.

వాళ్ళు వెళ్ళేదాకా ఆగారు. వారు కనుమరుగయిన తరువాత ముగ్గురూ లేచారు. ఊరివైపు ప్రయాణమయ్యారు.

కాస్త దూరం వెళ్ళిన తరువాత అడిగింది పద్మిని'ఏదో అడగాలనుకున్నావు?'

గంగాధర శర్మ సంశయించాడు. చివరికి గొంతు పెగల్చుకుని అడిగాడు. 'పద్మినీ, మీరు క్షత్రియులా?'

ఒక్క క్షణం అతడివైపు విస్మయంగా చూసింది. ఆ తరువాత పెద్దగా నవ్వటం ఆరంభించింది పద్మిని.

**‘ఎందుకు నవ్వుతున్నావు?‘** అడిగాడు గంగాధరశర్మ ఎర్రబడిన ముఖంతో.

అతడి ఎర్రబడ్డ ముఖం చూసి మరింతగా నవ్వటం ఆరంభించింది పద్మిని.

ప్రహరసింహుడు మాత్రం ముఖంలో ఎలాంటి భావంలేకుండా నిలబడి ఉన్నాడు. ఆమె నవ్వును గంగాధర శర్మ ముఖం మరింతగా ఎర్రబడింది.

పద్మిని నవ్వు ఆపింది.

****

'తుఫాను వచ్చి ఇళ్ళూ, ఊళ్ళూ కొట్టుకు పోతుంటే, ఎంగిలి ఆకు నా సంగతేమిటని అడిగిందట. అలా ఉంది నీ ప్రశ్న. తురుష్కుల దాడులకు సామ్రాజ్యాలు కూలి పోతున్నాయి. ఆలయాలు మట్టి దిబ్బలవుతున్నాయి. దైవం దూషణకు గురవుతోంది. ప్రాణాలు అరచేత పట్టుకుని ప్రజలు దిక్కుతోచక బిక్కు బిక్కుమంటూంటే, నువ్వు కులం ప్రసక్తి తెస్తే నవ్వక, ఏడవమంటావా?' అడిగింది.

గంగాధర శర్మ తల వంచుకున్నాడు. లో గొంతుకలో చెప్పాడు.

'నేను మన సమాజం గురించి ఆలోచిస్తున్నాను. తురుష్కుల తుఫాను తాకిడికి, అల్లకల్లోలమవుతున్న సమాజం భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నాను. ప్రస్తుతం ఎవరికీ రక్షణ లేదు. దేనికీ గౌరవం లేదు సువ్యవస్థమైన సమాజం అతలాకుతలమవుతోంది. ఈ సంఘర్షణ, ఈ అయోమయం, ఈ అనిశ్చింత పరిస్థితి ఎటు దారితీస్తుందా అని ఆలోచిస్తున్నాను' అన్నాడు.

పద్మిని అతడివైపు ఆలోచనగా చూసింది.

'మేము తక్కువ కులస్థులము. కానీ రాజ్యం అల్లకల్లోలంగా ఉండటంతో మా తాతగారు రాజ్యంపై అధికారాన్ని సాధించారు. రాజ్యాన్ని స్థిరపరచారు. పాలనను అందించారు. మా రాజ్యంలోని బ్రాహ్మణుల అనుమతితో మా తాతగారు మా మరణానికి ప్రామాణికత సాధించారు. మమ్మల్ని క్షత్రియులనలేదు కానీ అగ్రవర్ణాలుగా గుర్తించారు. మేమందరం బాల్యం నుంచీ యుద్ధ విద్యలో శిక్షణ పొందాం. తురుష్కుల దాడి జరగకపోతే..' పద్మిని మాట్లాడలేకపోయింది.

ఆమె గొంతు గద్గదికమయింది.

ప్రహరసింహుడు ముందుకు వచ్చాడు.

'మేము క్షత్రియులము. మా తాతగారి కాలంలో రాజ్యం చేతులు మారింది. మారుతున్న పరిస్థితులకనుగుణంగా మారని వారికి మనుగడ ఉండదు. అందుకే మా నాయనగారు రాజరక్షణ బాధ్యత స్వీకరించారు. మా నాన్నగారు నాతో ఒకమాట చెప్పేవారు ఎప్పుడూ. ఆయన రాజ్యం కోసం కత్తి పట్టినప్పుడు కొందరు నిరసించారు. అప్పుడు నేను ఆయనని నిలదీసి అడిగాను' గతాన్ని గుర్తుచేసుకుంటున్నట్టు ఆగాడు ప్రహరసింహుడు.

పద్మిని, గంగాధర శర్మ అతడివైపే చూస్తున్నారు.

ప్రహరసింహుడు ఎక్కువ మాట్లాడడు. అసలీ విషయాలేవీ పద్మినికి తెలియవు. అందుచే ఆమె చూపులో కుతూహలంతో పాటు విస్మయం తోడయింది.

'మన సమాజంలో కులాలు, వృత్తులు సౌలభ్యం కోసం ఏర్పడ్డాయి. సమాజం ఒక నీటి ప్రవాహంలాంటిది. ప్రవాహంలో నీరు కనిపిస్తుంది. నీటిలో పైన క్రింద అంటూ మనం అనుకుంటాం కానీ నీరంతా ఒకటే. సుళ్ళు తిరుగుతూ ప్రవహించే నది నీటిలో ఒక నీటి పొరపైన ఉండటం, మరొకటి క్రింద ఉండటం అంటూ జరగదు. పై నీరు క్రిందకు పోతూంటుంది. నిరంతరం ప్రవహిస్తూ పరిణామం చెందే సమాజం కూడా అలాంటిదే అలా నిరంతరం తనని తాను రూపాంతరం చెందించుకుంటూ పరిణామం చెందే సమాజం సజీవంగా ఉంటుంది. అలాకాని సమాజం కదలని నీటిలా, మురుగులా మారిపోతుంది. కుళ్ళి కృశించి ఎండిపోతుంది. అందుకే, మారుతున్న పరిణామాలను గ్రహించి మనమూ మారాలి అని చెప్పారు.'

అది వింటున్న గంగాధర శర్మ మనసు ఉప్పొంగింది.

భారతీయాత్మకు, మనస్సాక్షికి ప్రతీకలాంటిది గంగానది. గంగానది ప్రధాన లక్షణం, తనలో ఎన్ని మలినాలు వచ్చి చేరినా తనని తాను శుభ్రపరచుకుంటూ నిరంతరం పవిత్రంగా స్వచ్ఛంగా ఉండటం.

తమ సమాజం కూడా అలాంటిదేనని ప్రహరసింహుడి తండ్రి మాటలు నిరూపిస్తున్నాయి. తనని తాను శుభ్రపరచుకుని నిరంతరం స్వచ్ఛంగా ఉండగల లక్షణం తమ సమాజంలో ఉందన్నమాట; అనుకున్నాడు గంగాధర శర్మ.

'మా నాయనగారు నాకు మరో మాట చెప్పారు. కులంతో సంబంధం లేకుండా, సామాజిక స్థాయితో సంబంధం లేకుండా మన అందరి లక్ష్యం మన సనాతన ధర్మాన్ని రక్షించటం, సజీవంగా ఉండటం. అందుకు నడుం కట్టేవారికి అండగా నిలబడటం తప్ప మాలో కర్తవ్యం లేదు.'

తన సంశయాలను నివృత్తి చేసేందుకు ప్రహరసింహుడు తన గురువు అవతారం ఎత్తాడేమోననిపించింది గంగాధరశర్మకు.

ధర్మం ప్రమాదంలో పడినప్పుడల్లా ధర్మ రక్షణ కోసం అవతారం ఎత్తుతున్నాడు శ్రీకృష్ణుడు. ఎప్పుడెప్పుడు ప్రపంచానికి సంకటం వాటిల్లినా నేనున్నానంటూ సమాజ రక్షణ కోసం ముందు దూకాడు శివుడు.

'ఇపుడు ఈ సంకటం నుంచి సమాజాన్ని రక్షించేందుకు ఏ రూపంలో, ఎలా వస్తాడో భగవంతుడు?' అనుకున్నాడు గంగాధర శర్మ.

ఎందుకో, అతడికి తెలియకుండానే, ఏదో ఆత్మవిశ్వాసం అతడిలో ప్రవేశించింది. ఏదో ధైర్యం కలిగింది.

తమ సమాజానికి, ధర్మానికి ఎలాంటి ప్రమాధం లేదు.

చీకటి వచ్చినప్పుడు సర్వం అయిపోయిందని, ఇక వెలుతురు రాదని నిరాశలో మగ్గటం మూర్ఖత్వం.

చీకటి తరువాత వెలుతురు వస్తుంది. రాత్రి వెన్నంటే పగలు ఉంటుంది. తాము చేయవలసిందల్లా, పగలవటం కోసం ఎదురు చూడటమే.

ఊరి వైపు గంగాధర శర్మ అడుగులు వేగంగా పడసాగాయి.

'మనం బ్రతికి ఉన్నాం' అన్న పద్మిని మాటలు ఇప్పుడు అతడికి అర్థమయ్యాయి. ఏ ఒక్కరు బ్రతికి ఉన్న సనాతన ధర్మానికి ఎలాంటి ప్రమాదం లేదు. ఏదో ఓ రూపంలో అది నిలుస్తుంది.

ఎలాగయితే, వృక్ష బీజం భూమిలో నిక్షిప్తమై ఉండి, తొలకరి జల్లు పడగానే మొలిచి, వృక్షమై, శాఖోపశాఖలుగా విస్తరిస్తుందో, అలాంటి సంజీవని లాంటి శక్తి ఈ సమాజానికి ఉంది, అనుకున్నాడు గంగాధర శర్మ.

మాటలాపి వేగంగా ఊరివైపు నడుస్తున్న గంగాధర శర్మ వైపు సాలోచనగా చూసింది పద్మిని.

ఆమెకు అతడిపై జాలితో కూడిన అనురాగం కలిగింది. ఒకోసారి ఆలోచనలు ఉండటం కూడా శాపమేమో అనిపించింది ఆమెకు.

మాటలాపేయటంతోటే ప్రహరసింహుడు మామూలుగా అయిపోయాడు. నిర్భావంగా వారిని అనుసరించాడు.

●●●

కాస్త దూరం వెళ్ళిన తరువాత తురకల తండా నాయకుడు అందరినీ ఆగమన్నట్టు సౌంజ్ఞ చేశాడు.

అందరూ గుర్రాలు దిగారు.

'మనకు దొరికిన ధనమెంత?' అడిగాడు.

తాము దోచుకున్న వస్తువులు, దొరికిన నగలు, విలువైన వస్తువులను అందరూ కుప్పలు పోసి లెక్కించారు. పెదవి విరిచారు.

'దొరికిన మనుషులు?' అడిగాడు.

'గుప్పెడుమందే'

'ఈ గ్రామం వారు తెలివైన వారిలా ఉన్నారు. అందరూ మనకు అందకుండా కొండల్లో తల దాచుకున్నట్టున్నారు. తమతో పాటు విలువైన వస్తువులూ తీసుకెళ్ళినట్టున్నారు. ఈ దొరికినవి సరిపోవు' తీర్మానించాడు తురుష్క నాయకుడు.

'మరేం చేద్దాం?' అడిగాడొక అనుచరుడు.

నాయకుడు గడ్డాన్ని నిమురుతున్నాడు.

'మనం ఇక్కడే ఈ రాత్రికి విశ్రాంతి తీసుకుందాం. రేపు ప్రొద్దున్నే హఠాత్తు వెనక్కి తిరిగి మళ్ళీ దాడి చేద్దాం' అన్నాడు.

'ఇప్పటికే ఊరంతా తగలబెట్టాం కదా, ఏముటుందక్కడ?' అడిగాడొకడు.

'ప్రాణాలతో తప్పించుకున్న వాళ్ళు వెనక్కు తిరిగి వస్తారు. వాళ్ళతో పాటు వాళ్ళ నిధులు వెనక్కు వస్తాయి. వాళ్ళ నిధులు తీసుకుందాం. అల్లా అనుచరులుగా ఉండేందుకు ఒప్పుకున్న వాళ్ళని మన ప్రతినిధులుగా నియమిద్దాం. లేని వాళ్ళు ఛస్తారు. మనం ఊళ్ళో మసీదు నిర్మించకుండా వచ్చాం. అది పొరపాటు. అందుకే నాకు ఎలాగో, ఏదో పని సగం చేసినట్టే అనిపిస్తోంది' అన్నాడు నాయకుడు.

వాళ్ళవెంట ఊరినుంచి కొత్తగా పట్టుకొచ్చిన కొందరు ఆడవాళ్ళు సన్నగా రోదించటం ఆరంభించారు. చకచకా గుడారాలు కట్టేశారు వాళ్ళు.

ఎవరి ఏ ఆడవారిని తమ సొత్తుగా ఎత్తుకొచ్చారో, వాళ్ళు బలవంతాన వారిని తమ డేరాల్లోకి లాక్కుపోయారు.

మిగిలిన వారు రకరకాల కాలక్షేపాల పనులలో మునిగిపోయారు.

●●●

గంభీరంగా ఉన్న శూరవర్మను పలకరించటానికి ఉరికాడు చంద్రశేఖరుడు. కానీ అడకుండా ఉండలేక పోయాడు.

'నా ప్రవర్తన మీకు కోపం తెప్పించినట్టుంది?'

శూరవర్మ మాట్లాడలేదు.

'నేను నిజంగా మన దేవుళ్ళని అవమానించాలని అనలేదు. కానీ ఆ క్షణంలో అలా అనిపించింది. రాతి ముక్కలు. తమని తాము రక్షించుకోలేనివి. దాన్ని రక్షించటానికి మనం ప్రాణాలు అర్పించటం ఏమిటి అనిపించింది. అదీగాక, ప్రపంచంలో ప్రతిదీ సమయబద్ధం. ..జన్మిస్తుంది. ఉచ్చదశకు చేరుతుంది. కొన్నాళ్ళకి దిగజారుతుంది. బహుశా మనం నమ్మే దేవుళ్ళు, మనం చేసే పూజలు ఉచ్చదశ దాటి దిగజారే దశకు వచ్చాయేమో అనిపించింది. ఇది తురుష్కుల ఉచ్చదస స్థితి అనిపిస్తోందన్నాను. అంతే' సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్టు అన్నాడు.

శూరవర్మ చాలాసేపు మౌనంగా ఉన్నాడు. తన మాటలు వినలేదేమోనన్న అనుమానం వచ్చింది చంద్రశేఖరుడికి.

చంద్రశేఖరుడు మళ్ళీ మాట్లాడబోతూంటే శూరవర్మ హఠాత్తుగా నోరు విప్పాడు.

'ప్రపంచ గతి అలల గతి అన్నదానిలో సందేహం లేదు. అలలలాగా ఆలోచనలు, సిద్ధాంతాలు, దైవ భావనలు వస్తూంటాయి. కొన్ని ఎగసి పడి తీరాన్ని తాకుతాయి. మరికొన్ని తాకి వెనక్కు వెళుతూ, వెనక నుంచి వచ్చి తోసే అల ఊపుతో మళ్ళీ ముందుకు దూకుతాయి. రాజ్యాలు వస్తాయి. పోతాయి. రాజులు వస్తారు పోతారు. సిద్ధాంతాలు వస్తాయి పోతాయి. కొత్త కొత్త దైవ ప్రతిపాదనలు, మోక్ష మార్గాలు వస్తాయి పోతాయి కానీ నిరంతరం నిలచి తరం తరం అందుతూ ఆద్యంతాలు లేని ఏకైక ధర్మ సనాతన ధర్మం..

మిగతా అన్నిటికీ ఆరంభం ఉంది. అంతం ఉంటుంది. బౌద్ధం బుద్ధుడితో ఆరంభమయింది. బుద్ధుడి తరువాత కొన్నాళ్ళు సాగింది. ఆపై చీలికలు, పీలికలై బుద్ధుడి చెప్పినదానికి పూర్తిగా భిన్నమయింది. నామరూపాలు లేకుండా పోయింది.

ఇవన్నీ సంబంధంలో రేగే అలలలాంటివి. ఇలాంటి ఎన్ని అలలు రేగినా, ఎన్ని తాకినా, ఎన్ని వెనక్కి వెళ్ళినా సముద్రానికి నష్టం లేదు. అలాంటి సముద్రం లాంటిది సనాతన ధర్మం. ఈ తురుష్కుల అల తాకిడినీ తట్టుకుంటుంది. తనని తాను అదుపులోకి తెచ్చుకుని,

పునర్నిర్వచించుకుని, పునర్మించుకుని ముందుకు సాగుతుంది. ఇలాంటి చిన్న చిన్న దెబ్బలకే విశ్వాసం కోల్పోతే ఎలా?' కాస్త నిరసనగా, కాస్త నిష్టూరంగా అన్నాడు శూరవర్మ.

చంద్రశేఖరుడు నవ్వాడు.

'ఎందుకో నాకలా అనిపించింది. అలా అన్నాను అంతే..' అన్నాడు.

'ఒక మనిషి వ్యక్తిత్వం కష్టకాలంలో అతడు స్పందించే విధానాన్ని బట్టి తెలుస్తుంది. కష్టం రాగానే కృంగిపోయేవారు, వంగిపోయేవారివల్ల లాభం లేదు. నేను నీమీద విశ్వాసం ఉంటే, నీ ధర్మం మీద, నీ దైవం మీద విశ్వాసం ఉంటే, ఎలాంటి కష్టమైనా దాటుకు రాగలవు. ***విశ్వాసం మనిషిని నీటిమీద నడిచేట్టు చేస్తుంది.*** ఆ విశ్వాసం సడలిందంటే ఇక భవిష్యత్తు లేదని అర్థం'. చంద్రశేఖరుడు ఏమీ అనలేదు.

కానీ మనసులో అనుకున్నాడు 'ఎలా కలుగుతుంది విశ్వాసం?' ఎవరి ఆలోచనలలో వారు. ఊరి వైపు పొంగిపోయారు.

●●●

ఒకరొకరుగా ఊర్లోకి చేరుతున్నారు.

బ్రతికి ఉన్నవారు బ్రతికినందుకు ఆనందించాలో, చావనందుకు బాధపడాలో అర్థంకాని స్థితిలో ఉన్నారు.

వారి కళ్ళలో జీవంలేదు. హృదయంలో ఆశలేదు. ఊపిరిలో వెచ్చదనంలేదు. బూడిదయి కనిపిస్తోంది ఊరు.

ఎవరెవరి వారిని తురుష్కులు ఎత్తుకెళ్ళారో, వారు తురుష్కుల బారిన పడేకన్నా ప్రాణాలు ఎందుకు త్యాగం చేయలేదని బాధపడుతున్నారు, కుములుతున్నారు. తమవారు అనుభవించే నరకాన్ని తలచుకుని కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నారు.

వారిని ఓదార్చేవారు లేరు. ఎవరి బాధవాళ్ళది.

గంగాధరశర్మకు వారందరినీ చూస్తూంటే బాధ అధికమవుతోంది. అతడు తన గురువుగారి కోసం తల్లి కోసం వెతుకుతున్నాడు అందరినీ అడుగుతున్నాడు.

ఎవరికీ వారి గురించి తెలియదు. తెలిసినా చెప్పే స్థితిలో లేరు. ఇప్పుడు ఊరు మొత్తాన్ని మళ్ళీ నిర్మించుకోవాలి. కానీ మళ్ళీ కొన్నాళ్ళకి తురుష్కులు దాడి చేయరని లేదు. దాంతో మళ్ళీ అక్కడ నివాసం ఉండాలన్న ఇచ్ఛ ఎవ్వరిలోనూ లేదు.

ఎవరికి వారు ఎక్కడో ఉన్న తమ బంధువులను గుర్తుకు తెచ్చుకుంటున్నారు. అక్కడికి వెళ్ళాలని ఆలోచిస్తున్నారు.

కానీ ఆ బంధువుల ప్రాంతం తురుష్కుల తాకిడికి గురికాలేదన్న విశ్వాసం ఎవరిలో లేదు. అదీగాక దారిలో తురుష్క తండాలు మీద పడతాయేమోనన్న భయం ఉంది.

ఏం చేయాలన్నా భయమే!

నిన్నటి ఎవరూ అంతా శాంతంగా నలిగిపోతోంది. ప్రతి ఒక్కరూ భవిష్యత్తు గురించి బంగారు కలలు కన్నారు. క్షణంలో అన్నీ ఆవిరైపోయాయి.

ఇప్పుడు వారికి గతం లేదు. వర్తమానం లేదు. భవిష్యత్తు లేదు.

ఇంతలో ఎవరో పరుగెత్తుకుంటూ వచ్చారు.

రొప్పుతూ చెప్పారు.'తురుష్క తండా మళ్ళీ వస్తోంది'.

●●●

**‘ఇది మన ఊరికి వెళ్ళేదారి‘**

అది ప్రశ్నలా లేదు వ్యాఖ్యలా లేదు. నిజం చెపుతున్నట్టులేదు. ఆక్రందనలా ఉంది.

చంద్రశేఖరుడి స్వరంలో ఆవేదన స్పష్టంగా ధ్వనించింది

ఆ ప్రాంతాన్ని శూరవర్మ. అతడి సహచరులు జాగ్రత్తగా పరిశీలించారు.

ఆత్రంగా శూరవర్మ వైపే చూస్తున్నాడు చంద్రశేఖరుడు.

‘ఈ తురుష్కుల తండా, మన ఊరు నుంచి వచ్చి రాత్రి ఇక్కడ గడిపినట్టుంది‘ అన్నాడు శూరవర్మ.

వెర్రివాడిలా చూశాడు శూరవర్మవైపు చంద్రశేఖరుడు

'మన ఊరి వైపు నుంచి వచ్చిందా?' అడిగాడు.

'ఇదిగో, గుర్రాల కాలి గుర్తులు చూడు, రెండువైపులా ఉన్నాయి' చూపించాడు శూరవర్మ.

'గుర్రం అటూ ఇటూ నడచి ఉండవచ్చుగా?' సందేహం వ్యక్త పరిచాడు చంద్రశేఖరుడు.

తల అడ్డంగా ఊపాడు శూరవర్మ.

'చూడు.. వాళ్ళు ముందుకు వచ్చి ఉంటే, మనకు ఎదురుపడి ఉండేవారు కానీ మనకెవరూ ఎదురుపడలేదు.'

తల ఊపాడు చంద్రశేఖరుడు

'కాబట్టి వాళ్ళు ఒకే దిశలో ప్రయాణించి ఉండాలి'

'వాళ్ళిప్పుడిప్పుడే మన ఊరి వైపు వెళ్తూండి ఉంటారు. మనం వేగంగా వెళితే వాళ్ళని దారిలోనే అడ్డగించవచ్చు' ఆత్రంగా అన్నాడు చంద్రశేఖరుడు.

'అది నిజమే.. కానీ వాళ్ళు దాడి చేసి తిరిగి వస్తున్నారు. ఎందుకనో మళ్ళీ వెనక్కు వెళ్ళారు.'

'దాడి చేసి తిరిగి వస్తున్నారని ఎలా చెపుతారు?' చిరాకుగా అడిగాడు చంద్రశేఖరుడు. తమ ఊరి మీద తురకలు దాడి చేస్తారన్న ఆలోచనే అతడికి రుచించటం లేదు.

తురకలు దేశంలో స్వైర విహారం చేస్తున్నారు. రాజ్యాలను కబళించి వేస్తున్నారు. కానీ తమ ఊరి దాకా వారు లేరన్న భావన చంద్రశేఖరుడిలో స్థిరంగా ఉంది. ప్రపంచమంతా ఒకటి. తమ ఊరు ఒకటి అన్న నమ్మకంలో ఉన్నాడు. అందుకే శూరవర్మ మాటలు అతడికి నచ్చటం లేదు.

'ఈ ప్రాంతంలో వారు బసచేశారు. ఇక్కడికి ఎలా వచ్చి ఉంటారు? ఏ వైపు నుంచి వచ్చి ఉంటారు? ఏవైపు నుంచి వచ్చినా గుర్తులుండాలి కదా? కానీ వారి ప్రయాణపు గుర్తులన్నీ ఒకేవైపు ఉన్నాయి. అదీ మన ఊరివైపు గమనిస్తే, అటూ ఇటూ గుర్తులూ ఊరివైపే ఉన్నాయి'

చంద్రశేఖరుడు గభాలున గుర్రం పైకి దూకాడు.

'ఇక ఆలస్యం దేనికి?' అని దాదాపుగా అరిచాడు.

అందరూ వేగంగా ప్రయాణం ఆరంభించారు.

దారంతా వారికి తురుష్కులు ప్రయాణించిన చిహ్నాలు కనిపిస్తూనే ఉన్నాయి.

●●●

తురుష్కుల తండా మళ్ళీ వస్తోందన్న వార్త తెలియగానే ఊళ్ళో వారిలో కంగారు పెరిగిపోయింది.

వాళ్ళింకా జరిగిన నష్టాన్ని అంచనా వేయలేదు.

తురుష్కులు వస్తున్నారని తెలిసి, దాక్కున్న వారింకా ఊరు వచ్చి పూర్తిగా చేరనేలేదు అంతలో మళ్ళీ దాడి జరిగితే ఎలా?

ఇప్పుడు వారికి పారిపోయే సమయం కూడా లేదు.

పద్మిని, గంగాధర శర్మ వైపు చూసింది.

'అమ్మ, గురువుగారు..' మాట పూర్తిచేయలేక పోయాడు గంగాధర శర్మ.

ఇపుడు ఎవరి గురించీ వెతికే సమయం లేదు. కాని ఇప్పుడు, పారిపోయి దాక్కునే వీలూ లేదు. ఇది నిలిచి పోరాడాల్సిన సమయం. అది తప్ప మరో గత్యంతరమూ లేదు చుట్టూ చూశాడు గంగాధర శర్మ.

తమదంతా నాశనమై పోయిందని బాధపడే సమయమూ లేదు. ఒకరినొకరు వెతుక్కుంటూనే ఉన్నారు.

తురుష్కుల బారిన పడ్డదెవరు? ఎవరు తప్పించుకున్నారు? ఎవరెవరు ప్రాణాలు కోల్పోయారనే అంచనాలు వేస్తూనే ఉన్నారు. ఇంతలో మళ్ళీ తురుష్కులు దాడికి వస్తూంటే నిలిచి పోరాడేదెవరు?

తుఫాను వచ్చి వెళ్ళిన తరువాత, బ్రతికి ఉన్నవారు జరిగిన నష్టాన్ని అంచనా వేసుకుంటారు. తరువాత నెమ్మదిగా జీవితాన్ని పునర్నిర్మించుకుంటారు. ఇందుకు సమయం పడుతుంది.

కానీ ఇక్కడ తుఫాను తాకిడి తగ్గిన వెంటనే ఊపిరిపీల్చుకునే సమయం కూడా లేకుండా మరో తుఫాను వస్తే తట్టుకునే మానసిక శక్తి ఎవరికి ఉంటుంది?

అప్పటికే తురుష్కులు వస్తున్నారని తెలియగానే, కనీసం పారిపోయే ప్రయత్నాలు కూడా చేయకుండా, ఒకరినొకరు పట్టుకుని ఏడవటం ఆరంభించారు.

కొందరు ఏడుపు కూడా లేకుండా శూన్యంలోకి చూస్తూకూచున్నారు. జరిగిన సర్వనాశనానికి వారిలో జీవితేచ్ఛ నశించింది.

ఇంకొందరు 'దేవుడా.. ఎందుకు మాకీశిక్ష?' అని రోదించటం ఆరంభిస్తున్నారు. వారివైపు చూసి పద్మిని వైపు చూశాడు గంగాధర శర్మ.

'పోరాడాల్సింది ఎవరు? వీళ్ళా?' అడిగాడు.

పద్మిని నవ్వింది

'కాదు. నువ్వూ, నేనూ, ప్రహరసింహుడు' అంది.

'మనం ముగ్గురమా?' అడిగాడు గంగాధర శర్మ.

'అవును.. జీవం ఉన్నంతకాలం ప్రాణరక్షణ మానవుడి కర్తవ్యం' అంది పద్మిని.

ఏడుస్తూన్న వారిని చూశాడు గంగాధరశర్మ. 'అవును జీవం ఉన్నంతకాలం ప్రాణాన్ని రక్షించుకోవాలి. వీళ్ళు జీవచ్ఛవాలు..' అన్నాడు.

ఇంతలో దూరంగా దుమ్మురేగుతూ కనిపించింది.

ఇంతకు ముందులా తురుష్కులు జాగ్రత్తగా రావాలని ప్రయత్నించటం లేదు. వారికి తెలుసు తాము గ్రామం నడ్డి విరిచామని. ఇక ఇపుడు మిగిలింది, అందింది దోచుకోవటం తప్ప మరేమీ లేదని వారికి తెలుసు.

అందుకే ధీమాగా వస్తున్నారు.

అది చూసి ఉళ్ళోవారి రోదన ధ్వని పెరిగింది.

పద్మిని కత్తి ఎత్తుతూ అంది.

'పుట్టిన ప్రతివారూ మరణించక తప్పదు మరణాన్ని ఎవ్వరూ తప్పించుకోలేరు. కానీ ఎలా మరణిస్తారన్న నిర్ణయం మన చేతుల్లో ఉంటుంది. పోరాడుతూ మనిషిలా మరణిస్తాము.. అన్నీ వదిలి ఎలాంటి ప్రతిఘటన లేకుండా పరాజితుడిలా ప్రాణాలు వదిలేస్తామా అన్నది మనం నిర్ణయించుకోవాలి' అంది.

ప్రహర సింహుడు మౌనంగా కత్తిపట్టుకుని ఆమె పక్కన నుంచున్నాడు.

ఒక్క రోజు ముందు తాము ఇలాగే నుంచున్నారు. మళ్ళీ రోజు అయ్యేలోగా అలాంటి పరిస్థితినే ఎదుర్కోవాల్సి వస్తోంది.

దీనికి అంతం ఏది?

ఈ తురుష్క తండాను తాము ముగ్గురు తరిమి కొట్టటం సాధ్యమా?

తరిమి కొట్టినా, తరువాత ఎటు చూసినా, ముంచెత్తుతున్న ప్రళయ జలంలా తురుష్కులు తమని చుట్టుముడుతున్నారు.

వారి నుంచి తప్పించుకునే మార్గం ఏది? ఎలా తప్పించుకుంటారు? ఎటు పోతారు? ప్రపంచం నీట మునుగుతూంటే, వరాహావతారం నెత్తిన శ్రీ మహావిష్ణువు తన దుష్టులపైన భూమిని నిలిపాడు. రక్షించాడు.

ఇప్పుడు ఏడీ శ్రీ మహావిష్ణువు? ఏదీ ఆయన అవతారం?

రాక్షస తండ్రి అకృత్యాలనుంచి తన భక్తుడిని రక్షించటానికి నరసింహావతారం ఎత్తాడు.

హిరణ్య కశిపుడి ప్రేవులు చీల్చాడు.

ఏడీ నరసింహుడు ఇపుడు?

గంగాధర శర్మ మనస్సులో అనేకానేక ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి.

ఆలోచనలు కట్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమయిందన్నట్టు దూరంగా అశ్వాల పదఘట్టనలు వినిపించాయి.

అయితే, తురుష్కులు ఈసారి పథకం మార్చారు. అందరూ ఒకేవైపు నుంచి రాలేదు. ఊరిని చుట్టుముడుతూ నాలుగు వైపుల నుంచి దూసుకు వస్తున్నారు.

నిస్సహాయత గంగాధర శర్మని ముంచెత్తింది

అతడి చేతిలోంచి కత్తి జారిపోయింది.

●●●

ఊరు దగ్గర పడుతున్న కొద్దీ చంద్రశేఖరుడిలో ఆత్రం పెరిగిపోతోంది. గుర్రాన్ని మరింత వేగంగా నడిపిస్తున్నాడు. దాని వేగం సరిపోక చావబాదుతున్నాడు. చిరాకు పడుతున్నాడు అతడిని గమనిస్తున్న శూరవర్మ, ఊరు దగ్గర పడుతూండగా చెప్పాడు.

'చంద్రశేఖరా.. ఆవేశం అనర్ధదాయకం ఊర్లో పరిస్థితి ఎలా ఉందో తెలియదు. మనం ముందు వెనక చూడకుండా దూసుకు వెళ్ళటం వల్ల లాభం ఉండదు. పైగా నష్టం సంభవిస్తుంది. అందుకే ముందుగా పరిస్థితిని తెలుసుకుందాం. ఆపై ప్రణాళిక ప్రకారం దాడి చేద్దాం' అన్నాడు శూరవర్మ.

చంద్రశేఖరుడు కోపంతో ముక్కుపుటాలదరుతూండగా, కళ్ళు ఎర్రబడగా, ఆవేశంతో అన్నాడు.

'అక్కడ ఊళ్ళో ఉన్నది అమ్మ, గంగాధరశర్మ. వాళ్ళు నా తల్లి, సోదరులు. మీవాళ్ళు ఎవరున్నారు? మీకెందుకుంటుంది ఆత్రం? మీలా, అది నా ఊరు కాకపోతే నేనూ శాంతి మంత్రం వల్లెవేస్తాను. నీతులు చెపుతాను.'

శూరవర్మ చంద్రశేఖరుడివైపు తీక్షణంగా చూశాడు.

'మనం వెళ్ళే ప్రతిగ్రామంలో, ఎవరో ఒకరి తల్లి ఉంటుంది. తండ్రి ఉంటాడు. సోదరులు ఉంటారు. ఈ దేశం, ఈ ధర్మం, ఈ సంస్కృతి మనది. ఇందులో వాళ్ళమంతా బంధువులమే. అలా అనుకోబట్టే, నేను ఓ సేనను తయారు చేసి ఊరూరా తిరుగుతున్నాను. మన వారిని రక్షించాలని ప్రయత్నిస్తున్నాను. నా వెంట ఉన్న వీరంతా ప్రతి ఒక్క గ్రామంలో, ఉన్న ప్రతి ఒక్క సనాతన ధర్మానుయాయి మన బంధువుగానే భావిస్తున్నారు. దాడికి గురయిన వారంతా వారి కులం, ధర్మం, నమ్మకాలు సంబంధం లేకుండా మనవారిగానే భావిస్తున్నారు. మనం మనుషులం. మన కులం మానవ కులం. మన ధర్మం మానవ ధర్మం. మనిషిని రక్షించటం మన కర్తవ్యం. అలా కాక, నీ కుటుంబం వారే నీ వారు అనుకునే సంకుచితత్వాన్నే ప్రదర్శిస్తానంటే అది నీ ఇష్టం అది నీ ఇష్టం. ఈ ప్రపంచం మన కుటుంబం. ఇందులోని వారంతా మన బంధువులు. అలా అనుకుని ఆపదలో ఉన్నవారిని రక్షించటానికి సిద్ధం. లేకపోతే, నీ వల్ల మాకూ ప్రమాదం' అన్నాడు.

అతడి మాటలు విన్న చంద్రశేఖరుడి వేగం తగ్గిపోయింది.

'అంటే, మీరు చెప్పినట్టు వినకపోతే మీతో నాకు స్థానం ఉండదా?' అడిగాడు శూరవర్మ మాట్లాడలేదు.

చంద్రశేఖరుడు రెట్టించి అడిగాడు.

'మనమంతా కలిసి కట్టుగా ఒకటై మన జీవన విధానాన్ని భగ్నం చేస్తున్న వారితో పోరాడాల్సిన సమయం ఇది. మన జీవన విధానాన్ని, ధర్మాన్ని, దైవాన్ని రక్షించుకోవాల్సిన సమయం ఇది. ఈ సమయంలో సంకుచిత్వాలు, తొందరపాటులకు తావులేకుండా మనం కలిసి కట్టుగా ఉండాలి.'

చంద్రశేఖరుడు మాట్లాడలేదు. కానీ వేగం పెంచలేదు.

ఊరు దగ్గర పడగానే, శూరవర్మ అందరినీ ఆగమని సౌంజ్ఞ చేశాడు.

వీరికన్నా ముందు బయలుదేరి, పరిస్థితిని సమీక్షించి, వివరించేందుకు వెళ్ళిన చోరులు చెట్టుచాటు నుంచి బయటకు వచ్చారు.

వారిని చూడగానే జరగరానిదేదో జరిగిందని స్పష్టంగా తెలుస్తోంది

నాలుగువైపుల నుంచి పెద్ద సంఖ్యలో తురుష్కులు పెద్దగా అరుస్తూ, వేగంగా, ఊళ్ళోకి ప్రవేశించారు.

అలా ప్రవేశించినవారు 'అల్లాహో అక్బర్' అని అరుస్తూ కత్తులు తిప్పుతూ, కనబడిన వారిని నరకసాగారు.

ఏడుస్తున్న వారి తలలెగిరి క్రిందపడ్డ వారి ముఖాలపై ఏడుపు అలాగే ఉంది.

తమ ప్రాణం పోయిందన్న గ్రహింపు కూడా వారికి రాలేదు.

దైన్యంగా, శూన్యంలోకి చూస్తున్న వారి పరిస్థితీ అంతే. వారి కళ్ళల్లో ప్రాణం పోయింది తప్ప, వారి ముఖంలో దైన్యం పోలేదు.

క్షణంలో తురుష్కులు పద్మినిని, ప్రహరసింహుడినీ చుట్టుముట్టారు.

అది చూసిన గంగాధర శర్మ క్రింద పడిన కత్తిని తీసుకున్నాడు. ఆ వైపు లంఘించాడు.

అప్పటికే ప్రహరసింహుడు అతివేగంతో కత్తిని తిప్పుతూ గుర్రాలపైనున్న ఇద్దరు తురుష్కుల తలలను ఎగరగొట్టాడు.

పద్మిని ప్రచండ వేగంతో ఓ తురుష్కుడిపై లంఘించింది.

అది ఊహించని వాడు క్రిందపడగానే, వాడి గుండెలలో కత్తిని దింపి, అదే ఊపులో, గుర్రం పైకి ఎగిరింది.

ఆమె వేగం, చాకచక్యం చూసిన తురుష్కులు స్థంభించి పోయారు.

అయితే, ఎంత వేగంగా గుర్రం పైకి దూకిందో, అంతవేగంగా, ఆమె కత్తి తిప్పుతూ తురుష్కులపైకి దూకింది.

కళ్ళుమూసి తెరిచేలోగా, తురుష్కుల తలలు గాల్లోకి ఎగిరాయి.

ఇది చూసి కొందరు ఈ వైపుకు దూసుకు రాసాగారు.

వెంటనే గంగాధర శర్మ వారికి అడ్డుపడ్డాడు.

తాను కూడా పద్మినిలా ఓ గుర్రంపైకి ఎక్కితే తురుష్కులను ఎదుర్కోవటం సులభం అవుతుందనిపించింది.

నేలపై నుండి గుర్రాలపైనున్న వారిని ఎదుర్కోవటం కష్టంగా ఉంది.

తురుష్కుల ప్రహారాలను గంగాధర శర్మ సులభంగా ఎదుర్కోసాగాడు. ఎందుకో క్షణంలో అతడికి తాను జీవితంలో ఎప్పటినుంచో యుద్ధం చేస్తున్నట్టు అనిపించసాగింది.

తురుష్కుడి కత్తి ఎత్తే పద్ధతి చూడగానే, వాడు ఏవైపు దాడిచేస్తాడో అర్ధమై పోతోంది. వాడి కత్తి దిగేలోగా వాడిచేతిలో కత్తిని ఎగరగొట్టేస్తున్నాడు. గుర్రం వాళ్ళు నరికేయటంతో వారు క్రిందపడుతున్నారు.

వారిని దూరం తరిమేస్తున్నాడు కానీ వారిని సంహారించటం లేదు గంగాధరశర్మ.

కానీ, అలా చేయటం వల్ల అతడిపై ఒత్తిడి పెరుగుతోంది.

క్రిందపడిన వారు కత్తులు తీసుకుని మీదకు వస్తున్నారు. గుర్రాలపైని వారు గుర్రాలను మీదకు దూకిస్తున్నారు. వాటితో గంగాధర శర్మను తన్నించాలని ప్రయత్నిస్తున్నారు.

ఇంతలో తురుష్కులు గుర్రాలపై తనని చుట్టుముట్టారని గ్రహించాడు గంగాధర శర్మ. అంతేకాదు, వారు తనని ప్రాణాలతో పట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారని అర్థం చేసుకున్నాడు.

వాళ్ళ మాటల్లో 'బొమ్మన్' అన్నది విన్నాడు. అది 'బ్రాహ్మణ్'కు అపభ్రంశ శబ్దమని గ్రహించాడు.

రాను రాను వారి ఒత్తిడి పెరుగుతోంది.

ఒక్కడే వారిని ఎదుర్కోలేనని గ్రహించాడు. కానీ పారిపోవటానికి వీలులేదు. ప్రాణాలతో వారికి చిక్కితే.?

పద్మిని, ప్రహసింహుడు ఎలా ఉన్నారో చూడాలని ఉంది. కానీ కనురెప్ప సమయం దృష్టి మళ్ళినా, తను దెబ్బతింటాడని తెలుసు.

ఇంతలో దూరంగా కోలాహలం వినిపించింది.

'కాఫెర్ లోగే..' అన్న అరుపులు వినిపించాయి.

●●●

**'కాఫెర్ లోగ్' అన్న అరుపు వినబడటంతోటే పరిస్థితిలో మార్పు వచ్చింది.**

అంతవరకూ ముగ్గురే నన్న అలసత్వంతో పోరాడుతున్న తురుష్కుల పోరాటంలో మార్పు వచ్చింది.

అంతవరకూ లేని ఉద్విగ్నత, తత్తరపాటులు వారిలో కనపడసాగాయి.

దూరంగా గుర్రాలు పరుగెత్తుతూ వస్తున్న సూచనగా దుమ్ములేస్తోంది. ఆ దుమ్ము ఆధారంగా ఎంతమంది కాఫిర్‌లు వస్తున్నారో అంచనా వేయాలన్న ఆతృత వారిలో కనపడసాగింది.

వారి దృష్టి చెదరటంతో ప్రహరసింహుడు, పద్మిని విజృంభించారు. దాంతో గంగాధర శర్మపై ఒత్తిడి తగ్గింది. తనపైకి విరుచుకుపడుతున్న తురకలను వెనక్కు నెట్టసాగాడు గంగాధర శర్మ.

గంగాధర శర్మ యుద్ధంలో క్రౌర్యం లేదు. ఆవేశం లేదు. అతనిది ఆత్మరక్షణ యుద్ధం తప్ప శత్రువును సంహరించాలని చేస్తున్న యుద్దం కాదు. అందుకని కూడా ఇంత వరకూ అందరిపై ఒత్తిడి పెరుగుతూ వచ్చింది.

శత్రువుల సంఖ్య తగ్గుతూంటే ఒత్తిడి తగ్గుతుంది. శత్రువు సంఖ్య తగ్గాలంటే శత్రువును చంపాలి. గంగాధర శర్మ అది చేయకపోవటంతో మిగతా వారిపై కూడా ఒత్తిడి పెరుగుతూ వచ్చింది కానీ, ఇప్పుడు తమకు సహాయంగా ఏవో సేనలు వస్తున్నాయని తెలియటంతో తురుష్కుల దృష్టి చెదిరింది. పద్మిని, ప్రహర సింహుల వేగం పెరిగింది.

ఇంతలో దూరంగా వస్తున్న అశ్వకులు దగ్గరకు వచ్చారు. వారి సంఖ్య గుప్పెడే ఉంది. అది చూడగానే తురుష్కులు పెద్దగా నవ్వారు.

'కుఛ్ హీ హోగ్ హై' అని అరుచుకున్నారు.

ఏదో పెద్ద సైన్యం వస్తున్నదని భయపడ్డవారి భయం క్షణంలో తేలిపోయింది. కుంభవృష్టి కురుస్తుందని భయపడ్డ రైతు చినుకులతో సరిపెట్టుకున్న వర్షాన్ని చూసి సంతృప్తిగా నవ్వే నవ్వు అది.

●●●

ఊరు దగ్గర పడుతూంటే చంద్రశేఖరుడిలో ఉద్విగ్నత పెరిగిపోతోంది. తురుష్కులు తమ ఊరివైపే ప్రయాణిస్తున్నట్టు స్పష్టమవుతోంది. అది క్షణక్షణానికీ చంద్రశేఖరుడికి ఉద్విగ్నత పెంచుతోంది.

శూరవర్మ నిర్భావంగా ఉన్నాడు. వెంట ఉన్నవారిలో అలసట స్పష్టంగా తెలుస్తోంది. వరుస పరాజయాలతో వారు నిరాశలో మునిగి ఉన్నారు. వారికి మరోసారి తురుష్కులతో తలపడాలని లేదు. వారికి విశ్రాంతి కావాలని ఉంది. తమ తమ ఇళ్ళకు చేరుకుని తమ కుటుంబాలతో గడపాలని ఉంది.. కానీ..

శూరవర్మకు తన వెంట ఉన్న యోధుల శౌర్య పరాక్రమాల విషయంలో ఎలాంటి సందేహం లేదు. కానీ వరుస పరాజయాలు, స్నేహితుల మరణాలు, నిరంతర పోరు వారిని మానసికంగా క్రుంగదీస్తున్నాయని తెలుసు. కానీ ప్రస్తుతం పరిస్థితి ఎలా ఉందంటే, శత్రువు నలువైపులనుంచీ దాడులు చేస్తున్నారు. పలు తావుల దాడులు చేస్తున్నాడు. తమ పరిస్థితి పలు రంధ్రాల నుండి వేగంగా, ఉద్ధుతంగా చొచ్చుకుని వస్తున్న నీటిని ఆపి పడవని మునకనుంచి రక్షించాలని ప్రయత్నిస్తున్న వాళ్ళలా ఉంది.

ఎంత ప్రయత్నించినా నీళ్ళు లోపలకు రాకమానవు. పడవ మునగక తప్పదు. కానీ పడవ మునగక తప్పదని ప్రయత్నాలు మానేయటం మరణ సదృశ్యం. ఊపిరి ఉన్నంతవరకూ నీటిని ఆపాలని ప్రయత్నిస్తూనే ఉండాలి.

ఇంతలో చంద్రశేఖరుడి స్వరం నుంచి అప్రయత్నంగా కేక వెలువడింది. వారికి దూరంగా ఊళ్ళో పోరు సాగుతూ కనిపించింది. ఎవరు యుద్ధం చేస్తున్నారో తెలియలేదు. కానీ సమరం జరుగుతున్నట్టు తెలుస్తోంది. అది చూడగానే శూరవర్మకు గర్వంగా అనిపించింది.

తన శిక్షణ ఫలితం ఇది!

అనేక ఊళ్ళు తురుష్కులను ప్రతిఘటించలేకపోయాయి. తురుష్కులు వస్తున్నారని తెలియగానే ప్రాణాలు. అరచేత పట్టుకుని పారిపోయారు ప్రజలు. కానీ తురుష్కులకు దొరికిపోయారు.

ఒక ఊరు తురుష్కుల వశమయితే దాని ప్రభావం ఇరుగు పొరుగు ఊళ్ళమీద పడేది.

'వాళ్ళే లొంగిపోయారు. మనమెంత?' అని భయపడేవారు.

తురుష్కుల అకృత్యాల వార్తలు చిలవలు పలవలై ప్రచారం జరిగేది దాంతో తురుష్కులు రాకముందే ప్రజలు మానసికంగా పరాజయానికి సిద్ధమై ఉండేవారు.

ఇందుకు భిన్నంగా ఈ ఊరు తురుష్కులను ప్రతిఘటిస్తోంది!

గెలుపు, ఓటముల ప్రసక్తి తరువాత, కనీసం ఎదురు నిలిచిపోరాడుతోంది. ఇలాంటి ఆలోచనలతో శూరవర్మ ముందుకు సాగుతున్నాడు.

ఊరు దగ్గరపడింది.

అందరినీ ఆగమని సౌంజ్ఞ చేశాడు శూరవర్మ.

కానీ చంద్రశేఖరుడు ఆగలేదు. ఆవేశంతో అతడు గుర్రాన్ని ముందుకు దూకించాడు. శూరవర్మ వారించేలోగా మిగతావారు చంద్రశేఖరుడిని అనుసరించారు. శూరవర్మకు ఎందుకో నిస్సత్తువగా అనిపించింది.

ఆవేశం అనర్థదాయకం. యుద్ధానికి ప్రణాళిక కావాలి. ముఖ్యంగా, శత్రు సంఖ్య అధికంగా ఉన్నప్పుడు, తమ సంఖ్య తక్కువగా ఉన్నప్పుడు, తాము కలిసిపోయి ఉన్నప్పుడు ఆవేశం వల్ల లాభం కన్నా నష్టం కలుగుతుంది. ఈ సమాజంలో అత్యంత శక్తిమంతులున్నారు. విజ్ఞానవంతులున్నారు. శూరులు ఉన్నారు. మేధావులు ఉన్నారు.

కానీ ఆవేశం అన్నిటినీ దెబ్బతీస్తోంది. ముందూ వెనుక చూడకుండా ముందుకు దూసుకు పోవటం అన్నిటినీ నిర్వీర్యం చేస్తోంది..

చేసేది లేక తానూ వారిని అనుసరించాడు శూరవర్మ.

●●●

వస్తున్న వారి సంఖ్య తురుష్కులలో ఉత్సాహం పెంచింది. వారు రెండుగా విడిపోయారు.

ఒక భాగం ఊరికి వస్తున్న కొత్త కాఫెర్‌లను అడ్డుకోవటానికి వెళ్ళింది.

మరో భాగం రెట్టించిన ఉత్సాహంతో ఉన్న ముగ్గురిపై విరుచుకుపడింది

●●●

పద్మిని, ప్రహరసింహుడు వీరోచితంగా పోరాడుతున్నారు.

తమకు సహాయంగా ఎవరో వస్తున్నారన్న ఆలోచన వారి ఉత్సాహాన్ని పెంచింది. కానీ అంతలో తమకు సహాయంగా వస్తున్నవారు గుప్పెడు మందేనని తెలియగానే వారికి నిరాశగా అనిపించింది. అదీగాక గంగాధర శర్మ కేవలం ఆత్మరక్షణ కోసం పోరాడటం కూడా వారిపై ఒత్తిడి పెంచుతోంది.

●●●

గంగాధరశర్మ శక్తి సన్నగిల్లుతోంది.

ఆత్మరక్షణ కోసం మాత్రమే యుద్ధం చేయటం వల్ల ప్రమాదం ఇదే ఒక వ్యక్తితో పోరాడే సమయంలో ఆత్మరక్షణగా పోరాడటం వల్ల లాభం ఉంటుంది.

ఎదుటి వ్యక్తి బలం ఉపయోగించి దాడిచేస్తాడు. దాంతో అతడి శక్తి ఖర్చవుటం, దాన్ని ఎదుర్కోవటం వల్ల పెద్దగా శక్తి ఖర్చుకాదు దాంతో, కాస్సేపటి తరువాత దాడి చేస్తున్నవాడు అలసిపోతాడు. అప్పుడు ఆత్మరక్షణ చేస్తున్న వాడు విజృంభిస్తే విజయం సులభం అవుతుంది.

కానీ అధికులతో పోరాడే సమయంలో ఆత్మరక్షణగా పోరాడటం ఆత్మహత్య సదృశం.

ఎందుకంటే ఒకేసారి పలుదాడులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. పైగా, దాడి చేసేవారికి విశ్రాంతి తీసుకునే వీలుంటుంది. ఆత్మరక్షణ చేసుకునేవాడికి ఆ వీలుండదు. నిరంతరం దాడిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. దాంతో అతడు బలహీనవుతాడు. ఇది దాడి చేస్తున్న వారికి విజయంగా పరిణమిస్తుంది.

గంగాధర శర్మకు ఇది తెలియదు.

అతనికి ఎంతసేపూ, మరో ప్రాణం తీయకూడదన్న ఆలోచన తప్ప, తన ప్రాణం ప్రమాదంలో పడుతుందన్న గ్రహింపు లేదు. అతడు యుద్ధం చేస్తున్నాకానీ, అతడి మనస్సు యుద్ధంపై లేదు.

అతనిలో ఒక పార్శ్వం 'ఏమిటిదంతా?' అని ఆలోచిస్తోంది.

'ఎందుకిదంతా?' అని తర్కిస్తోంది.

భగవంతుడి సృష్టిలో ఎల్లలు లేవు. సరిహద్దులు లేవు.

గాలి, నీరు, చెట్టు, పుట్ట, గుట్ట, ఆకాశం, మేఘం, పశువులు, పక్షులు, జంతువులు ఏ ప్రాణీ కూడా సరిహద్దులను గుర్తించదు.

కానీ ఆలోచించగలిగి, మేధాశక్తి ఉన్న మనిషి మాత్రం ఎందుకని ఈ అనంతంలో హద్దులను గీస్తాడు? సముచితంగా వ్యవహరిస్తాడెందుకని?

ఎందుకని ఇతర చరాచర సృష్టిలాగా విశాలంగా ఆలోచించలేడు మనిషి? ఎందుకని కలిసి మెలసి జీవించలేడు మనిషి?

●●●

గంగాధర శర్మ బలహీనుడవటం గమనించారు అతనితో పోరాడుతున్న తురుష్కులు.

అతడిపై శక్తినంతా ఉపయోగించి దాడిచేస్తే, అతడు కుప్పకూలే సమయం దూరంలో లేదని గ్రహించారు.

దాంతో వారు విజృంభించారు.

●●●

తురుష్కులతో పోరాడుతున్నది పద్మిని, గ్రహించాడు చంద్రశేఖరుడు. ఆమె పోరాడే విధానం అతడిని ఆశ్చర్యపరచింది.

పద్మిని పోరు పద్ధతి విచిత్రంగా ఉంది.

చూస్తూంటే ఆమె నృత్యం చేస్తున్నట్టుంది. అది కాళికాదేవి శత్రు సంహారం చేస్తూ చేసే కరాళ భయంకర నృత్యం.

అది చూసి చంద్రశేఖరుడి ఉత్సాహం హెచ్చింది. ఆమెకు తన శక్తిని చూపించాలన్న కోరిక కలిగింది. దాంతో, తురుష్కులను తాకటమే అత్యుత్సాహంతో దూకాడు చంద్రశేఖరుడు.

ఇది పద్మినిని ఆకర్షించటానికి, ఆమె మెప్పుపొందటం కోసం తాను చేస్తున్న యుద్ధంలా అనిపించింది చంద్రశేఖరుడికి.

ఇదొక ఆటలా అనిపించింది చంద్రశేఖరుడికి.

ఒక తురుష్కుడి తలను బంతిలా ఎగరగొట్టాడు.

మరో తురుష్కుడి ప్రాణాన్ని గాల్లో కలిపేశాడు.

ఇంకో తురుష్కుడి కాలిని తలను వెతకటానికి పంపించాడు.

ఇంకొక్క తురుష్కుడి చేతిని గుండెల వేటలో పంపాడు.

చంద్రశేఖరుడి వీరవిహారంలో క్రీడా వినోదం కనిపిస్తోంది.

●●●

శూరవర్మ పరిస్థితిని గమనించాడు.

తురుష్కుల సంఖ్య ఎక్కువగా ఉన్నా, ఓ వైపు పద్మిని, మరోవైపు ప్రహరసింహుడు వారిని అదుపులో పెట్టడం గమనించాడు.

చంద్రశేఖరుడి వీరవిహారం తురుష్కుల ప్రవాహాన్ని నియంత్రిస్తోంది.

అతడి ఆవేశం ఇతరులలో ఉత్సాహాన్ని నింపుతోంది.

కానీ గంగాధర శర్మ ఆత్మరక్షణ వల్ల చంద్రశేఖరుడి వీరవిహారం తురుష్కుల ప్రవాహాన్ని నియంత్రిస్తోంది. అతడి ఆవేశం ఇతరులలో ఉత్సాహాన్ని నింపుతోంది.

కానీ గంగాధరశర్మ ఆత్మరక్షణ వల్ల తమ యుద్ధంలో సమతుల్యం లోపిస్తోందని అర్థం చేసుకున్నాడు శూరవర్మ.

అతడికి గంగాధర శర్మపై జాలి కలుగుతోంది.

నిత్య పరిణామ శీలి ఈ ప్రపంచం.

ఇందులో మార్పు అనేది సహజ పరిణామం.

మంచి అయినా, చెడు అయినా మార్పును స్వీకరించే దానికి తగ్గట్టు రాజీపడేవారు జీవిస్తారు.

మార్పును అర్థం చేసుకుని దాని ఆధారంగా ముందుకు సాగటం అభివృద్ధికరం కానీ మార్పును అర్థం చేసుకోకుండా, మార్పును స్వీకరించలేకపోవటం ఆత్మహత్య సదృశం. అలాంటి వారికి మరణం తప్ప మరో శరణ్యం లేదు చంద్రశేఖరుడు మార్పుతో రాజీపడిపోయాడు. ఓ రకంగా చెప్పాలంటే మార్పును సంతోషంగా స్వీకరించాడు. తానే ఆ మార్పు అయ్యాడు. ఇందుకు భిన్నంగా గంగాధర శర్మ మార్పును స్వీకరించలేకపోతున్నాడు. అది అతడి ఉనికి ప్రమాదంలోకి నెడుతోంది.

కానీ గంగాధర శర్మలాంటి వారు మార్పుని స్వీకరిస్తే, ఆ మార్పుకే నూతన దిశనివ్వగలరు. తమ మేధతో మార్పును సరైన దిశలో నిర్దేశించగలరు.

కానీ గంగాధర శర్మలో ఈ మార్పు ఎప్పుడు వస్తుంది? ఆ మార్పు వస్తే ఏ దిశలో ప్రవహిస్తుంది?

పద్మిని యుద్ధ విధానం తురుష్కులను చిరాకు పరుస్తోంది. ఎలాగయినా ఆమెని పడగొట్టాలని తురుష్కులు సైగలద్వారా నిశ్చయించుకున్నారు. యుద్ధంలో మార్పు లేకుండానే ప్రహరసింహుడిని వదిలి మరికొందరు పద్మిని వైపు వచ్చారు.

గంగాధర శర్మతో పోరాడుతున్నవారు కొందరు పద్మిని వైపు మళ్ళారు. దాంతో పద్మినిపై ఒత్తిడి పెరిగింది.

ఆమె ఓ వైపు దాడి చేయగానే మిగతా మూడు వైపులనుంచి కత్తులు ఆమె వైపు వేగంగా దూసుకు వస్తున్నాయి.

దాంతో ఆమెకు వేగం పెంచాల్సి వస్తోంది. అప్పటికే చాలాసేపటినుంచి పోరాడుతూండటం వల్ల ఆమె అలసిపోతోంది. ఈ దశలో వేగం పెంచాల్సి రావటం ఆమె శక్తిని వేగంగా హరిస్తోంది.

ఇంతలో ఆమె ఓ వైపు దాడిని ఎదుర్కొని, దూకి, మరో వైపు దాడిని ఎదుర్కోబోతుంటే, అడ్డుగా ఉన్న రాయి ఆమె కాలికి తగిలింది. జరుగుతున్నది అర్థమయ్యేలోగా ఆమె క్రిందపడింది.

పైన ఆకాశం కనబడే బదులు ఆమెకు కత్తులు కనిపించాయి దృష్టిపథాన్ని సంపూర్ణంగా నింపుతూ.

●●●

**'మిల్ గయా, లడ్కీ మిల్‌గయా'**

అంత హోరులోనూ స్పష్టంగా వినిపించిందో స్వరం.

తురుష్కులను తుఫానులా సంహరిస్తున్న చంద్రశేఖరుడి దృష్టి ఆ వైపు మళ్ళింది. తురుష్క ప్రవాహ తాకిడిని తట్టుకుని వెనక్కు తోస్తున్న శూరవర్మ ఆ వైపు చూశాడు.

వీరావేశంతో తురుష్కులను ఎదుర్కొంటున్న ప్రహరసింహుడు ఆ స్వరం వినిపించిన వైపు చూశాడు.

ఒక తురుష్కుడు పద్మిని రెండు చేతులు వెనక్కు విరిచి పట్టుకున్నాడు. మిగిలిన వారంతా చుట్టూ చేరి నవ్వుతున్నారు.

****

చంద్రశేఖరుడిలో ఆవేశం పెల్లుబికింది.

శూరవర్మ కళ్ళు నిప్పులు కురిపించాయి.

ప్రహర సింహుడు మితిమీరిన ఆవేశంతో తన ఎదురుగా ఉన్న తురుష్కుల అడ్డుతొలగించుకుని, పద్మిని ఉన్న వైపు దూసుకెళ్ళాడు.

గంగాధర శర్మ మనసులో దాడి చేస్తున్న వారిని యాంత్రికంగా ఎదుర్కొంటున్నాడు తప్పించి ఎందుకనో అతడిలో విరక్తి భావన జాగృతమయింది.

ఇంతలో ఓ తురుష్కుడు అరిచాడు, స్వచ్ఛమైన సంస్కృతంలో.

'మీరు యుద్ధం చేసి లాభం లేదు. ఈ యువతి మాకు చిక్కింది. మీరూ లొంగిపోయి ప్రాణాలు కాపాడుకోండి.'

అతడు అంత స్వచ్ఛంగా మాట్లాడటంలో ఎవరికీ ఆశ్చర్యం కలగలేదు.

ఎందుకంటే, భారతీయ సమాజం అల్లకల్లోలమవుతున్న కాలం అది.

ప్రాణాలు కాపాడుకోవటం కోసమో, కుటుంబాన్ని రక్షించుకోవటం కోసం, హింసను తప్పించుకోవటం కోసమో, ప్రజలు మతం మారిపోతున్నారు.

మతం మారినా వారిలో సంస్కారం అదృశ్యమై పోదు దాంతో వారు పాతను వదలలేక కొత్తను మనస్ఫూర్తిగా ఆమోదించలేక సంఘర్షణకు గురవుతున్నారు. ఈ సమయంలో భారతీయ సమాజం అలాంటి వారిపై సానుభూతి చూపి, వారి సంఘర్షణను అర్థం చేసుకునే దశలో సమాజం లేదు.

సాధారణంగా ఓ వ్యక్తి ఏదైనా ఇష్టంగా చేస్తే అతని మానసిక స్థితి వేరుగా ఉంటుంది. తనపై బలవంతాన రుద్దిన వారి మీద ద్వేషం, తాము కోల్పోయిన దాని మీద ప్రేమ పెరుగుతుంది.

కానీ, భారతీయ సమాజంలో సనాతన ధర్మాన్ని వదిలి మరో మతం స్వీకరించిన వారి మానసిక స్థితి ఇందుకు భిన్నంగా ఉంటోంది. ఆరంభంలో, బలవంతాన, గతిలేని పరిస్థితిలో ఈ పరమతం స్వీకరించిన వాడు మానసికంగా కృంగిపోతాడు. సిగ్గుతో చితికిపోతాడు. అలాంటి వాడిని సానుభూతితో అర్థం చేసుకుని, అక్కున చేర్చుకునే ఓపిక, తీరిక, ఔదార్యం భారతీయ సమాజం ప్రదర్శించలేకపోయింది. అల్లకల్లోలంలో ఉండి, తన అస్తిత్వాన్ని నిలుపుకోవటం కోసం, మనుగడ కోసం పోరాడుతున్న సమాజం ఆ క్షణం గురించి తప్ప భవిష్యత్తు గురించి ఆలోచించలేకపోయింది. దాంతో నిరాదరణకు గురయి, తమ ప్రమేయం లేని తప్పుకు ఛీత్కారాన్ని అవమానాలను తమ వారి నుంచే ఎదుర్కొన్న వారు తమ ఒకప్పటి సహచరులపై పై ద్వేషం పెంచుకున్నారు. బలవంతాన స్వీకరించిన మతాన్ని అక్కున చేర్చుకున్నారు.

తమని తాము ఉన్నతులుగా భావించమంటూ, ఇతరుల బలహీనతలను, వాత్సల్యాన్ని ఈసడించుకుంటున్న వారిని ఆ పీఠం నుంచి లాగి తమలాగే, మురికి కూపంలోకి లాగాలని కంకణం కట్టుకున్నారు. దాంతో అసలు తురుష్కులకన్నా ఈ మతం పుచ్చుకున్న తురుష్కులు మరింత క్రౌర్యంగా, పట్టుదలగా ప్రవర్తిస్తున్నారు. తమని దగ్గరకు రానీయని సనాతన ధర్మాన్ని సమూలంగా నాశనం చేయాలని పట్టించి ద్వేషంతో ప్రయత్నిస్తున్నారు.

తురుష్కుడు సంస్కృతంలో మాట్లాడగానే గంగాధర శర్మ మనస్సులో గురువుగారు చెప్పిన మాటలన్నీ మెదిలాయి.

మనసు బాధతో మూల్గింది.

ఎటువంటి మహా పండితుడో ఇప్పుడు తురుష్కుడయ్యాడు. తన పాండిత్యాన్ని ఇపుడీయన సనాతన ధర్మంలోని లోపాలను ప్రచారం చేయటానికి, సనాతన ధర్మ సూత్రాలకు దుర్వ్యాఖ్యానం చేయటానికే వాడతాడు.

మరోసారి అరిచాడా తురుష్కుడు.

'మీరు ఇక పోరాడి లాభం లేదు. లొంగి పొండి. ప్రాణాలు కాపాడుకోండి.' కానీ ఇపుడు పోరాటం ఆపి లాభం లేదని అందరికీ తెలుసు.

అందుకే రెట్టించిన ఉత్సాహంతో పోరాడసాగారు అందరూ. ముఖ్యంగా ఇప్పుడు పద్మినిని రక్షించటం వారందరి లక్ష్యం.

జాప్యం చెయ్యకుండా తన ఎదురుగా ఉన్న వారిని నిర్దాక్షిణ్యంగా మట్టు పెట్టి చంద్రశేఖరుడు పద్మినిని పట్టుకున్న వారివైపు దూసుకు పోసాగాడు.

ప్రహరసింహుడు అప్పటికే పద్మినిని చుట్టుముట్టిన వారిని చేరుకున్నాడు. శర్మ మారిన పరిస్థితిని గమనించాడు. ఇదే అనువైన సమయం అని గ్రహించాడు.

ఇంతవరకూ జరిగిన పోరులో తమకు ఒక నిర్దిష్ట లక్ష్యం లేదు. ఎవరికి వారు తమ ప్రాణాలను రక్షించుకోవటం కోసం పోరాడుతున్నారు. కానీ, పద్మిని తురుష్కులకు చిక్కటం తామందరికీ ఒక కేంద్రాన్ని కల్పించింది. ఇప్పుడు తాము తమ శక్తినంతా పద్మినిని రక్షించటం వైపు మళ్ళిస్తారు. అంటే ఎవరికి వారుగా పోరాడేవారు అంతా ఒకటై పోరాడతారు. అందుకే శూరవర్మ ఇతర అనుచరులకూ సైగ చేశాడు.

దాంతో అందరూ ఒక్కసారిగా పద్మినిని చుట్టుముట్టి తురుష్కులపై దాడి చేశారు.

జరుగుతున్నది గంగాధర శర్మ గమనిస్తున్నాడు. కానీ అతనికి యుద్ధం పై ఆసక్తి పోతోంది.

ఏం లాభం? ఏమిటీ ప్రయోజనం?

తాము ఎలాగో ఈ తురుష్కులను గెలవలేరు. ఇప్పుడు తాత్కాలికంగా గెలిచినా, మళ్ళీ మరో తరంగం తమపై విరుచుకు పడుతుంది. అప్పుడయినా తాము ఓడిపోక తప్పదు.

గంగాధర శర్మలో పెరుగుతున్న నిరాసక్తత అతడి యుద్ధ పద్దతిలో ప్రతిఫలించసాగింది.

గంగాధర శర్మ శత్రు ప్రహారాలను ఎదుర్కోవటంలో పొరపాట్లు చేయసాగాడు. ఒక తురుష్కుడి కత్తి అతడి భుజం పై గాయం చేసింది. మరో కత్తి అతని చేతిపై చర్మాన్ని తొలగించింది.

అని చిన్నగాయాలే. కానీ తన శరీరంపైన అయిన గాయం నుండి రక్తం రావటం గంగాధర శర్మలో మరిన్ని ఆలోచనలు కలిగించసాగింది. అతడికి నొప్పిగా ఉంది. శరీరం మంటగా ఉంది. అలసటగా ఉంది. అన్నీ వదిలేసి, ఏదో ఓ మూల ప్రశాంతంగా నిద్రించాలని ఉంది. కానీ అతడి మెదడు చురుకుగా పని చేయసాగింది.

అతడికి ఇదంతా రభసలాగా అనిపించసాగింది. ఇది నిజం కాదు 'కల' అనిపిస్తోంది. ఇంకాస్సేపటికి తాను నిద్రలేస్తాడు.

అమ్మ ఇంట్లో భజనలు పాడుతూ పని చేస్తూంటుంది తాను గ్రంధాలు చదువుతూంటాడు. అంతా శాంతంగా, ప్రశాంతంగా ఉంటుంది అనిపిస్తోంది మరోవైపు. తన శరీరం నుంచి కారుతున్న రక్తం చూస్తూంటే, 'ఇది తాకేనా?' అన్న సందేహం జనిస్తోంది.

ఏమిటీ శరీరం?

లోపల మాంసం, రక్తం.. పైన చర్మం.. ఇందులో తానెవరు? ఈ చూస్తున్నదెవరు? ఆలోచిస్తున్నదెవరు? అనుభవిస్తున్నదెవరు?

మరి ఈ పోరాడుతున్న దెవరు?

ప్రశాంతంగా గ్రంథాలు పారాయణం చేస్తూ విద్యనభ్యసించినదెవరు? కత్తి పట్టిన తానెవరు?

అనేక రకాల ప్రశ్నలు అతని మెదడులో ఉత్పన్నమై, తరంగాలలా విరుచుకుపడి ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

గంగాధర శర్మ బలహీనమై పోసగాడు.

నిజానికి ఇంతకు ముందుతో పోలిస్తే, అతడితో పోరాడుతున్న తురుష్కుల సంఖ్య బహుతక్కువ. అతడిని చుట్టు ముట్టిన వారంతా, పద్మిని వైపుకు వెళ్ళారు.

కానీ ఇప్పుడు గంగాధర శర్మ సంశయాలతో బలహీనుడయ్యాడు. అతడిలో జీవితేచ్ఛ నశిస్తోంది.

దాంతో శత్రువు బలవంతుడవుతున్నాడు. గంగాధర శర్మపై ఆధిక్యం సంపాదిస్తున్నాడు.

●●●

కాస్సేపటికే శూరవర్మకు తాను పొరబడ్డాడని అర్థమయింది. అంతేకాదు, ఈ తురుష్క సైన్యాన్ని నడిపిస్తున్న వ్యక్తి యుద్ధవ్యూహంలో నిష్ణాతుడనీ అర్థమయింది.

మొదటి నుంచీ ఒక పథకం ప్రకారం వారు పద్మినిపై తీవ్రంగా దాడి చేశారు. సంఖ్యాబలం అధికంగా ఉండటంతో వారు పద్మినిని ఒంటరి దాన్ని చేసి, ఇతరులను ఆ వైపు రానీయకుండా అడ్డుకున్నారు. పద్మినిని బందీ చేశారు. పద్మినిని బందీ చేయటం వల్ల ఇతరుల దృష్టిని ఈ వైపుకు ఆకర్షించినట్టు అవుతుంది. లేదా, పద్మిని దొరికిపోయిందని ఇతరులలో నిరాశకు నింపినట్టువుతుంది.

నిరాశకు లోను కాని వారు ఆవేశానికి గురవుతారు.

ఆవేశానికి గురయిన వారు ఎంత నిష్ణాతులయినా, ఎంత ప్రావీణ్యులయినా పొరపాట్లు చేస్తారు.

ఆవేశానికి గురయి తాము పొరపాటు చేశారు. అందరూ ఆవేశంతో పద్మినిని రక్షించాలని ఆ వైపు దూకారు.

తాము పద్మినిని రక్షించాలని పద్మినిని చుట్టుముట్టిన వారిపై దాడి చేశారు.

తమతో పోరాడుతున్నవారు, తమని పోనిచ్చారు తాము ఆ వైపుకు వెళ్ళగానే, వెనక నుంచి తమని చుట్టుముట్టారు. అంటే తాము ఆడకత్తెరలో పోక చెక్కలాగా చిక్కుకున్నారు.

శూరవర్మ ఆలోచన నిజమని నిరూపిస్తూ, పెద్దగా హాహాకారం చేశాడు ప్రహరసింహుడు.

ఒక తురుష్కుడి కత్తి అతడికి గాయం చేసింది. మరో తురుష్కుడి కత్తి అతడికి మరింత తీవ్రమైన గాయం చేసింది. పెద్ద కేకతో నేలపై పడిపోయాడు ప్రహరసింహుడు.

అదే సమయానికి, చంద్రశేఖరుడి వీరావేశం సైతం దెబ్బతిన్నది. ఒక తురుష్కుడి తాకిడికి చంద్రశేఖరుడి చేతిలో కత్తి ఎగిరిపోయింది. దాంతో చంద్రశేఖరుడు నిరాయుధుడై యుద్ధం ప్రారంభించాడు. కానీ సాయుధులు, సుశిక్షితులైన వారితో ఎక్కువ కాలం నిరాయుధుడిగా పోరాడగలగటం అసాధ్యం.

అతడికి సహాయంగా ఆ వైపు వెళ్ళబోయాడు శూరవర్మ. కానీ అతడిని కదలనివ్వటం లేదు తురుష్కులు.

ఇంతలో ఒక తురుష్కుడి కత్తి చంద్రశేఖరుడి శరీరంలోకి దిగబడింది. బాధతో చంద్రశేఖరుడు అరిచాడు.

ఆ అరుపుకి శూరవర్మ దృష్టి చెదిరింది. వెంటనే ఓ తురుష్క కత్తి అతడి శరీరంలో దిగబడింది.

'మహాశివా' గట్టిగా అరిచాడు శూరవర్మ. క్రిందపడ్డాడు.

●●●

గంగాధరశర్మ శక్తి క్షీణిస్తోంది.

ఇంతలో శూరవర్మ అరుపు వినిపించింది.

ఆవెంటనే చంద్రశేఖరుడి కేక అతడి చైతన్యాన్ని తాకింది.

'మహాశివా' అన్న ఆక్రందన అతడి ఆత్మను తాకింది.

ఒక్కసారిగా గంగాధర శర్మ చైతన్యవంతుడయ్యాడు. అతడు నిద్రనుంచి మేల్కొన్నట్టయింది.

వికటాట్టహాసం చేస్తూ తనపైకి లంఘిస్తున్న తురుష్కుడు కనిపించాడు. గంగాధర శర్మలో ఆవేశం పెల్లుబికింది.

'ఏమిటిదంతా?' అనుకున్నాడు. వెంటనే ఒక్క కరవాల ఘాతంతో ఆ తురుష్కుడి తలను శరీరాన్నుంచి వేరు చేశాడు.

మరో ప్రహారంతో మహా తురుష్కుడు విగతజీవుడయ్యాడు

గంగాధర శర్మ మరో మనిషిలా కత్తి యుద్ధం ఆరంభించాడు.

ఇంతవరకూ గంగాధర శర్మ ఒక ఆలోచనల్ను మనిషిలా యుద్ధం చేశాడు. ఇప్పుడు గంగాధరశర్మ ప్రళయకాల రుద్రడిలా విలయతాండవం ఆరంభించాడు.

క్షణంలో పరిస్థితి అనూహ్యంగా మారిపోయింది.

●●●

విద్యుల్లతా వియతి వారిద వృంద మధ్యే
గంభీర భీషణరవైః కపిశీ కృతాశా!
ఘోరా యాగాంతచలితస్య భయంత రాధ
కాలస్య లోలరసనేవ చమచ్చ కార!

ఆకాశంలో మేఘాల నడుమ విద్యుల్లతలు కనిపిస్తూ చేసిన శబ్దధ్వని ఎంత భయంకరంగా ఉన్నదంటే, నలుదిక్కులు దద్దరిల్లిపోయాయి. యమరాజుకు సైతం ఈ శబ్దధ్వనికి భయంలాంటి ఆశ్చర్యం కలిగింది. ఆ దృశ్యం చూసిన వారందరికీ, కుమారస్వామి, తారకాసురుల యుద్ధాన్ని వర్ణించే సమయంలో కాళిదాసు చేసిన వర్ణన జ్ఞప్తికి వచ్చింది.

ఆకాశంలో మెరుపు మెరిసిన వేగంతో గంగాధర శర్మ కత్తి కదిలింది.

ఉరుము ధ్వనితో అతని హృదయలోతుల్లోంచి భీకర రణనినాదం వెలువడింది.

ఆ ధ్వనికి శత్రువులంతా బెదిరిపోయారు.

అంతకాలం గంగాధర శర్మని ఎరిగి ఉన్నవారంతా నివ్వెరపోయారు. అతనిలో ఇంత పౌరుషం, ఇంత ఆవేశం, ఇంత వీరత్వం, ఇంత రాక్షసత్వం దాగుందని వారెన్నడూ ఊహించలేదు. అందుకే ప్రళయకాల రుద్రుడిలా విలయతాండవం చేస్తున్న గంగాధర శర్మను భయంతో, సంభ్రమాశ్చర్యాలతో స్థాణువులై చూడసాగారు.

ఒక గెంతుతో పద్మినిని చుట్టుముట్టిన వారిపై పడ్డాడు గంగాధర శర్మ.

కనుమూసి తెరిచేలోగా జరుగుతున్నది అర్థమయ్యేలోగా, ఆమెను చుట్టుముట్టిన వారి శరీరాంగాలు గాల్లోకి ఎగిరాయి. వారి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

జ్వలద్ధి రుచ్చైరభితః ప్రభాభలై రుద్భాసితా శేషదిగంత రాంబరమే!

రవేణ రౌద్రేణ హృదంత దారణమ్ పరాత వజ్రమ్ నభసో నిరమ్బుదాత్!!

మేఘాలు లేని నిర్మల ఆకాశం నుంచి పిడుగుపడ్డట్టు, ఆకాశం నలుదిశల మెరుపులు మెరిసినట్టు, ఆ శబ్దం హృదయాలను భయభ్రాంతులను చేసింది అని కాళిదాసు వర్ణించినట్టు, ఓ పిడుగులా తమపైకి వచ్చి పడ్డ గంగాధర శర్మను చూసి ఇంకా ప్రాణాలు కోల్పోని తురుష్కులు భీతి భ్రాంతులయ్యారు. చెల్లా చెదురయ్యారు

కానీ ప్రళయకాల రుద్రుడు, నరసింహావతారం దాల్చినట్టు ఆనాడు గంగాధర శర్మ విజృంభించాడు.

జ్వలద్ధిరంగా రచయైర్నభ స్థలం వవర్షగాఢం సహ శోణితాస్థిభి!

ధూమం జ్వలన్తే వ్యసృజకముఖైః రజో దధుర్దిశోరాస భకంత ఘూసరమ్!!

ఆకాశం నిప్పుకణికలతో పాటు ఎముకలను రక్తాన్ని వర్షించినట్టు, నలుదిశలు ధూళితో నిండిపోయాయి.

గంగాధర శర్మ కరవాలానికి ఎరకాకుండా తప్పించుకోవాలని పరుగిడుతున్న తురకల పాదాల నుండి ఎగసిన ధూళి ఆకాశాన్ని తాకేకన్నా ముందే, వారి శరీరాల ఖండాలు ఆకాశానికి ఎగురుతున్నాయి.

వాటితో పాటు, వాటిని వీడాలన్న గ్రహింపు ఇంకా ఏర్పడని రక్తమాంసాలు ఆకాశానికి ఎగురుతున్నాయి. అవి క్రింద పడటం, ఆకాశం రక్తమాంసాలను వర్షిస్తున్న భ్రాంతిని కలిగిస్తోంది.

తమని నడిపేవారు లేకపోవటంతో గుర్రాలు ఇష్టం వచ్చినట్టు పరుగెత్తసాగాయి.

గుర్రాల బెదిరిన సకిలింపులకు తోడుగా, అంగాలు తెగిన బాధతో అరచే తురుష్కుల కేకలు ఆ ప్రాంతాన్ని దద్దరిల్లచేస్తున్నాయి.

వీటిని మించి ప్రాణాలు పోయే ముందు తురుష్కులు భయభ్రాంతులై చేస్తున్న కేకలు ఆకాశాన్ని తాకి ప్రతిధ్వనిగా వెనక్కి వస్తున్నాయి. అక్కడున్న వారి చెవులు గింగురుమంటున్నాయి.

కానీ గంగాధర శర్మను ఇవేవీ తాకటం లేదు.

అసలు గంగాధర శర్మ ఎక్కడికో పారిపోయినట్టుంది. ఇప్పుడు అక్కడ కత్తిపట్టుకుని, రక్తప్రవాహానికి కారణమవుతున్న గంగాధర శర్మ వేరే ఎవరో అనిపిస్తోంది.

ప్రాణభయంతో కత్తి పారేసి చేతులు జోడించి 'శరణ'న్న వారిని పట్టించుకోవటం లేదతడు.

అతడి చేతిలో కత్తి కత్తిలా తోచటంలేదు.

అది ఇంద్రుడి వజ్రాయుధం అనిపిస్తోంది. అది ఓ మెరుపులా తోస్తోంది. శత్రువుపై పిడుగులా పడుతోంది క్షణాల్లో మాడ్చివేస్తోంది.

పారిపోతున్న వారి వెంట పడి మరీ హతమారుస్తున్నాడు గంగాధరశర్మ.

అతని వదనంలో ఎంత ఏకాగ్రత కనిపిస్తోందంటే, దివిజ గంగను భువికి దింపే సమయంలో, గంగానది ప్రతి తరగను, ప్రతి కదలికను భగీరథుడు ఎంత ఏకాగ్రతతో చూసేవాడో, అంత ఏకాగ్రత కనిపిస్తోంది.

భగీరథుడు గంగా నదిని ప్రవహింపచేస్తే, గంగాధర శర్మ తురుష్క రక్త ప్రవాహానికి కారణమవుతున్నాడు. అలా తురుష్కులను హతమారుస్తూ రాక్షసులు సైతం భయపడే రీతిలో కదం తొక్కుతున్న గంగాధర శర్మకు ఎదురుగా, సంస్కృతంలో మాట్లాడిన తురుష్కుడు వచ్చాడు.

గంగాధర శర్మతో ఏదో అనబోయాడు.

కానీ గంగాధరశర్మ అతడికి ఆ అవకాశం ఇవ్వలేదు.

అతడి నోరు పెగిలేలోగా, కంఠాన్ని ఉత్తరించాడు. అప్పటికే అతడి చేతులు ఆడటంతో రెండు చేతులను కత్తిరించాడు.

మహాభారత యుద్ధంలో భీమసేనుడు శత్రువుల గుండెను చీల్చి రక్తాన్ని తాగినట్టు, అంతటితో ఆగక ఆ తురుష్కుడి గుండెల్లోకి కత్తిని దింపాడు గంగాధర శర్మ.

అది చూసి భీతి భ్రాంతులయిన ఇతర తురుష్కులు పలాయనం చిత్తగించారు.

సాధారణంగా, భారతీయ రాజులు సైనికులు శరణన్న వారిని క్షమించి వదిలేస్తారు. ఆయుధాలు పారవేసిన వారిని సంహరించారు. ఇలాంటి నియమాలను పాటించటం వల్ల అనేక తురుష్క సైనికులు రాజులు ఓటమి చెంది కూడా ప్రాణాలు దక్కించుకున్నారు. మరోసారి దాడి చేసి, తమకు ప్రాణభిక్ష పెట్టిన వారిని నిర్దాక్షిణ్యంగా సంహరించి విజేతలుగా నిలిచారు.

భారతీయులలోని ఈ మంచితనాన్ని బలహీతనగా మార్చి ఓటమిని గెలుపుగా మార్చుకోవటం తురుష్కులకు అలవాటయింది.

కానీ, గంగాధర శర్మ దగ్గర అలాంటి 'మంచి బలహీనత'లేదని గ్రహించిన తురుష్కులు, వెనుతిరిగి చూడకుండా పారిపోయారు. కాస్త దూరం వారిని వెంబడించాడు గంగాధర శర్మ. వారు అందక పోవటంతో రెట్టించిన ఆవేశంతో వెనుతిరిగి వచ్చాడు అయితే, అతడి ఆవేశం చల్లారలేదు. దాంతో అక్కడే పడి ఉన్న శవాలను ముక్కలు ముక్కలు చేయసాగాడు.

ఒక్క క్షణం క్రితం వీరుడిలా కనిపించిన గంగాధరశర్మ ఇప్పుడు 'పిశాచి'లా, పిచ్చివాడిలా కనబడసాగాడు.

గంగాధర శర్మ 'విలయతాండవం' జరిగింది కొద్దిసేపే. ఇపుడు జరుగుతున్న అనూహ్యామైన క్రౌర్య ప్రదర్శన అందరిలో అసహ్యం కలిగించింది.

ముందుగా పద్మిని తేరుకున్నది

కానీ గంగాధర శర్మను ఆమెకన్నా ముందు చేరుకున్నాడు శూరవర్మ.

'గంగాధరా - శాంతించు' అరిచాడు.

అది గంగాధర శర్మకు వినిపించినట్టు లేదు. ఇంకా నేలపై పడిన తురుష్క శవాలపై కసి తీర్చుకుంటూనే ఉన్నాడు గంగాధర శర్మ. మరో వైపు నుంచి చంద్రశేఖరుడు పరుగెత్తుకు వచ్చాడు.

జరిగిందంతా చంద్రశేఖరుడికి నమ్మశక్యంగా లేదు.

తామిద్దరిలో అసలు వీరుడు తాను.

తురుష్కులను ధైర్యంగా ఎదుర్కొనేది తాను.

తమ గ్రామాన్ని, తమవారిని రక్షించాల్సింది తాను.

అందరి పొగడ్తలను అందుకోవాల్సింది తాను.

గంగాధర శర్మ భీరువు. కత్తి పట్టటం తెలుసుకానీ దాన్ని ఉపయోగించటం తెలియదు.

ఉత్తుత్తి యుద్ధాలు చేయగలడు. ఊహా శత్రువుతో అత్యద్భుతంగా పోరాడగలడు.

కానీ అసలు యుద్ధం వచ్చేసరికి, గంగాధర శర్మ పనికిరాడు. అతని కత్తి కదలదు. కాలు కదలదు.

కానీ ఇపుడు జరిగిందేమిటి?

తాను చేతకాని వాడిలా క్రిందపడిపోయాడు. తురుష్కులకు చిక్కిపోయాడు. ఇందుకు భిన్నంగా గంగాధర శర్మ అంతమందినీ ఒక్కడే మట్టి కరిపించాడు ఒక్కడే!

ఇది నిజంగా అనూహ్యం, అద్భుతం. కానీ..

చంద్రశేఖరుడూ, గంగాధర శర్మ వీరత్వాన్ని అంగీకరించే స్థితిలో లేడు. అదే వీరత్వం తాను ప్రదర్శించి ఉంటే, అందరి మన్ననలూ తనకి అంది ఉంటే, అతడికి అభ్యంతరం ఉండేది కాదు. ఎందుకంటే, చంద్రశేఖరుడి దృష్టిలో ఆ శౌర్య ప్రదర్శనకు గానీ, ఆ అనూహ్యమైన ధైర్యాన్ని ప్రదర్శించటానికి కానీ, అందరి గౌరవాన్ని అందుకోవటానికి కానీ తనకే అర్హత ఉంది. గంగాధర శర్మ అందుకు అర్హుడు కాడు!

గంగాధర శర్మ పండితుడు. పుస్తకాల్లోని అంశాలు బట్టీ పట్టి అప్పచెప్పటం తప్ప ఏమీరాదు. అలాంటివాడు ఇంతటి ధైర్యం ప్రదర్శించి, అందరి మన్ననలందుకునే స్థితికి రావటం చంద్రశేఖరుడు భరించలేకపోయాడు. అతడికి, గంగాధర శర్మకన్నా తానే వీరుడనని నిరూపించుకోవాలని ఉంది. తన గొప్పతనాన్ని ప్రదర్శించాలని ఉంది.

అందుకే శూరవర్మలా చంద్రశేఖరుడు, గంగాధర శర్మను పిలవలేదు. కత్తి పట్టుకుని అతనికి ఎదురుగా నిలబడ్డాడు.

గంగాధర శర్మ ఎదురుగా ఎవరు నిలిచారో కూడా చూడలేదు. అత్యంత ఆవేశంలో ఉన్నాడతడు. అతడి కళ్ళు చూస్తున్నాయి కానీ, కళ్ళకు మెదడుకూ నడుమ సంబంధం తెగిపోయినట్టుంది.

గుడ్డిగా కత్తి ఎత్తాడు. అంత వేగంగా బలంగా కత్తిని చంద్రశేఖరుడి తలపై దింపాడు.

గంగాధర శర్మకు దగ్గరలోనే ఉన్న శూరవర్మ ఇది గ్రహించాడు. వెంటనే ముందుకు దూకాడు.

గంగాధర శర్మ వేగాన్ని చంద్రశేఖరుడు ఊహించలేదు. వేగంగా తనపైకి దిగుతున్న కత్తిని ఎదుర్కొనటానికి సిద్ధమయ్యాడు.

కానీ ఓ వైపు వస్తున్న కత్తి చివరి క్షణంలో దిశమార్చింది.

అది చంద్రశేఖరుడు ఊహించలేదు.

తలపై దిగే కత్తిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా కత్తిని అడ్డు ఉంచాడు. కానీ తలను దూకాల్సిన కత్తి ఆఖరి క్షణంలో దిశను మార్చి మెడవైపు మళ్ళింది.

చివరి సెకనులో ఇది గ్రహించిన చంద్రశేఖరుడు తన కత్తిని ఆ వైపు తిప్పబోయాడు.

కానీ అప్పటికే ఆలస్యం అయిందని చంద్రశేఖరుడికి అర్థమైంది. గంగాధర శర్మ వేగానికి నైపుణ్యానికి విస్మయం కలిగింది. కానీ ప్రాణాల మీద ఆశ కూడా పోయింది.

అయితే, గంగాధర శర్మ కత్తి చంద్రశేఖరుడి మెడను తాకే చివరి క్షణంలో శూరవర్మ కత్తి దాని దారి మళ్ళించింది. అదే వేగంతో శూరవర్మ చంద్రశేఖరుడిని పట్టుకుని పక్కకు దూకాడు.

అయితే, ఎవరూ ఊహించని వేగంతో, గంగాధర శర్మ కత్తి చంద్రశేఖరుడిని వెన్నాడింది.

చంద్రశేఖరుడిని అందుకునేందుకు గంగాధరశర్మ ముందుకు దూకాడు. అదే ఊపుతో కత్తిని చంద్రశేఖరుడి తలపైకి దింపబోయాడు.

అంతలో పద్మిని వారి మధ్యకు దూకింది. తన కత్తితో గంగాధర శర్మ కత్తి గాలిలో ఆగిపోయింది.

అతని కళ్ళు, పద్మిని కళ్ళతో కలిశాయి. అతని చేతిలోని కత్తి జారిపడింది.

ఒళ్ళంతా రక్తంతో తడిసి, మాంసంతో నిండిన గంగాధరశర్మ తనవైపు తాను చూసుకున్నాడు. పెద్దగా కేకపెట్టి రెండు చేతుల్లో ముఖం దాచుకున్నాడు.

●●●

**ఏదైనా సంఘటన జరుగుతున్నప్పుడు మనిషి మెదడు** ఆ సంఘటనను అనుభవించటంపై దృష్టి పెడుతుంది తప్ప, ఆ సంఘటన తాలూకు అనుభూతిని విశ్లేషించదు.

అనుభూతి విశ్లేషణ సంఘటన అయిపోయిన తరువాత, ఉద్విగ్నత, ఉత్తేజం అణగిపోయిన తరువాత జరుగుతుంది.

గంగాధర శర్మ ఒక ఆవేశంలో ఉత్తేజితుడయి తురుష్కులను సంహరించాడు. అప్పుడతడు శారీరకంగా గంగాధర శర్మనే అయినా, మానసికంగా అతడు మాములు గంగాధర శర్మకాడు.

ఇప్పుడు ఆవేశం తగ్గిపోయింది. మళ్ళీ మామూలు గంగాధర శర్మ స్పృహకు వచ్చాడు.

తనని తాను చూసుకున్నాడు తాను చేసిన కరాళ నృత్యం ఫలితం చూశాడు.

తన శరీరం సర్వం రక్తం, మాంసాలతో నిండి ఉండటం చూశాడు.

తాను తనువూడిన వారి శరీర ఖండాలను చూశాడు. వెదజల్లినట్టున్న కళేబరాలను చూశాడు.

అతని హృదయ లోతులలో నుండి ఒక నిస్సహాయమైన ఆర్తనాదం ఆకాశం దద్దరిల్లేట్టు వెలువడింది.

అనేక వేల సంవత్సరాలనుండి, మనిషి మనిషిగా జీవించాలని ఎంతగా ప్రయత్నిస్తున్నా, అతడిని రాక్షసత్వం వైపు నెడుతున్న ప్రపంచ రీతిని నిరసిస్తూ సకల మానవాళి నిరసనతో చేసిన ఆర్తనాదంలా ఉంది అతడి అరుపు.

మనిషిని మనిషిలా బ్రతకనివ్వని పరిస్థితుల పట్ల ఆక్రోశంలా ఉంది అతని అరుపు.

మనిసిలోని రాక్షసుడిని వెలికి తీసే పరిస్థితుల పట్ల నిస్సహాయత్వం ధ్వనించింది అతడి అరుపులో.

అది చూస్తూంటే అక్కడ ఉన్న వారందరి హృదయాలు ద్రవించాయి. వారందరికీ గంగాధర శర్మ మానసిక స్థితి అర్ధమయింది.

ఈ ప్రపంచంలో మనుషులందరూ ఒకే రకమైన అనుభవాలే పొందినా, అవే దారులలో ప్రయాణించినా, ఎవరి అనుభూతులు వారికే ప్రత్యేకం. ఎవరి స్పందనలు వారివే.

కానీ ప్రతి వ్యక్తిలో సాటి మనిషి స్పందనలను అర్ధం చేసుకుని వారి అనుభూతులను తనవిగా చేసుకునే ప్రయత్నాలు చేయరు. కానీ కొన్ని అరుదైన సందర్భాలలో మనిషి అప్రయత్నంగా సాటి మనసు స్పందనను గ్రహిస్తాడు. సహ అనుభూతి చెందుతాడు. అప్పుడు ఆయా మనుషుల్లోని దివ్యాత్మ కదలిక పొందుతుంది. ఆ కదలికను పదిలంగా కాపాడుకోగలిగిన వారు అదృష్టవంతులు.

పద్మిని అతి సులభంగా గంగాధర శర్మను అర్ధం చేసుకోగలిగింది.

తురుష్కులు తనని బంధించినప్పుడు, తన వారిని చంపినప్పుడు ఆమె మనస్సు ఇంతకన్నా ఘోరమైన వేదనను అనుభవించింది.

ఆ తరువాత కత్తి పట్టుకుని ఆత్మరక్షణ చేసుకోవటం ఆరంభించినప్పుడు శత్రువులను హత మారుస్తున్నప్పుడూ, ఆమెకు 'ఇదంతా చేస్తున్నది తానేనా?' అన్న సందేహం పదే పదే కలుగుతూండేది.

'ఇదంతా నిజం కాదు. పీడకల' అనిపించేది. ఇప్పుడో, ఇంకాస్సేపటికి తాను నిద్రలేచి, ఈ కలను తలచుకుని నవ్వుకుంటుందని ఎదురు చూస్తూండేది. కానీ కొన్నాళ్ళకు పీడకలనే నిజంగా అలవాటయింది. 'నిజం' ఓ కలగా కరిగిపోయింది.

ఇప్పుడు గంగాధర శర్మని చూస్తుంటే ఆమెకు తొలినాళ్ళలో తాను అనుభవించిన మానసిక వేదన గుర్తుకు వచ్చింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. పగవాడికి కూడా ఇలాంటి క్షోభ ఉండకూడదనుకునేది. ఇప్పుడు అలాంటి తీవ్రమైన వేదన గంగాధర శర్మలో చూస్తోంది.

శూరవర్మ సైతం గంగాధర శర్మను అర్ధం చేసుకోగలిగాడు.

గంగాధర శర్మ జీవితంలో ఇది నిర్ణయాత్మకమైన సమయం అని శూరవర్మకు తెలుసు.

ప్రస్తుతం అనుభవిస్తున్న వేదన తీరిన తరువాత ఎదిగే గంగాధర శర్మ జీవితాంతం మిగిలే గంగాధరశర్మ.

ప్రతి వ్యక్తి జీవితంలో ఇలాంటి నిర్ణయాత్మకమైన సమయం వస్తుంది.

ఇప్పుడు కనుక గంగాధర శర్మ యుద్ధాన్ని, హింసను అసహ్యించుకుంటే ఇక జీవితాంతం అతను కత్తి పట్టడు.

అలాకాక, తనలోని రాక్షసుడి పట్ల గర్వం కలిగితే, ఇక జీవితాంతం గంగాధర శర్మ జీవితాంతం గంగాధర శర్మ ఎదురులేని వీరుడిగా నిలుస్తాడు. కానీ మానవత్వం అన్నది లేని కర్కోటక వీరుడవుతాడు.

ఈ రెండు ప్రవృత్తుల నడుమ సమన్వయం సాధిస్తే గంగాధరశర్మ మనిషిలా ఎదుగుతాడు. ప్రశాంతంగా జీవించగలుగుతాడు.

వీరుడిగా ఎదిగినా, జీవితాంతం కత్తి పట్టుకున్న గంగాధరశర్మ జీవితంలో శాంతి ఉండదు.

ఈ ప్రపంచంలో ప్రతివ్యక్తి జీవితంలో ఇలాంటి సంఘర్షణ నిరంతరం సాకుతూ అతని వ్యక్తిత్వాన్ని నిర్దేశిస్తుంది.

తాను కోరేదానికీ, తన మనస్సు ఆశించేదానికీ, తనకు లభించిన దానికీ నడుమ నిత్యఘర్షణ జరిగే ఏ వ్యక్తీ ప్రశాంతంగా ఉండలేడు.

ఈ సంఘర్షణ నడుమ సమన్వయం సాధించగలగటం వ్యక్తి పరిణతికి, వ్యక్తిత్వానికి పరీక్షా సమయం అని శూరవర్మకు తెలుసు.

అందుకే అడుగు ముందుకు వేసి రోదిస్తున్న గంగాధర శర్మను అక్కున చేర్చుకున్నాడు. తల్లి పిల్లవాడిని లాలించినట్టు లాలించసాగాడు. అక్కడున్న వారిలో గంగాధర శర్మ పరిస్థితికి స్పందించనిది చంద్రశేఖరుడు ఒక్కడే

చంద్రశేఖరుడికి గంగాధర శర్మపై జాలి కలగలేదు. అసహ్యం కలిగింది. ఎందుకీ రోదన?

ఇదంతా నటన అనిపిస్తోంది అతనికి అంతా కృత్రిమంగా తోస్తోంది. మనం చంపకపోతే, ఎదురు తిరిగి మనల్ని చంపేవాడిని చంపి ఏడవటం ఎందుకు?

అదేదో, వాడి చేతిలో కిక్కురుమనకుండా ఛస్తే ఓ పనయిపోయేది కదా? అప్పుడు ఈ ఏడ్పే ఉండేది కాదు.

ఒక వైపు గొప్ప వీరుడిలా అందరినీ చంపాడు. ఇంకోవైపు నంగనాచిలాగా కల్లబొల్లి కన్నీళ్ళు కారుస్తున్నాడు.

దానివంక చూసి వీళ్ళంతా కన్నీళ్ళు కారుస్తున్నారు వాడిని ఓదార్చలేక సతమతమవుతున్నారు.

వాళ్ళవైపు అసహ్యంగా చూస్తూ, లేచి ఒంటికంటిన మట్టిని దులుపుకున్నాడు.

'ఇంక ఆపు ఆడపిల్లలా ఆ ఏడుపు?' కసిరినట్టు అన్నాడు.

అతడివైపు విస్మయంగా చూసింది పద్మిని. 'ఆడపిల్లలు అలా ఏడవరు?' అంది తీవ్రంగా.

పద్మిని వైపు కోపంగా చూశాడు చంద్రశేఖరుడు. అతడికి కసిగా ఉంది. అందరినీ తానొక్కడే ఓడించగలడన్న అతడి విశ్వాసం దెబ్బతిన్నది. అందరినీ గంగాధర శర్మ రక్షించాడు. ఆపై తనపై విరుచుకుపడ్డాడు. ఇదంతా అతనికి అవమానంగా ఉంది.

'ఇక ఏడ్చిన ఏడ్పు చాలు. ఏం చేయాలో ఆలోచించండి' అన్నాడు గంగాధర శర్మ ఏడ్పు ఉధ్ధృతం తగ్గింది. అతడు శూరవర్మ బాహువుల్లోనే సొమ్మసిల్లినట్టు పడుకున్నాడు.

శూరవర్మ ఓ సైనికుడికి సౌంజ్ఞ చేశాడు. అతడు వచ్చి గంగాధర శర్మను పట్టుకున్నాడు. నెమ్మదిగా లేచి నిలబడ్డాడు శూరవర్మ.

'మనం తురుష్క తండా వెనకే వచ్చాం కాబట్టి వీళ్ళ తరువాత వచ్చేవాళ్ళు ఎవరూ లేరని తెలుస్తోంది. వీళ్ళంతా మరణించారు కాబట్టి ఈ వార్త తురక రాజులను చేరేసరికి సమయం పడుతుంది. కాబట్టి కనీసం కొన్ని వారాలయినా మనకేం ప్రమాదంలేదు. ముందు మనం చేయవలసిన పనులు రెండున్నాయి' అన్నాడు శూరవర్మ అందరినీ కలియచూస్తూ.

అందరూ అతని మాటలు జాగ్రత్తగా వింటున్నారు. గంగాధర శర్మ స్పృహలో ఉన్నాడో, లేదో తెలియటంలేదు. కళ్ళుమూసుకుని ఉన్నాడు.

'మన ఊరివాళ్ళు కొండల్లోకి పారిపోయినవారున్నారు. వాళ్ళని వెతికి తీసుకురావటం ఒక పని. ఈ తురుష్కులు మన ఊరి వారిని బందీలుగా తీసుకున్నారు. వారిని ఊరవతల ఉంచారు. వారికి కాపలాగా ఉన్నవారిని సంహరించయినా, బందీలుగా తీసుకునయినా మనవారిని విడిపించి తీసుకురావలి. ఆ తరువాత ఏం చేయాలన్నది అందరం కలసి ఆలోచిద్దాం' గబగబా చెప్పాడు శూరసింహుడు.

ఎవరూ ఏమీ అనలేదు. మౌనంగా ఉన్నారు. అంటే, తాను చెప్పింది అందరికీ అంగీకారం కాకున్నా, వ్యతిరేకత ఏమీలేదని శూరవర్మకు అర్థమయింది. అందుకే మాట్లాడటం కొనసాగించాడు.

'చంద్రశేఖరా నువ్వు కొందరిని తీసుకుని వెళ్ళి బందీలుగా ఉన్న మనవారిని విడిపించుకునిరా. ప్రహరసింహా నువ్వు కొందరితో వెళ్ళి అడవులు, కొండల్లో వెతుకు ప్రాణభయంతో తలదాచుకున్న మనవాళ్ళని వెనక్కి తీసుకురా' అన్నాడు.

'మళ్ళీ మనం ఇక్కడ ఉండటం కుదరదు. ఈ వాలిపోయిన మొండిగోడల నడుమ, ఈ పీనుగు పెంటల నడుమ, ఈ రక్తమాంసాల నదులలో మనం మళ్ళీ బ్రతకలేము' కోపంగా అన్నాడు చంద్రశేఖరుడు.

'అది అందరం కలసిన తరువాత ఆలోచిద్దాం. మనమేకాదు సమస్త భారత దేశం పరిస్థితి ఇలాగే ఉంది. ఎవ్వరికీ రక్షణ లేదు. ఎవ్వరూ ఎక్కడా ప్రశాంతంగా ఉండలేరు. చివరికి, వారణాసి  కూడా తురుష్కుల తాకిడికి గడగడలాడటం మనం చూశాం కాబట్టి మనం మళ్ళీ ఎక్కడ నివసించాలో ఆలోచించి నిర్ణయం తీసుకుందాం' అన్నాడు శూరవర్మ.

ఓసారి పద్మినివైపు చూసి కొందరిని వెంట తీసుకుని చంద్రశేఖరుడు వెళ్ళిపోయాడు.

మరి కొందరిని వెంటతీసుకుని ప్రహరసింహుడు వెళ్ళిపోయాడు.

ప్రాణాలు పోకుండా మిగిలి ఉన్న ఊరివారు కొందరు జీవచ్ఛవాల్లా చెట్లనీడన కూచున్నారు. వారి కళ్ళల్లో జీవం లేదు.

గంగాధర శర్మను పద్మినికి అప్పచెప్పాడు శూరవర్మ.

'నేను ఒకసారి చుట్టూ చూసి వస్తాను' అన్నాడు.

'మనం దేవగిరికి వెళదాం అంది పద్మిని.

పద్మిని వైపు సాలోచనగా చూశాడు శూరవర్మ.

'దేవగిరితో తురుష్కులకు సత్సంబంధాలే ఉన్నాయి. దేవగిరి పరిసరప్రాంతాలలో ప్రశాంతంగానే ఉండవచ్చు. కానీ.' అని ఆగాడు.

'కానీ?' కళ్ళెగరేసింది పద్మిని.

'పద్మినీ' అన్నాడు శూరవర్మ. ఆమెను పేరుతో అతడు పిలవటం ఇది తొలిసారి. ఆమెను పేరు పెట్టి పిలుస్తూంటే అతడి గొంతు వణికింది. పద్మిని అది గమనించింది. గమనించినట్టే ఊరుకుంది. తాను ఒకప్పుడు రామమూర్తి ఇప్పుడు కాదు. ఇప్పుడు ప్రాణభయంతో పారిపోతున్న మామూలు మనిషి అంతే.

'తురుష్కులు కార్చిచ్చులా దేశమంతా వ్యాపిస్తున్నారు. మన సనాతన ధర్మాన్ని సంరక్షించాల్సిన రాజులు ప్రస్తుతం ప్రాణ రక్షణలో ఉన్నారు. ఆత్మరక్షణలో ఉన్నారు. వీరు తురుష్కులతో తాత్కాలికంగా సంధి చేసుకుంటున్నా, వారి మనస్సాక్షి వారిని ప్రశాంతంగా ఉండనివ్వదు. అందుకే, దేవగిరి కూడా అంత సురక్షితం కాదనిపిస్తోంది'.

'కాలం శత్రువై కాటువేస్తున్నప్పుడు ప్రపంచంలో ఏ ప్రాంతంలో రక్షణ ఉంటుందో చెప్పండి?' సూటిగా ప్రశ్నించింది పద్మిని.

తలవంచుకున్నాడు శూరవర్మ. కాస్సేపటికిలో గొంతుకలో అన్నాడు.

'ఇలా గ్రామాలు తురుష్కుల పాలవగా ప్రాణాలు దక్కించుకున్నవారు ప్రాణాలు అరచేత పట్టుకుని తురుష్కుల నుంచి తప్పించుకున్నవారు అంతా దండకారణ్యం ప్రాంతంలో నివాసాలు ఏర్పరచుకుంటున్నారని తెలిసింది. అందరూ అంగీకరిస్తే మన వాళ్ళని కూడా ఆ ప్రాంతానికి చేర్చాలని నా ఆలోచన.'

నవ్వింది పద్మిని. 'దండకారణ్యం చేరాలన్న మనం శత్రువు బలంగా ఉన్న ప్రాంతాల నుంచి ప్రయాణించాల్సి ఉంటుంది. దారిలో తురుష్క తండాల దాడుల ప్రమాదాన్నుంచి తప్పించుకోవాల్సి ఉంటుంది. ఆలోచించండి' అంది.

'ఇక్కడే ఉండటం కుదరదు. ముఖ్యంగా, ఇక్కడే ఉంటూ, పోయిన వాళ్ళ జ్ఞాపకాలలోనే బ్రతకాల్సి రావటం కష్టం' అన్నాడు శూరవర్మ.

'మనం ఈ ప్రాంతాన్ని వదిలివెళితే, తురుష్కులు ఈ ప్రాంతాన్ని ఆక్రమిస్తారు. అంటే, మనం చేజేతులారా మన భూమిని ఎలాంటి పోరులేకుండా శత్రువుకు అప్పచెపుతున్నట్టవుతోంది కదా?' సూటిగా ప్రశ్నించింది పద్మిని.

'ప్రస్తుతం జరుగుతున్నదీ అదే మనం ఒకో అడుగు వెనక్కి వేస్తూ వెళుతున్నాం. శత్రువు ఒకో అడుగు ముందుకు వేస్తూ వస్తున్నాడు.'

'మరి మనం ఈ ప్రాంతాన్ని వదిలి వెళ్ళటం ఎందుకు? ఇక్కడే ఉందాం. ఈ భూమిని శుభ్రం చేసుకుందాం. ఈసారి శత్రువుతో పోరుకు సిద్ధంగా ఉందాం. మన ప్రాణాలు పోతే తప్ప మన భూమిని వదలద్దు' స్థిరంగా చెప్పింది పద్మిని.

ఆమె వైపు నిశితంగా చూశాడు శూరవర్మ.

'మరి, ఇందాక దేవగిరి వెళ్దామన్నారు?' ప్రశ్నించాడు

నవ్వింది పద్మిని.

'మనం ఎంతగా మానసికంగా బలహీనులమవుతున్నామో మీకు చూపించాను. తుఫాను వస్తుంది. ఊళ్ళు కొట్టుకుపోతాయి. తుఫాను నీరు తీసిన తరువాత మళ్ళీ ఇళ్ళు కట్టుకోమా? మళ్ళీ కొత్త జీవితం ప్రారంభించమా? భూకంపాలు వస్తాయి. భూమి చీలిపోతుంది. బ్రతికి ఉన్న వాళ్ళు మళ్ళీ అదే ప్రాంతంలో తమ జీవికను కొనసాగించరా? ఇదీ అలాంటిదే. అయితే ఇపుడు మనం ఎదుర్కొంటున్న ప్రమాదం ప్రాకృతికం కాదు. దైవికం కాదు. ఈ పాటి మానవుడి నుంచి దైవం నుంచే పారిపోని వాళ్ళం మానవుడి నుంచి పారిపోతామా?' తలవంచుకున్నాడు శూరవర్మ.

'అసలీ ప్రాంతం వదలి వెళ్ళాలన్న ఆలోచనకే బలహీనతలోంచి వచ్చింది. నిరాశలోంచి వచ్చింది. దేవగిరిలోనే కాదు మనం ఈ ప్రపంచంలో ఎక్కడా ప్రశాంతంగా ఉండలేము. ఎందుకంటే మనం మననుంచి పారిపోవాలని ప్రయత్నిస్తున్నాం. ఎదురు నిల్చి పోరాడే బదులు, మన భూమిని, వదలి, సురక్షిత ప్రాంతానికి తరలి వెళ్ళాలని ఆలోచిస్తున్నాము. కానీ సురక్షిత ప్రాంతం ఏదీ లేదని మన మనసుకు తెలుసు. అయినా మనల్ని మనం మభ్యపెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నాం. ఆత్మవంచనకు సిద్ధమవుతున్నాం. ఆత్మవంచన ఎన్నడూ సత్ఫలితమివ్వదు. అందుకే మనం అడుగడుగూ వెనక్కు వెళుతున్నాం. శత్రువు అడుగడుగూ ముందుకు వస్తున్నాడు' తీవ్రంగా అంది పద్మిని.

శూరవర్మ నిట్టూర్చాడు. ఉన్న చోటనే కూర్చుండిపోయాడు.

పద్మిని మాటలలో నిజం అతడికి అర్ధమయింది. తాను పరాజితుడిలానే ఆలోచించాడు. ఒక పక్క శత్రువును ఎదుర్కొనేందుకు అందరినీ సిద్ధం చేస్తున్నాడు తాను. మరోవైపు శత్రువు నుంచి పారిపోవటం నేర్పుతున్నదీ తానే.

తురుష్కుల తాకిడి ఎంతగా తమ ఆత్మస్థయిర్యాన్ని దెబ్బ తీస్తోందో శూరవర్మ గ్రహింపుకు వచ్చింది.

ఇంతలో గంగాధర శర్మ కదిలాడు.

పద్మిని, శూరవర్మ అతడి వైపు తిరిగారు.

గంగాధర శర్మ కళ్ళు తెరిచాడు. తనవైపే చూస్తున్న పద్మిని, శూరవర్మలను చూశాడు. అతడి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. లేచి కూచుని చుట్టూ చూశాడు. ఎటు చూసినా సర్వనాశనం కనిపిస్తోంది. భీభత్స దృశ్యాలే ఉన్నాయి.

అన్నీ చూసి తల పట్టుకుని కూచున్నాడు గంగాధర శర్మ.

ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు.

ఇంతలో నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ నలువైపుల నుంచీ శబ్దాలు వినిపించాయి. శూరవర్మ లేచి నిలబడ్డాడు.

ఓ వైపు నుంచీ చంద్రశేఖరుడు వస్తున్నాడు. అతనితో పాటు తురుష్కులు బందీలుగా తీసుకున్న వారు వస్తున్నారు.

మిగతా వైపుల నుంచి, ఊళ్ళోంచి పారిపోయి తలదాచుకున్న వారు వస్తున్నారు. పద్మిని లేచి నిలబడింది. గంగాధర శర్మ కదలలేదు అలాగే కూచుని చుట్టూ చూస్తున్నాడు.

**ఒకరొకరుగా వస్తున్న వారిని చూస్తూంటే** గంగాధర శర్మ కళ్ళల్లో నీళ్ళు నిండసాగాయి.

తమ బంధువులను, పరిచయస్తులను చూడగానే దుఃఖాన్ని ఆపుకోలేక కొందరు వెక్కి వెక్కి ఏడవటం ఆరంభించారు.

పిల్లలను కౌగిలించుకుని తల్లులు, భర్తలను చూసి భార్యలు, తల్లిదండ్రులను కలిసిన పిల్లలు ఇలా తమ వారిని చూసిన ప్రతివారి కళ్ళల్లో నీళ్ళు తిరగసాగాయి.

భగవంతుడు తన అంశను మనిషి కన్నీటిలో ఉంచాడనిపించింది గంగాధర శర్మకు.

****

భగవంతుడిలాగే కన్నీరు ఉపశమనాన్నిస్తుంది. అలవికాని ఆవేదనకొక ఆకారాన్నిస్తుంది. ఆవేదనను ద్రవీభవింపచేసి కన్నీటి రూపంలో వ్యక్తి మనస్సునుండి వెడలనడుపుతుంది. అందుకే ఎంత బాధలో ఉన్నవాడయినా కన్నీరు కార్చిన తరువాత అదోరకమైన మనఃశ్శాంతిని పొందుతాడు. అతడి దృష్టి బాధనుంచి ఇతరాల వైపు మళ్ళుతుంది. ఎవరయితే కన్నీరు కార్చరో, వారి బాధ ద్రవీభవించే బదులు ఘనీభవిస్తుంది. గడ్డకట్టి వ్యక్తి హృదయంలో గుదిబండ అయి నిలుస్తుంది. బాధ పట్టరాని ద్వేషంగా, క్రోధంగా పరిణమిస్తుంది. మనిషిని పశువును చేస్తుంది. అతని హృదయాన్ని బండరాయిగా మారుస్తుంది.

అందుకే కన్నీరు కార్చే హృదయంలో దైవమున్నాడంటారు. తనచుట్టూ జరుగుతున్నది చూస్తూంటే గంగాధర శర్మ మనస్సులో చిత్రవిచిత్రమైన భావాలు కలుగుతున్నాయి.

ఇంతలో ఏదో కలకలం వినిపించింది.

అందరి దృష్టి ఆ వైపు మళ్ళింది.

'పో.. నువ్వు నన్ను తాకద్దు. నువ్వెవరో నాకు తెలియదు. నా శ్రీలక్ష్మి మరణించింది. తురుష్కుల దగ్గర ఒక రాత్రి గడిపి వచ్చి ఏ ముఖంతో నన్ను స్వీకరించమని అడుగుతున్నావు?'

అరుస్తున్నాడొకాయన.

గంగాధర శర్మ అతడిని పరిశీలనగా చూశాడు.

అతడు శర్మకు తెలుసు. నిత్య జీవితంలో ఎంతో సౌమ్యుడు. రోజూ నదిలో స్నానం చేసేటప్పుడు, క్షమించమని నదీమాతను ప్రార్ధిస్తున్నాడు. ఉదయం నిద్రలేచి పాదాలు భూమి మీద మోపేటపుడు 'క్షమించమ'ని భూమాతను వేడుకుంటాడు.

కాళ్ళ క్రింద నిలిచే జీవులను క్షమించమని ప్రార్ధిస్తాడు.

స్నానం చేసేటప్పుడూ, ఒళ్ళు రుద్దుకుంటూ, ఒంటిమీద ప్రాణులను క్షమించమని వేడుకుంటాడు.

'చరాచర సృష్టి స్వరం భగవంతుడి మయం' అని నమ్ముతాడు. అలాగే ఆచరిస్తాడు.

ఇంతవరకూ అతడు ఒక్క పరుషమైన మాట మాట్లాడటం కానీ, ఆవేశాన్ని ప్రదర్శించటం కానీ గంగాధర శర్మ చూడలేదు.

కానీ, ఇప్పుడు తన ప్రమేయం లేకుండా, తురుష్కులకు బందీగా చిక్కి, వారి చెరనుండి విముక్తమై వచ్చిన భార్యను మాత్రం క్షమించలేక పోతున్నాడు. ఆమెలో ప్రాణిని, భగవంతుడిని చూడలేక పోతున్నాడు.

భగవంతుడు సృష్టించిన ఈ ప్రపంచంలో ఏం జరిగినా అది భగవంతుడి ఇచ్ఛ ప్రకారం జరుగుతుందని, దానిలో, వ్యక్తిని దోషిగా నిలపటం తగదని నమ్మలేకపోతున్నాడు.

అతని భార్య ఏడుస్తోంది. ప్రాధేయపడుతోంది. జరిగిన దానిలో తన తప్పేమీలేదని, తాను నిస్సహాయురాలినని విలపిస్తోంది.

కానీ ఆమె కన్నీరు అతడి హృదయాన్ని కరిగించలేకపోతోంది. అతడి హృదయమే కాదు, తమ ఊళ్ళో, తురుష్కుల బారిన పడకుండా తప్పించుకున్న వారెవరి హృదయాలనూ కరిగించలేకపోతోంది.

అప్పుడు గమనించాడు గంగాధర శర్మ.. తామెవరూ గమనించకుండా తమ నడుమ ఒక సన్నని పొర ఏర్పడింది. తమని నేను చేస్తూ ఒక అదృశ్య రేఖను ఎవరో గీశారు.

రేఖకు ఆ వైపున ఉన్నవారు తురుష్కుల స్పర్శతో అపవిత్రులయ్యారు! రేఖకు ఈ వైపున ఉన్న వారు తురుష్కుల స్పర్శ సోకని పవిత్రులు!

గంగాధర శర్మ మనస్సు బాధతో మెలికలు తిరుగుతోంది.

తమ ధర్మం శుచ్చానికి  అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. కనబడే మలినాలనే కాదు సూక్ష్మమై కంటికి కనబడని మలినాలను సైతం పరిగణనలోకి తీసుకుంటుంది.

వీటి ఆధారంగా మంచి, చెడులను ఏర్పరచింది.

మంచిని పెంచాలని, చెడును దూరంగా ఉంచాలని భావిస్తుంది. కానీ మంచి, చెడు అన్నవి కొన్ని విషయాలలో స్థిరమైనవైనా, కొన్ని విషయాలలో కాలాన్ని బట్టి మారుతూంటాయి.

మార్పుకు తగ్గట్టు మనిషి మారాలి. సమాజం మారాలి. సామాజిక నియమాలు మారాలి.

సమాజగతిని, నదీ ప్రవాహ గతికి తేడాలేదు.

వీలున్న చోట నది పరవళ్ళు తొక్కుతుంది. దూకుతుంది జలపాత ధారలా వీలు లేనప్పుడు దూకుడు తగ్గించుకుంటుంది. వాలును బట్టి ప్రవహిస్తుంది. అడ్డువచ్చిన రాయిని కోయలేనప్పుడు వంపులు తిరిగి ప్రవహిస్తుంది. దారిలో ఎన్నో ఉపనదులను, అవి తెచ్చే పదార్థాలనూ కలుపుకుని ముందుకు పాకుతుంది.

ఎప్పుడయితే, నదికి ఉపనదులను కలుపుకోవటం మానేస్తుందో, అప్పుడు కొత్తనీరు వచ్చి చేరదు. ప్రవాహం మందగిస్తుంది. నది ఎండిపోతుంది. ఏ సమాజమయితే మారుతున్న పరిస్థితులకు తగ్గట్టు మారదో, అడుగడుగునా తనని తాను పునర్నిర్వచించుకుంటూ, కొత్త ఆలోచనలను స్వీకరిస్తూ తనని తాను సుసంపన్నం చేసుకుంటూ ముందుకు సాగదో, ఆ సమాజం నిశ్చలమైన నీటి బురదలా మారుతుంది.

ప్రవహించటం మానేసి అనేక రోగాలకు కారణమవుతుంది. చివరికి నశిస్తుంది. తన ఎదురుగా జరుగుతున్నది చూస్తుంటే గంగాధర శర్మ మనస్సులో ఒక రకమైన భయం కలగసాగింది.

ఇది సంకుచితంగా ఆలోచిస్తూ, మనస్సును రాయి చేసుకుని, కళ్ళుమూసుకుని గుడ్డిగా, మూర్ఖంగా ప్రవర్తించే కాలం కాదు.

ఇప్పుడు మనిషి కళ్ళతో కాదు హృదయంతో చూడాలి. మెదడుతో కాదు మనసుతో ఆలోచించాలి.

'నేనేమీ శ్రీరామ చంద్రుడిని కాను, అగ్నిపరీక్ష పెట్టి సంతోషంగా స్వీకరించటానికి' అరుస్తున్నాడు ఆమె భర్త.

అతనిని ఎందరో సమర్థిస్తున్నారు.

'తురుష్కుల చెరలో ఉన్న వారిని తాకేందుకే కాదు, వారిని ఊరిలో ఉండనిచ్చేందుకూ' ఇష్టపడటంలేదు.

'మళ్ళీ మా దగ్గరకు ఏ ముఖం పెట్టుకుని వచ్చారు. దారిలోనే నదిలో దూకి చావాల్సింది' అంటున్నారు.

శూరవర్మ వారికి ఏదో చెప్పబోయాడు.

'ఇది మా అంతర్గత వ్యవహారం. కుటుంబ వ్యవహారం. నీవు కలగజేసుకోవద్దు'

శూరవర్మను పక్కకు నెట్టారు.

శూరవర్మ మౌనంగా వచ్చి గంగాధర శర్మ పక్కన నుంచున్నాడు. వారి పక్కన పద్మిని నుంచుంది.

ప్రహరసింహుడు కాస్త దూరంగా నుంచున్నాడు.

చంద్రశేఖరుడు ఎటో వెళ్ళాడు.

ఊళ్ళోవాళ్ళు తురుష్కులు తాకిన వారిని వెళ్ళిపొమ్మంటున్నారు.

'ఇది శాస్త్రం కూడా చెప్తుంది. శ్రీరామ చంద్రుడే జానకిని స్వీకరించినా, మళ్ళీ లోక అపవాదుకు వెరచి అడవికి పంపలేదా?'

గంగాధర శర్మ మనస్సు బాధతో క్రుంగిపోయింది.

శాస్త్రం మనిషి దూరం చేసుకోమని చెప్పదు. ప్రతిదానికీ ఏదో ఓ ప్రాయశ్చిత్తం ఉంటుంది. ప్రతి సమస్యకూ ఏదో పరిష్కారం ఉంటుంది. తమ ఊరిలో తురుష్కుల బారిన పడకుండా మిగిలింది. అధికశాతం వృద్ధులు, వృద్ధ మహిళలు.

ఇప్పుడు స్త్రీలను, పిల్లలను దూరం చేసుకున్న తరువాత తమ ఊరు ఏరకంగా నిలబడుతుంది? ఎలా అభివృద్ధి చెందుతుంది?

గంగాధర శర్మ మనస్సు కకావికలం అవుతోంది.

అంతలో అతనికి శాస్త్రాలను సరిగ్గా అర్థం చేసుకునే బదులు, పురాణాలను అపార్థం చేసుకుని, దుర్వ్యాఖ్యానం చేస్తూ, తమ బలహీనతలను, పొరపాట్లను పురాణాలను చూపి సమర్థించుకునే నైచ్యం గుర్తుకు వచ్చింది.

ఓ వైపు మనుషులను దూరం చేసుకుంటున్నారు. మరోవైపు తమ శాస్త్రాలను పురాణాలను దుర్వ్యాఖ్యానాల ద్వారా దిగజారుస్తున్నారు. తప్పుడు అభిప్రాయాన్ని కలిగిస్తున్నారు.

ఇందువల్ల సమాజమే కాదు.. ధర్మమూ దెబ్బతింటొంది.

ఇంతలో కలకలం వినిపించింది.

'గురువుగారొస్తున్నారు గురువుగారొస్తున్నారు' అన్న మాటలు వినిపించాయి. దిగ్గున లేచాడు గంగాధర శర్మ.

'గురువుగారే ఈ సమస్యను పరిష్కరిస్తారు' అనుకున్నాడు ఆశగా.

●●●

గురువుగారి వెనక చంద్రశేఖరుడున్నాడు. ఓ గుర్రాన్ని నడిపిస్తున్నాడు.

ఆ గుర్రం పైన ఓ మహిళ ఉంది.

ఆమెను చూడగానే గంగాధర శర్మ హృదయంలోంచి కేక వెలువడింది. 'అమ్మా' అరుస్తూ పరుగెత్తాడు.

అందరూ కలసి ఆమెను గుర్రం పైనుంచి దింపారు.

ఎవరో గడ్డి తెచ్చి పరిచారు. ఆమెను గడ్డిపై పడుకోబెట్టారు.

గంగాధర శర్మ ఆమె దగ్గర కూర్చున్నాడు.

'తురుష్కులు విసిరిన విషపూరిత బాణం అమ్మను తాకింది. గురువుగారు చికిత్స చేస్తున్నారు. కానీ లాభంలేదంటున్నారు.' విషాదంగా చెప్పాడు చంద్రశేఖరుడు.

ఆమె కొన ప్రాణంతో ఉంది. కేవలం తన కొడుకులను చివరిసారిగా చూడాలన్న ఆశ ఆమెను బ్రతికిస్తున్నట్టుంది.

'అమ్మా' పిలిచాడు గంగాధరుడు ఆవేదనతో.

ఆమె నెమ్మదిగా కళ్ళు తెరిచింది. చుట్టూ చూసింది.

తన వైపు వంగి ఆత్రంగా చూస్తున్న వారినెవరినీ ఆమె గుర్తుపట్టినట్టులేదు.

అందరినీ చూస్తున్న ఆమె కళ్ళు పద్మినిపై నిలిచాయి.

ఆమె కళ్ళల్లో మెరుపు మెరిసింది. ఒక్కసారిగా జీవం వచ్చినట్టయింది.

ఎవరో తెచ్చి నీళ్ళుపోశారు ఆమె పెదిమలను దూరం చేసి.

'గంగాధరా' అతి నీరసంగా ధ్వనించింది ఆమె స్వరం.

'అమ్మా' అన్నాడు గంగాధర శర్మ.

'గంగాధరా.. తండ్రి కోరిక తీర్చాలి నువ్వు' అంది.

ఆమె ఏమంటుందో గంగాధర శర్మకు అర్థం కాలేదు. అయోమయంగా చూశాడు.

'తురుష్కులందరినీ సంహరిస్తాను' అంటూ ఏదో ఆవేశంగా అనబోతున్న గంగాధర శర్మను వారించిందామె.

'శ్రీ రామానుజాచార్యులు.. శ్రీరంగం..' ఆమె మాటల్లో అస్పష్టత ప్రవేశించింది. గంగాధర శర్మకు అర్థమయింది.

ఒక్కసారిగా అతని తల గిర్రున తిరిగింది.

అమ్మ తనను ఏమని ఆదేశిస్తోందో అతనికి అర్థమయింది.

తన పూర్వీకులు రామానుజులతో వాదించి ఓడిపోయి ఆత్మార్పణం చేసుకున్నారు. తమ వంశంలో ఏ తరం వారయినా విశిష్టాద్వైతాన్ని ఖండించి, అద్వైతం ఆధిక్యాన్ని నిరూపించాలని ఆదేశించారు.

తన తండ్రి కూడా శ్రీరంగం వాదించటానికని వెళ్ళి తిరిగిరాలేదు. ఆ బాధ్యతను తల్లి తనకు గుర్తుచేస్తోంది.

ఇంక యుద్ధంలో, ఇంత భయంకర పరిస్థితిలో తల్లి దాన్ని గుర్తుచేయటం ఎందుకు?

'అలాగే అమ్మా శ్రీరంగం వెళతాను' అన్నాడు గంగాధర శర్మ ఆమె చేతిలో చేయివేసి

ఆమె చిరునవ్వు నవ్వింది. హఠాత్తుగా ఆమె ముఖంలోకి జీవకళ వచ్చింది. ఆమె పద్మిని వైపు చూసింది.

పద్మిని వైపు చూసింది.

పద్మిని ఆమె దగ్గరకు వచ్చింది. ఆమె చేతిలో చేయివేసింది.

ఆమె నవ్వింది. 'పద్మినీ. వీళ్ళు జాగ్రత్త..' అంది ఆమె మాట తడబడింది. ఆమె చంద్రశేఖరుడి వైపు చూసింది ఏదో అనబోయింది మాట బయటకు రాలేదు. గాలి ఆమె గొంతులో కొట్టుమిట్టాడుతున్నట్టుంది. 'అమ్మా' అరిచాడు గంగాధర శర్మ.

ఆమె ఆ అరుపు వినిపించినట్టులేదు. 'చంద్రశేఖరా' మొత్తం గాలి ఒక్కసారిగా బయటకు తన్నుకు వచ్చింది.

ఆ గాలిలో వచ్చిన శబ్దంతో పాటు ఆమె ప్రాణాలు అనంతంలో లీనమయి పోయాయి. చంద్రశేఖరుడు స్థాణువులా నిలిచి చూస్తున్నాడు.

గంగాధర శర్మ కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు.

అక్కడ ఉన్న వారందరి కళ్ళు చెమర్చాయి. ఈ విషాదంలో అందరికీ దూరంగా గురువుగారు వెళ్ళిపోవటం ఎవ్వరూ చూడలేదు. ఆయన భగవధ్యానం చేస్తూ నదిలోకి ప్రవేశించారు ప్రాణత్యాగం చేశారు.

●●●

**తల్లి మరణం, ఆ వెంటనే గురువుగారి ప్రాణ త్యాగం** గంగాధర శర్మలో కలిగించిన మార్పు అందరిలో ఆశ్చర్యం కలిగించింది.

ముఖ్యంగా, తల్లి మరణిస్తూ 'చంద్రశేఖరా' అనటం, ఆమె చూపు గంగాధర శర్మవైపు, పద్మిని వైపు ఉండటం గంగాధర శర్మకు అర్థం కాలేదు.

దాన్ని ఎలా అర్థం చేసుకోవాలో అతనికి తెలియటం లేదు.

తల్లి మరణం, గురువుగారి ప్రాణత్యాగంతో ఒక్కసారిగా గంగాధర శర్మకు ఒంటరివాడయిన భావన కలుగుతోంది. తనకు మార్గ దర్శకత్వం చేసే వారిద్దరూ ఒకేసారి అదృశ్యమవటం అతని అయోమయాన్ని పదింతలు చేస్తోంది.

ఎందుకని ఇలా జరిగింది?

భగవంతుడి సృష్టిలో ప్రతి చర్యకూ ఏదో ఒక కారనం ఉంటుంది. దానికి ఏదో ఒక ఫలితం ఉంటుంది.

ఇది గతం, వర్తమానం, భవిష్యత్తుల నడుమ సంబంధంలాంటిది. గతం వర్తమానాన్ని ప్రభావితం నిర్దేశిస్తుంది.

కానీ ఈనాటి భవిష్యత్తు రేపటికి గతం అయిపోతుంది. అది వర్తమానాన్ని ప్రభావితం చేసి భవిష్యత్తును నిర్దేశిస్తుంది.

ఇదొక చక్రనేమి క్రమం.

ఎలాంటి ప్రపంచంలో ప్రతిదానికీ మరో దానితో సంబంధం ఉంటుంది. ప్రతీదానికీ ఆ సమయంలో కనబడని అర్థం ఏదో ఉంటుంది.

మరి ఇప్పుడు తన జీవితంలో జరుగుతున్న సంఘటనలకు అర్థం ఏమిటి?

గంగాధర శర్మ మనస్సు అల్లకల్లోలంగా ఉంది.

పుట్టిన ప్రతి మనిషి మరణించక తప్పదని తెలుసు.

పుట్టటం అంటేనే మరనం వైపు పరుగులిడటం అనీ తెలుసు.

అయినా మరణం ఎందుకంత బాధాకరం?

ఏమయి ఉంటుంది అమ్మ?

గురువు గారేమై ఉంటారు?

గంగాధర శర్మకు అంతులేని ఆలోచనలు కలుగుతున్నాయి. సమాధానం లేని ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

ఊళ్ళో వాళ్ళు సగం మంది ఊరొదిలి, ఇంకా తురుష్కుల ఆక్రమణకు గురికాని ప్రాంతాలకు తరలి వెళ్ళటం ఆరంబించారు. ఏ వైపు వెళ్ళాలన్న చర్చలు జోరుగా సాగుతున్నాయి.

తురుష్కులు తాకిన తమవారి వైపు కూడా చూసేందుకు ఇష్టపడని వారుబ్రతికి ఉన్న వారి ఎదుటనే వారి శ్రాద్ధ కర్మలు నిర్వహించటం ఆరంభించారు.

తమ తప్పు ఏమీలేదనీ, తురుష్కులు తమని తాకలేదని వారు ఎంతగా మొత్తుకున్నా అక్కడ ఎవరి గుండె కరగటం లేదు.

తమని జీవచ్ఛవాలుగా వదల వద్దని వారు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

వారి కన్నీరు జోడవటంతో ఏమో, ఆ ఊరిని ఆనుకుని ప్రవహిస్తున్న నది వేగం ఉధ్రుతమవుతోంది. అది అక్కడ ఉన్న వారినందరినీ ముంచెత్తుతుందేమో కనిపించేంత ఉధ్రుతంగా ప్రవహిస్తోంది.

గంగాధర శర్మకు ఇదేమీ పట్టటం లేదు.

అతని దృష్టిలో వారి ఆరాటాలు, పోరాటాలు అర్థవిహీనంగా అనిపిస్తున్నాయి. గురువుగారుంటే వారి సందేహాలు తీర్చేవారు.

మనిషిని మనిషి ప్రేమించటమే అసలైన భారతీయ ధర్మం అని బోధించేవారు మనిషి శరీరాన్ని చూడకూడదు 'ఆత్మను చూడాలి' అని వివరించే వారు. ఒక వ్యక్తి దగ్గర బందీగా ఉండటం వల్ల తన ప్రమేయం లేకుండా తనను బందీ చేసిన వాడిపై అనురాగం కలుగుతుంది. ఇది దోషం కూడా కాదు. ఎందుకంటే తన ప్రాణాలు బందీ చేసిన వాడి ఇష్టా ఇష్టాలపై ఆధార పది ఉంటాయి. తన అవసరాలన్నీ వాడు చూసుకోవటం అదొరకమైన భావన కలుగుతుంది.

అది ప్రేమకాదు.

ఆరంభంలో తనని, బలవంతంగా బందీ చేసిన వాడిపై ద్వేషం, కోపం కలిగినప్పటికీ, ఒక నిస్సహాయ స్థితిలో, ఒక తప్పని సరి పరిస్థితిలో వ్యక్తికి ఇలాంటి భావన కలుగుతుంది.

కాబట్టి దీర్ఘకాలం బందీగా ఉన్నప్పుడు. అలా బందీగా ఉన్నవాడి మానసిక స్థితిపై అనుమానం కలగటం సహజం.

ఆ సందేహం నివృత్తి కోసమేనా మా శ్రీరామ చంద్రుడు సీతాదేవిని అగ్ని పరీక్షకు గురిచేశాడు.

కానీ, పురాణాలను పరిశీలిస్తే, వ్యక్తి స్వచ్ఛందంగా భర్తను విస్మరించి పరపురుషుడి సంగమానికి ఉవ్విళ్ళూరినా, భర్త, ఆ భార్యను తిరిగి స్వీకరించటం, కలిసి ఆనందంగా సహజీవనం సాగించిన దృష్టాంతాలు కోకొల్లలు.

తార, శశాంకుడిని ఇష్టపడినా ఆమె భర్త బృహస్పతి తారకోసం, చంద్రుడి వల్ల ఆమెకు కలిగే శిశువుల కోసం పోరాటం జరపటానికి సిద్ధమయ్యాడు.

వాలి భార్య సుగ్రీవుడితో సుఖంగా జీవించింది. సుగ్రీవుడు సైతం వాలితో ఆమె జీవితం గురించి ఎలాంటి ప్రశ్నలు లేవనెత్తలేదు.

అంతెందుకు, అహల్య ఇంద్ర సంగమాన్ని విస్మరించి గౌతముడు మళ్ళీ ఆమెను స్వీకరించలేదు.

ఈ భగవంతుడి సృష్టిలో 'పాపం' అన్నది లేదు.

''పొరపాటు జరుగుతుంది. పొరపాటును గ్రహించి సరిదిద్దుకుంటే చాలు. సరిదిద్దుకోకపోవటాన్ని, అదే పొరపాటుని మళ్ళీ మళ్ళీ చేయటాన్ని 'దోషం' గా పరిగణించవచ్చు.

అలా కాని వాటిన్నిటికీ పరిహారాలుంటాయి. అలాంటి పొరపాట్లు వ్యక్తికి సహజం అని పెద్ద మనసుతో అర్థం చేసుకుంటుంది భారతీయ సమాజం.

కానీ ఇప్పుడు తన ఎదురుగా జరుగుతున్నది గంగాధర శర్మకు బాధకరం ఉంది.

ఒక దిశ అన్నది లేకుండా, మార్గదర్శనం చేసేవారు లేకుండా,తమ ప్రాచీన ఔన్నత్యాన్ని విస్మరించి, వారు చూపిన బాతను వదిలి తాత్కాలిక ఆవేశాలకు, సంకుచితాలకు లొంగిపోతున్నారు మనుషులు.

ఎందుకని ఇలా జరుగుతోంది?

అంతలో గంగాధర శర్మకు మరో ఆలోచన వచ్చింది.

తన గురువుగారు విజ్ఞాన వంతుడు. విచక్షణ ఉన్న విజ్ఞాని. తమ శాస్త్రాలపై అపారమైన విశ్వాసం ఉన్న వ్యక్తి.

నూరేళ్ళు ఆనందంగా బ్రతకమంటుంది శాస్త్రం. సత్కర్మలు చేస్తూ నూరేళ్ళు జీవితాన్ని అనుభవించమంటుంది శాస్త్రం.

మరి ఆయన ప్రాణ త్యాగం ఎందుకని చేశారు?

ప్రాణ త్యాగం కూడని పని మరి అంత విజ్ఞానవంతుదు, పండితుడు అలాంటి పని ఎందుకని చేశారు?

ఇలా రకరకాల ఆలోచనలతో గంగాధర శర్మ మనస్సు వికలం అవుతోంది. ఈ ఆలోచనలతో అతడు అక్కడే ఉన్న అక్కడ లేనట్టుగా ఉంది.

●●●

గంగాధర శర్మకు భిన్నంగా ఉంది చంద్రశేఖరుడి మానసిక స్థితి. అతడికి బాధగా ఉంది. కానీ విషాదంగా లేదు. గంగాధర శర్మలా వేదనలో కూరుకుపోలేక పోతున్నాడు.

అదేమిటో అతడికే అర్థం కాని ఉత్సాహం అతడిలోంచి తన్నుకు వస్తోంది. అతడికి యుద్ధం చేయాలని ఉంది.

తన కత్తి ఎదుటివాడి శరీరంలోకి దిగబడుతోంటే, తన చేతికి కలిగే భావన అదోరకమైన సౌఖ్యభావనలా తోస్తోంది. ఆ సౌఖ్యాన్ని పదేపదే అనుభవించాలనిపిస్తోంది అతడికి.

కానీ అందరూ అతడిపై సానుభుతి చూపిస్తున్నారు. అతడు విషాదంలో, దుఃఖంలో మునిగి ఉండాలన్నట్టు ప్రవర్తిస్తున్నారు.

అందుకని లేని విషాదం తెచ్చిపెట్టుకోవాల్సివస్తోంది. అది అతడికి విసుగ్గా ఉంది.

తల్లి మరణం పెద్దగా అతడిని బాధించటం లేదు.

తల్లి వయసయిపోయింది.

ప్రస్తుత పరిస్థితులలో, తల్లిని వెంటపెట్టుకుని ఊళ్ళు తిరగాల్సి రావటం, తురుష్కులను ఎదుర్కోవటం కష్టం. పైగా, ఈ వయసులో తురుష్కుల బారిన పడటం కన్నా, ఇలా మరణించటమే మేలు.

ఇక గురువుగారి మరణం అతడిపై ఎలాంటి ప్రభావం చూపలేదు. ఎందుకంటే. గురువుగారికి మొదటి నుంచీ గంగాధర శర్మ అంటేనే అభిమానం అని చంద్రశేఖరుడి నమ్మకం.

అతడికి అర్థం కానిది, మరణించే ముందు అమ్మ, తననీ, పద్మినినీ ఎందుకని చూసింది?

ఇక ఊళ్ళో వాళ్ళ గొడవలు అతడికి విసుగు కలిగిస్తున్నాయి.

తురుష్కులు ఎత్తుకు పోయారు. అయితే ఏమైంది? వాళ్ళు ఎత్తుకుపోగానే, ఇన్నాళ్ళ అనుబంధాలు, ఆప్యాయతలు అదృశ్యమై పోతాయా?

వీళ్ళూ తురుష్కుల బారిన పడేవారే. అదృష్టం బాగుంది తప్పించుకున్నారు లేకపోతే, ఈ పాటికి మతం మారి ఉండేవారు. లేదు చచ్చి ఉండేవారు.

అది అర్థం చేసుకోకుండా, పట్టుబడ్డ వారిని పరాయి వాళ్ళున్నట్టు చూడటం, వారికి శ్రాద్ధ తర్పణాలు విడవటం, దానికి వీళ్ళు ఏడవటం చంద్రశేఖరునికి విసుగు కలిగిస్తోంది.

కత్తి తీసుకుని ప్రతి ఒక్కడి మెడమీద పెట్టి 'స్వీకరిస్తావా? ఛస్తావా?' అని బెదిరించాలని ఉంది.

శూరవర్మ, పద్మిని, ప్రహరసింహులు జరుగుతున్న దాన్ని నిర్లిప్తంగా చూస్తూండిపోయారు.

వారికి ఇది అనుభవమే

ఊళ్ళు ఊళ్ళు చూస్తూ చూస్తూ స్మశానాలుగా మారిపోవటం, జీవితాంతం ఒకరికొకరు తోడుగా ప్రాణంలో ప్రాణం ఉండాల్సిన వారు కన్నుమూసి తెరిచేలోగా బద్ధ శత్రువులై ఒకరి పొడ మరొకరికి గిట్టని విధంగ మారిపోవటం వారికి అనుభవమే.

కళ్ళు మూసేలోగా కళ్ళ ఎదురుగా ఉన్న ప్రపంచం అనూహ్యమైన రీతిలో రూపాంతరం చెందటం, జీవితాలు మారిపోవటం వారికి అనుభవమే.

పద్మినికి గంగాధర శర్మను చూస్తే జాలిగా ఉంది.

ఆమెకు అతడిని దగ్గర తీసుకుని ఓదార్చాలని ఉంది.

ఇలాంటి వాళ్ళ బ్రతుకు భవిష్యత్తులో మరీ దుర్భరం అవుతుందని ఆమెకు తెలుసు. ప్రపంచంలోంచి సున్నితత్వం, ప్రేమ, అనురాగం, ఆప్యాయతలు నెమ్మదిగా అదృశ్యం అవుతున్నాయని ఆమె గ్రహించింది.

ఎవరికి వారే, స్వలాభం, సుసౌఖ్యం చూసుకునే ప్రపంచ ఆవిష్కరణ జరుగుతోందని ఆమె అర్థం చేసుకుంది -

అందుకే గంగాధర శర్మను చూస్తే జాలిగా ఉంది ఆమెకు.

●●●

ఆకాశంలో సూర్యుడు విశ్రాంతికని నెమ్మదిగా దుప్పటి కప్పుకుంటూ అదృశ్యమవుతున్నాడు.

సూర్యుడు దిగిపోగానే అప్పటి వరకూ ఏమనాలో నక్కి ఉన్న తారకలు ఆకాశంలో మిలమిలలాడుతూ వచ్చేశాయి.

హఠాత్తుగా లేచాడు గంగాధరుడు.

చంద్రశేఖరుడి వద్దకు నడిచాడు.

గంగాధరుడు లేవగానే ఒక్కసారిగా ఆసాంతం నిశ్శబ్దం అయిపోయింది.

సూర్యుడికి వీడ్కోలు పలుకుతూ, చంద్రుడికి స్వాగతం పలుకుతున్న పక్షితతులు సైతం ఒక్కసారిగా నిశ్శబ్దమైపోయాయి.

చంద్రశేఖరుడి పక్కన కూచుండిపోయాడు గంగాధరుడు.

ఎంత ఆపుకుందామని ప్రయత్నించినా గంగాధర శర్మ కళ్ళల్లోంచి నీళ్ళు ఉబికి ఉబికి వస్తున్నాయి.

గంగాధర శర్మవైపు నిరసనగా చూశాడు చంద్రశేఖరుడు.

ఆడపిల్లల్లాగా ఏడవటం అతడిని అసహ్యం కలిగిస్తోంది.

ఏమైందని ఏడుపు?

మనుషులు పుడతారు. ఛస్తారు. దాన్లో ఏడవటం ఎందుకు?

గంగాధర శర్మ మనస్సులో బాధ సుళ్ళు తిరుగుతోంది.

ఇపుడీ ప్రపంచంలో తనూ చంద్రశేఖరుడు, చంద్రశేఖరుడికి తాను తప్ప ఎవరూ లేరు.

నిన్నటి వరకూ తల్లి తమ వెంట ఉంటే, మొత్తం ప్రపంచం తనవెంత ఉన్న భావన కలిగేది. ఇప్పుడు ఆ ఒక్క మనిషి లేకపోతే మొత్తం ప్రపంచమే లేనట్టు అనిపిస్తోంది. తమకెవరూ లేరన్న ఒంటరి భావన దహించివేస్తోంది.

చంద్రశేఖరుడు ఎంతో ఆప్యాయంగా అనిపిస్తున్నాడు.

ఇప్పుడు గమనించాడు గంగాధర శర్మ.

చంద్రశేఖరుడి కళ్ళు అచ్చు అమ్మ కళ్ళలా ఉన్నాయి.

చంద్రశేఖరుడి కళ్ళల్లోంచి అమ్మ తొంగి చూస్తున్నట్టుంది.

ఎందుకో ఒక విచిత్రమైన సంచలనం కలిగింది. గంగాధర శర్మలో మనిషి భౌతికంగా అదృశ్యమవుతాడు. కానీ అతని అంశకు మరణం లేదు. అతని లక్షణాలకు మరణం లేదు. మనిషి సూక్ష్మ స్థాయిలో మరణం లేదు. స్థూల శరీరం నశిస్తుంది. అంతే.

ఈ భావన కలగటంతోటే ఏదో సాంత్వన కలిగినట్టయింది.

'ఇప్పుడేం చేద్దాం?' లో గొంతుకలో చంద్రశేఖరుడిని అడిగాడు.

'ఏడుస్తూ కూచుందాం' అంటూ విసురుగా లేచాడు చంద్రశేఖరుడు.

ఆశ్చర్యంగా చూశాడు చంద్రశేఖరుడి వైపు గంగాధర శర్మ.

'ఏం చేయాలని నన్నెందుకు అడుగుతున్నావు? నేను శూరవర్మతో కలసి తిరుగుతాను. కనబడ్డ తురుష్కుడిని కనబడినట్టు నరుకుతాను. ఒక చోట ఉండటం నాకు కుదరదు. నువ్వే ఏదో ఓ నదీపీఠం చూసుకో. ఓ పర్ణశాల కట్టుకుని గ్రంథపఠనం చేస్తూ బతుకు' కసిగా అన్నాడు చంద్రశేఖరుడు.

'నేను శ్రీరంగం వెళదామనుకుంటున్నాను.' అన్నాడు గంగాధర శర్మ మెల్లగా నిరసనగా చూశాడు చంద్రశేఖరుడు.

'నీలాంటి వాళ్ళకి నిజానిజాలు గ్రహింపుకురావు. ఒక పక్క తురుష్కులు మనమీద మిడతల దండులా వచ్చి పడుతూంటే, శ్రీరంగం పోతాడట. అక్కడ పోయి ఏం వాదిస్తావు? వాదించి ఏం సాధిస్తావు?'

'మన పూర్వికుల మాట నిలబెడతాను'

పెద్దగా నవ్వాడు చంద్రశేఖరుడు.

'ఒక కత్తి. దెబ్బతో పూర్వికులు, సంప్రదాయం, చరిత్ర అంతా హుష్ కాకి అయిపోతోంది. మొత్తం సమాజం కొత్త జన్మ ఎత్తుతోంది. గతం నాస్తి అయిపోతోంది. మొత్తం సమాజం కొత్త జన్మ ఎత్తుతోంది. గతం నాస్తి అయిపోతోంది. అలాంటి పరిస్థితులలో

పూర్వికుల మాట నిలబెట్టటం అన్న లోచనకే హాస్యాస్పదం.' కత్తిపట్టు నాతోరా. వర్తమానంలో మనల్ని మనం కాపాడుకుందాం. ఎప్పుడో జరిగిపోయిన గతాన్ని పట్టుకుని వర్తమానాన్ని చేజార్చుకోవటం మూర్ఖత్వం' కోపంగా అన్నాడు చంద్రశేఖరుడు.

'చంద్రశేఖరా.. గతాన్ని తిరస్కరించిన వాడు నీకు వర్తమానమే కాదు భవిష్యం కూడా ఉండదు. ఈ నిరంతరం సాగే కాలప్రవాహంలో గతం వర్తమానం భవిష్యత్తులు విడదీయరాని సంబంధం కలవి. వాటిని వేరు చేయటం కుదరదు. విస్మరించటం తగదు' అన్నాడు గంగాధర శర్మ.

హేళనగా నవ్వాడు చంద్రశేఖరుడు.

'నీ తర్కాలు, మర్కతాలు పండితులపైన, అద్దాల మేడల్లో ముక్కుమూసుకుని బయట ప్రపంచాన్ని దూరం చేసుకున్న మూర్ఖులపైన ప్రయోగించు. నాపైన కాదు. నేను నిజాన్ని నిక్కచ్చిగా చూస్తాను. వెరచి పారిపోకు'

'చంద్రశేఖరా, మూర్ఖుడిలా మాట్లాడకు..'

గంగాధర శర్మ మాటను పూర్తి కానీయలేదు చంద్రశేఖరుడు. కత్తిదూసి గంగాధర శర్మ మెడపైన పెట్టాడు.

'ఎవరు మూర్ఖుడు? పాతను పట్టుకుని వేలాడే నువ్వా? వర్తమానంతో రాజీపడుతూ జీవించాలనే నేనా?'

శూరవర్మ విషాదంగా తలపంకించాడు.

ఇలాంటి పోరాటాలు దేశం మొత్తం అనేకం జరుగుతాయి. ఇప్పుడు జరుగుతున్న అలాంటి పోరాటాలకు ప్రతీకలాంటిది మాత్రమే.. గతం, వర్తమానం, భవిష్యత్తు ఒకే ప్రవాహం లాంటి ఈ మూడు అంశాలు వేర్వేరయి, విడివడి, ముడపడి సమాజాన్ని అల్లకల్లోలం చేయబోతున్నాయి.

వర్తమానంపై గతం ప్రభావాన్ని గుర్తించి భవిష్యత్తును తీర్చిదిద్దాలనే అవగాహన, విచక్షణలు లోపించిన సమాజం గతాన్ని పట్టుకుని వేలాడి వర్తమానాన్ని విస్మరించటమో, గతాన్ని వదిలి వర్తమానంలో బ్రతకాలని తపన పడి భవిష్యత్తును పారవేసుకోవటమో చేస్తుంది. తద్వారా సమస్తమూ నష్టపోతుంది.

సమాజానికి దిశానిర్దేశనం చేసి, సరైన ఆలోచనలివ్వగల వారు గురువుగారిలా పలాయనంలో ఉంటే, ఇక ఆవేశాలు, అహంకారాలు తప్ప సమాజంలో ఏం మిగులుతాయి? ఇక సమాజం ఏవైపు ప్రయాణిస్తుంది?

గంగాధరుడు నెమ్మదిగా తన మెడపై ఉన్న కత్తిని చేతితో పక్కకు నెట్టాడు. లో స్వరంలో అన్నాడు.

'నేను ఇక జీవితంలో కత్తి పట్టుకుని ప్రతిజ్ఞ చేశాను. కత్తిపట్టి రాక్షసుడనవటం కన్నా మనిషిలా ప్రాణాలు విడవటం ఉత్తమం అన్న నిర్ణయానికి వచ్చాను. చంద్రశేఖరా.. నేనిక కత్తిపట్టను. నాకీ యుద్ధాలు, రక్తపాతాలతో పనిలేదు' నిశ్చయంగా అన్నాడు గంగాధరశర్మ.

●●●

**శూరవర్మ నిట్టూర్చాడు.**

ఇది అతడు ఊహించినదే

ఒక వ్యక్తి జీవితం ఎప్పుడు ఏ దిశలో ప్రయాణిస్తుందో ఎవరూ చెప్పలేరు. ఒక్క క్షణం చాలు వ్యక్తి జీవిత గమనాన్ని సంపూర్ణంగా రూపాంతరం చెందించి, అంతవరకూ అతడిలో ఉన్నదని ఊహించని వ్యక్తిని వెలికి తెస్తుంది. దాంతో, అంతవరకూ మనకు తెలిసిన వ్యక్తి అపరిచితుడవుతాడు.

గంగాధర శర్మలో శక్తి ఉందని తెలుసుకానీ, అది అవసరమైతే ఉగ్రనరసింహుడిలా అత్యంత భీషణమైన రీతిలో ఆ శక్తి ప్రకటితమవుతుందని ఎవరూ ఊహించలేదు. అది ప్రకటితమయిన తరువాత, ఆ శక్తిని ప్రకటించటం వల్ల కలిగిన ఉత్తేజంలో గంగాధర శర్మ తనని తాను మరచి రక్తదాహంతో తపించే ఉన్నత్త వ్యక్తిగా రూపాంతరం చెందుతాడని అందరూ ఊహించారు.

ఒక వ్యక్తి తనలో అనూహ్యమైన శక్తి ఉన్నదని గ్రహించిన తరువాత మాటమాటకీ అశక్తిని ప్రదర్శించి, ప్రజలను ఆశ్చర్య చకితులను చేయటం ద్వారా ఎంతో సంతృప్తి చెందుతాడు. అతని అహంకారం సంతృప్తి చెందుతుంది. ఇలా తనలోని శక్తిని నియంత్రించలేక దాని అదుపులోకి వచ్చిన వారు ఆ శక్తిని దుర్వినియోగం చేస్తారు. రాక్షసులవుతారు. అలాకాక, తమలోని శక్తిని నియంత్రించి దానిని నిర్మాణాత్మకంగా ఉపయోగించిన వారు గొప్పవారవుతారు. దేవతలవుతారు. చంద్రశేఖరుడు తనలోని శక్తిని గుర్తించాడు. దాని ప్రలోభంలో పడ్డాడు. దాంతో అతడు తనలోని తనలోని మానవత్వం కన్నా రాక్షసత్వానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాడు. తన శక్తిని ప్రదర్శించే మరో అవకాశం ఎప్పుడు వస్తుందా అని తహ తహలాడుతున్నాడు.

గంగాధర శర్మ కూడా అలాంటి ప్రలోభంలో పడతాడని శూరవర్మ భయపడ్డాడు. అయితే, గంగాధర శర్మ ప్రలోభంలోనయితే పడలేదుకానీ, మరోవైపు పూర్తిగా మళ్ళాడు. ఇక కత్తిపట్టను. యుద్ధం చేయను అంటున్నాడు. ఇదీ మంచిది కాదు వ్యక్తిలో ఏ విషయంలోనైనా 'అతి' మంచికాదు. తీవ్రస్వభావం వల్ల అనర్థాలు కలుగుతాయి. సమతౌల్య సాధన ఆవశ్యకం. కానీ చంద్రశేఖరుడిది ఒక రకమైన తీవ్రత అయితే, గంగాధర శర్మది మరో రకమైన తీవ్రత. వీరికి సమతౌల్యం ఎవరు నేర్పాలి? సమన్వయం ఎలా నేర్పాలి?

ఎందుకో శూరవర్మకు నిస్సత్తువగా అనిపించింది.

ఒక దేశ వ్యక్తిత్వం కష్టకాలంలోనే బహిర్గతమవుతుంది. భారతీయ ధర్మం ప్రపంచంలోని ఇతర అన్నిటికన్నా విశిష్టమైనది. ఆటుపోట్లను తట్టుకోవటమే కాదు, ఒక జీవనదిలా అన్నిటినీ తనలో కలుపుకుని, సరికొత్త రూపాలు కాలానికణుగునంగా ధరిస్తూ కూడా తనదైన ప్రత్యేకతను నిలుపుకుంటూ వస్తోంది. కానీ జీవనది నీళ్ళూ ఆరం భంలోని స్వచ్ఛతను కోల్పోయి, రాను రాను నూతన వర్ణాలను ధరించినట్టు ధర్మం మౌలిక లక్షణాలను కాపాడుకుంటూ కొత్త పోకడలను పోతూ వస్తోంది. కానీ ఇపుడీ అవాంతరాన్ని ఎలా తట్టుకుని తన అస్తిత్వాన్ని కాపాడుకుంటుందోనన్న అనుమానం కలుగుతోంది.

గతంలోని పరిస్థితికి ఇప్పటికీ చాలా తేడా ఉంది.

గతంలో శత్రువుకు కొన్ని నియమాలుండేవి. కొన్ని నీతులు, నిబంధనలు ఉండేవి. శత్రువులను గౌరవించటం ఉండేది. పోయిన వాడిలో వీరత్వాన్ని గుర్తించి వాడిని సముచితంగా సత్కరించటం ఉండేది.

మంగోలులు ఓ భారతపండితుడిని బందీగా పట్టుకుని వెళ్ళి, చివరికి అతడిని గురువుగా స్వీకరించి గౌరవించిన గాధ శూరవర్మ విన్నాడు. కానీ ఆ సంస్కారం, ఆ ఔదార్యం, ఆ ఔన్నత్యం ఇప్పుడు తాము ఎదుర్కొంటున్న శత్రువులో కనబడటం లేదు.

శత్రువు ఎంతటి వీరుడయితే, వాడిని అంత కసిగా శిక్షించటం శూరవర్మ కళ్ళారా చూశాడు.

తమ దేవుడే అసలు దేవుడు, తమ నమ్మకమే అసలు నమ్మకం, అందరు దాన్నే ఆమోదించాలి. లేకపోతే చావాలి అన్న మూర్ఖపు పట్టుదలతో ఉన్నాడు శత్రువు. అలాంటి శత్రువును ఎదుర్కొని నిలబడటం సామాన్యం కాదు. నీరు ఎలాంటి దాన్నయినా తనలో కలుపుకోగలదు. కానీ నూనె నీటితో కలుస్తుందా? అలాంటి కలవని నూనెను భారతీయ సమాజం ఇప్పుడు తనలో ఎలా కలుపుకోగలుగుతుంది? నూనెను సంపూర్ణంగా కలిపేసుకోగలంత ఏదీగ్రామంలో నీరు నదిలో వచ్చి చేరినప్పుడు.

కానీ అందుకు నదిలో ఊట అధికంగా ఉండాలి. నూనెను ముంచెత్తగలంత పడి గ్రామంలో ఉండాలి. అంటే భారతీయ సంస్కృతిలో, సమాజంలో నూతన చైతన్యం వెల్లి విరియాలి. వ్యక్తులకు తమ ధర్మం పట్ల గౌరవం కలగాలి. నమ్మకం పెరగాలి. అవగాహన

ఏర్పడాలి. ఆపై ధర్మం పట్ల అచంచలమైన విశ్వాసం స్థిరపడాలి. అప్పుడు ఎలాంటి తుఫానులయినా తట్టుకుని, వాటిలోని మంచిని స్వీకరించి తనని తాను పరిపుష్టం చేసుకుని, కొత్త మార్గంలో అతి వేగంగా, నూతనోత్సాహంతో పయనించే తాజాదనం పెరుగుతుంది.

కానీ ఇప్పుడు తన కళ్ళముందు కనిపిస్తున్నది వేరు. ప్రజలలో సంకుచితతత్వం పెరుగుతోంది. ఎదుటివారి బలహీనతలను సహృదయంతో అర్థం చేసుకుని, వారికి సాంత్వననివ్వటం కొసం నియమాలను కొత్త దృక్కోణంలో విశ్లేషించే బదులు, నియమాలను కఠినతరం చేసి, తీవ్రమైన సంకుచిత తత్వం ప్రదర్శించటం కనిపిస్తోంది. మనుషులను దూరం చేసుకోవటం కనిపిస్తోంది.

నీరులేని నదికి మనుగడ ఉంటుందా?

ఎందుకని ఈ సమాజం ఈ నిజాన్ని గ్రహించలేకపోతోంది? ఎవరు తెలపాలి సమాజానికి ఈ నిజాన్ని?

సంకుచిత తత్వానికి తోడుగా ఒక రకమైన తీవ్రత ప్రతి విషయంలో కనిపిస్తోంది. అందుకే చంద్రశేఖరుడి తన రక్తపిపాసను మెచ్చుకోనట్టే, ఇప్పుడు గంగాధరుడి తీవ్రమైన 'శాంతి', 'అహింస'ను కూడా శూరవర్మ మెచ్చలేక పోతున్నాడు.

భారతీయ ధర్మంలో గతంలో ఒకసారి ఇలాంటి శాంతి, అహింసలు తీవ్రస్థాయిలో తలెత్తుతాయి. ఈ 'శాంతి', 'అహింస'లు ఎంత తీవ్రస్థాయిలో సమాజంలో వ్రేళ్ళూనుకున్నాయంటే జైన, బౌద్ధం, తాము ఉద్భవించిన చెట్టునుండి తమని తాము ప్రత్యేకంగా భావించుకున్నాయి. అంటే శాఖ తనని తాను వృక్షానికి ప్రత్యేకం అనుకుని తమ ప్రత్యేక అస్తిత్వాన్ని ఏర్పాటు చేసుకునే ప్రయత్నం చేశాయన్నమాట.

ఫలితంగా సమాజం అల్లకల్లోలమయింది. అశాంతిమయం అయింది. కానీ ఈ రెండు ఆలోచనల వల్ల భారతీయ ధర్మం నూతన మార్గంలో ప్రయాణించింది. తనని తాను సంస్కరించుకుని కుబుసం విడిచిన పాములా కొత్త జన్మ ఎత్తింది.

అందుకు శంకరాచార్యులవారు ప్రేరణ నిచ్చారు. మార్గ నిర్దేశనం చేశారు. కానీ భారతీయ ధర్మంలో, అంత వరకూ లేని కొన్ని కొత్త ఆచార వ్యవహారాలు ఈ 'అహింస' వల్ల చోటు చేసుకున్నాయి. ఫలితంగా సమాజంలో అనేక విప్లవాత్మకమైన మార్పులు సంభవించాయి.

ఆ మార్పుల ఫలితంగా ఈనాడు కత్తిపట్టని వారు, మాంసాహారం సేవించనివారు, శక్తిహీనులు, బలహీనులు సమాజంలో మెండుగా నిండారు.

ఆ ఫలితమే ఈనాడు తురుష్క ధాటికి చెల్లాచెదురవుతున్నది సమాజం. మళ్ళీ శంకరాచార్యులు రావాలి. సమాజానికి కర్తవ్యం బోధించి అందరూ కత్తి పట్టేట్టు చేయాలి.

అంటే, గతంలో శంకరాచార్యుల వారు బోధించిన 'మాయ'కు భిన్నమైన 'మాయ'ను బోధించాలన్నమాట. ఆ 'మాయ'తో ప్రజలు విరక్తులయితే ఈ మాయతో ప్రజలు సమ్మోహితులై కార్య శూరులు కావాలి. కానీ ఇది అత్యంత త్వరగా సంభవించాలి.

లేకపోతే సమాజం మొత్తం తురుష్కమయం అయిపోతుంది. తలవంచుకుని నుంచున్నాడు శూరవర్మ.

ఒకరొకరుగా అక్కడ ఉన్న వారంతా ఏవేవో పనులలో నిమగ్నమవసాగారు.

●●●

ప్రవహిస్తున్న నీటిని చూస్తూ నుంచున్నాడు గంగాధర శర్మ.

నీటిలాగే అతని హృదయంలోనూ అనేక రకాల ఆలోచనలు, భావనలు సుళ్ళు తిరుగుతున్నాయి. నీటి ప్రవాహానికి దిశ ఉంది. అతని ఆలోచనలకు దిశలేదు. గమ్యం లేదు.

పద్మిని అతని పక్కకు వచ్చి కూచుంది.

ఆమె వచ్చిందని తెలిసి కూడా ఆమె వైపు తల తిప్పలేదు గంగాధరుడు. ఆమె వైపు చూడలేదు. ఆమె పక్కన ఉన్నా లేనట్టే కూచున్నాడు.

'గంగాధరా' మృదువుగా పిలిచింది పద్మిని.

పద్మిని వైపు తలతిప్పి చూశాడు గంగాధరుడు. అతడి కళ్ళల్లో నీళ్ళున్నాయి. అది చూసి చలించిపోయింది పద్మిని. మాతృమూర్తిలా అతడిని దగ్గరకు తీసుకుని ఓదార్చాలనిపించింది.

ఇప్పుడు తాము అనుభవిస్తున్నది నిజం కాదు, ఓ పీడకల అని, కళ్ళు తెరిచేసరికి ఈ పీడకల అంతం అయిపోతుందనీ అతడిని నమ్మించాలనిపించింది. అతి కష్టం మీద తనని తాను నియంత్రించుకుంది పద్మిని.

'గంగాధరా, ఇది మనమందరం కలసి ఉండవలసిన సమయం. ఇలాంటి సమయంలో నువ్వు ఒక్కడివి శ్రీరంగం వెళ్తాననటం భావ్యంకాదు' మెల్లగా అంది.

గంగాధర శర్మ మాట్లాడలేదు. ప్రవహిస్తున్న నీటివైపు చూస్తూ నుంచున్నాడు. 'గంగాధరా, కష్ట సమయంలోనే వ్యక్తిత్వం తెలిసేది. గాలి వీస్తే కొట్టుకుపోయేవి గడ్డిపోచలు. ఎండుటాకులు. సుడిగాలి వీచినా స్థిరంగా నిలుస్తాయి మహావృక్షాలు. వ్యక్తి మహా వృక్షంలా శాఖోపశాఖలతో విస్తరించిన విజ్ఞానంతో, స్థిరంగా నిలవాలి. గాలికి కొట్టుకుపోయే గడ్డిపోచలా కాకూడదు' అంది పద్మిని.

గంగాధర శర్మ మాట్లాడలేదు. మౌనంగా ఉన్నాడు. కాస్సేపు తాను మౌనంగా ఉంది పద్మిని. చివరికి నిట్టూర్చి మాట్లాడతం ఆరంభించింది.

'గంగాధరా, ఇది మనమంతా కలసి కట్టుగా నిలవవలసిన సమయం. చూశావుగా, తురుష్కుల ధాటికి, మన ప్రశాంత జీవనం ఎలా చిన్నాభిన్నమయిపోయిందో! ఇదొక చిన్న ఊరు మాత్రమే. ఇలాంటి అనేక ఊళ్ళు, సామ్రాజ్యాలు అతలాకుతలమయిపోతున్నాయి. ఎవరు ఎటుపోతున్నారో ఎవ్వరికీ తెలియటంలేదు. ఎవరు ఏమైపోతున్నారో ఎవరికీ తెలియటంలేదు. ఇలాంటి సమయంలో విచక్షణ ఉన్నవారు, విజ్ఞానవంతులు సమాజానికి దిశానిర్దేశనం చేయాలి. వ్యక్తులలో ఆత్మవిశ్వాసం నింపాలి. తమ ధర్మం పట్ల అభిమానాన్ని పెంచాలి ధర్మ రక్షణ కోసం నడుం బిగించేట్టు చేయాలి. ఇంకా ఏదో చెప్పబోతున్న పద్మిని గంగాధర శర్మ తల ఎత్తి తనవైపు చూడటంతో ఆగిపోయింది. గంగాధర శర్మ కళ్ళల్లోని నీరు ఆవిరైపోయింది. ఆస్థానంలో నిప్పుకణికలు ఉన్నట్టుతోచింది పద్మినికి. అంటే రాక్షసత్వంలోని పరమానందాన్ని నేను అనుభవించేట్టు చేశాడు. కానీ, ఆలోచించాను, నేను చేసిందేమిటి? భగవంతుడి సృష్టిలో అత్యుత్తమంగా భావించే మానవులను క్షణకాలంలో విగత జీవులను చేశాను. భగవంతుడు సృజించిన అపూర్వమైన శారీరక అంగాలను విరిచి ముక్కలు చేశాను. ఇదంతా చేస్తూ, చిన్నపిల్లలు బొమ్మలను విరిచి, చీమలను చంపి ఆనందించేట్టు ఆనందించాను. నేను గొప్పవాడినయినట్టు విర్రవీగాను. చెప్పు, ఇది నా వ్యక్తిత్వమా? సాటి మనిషిని హింసించి, చంపి, నేనేదో ఘనకార్యం సాధించానని సంబరాలు చేసుకోవటం, నా ధర్మాన్ని రక్షించాననో, నా సమాజాన్ని నిలుపుతున్నాననో గొప్పలు చెప్పుకోవటం భావ్యమా? ఎదుటి వాడిని చంపితేనే నా ధర్మం నిలుస్తుందా? అలాగయితే ఎంతమందిని చంపాలి? ఇక అలా చంపుతూ పోతే నేను మనిషిని ఎలా అవుతాను? నా ఖర్మం కోసం నేను రాక్షసుడి నవ్వాలా? చెప్పు పద్మినీ?' అడిగాడు.

పద్మినికేమనాలో తోచలేదు. గంగధర శర్మ మానసిక స్థితి ఆమెకు అర్ధమవుతోంది. చివరికి మెల్లిగా అడిగింది.

'అందుకని, నువ్వు అన్నీ వదిలి పారిపోవాలనుకుంటున్నావా?'

కాస్సేపు మౌనంగా ఉన్నాడు గంగాధరశర్మ.

'పద్మినీ, నువ్వు నేను పారిపోతున్నానని అనుకుంటే అనుకో. కానీ నాకు తెలుసు నేను పారిపోవటం లేదని. నేను ఓ రాక్షసుడిలా మారి, మనుషుల శరీరాలను ముక్కలు చేస్తున్నప్పుడు, వారి ప్రాణాలను హరిస్తున్నప్పుడు, నాలోని రాక్షసుడు ఆనందిస్తున్నాడు. కానీ నాలోని మనిషి ఏమాలోచిస్తున్నాడో తెలుసా?' ఆగి ఆమె వైపు చూశాడు.

అతడి వైపు చూసింది పద్మిని.

'పద్మినీ, ప్రతి వ్యక్తి సులభంగా రాక్షసుడవగలడు. ప్రతిమనిషిలో పశువు అంశ ప్రధానంగా ఉంటుంది. నిజానికి మనిషికీ పశువుకూ మౌలికంగా తేడాలేదు. పశువును అణచి మనిషి మనిషిలా ఎదగాలి. అందుకే మనిషి మనిషిగా ఎదగటం కష్టం అంటారు. పశువులా నిలవటం సులభం. నాగరికత అంటే అదేకదా! నియమం నాగరికత. పశువు నియమాలకు లొంగదు. దానికి నియమాలు లేవు. అలాంటి పశువును నియంత్రించి నియమపాలన చేయించటం నాగరికత. నాగరికుడు మనిషి. మానవుడు. అందుకే, నాలా, రాక్షసులయి, పశువులయి చంపేవాళ్ళు బోలెడంతమంది వస్తారు. కానీ, ధర్మ సూక్ష్మాలు గ్రహించి, ప్రజలకు నిజానిజాలు తెలిపి, ధార్మిక సత్యాలను వివరించి, ధర్మ ప్రచారం చేయగలవారెందరు? నేను అదే చేయాలనుకుంటున్నాను.'

ఆశ్చర్యంగా చూసింది పద్మిని గంగాధర శర్మ వైపు.

'నువ్వు దర్మప్రచారం చేస్తావా? నువ్వు శ్రీరంగం వెళ్ళి వాదిస్తానన్నావు?' నవ్వాడు గంగాధర శర్మ.

'అవును. శ్రీరంగం వెళతాను. కాలినడకన. ఆలోచించు, ఇక్కడి నుంచి బయలుదేరిన నేను ఎన్ని రాజ్యాలు దాటాలి? ఎన్ని ఊళ్ళు దాటాలి? దారిలోని ప్రజలందరికీ ధర్మం వివరిస్తాను. మన శాస్త్ర గ్రంధాల తత్వం బోధిస్తాను. వారికి పరిచయం లేని విజ్ఞానాన్ని వారికి చేరువ చేస్తూ పోతాను. పద్మినీ, ఇంతకాలం గురువుగారు నాలా బోధించిన విజ్ఞానాన్ని పదిమందికీ పంచుతూ ముందుగు సాగుతాను. గురువుగారు ప్రాచీన ధర్మశాస్త్రాలు, వాఙ్మయాన్ని భద్రంగా కాపాడాలనుకున్నారు. కానీ అవిపోయాయి. మిగిలింది నేను. నేనుకూడా పోయేలాగా వాటిని పదిమందికీ బోధించిపోతాను. పద్మినీ, కత్తిపట్టి ఈనాడు పదిమందిని చంపినవాడు, రేపు మరో కత్తికి బలి అవుతాడు. లాభం ఏమిటి? మన ధర్మానికి మన సాహిత్యం ప్రాణం. అలాంటి సాహిత్యాన్ని పదిమందికి పంచుతాను. అదీగాక, చూశావుగా సంకుచిత్వం ఎలా ప్రబలుతుందో మన వారిని మనమే దూరం చేసుకుంటున్నాం. ఇది మన ధర్మ శాస్త్రాలలోని ఔన్నత్యానికి విశాలమైన ఆలోచనలకీ కళంకాన్ని ఆపాదిస్తుంది. అందుచే ప్రజలకు నిజాలు తెలియాలి. అందుకే నా ప్రయాణం' అన్నాడు గంగాధరశర్మ నిశ్చయంగా.

●●●

**ఇంకా ఆకాశంలో చిక్కని చీకటి సామ్రాజ్యం ఏలుతోంది.** మినుకు మినుకుమంటున్న తారలు, చీకటితో పోరాటం సాగిస్తూనే ఉన్నాయి. చీకటి తరువాత వెలుతురు ఉంటుందని వాటికి తెలుసు. అందుకే వెలుతురు కోసం ఎదురు చూస్తూ, వీలయినంతగా చీకటిని దూరం చేయాలని ప్రయత్నిస్తున్నాయి.

ఆకాశం వైపు తదేకంగా చూస్తూ కూచున్నాడు గంగాధర శర్మ.

శ్రీరంగం ప్రయాణమవ్వాలని గంగాధర శర్మ నిర్ణయించుకున్నాడు. ఎవరు ఎంతగా ప్రయత్నించినా తన నిర్ణయం మార్చుకునే వీలులేదని స్పష్టం చేశాడు. అయినా ఎందుకో అతని మనస్సులోని అల్లకల్లోలం తగ్గటంలేదు.

పక్కన అలికిడి అయితే చూశాడు. శూరవర్మ వచ్చి కూచున్నాడు.

'నిద్రపట్టటం లేదు' గంగాధర శర్మ.

'నిద్రపోవాలని ప్రయత్నించలేదు కూడా' అన్నాడు.

శూరవర్మ నిట్టూర్చాడు.

'గంగాధరా, గురువుగారు నీమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అంతకన్నా ఎక్కువ ఆశలు నేను పెట్టుకున్నాను. మన సమాజం ప్రస్తుతం ఒక విచిత్రమైన పరిస్థితిని వెదుక్కొంటోంది. ఈ సమయంలో మనమంతా కలిసి కట్టుగా నిలబడాల్సి ఉంటుంది. శత్రువు, ఇంతవరకూ మనం ఎదురుకోనివాడు. కేవలం మనల్ని భౌతికంగానే కాదు, మానసికంగాను జయించాలని కంకణం కట్టుకున్నవాడు. ఈ శత్రువుకు సామ్రాజ్యం లభిస్తే సరిపోదు. సామ్రాజ్యంతో పాటు ప్రజల శరీరాలు, మనస్సులు, వారి నమ్మకాలు, జీవన విధానం అన్నీ తాను నిర్దేశించినట్టే ఉండాలి. అలాంటి శత్రువును ఎదుర్కొని నిలబడాలంటే మనం ఎంతగా ప్రతిఘటించాల్సి ఉంటుందో ఆలోచించు.' అనునయంగా అన్నాడు శూరవర్మ.

గంగాధర శర్మ చాలాసేపు మౌనంగా ఉన్నాడు.

చీకటిలో కలిసిపోయి కనబడకుండా వినిపిస్తున్న నీటి ప్రవాహపు గలగలలు తప్ప మరో శబ్దం వినబడటం లేదు.

ఉండి ఉండి చల్లని గాలి వీస్తోంది. మారుతున్న గాలి దిశను బట్టి తెల్లవారటం ఎంతో దూరం లేదని తెలుస్తోంది.

ఆకాశంవైపు ఏకాగ్రతతో చూస్తున్న గంగాధర శర్మ, శూరవర్మవైపు తిరిగాడు.

'గురువుగారు నాకు ఓ విషయం చెప్పారు' అన్నాడు హఠాత్తుగా తలెత్తి గంగాధర శర్మవైపు చూశాడు శూరవర్మ.

'ఈ ప్రపంచం ఎంత సరళమైనదో అంత సంక్లిష్టమైనది. ఏ విషయం కూడా పైకి కనిపించినంత సరళంగా ఉండదు. ఏ సమస్య కూడా అనిపించినంత సంక్లిష్టం కాదు. మనకు విషయాలు సరళంగా ఎప్పుడు అనిపిస్తాయంటే, మనం ఆ విషయాన్ని అన్ని కోణాల్లో పరిశీలించినప్పుడు. ఎప్పుడయితే, విషయాన్ని ఒకే కోణంలోంచి చూస్తూ ఉంటామో, అప్పుడు, ఆ విషయం సంక్లిష్టమవుతుంది.'

గంగాధరశర్మ వైపు నిశితంగా చూశాడు శూరవర్మ.

భారతీయ సమాజంలో ఇది ప్రధానంగా కనిపించే లక్షణం. ఇక్కడ మనుషులు వాదనలతో సమయం గడిపేస్తారు. తాము అధిగమించలేని ఇది ప్రధానంగా కనిపించే లక్షణం. ఇక్కడ మనుషులు వాదనలతో సమయం గడిపేస్తారు. తాము అధిగమించలేని సమస్య వచ్చినప్పుడు తమ కార్యశూరత్వంతో దాన్ని సాధించాలని ప్రయత్నించే బదులు వాదనలు ఆరంభిస్తారు. శుష్క వాదనలలో సమయం గడిపేస్తారు.

శూరవర్మను గమనించటం లేదు గంగాధర శర్మ.

'ఇప్పుడు ఈ తురుష్కుల దండయాత్రలని మీరు ఒకే కోణంలో చూస్తున్నారు. కత్తిని కత్తితో ఎదుర్కోవాలని చూస్తున్నారు. కానీ ఇది కత్తి సమస్య ఒక్కటే కాదు. అనేకానేక అంశాలను పరిగణనలోకి తీసుకుంటే కానీ మీకు సమస్య అసలు స్వరూపం అర్థం కాదు'

'ఏమిటా స్వరూపం?' లోగొంతుకలో అడిగాడు శూరవర్మ.

'మీరు మనదేశ చరిత్రను గమనించండి. మానవ స్వభావాన్ని గమనించండి. మన వాఙ్మయాన్ని తెలుసుకోండి. మన ఆలోచనలను ఆకళింపు చేసుకోండి. మీకు ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న సమస్య కొత్తది కాదనీ, ప్రాచీన కాలం నుంచేకాదు. మానవుడు ఆవిర్భవించినప్పటి నుంచీ మానవ సమాజం ఎదుర్కొంటూ వస్తున్న సమస్య ఇది అని అర్థమవుతుంది' నేను మాట్లాడుతూంటే పద్మిని నిశ్శబ్దంగా వచ్చి, వాళ్ళ మాటలు వినబడేంత దూరంలో కూచుంది.

ఆమెకు కాస్త దూరంలో నుంచుంది.

ఆమెకు కాస్త దూరంలో ప్రహరసింహుడు నిలబడ్డాడు.

'ఇద్దరు మనుషులు కలుస్తారు ఏం జరుగుతుంది? ఒక వ్యక్తి నయానో, భయనో, ప్రేమతోనో, బలవంతంగానో తన అభిప్రాయం ఎదుటివాడిపై రుద్దాలని చూస్తాడు ఒకవేళ ఆ అభిప్రయాలను స్వచ్ఛందంగా స్వీకరిస్తే సమస్యలేదు. అలాకాక తన అభిప్రాయాలను వదలక పోతే ఇరువురి నడుమ ఘర్షణ ఆరంభమవుతుంది. బలవంతుడు గెలుస్తాడు. కానీ బలహీనుడు తెలివైన వాడయితే, తన నమ్మకాల పట్ల అచంచల విశ్వాసం ఉన్నవాడయితే, తాత్కాలికంగా బలవంతుడికి లొంగినట్టు కనిపించినా, అవకాశం దొరకగానే తలఎత్తడు. బలవంతుడు ఎల్లప్పటికీ శక్తిమంతుడిగానే ఉండలేడు. ఈ ప్రపంచం సముద్రంలాంటింది. అలలు వస్తూంటాయి. పోతుంటాయి. అల స్థిరంగా ఉండదు. ఎల్లప్పుడు ఎగసిన దశలోనే ఉండదు. పైకి ఎగిరింది క్రిందకు రాక తప్పదు. ద్రోణిని వెన్నంటి లోయ ఉంటుంది. పగలు తరువాత రాత్రి వస్తుంది. ఆకులు రాలే కాలం వెన్నంటే చిగురులు తొడిగే కాలం ఉంటుంది. కాబట్టి ఈనాడు తన బలంతో తన మాట చలామణీ చేసుకున్నవాడు, రేపు బలహీనుడవుతాడు. ఒకప్పటి బలహీనుడు శక్తిమంతుడవుతాడు. ఇది ప్రపంచరీతి'

ఆకాశంలో వెలుగు రేకలు కనబడటం ఆరంభమయింది. వెలుతురు వచ్చేవరకూ చీకటిలో నిరంతర పోరాటం సాగించిన తారకలు నిశ్శబ్దంగా వెలుతురులో ఒదిగిపోతున్నాయి.

'అందుకే ఇప్పటి సమస్య మనకు కొత్తకాదు. ఇదే చివరిసారి ఇలాంటి సమస్యను ఎదుర్కోవటం కాదు. ఈ సమస్య అనంతకాలం నుంచీ వస్తోంది'

'ఇది పలాయనవాదం. నువ్వు సమస్యను పలచన చేసి తప్పించుకోవాలని చూస్తున్నావు' తీవ్రంగా అన్నాడు శూరవర్మ.

నవ్వాడు గంగాధర శర్మ.

'గురువుగారు నాకు ఓ విషయం ఎన్నో మార్లు చెప్పారు. కానీ నాకు అది అర్ధం కాలేదు. అది ఇప్పుడు అర్ధమయింది.'

'ఏమిటది?'

'కత్తితో సాధించే విజయం తాత్కాలికం. మీరు కత్తిని కత్తితోనే ఎదుర్కోవాలని చూస్తున్నారు. కానీ ఇది సమస్యలో ఒక భాగం మాత్రమే. మరో భాగం కత్తికన్నా పదునయినది. శక్తివంతమైనది.'

'ఏమిటది?'

'మీరు చూస్తున్నారుగా, తురుష్కుల బారినపడి, తమ తప్పులేకుండానే అత్యాచారానికి గురయిన వారు, తిరిగి తమ పాత జీవన విధానంలోకి రావాలనుకుంటే ఎలా ఇతరులు అడ్డుపడుతున్నారో!'

'చూశాను'

'కత్తి చేయలేని పని మనం చేస్తున్నాం. కత్తికన్నా ఎక్కువగా మన సమాజాన్ని, మన ధర్మాన్ని మనం గాయపరచుకుంటున్నాం. కత్తికి వెరవకుండా, ఎంతటి ఒత్తిడినయినా తట్టుకుని నిలబడి కూడా తమ ధర్మాన్ని విడవటానికి ఇష్టపడని వారిని, మనం మన ధర్మంలోకి రానీయకుండా తరిమేస్తున్నాం. వారిలో ద్వేషభావనలను తీవ్రం చేస్తున్నాం. ఒకరొకరిగా మనవారినే మనం దూరం చేసుకుంటున్నాం, శాశ్వతంగా. ఇక మళ్ళీ మనవైపు రావటమే కాదు, మనల్ని తరతరాలు ద్వేషించి, నాశనం చేయాలని. కంకణం కట్టుకునేంతగా. ఇప్పుడు చెప్పండి, ఈ సమస్య కత్తితో తీరుతుందంటారా? కత్తితో ప్రాణాన్ని హరిస్తారు. శరీరాన్ని పనికి రానిదిగా చేస్తారు. కానీ మనసుకయిన గయాన్ని ఎలా మాన్పుతారు? సమాజ ఆత్మలో పేరుకున్న మలినాన్ని ఎలా ప్రక్షాళన చేస్తారు?'

శూరవర్మ మౌనంగా ఉన్నాడు.

'గతంలో, రామాయణ కాలంలో రాక్షసులు, సమజిక జీవితాన్ని ఛిన్నాభిన్నం చేసేవారు. యజ్ఞయాగాదులను నాశనం చేసేవారు. కానీ వారు మనుషులను రాక్షసులుగా మార్చాలని ప్రయత్నించలేదు. కాబట్టి రాక్షస రాజును సంహరించటంతో సరిపోయింది.'

ఆకాశం ఎరుపెక్కింది. చీకటి పారిపోవటం వేగవంతమయింది. 'బౌద్ధుల కాలంలో సమస్య కొత్త రూపం ధరించి వచ్చింది. బౌద్ధం వ్యక్తులను మార్చటం ఆరంభించింది. సామాజిక జీవనాన్ని, ఆలోచనలను సంపూర్ణంగా రుపాంతరమొందించాలని ప్రయత్నించింది. అందుకే బౌద్ధాన్ని కత్తితో ఎదుర్కోలేదు. శంకరాచార్యుల వారు ధర్మాన్ని ఆ కాలానికి తగ్గట్టు తీర్చిదిద్దారు. దేశం నలుమూలల పర్యటించి ప్రజలలో ధార్మిక భావనలను రగిలించారు. సామాజిక జీవనాన్ని, ఆలోచనలను కొత్త దారులు తొక్కించారు. గమనించండి, శంకరాచార్యులవారు బోధించిన విధం, తిరిగి ప్రజలకు పాతకాలానికి తీసుకు వెళ్లలేదు. ముందుకు నడిపించింది. గతించిన కాలం తిరిగిరాదు. అది తిరిగి రావాలనుకోవటం మూర్ఖత్వమే కాదు అన్యాయం కూడా. సమయం ఎన్నడూ వెనక్కు పరుగిడదు. అది ముందుకే పరుగిడుతూంటుంది. సమాజం కూడా అంతే. ముందుకే పరుగిడాలి. వెనక్కు తిరగాలని ఆలోచించటం అన్యాయమే కాదు అనర్థం కూడా'

ఆకాలంలోకి బాలభానుడు వచ్చేశాడు. జగతి వెలుతురుమయం అవుతోంది.

'ఇపుడు మనం ఎదుర్కొంటున్న సమస్యలాంటిదే ఓ వైపు ఆనాటి రాక్షసులలా జీవితాలను భగ్నం చేస్తున్నారు. మరోవైపు బౌద్ధులలా సమాజాన్ని సంపూర్ణంగా పరివర్తనం చెందించి, భిన్నమైన సమాజాన్ని నెలకొల్పాలని చూస్తున్నారు. కాబట్టి ఈ సమస్య కత్తితోటే తీరదు. నీ తమ్ముడు కత్తిద్వారా సమస్యను పరిష్కరిస్తాడు. నువ్వు బుద్ధితో సాధించాలని గురువుగారు ఎప్పుడూ అంటూండేవారు. నాకు ఉక్రోషంగా ఉండేది. కోపం వచ్చేది. నాకూ కత్తి యుద్ధం వచ్చు అని నిరూపించాలని పట్టుదలగా ఉండేది. కానీ మొన్న కత్తిపట్టుకుని శత్రువులను సంహరిస్తున్నప్పుడు నాకు గురువుగారి మాటలలోని అర్థం బోధపడింది. ఈ సమస్య కత్తితోటే పరిష్కారం కాదు. ఓ వైపు కత్తితో ప్రతిఘటిస్తూనే, మరోవైపు మానసికంగా, ధార్మికంగా మనల్ని మనం శక్తివంతం చేసుకోవాలి'

'నువ్వు ఆ పని చేయగలవా?' సూటిగా అడిగాడు శూరవర్మ.

'నాకు తెలియదు. కానీ ప్రయత్నిస్తాను. ఇంకా దక్షిణం వైపు తురుష్కులు అడుగు పెట్టలేదు. నేను ఆ వైపు వెళతాను. జరుగుతున్నది వారికి వివరిస్తాను. శత్రువును ఎదుర్కొనేందుకు వారిని భౌతికంగా, మానసికంగా సిద్ధంగా ఉండమని చెపుతాను. నా వంతు ప్రయత్నం చేస్తాను. ఫలితం దైవం వంతు.'

శూరవర్మ మౌనంగా ఉన్నాడు.

ఎండ వేడి పెరుగుతోంది.

చివరికి శూరవర్మ అన్నాడు.

'పద్మిని యువతి. తను నా వెంట రావటం బాగుండదు. మంచిదికాదు.'

'కానీ వస్తానంటోంది. నువ్వు కత్తిపట్టనన్నావు. నీకేదైనా ప్రమాదం ఎదురయితే?'

'నన్ను నేను భగవంతుడికి అర్పణం చేసుకున్నాను. నాకేం జరిగినా అది భగవదేచ్ఛ.'

'పద్మిని కూడా నీకు తనని అర్పణం చేసుకుటుంది' అన్నాడు శూరవర్మ.

గంగాధర శర్మ పద్మినివైపు ఆశ్చర్యంగా చూశాడు.

'నేను శ్రీరంగం వెళుతున్నాను. అక్కడ వాదనలో నేను ఓడిపోతే ప్రాణత్యాగం చేస్తాను' అన్నాడు.

'నేనూ మీ వెంట వస్తాను' అంది పద్మిని మెల్లిగా, కానీ నిశ్చయంగా.

ఇంతలో చంద్రశేఖరుడు చెట్టుచాటునుంచి బయటకు వచ్చాడు.

'పద్మిని నాది' అన్నాడు.

'అది నేను నిర్ణయించుకోవాలి' అంది పద్మిని తీవ్రంగా.

'అది నా కత్తి నిర్ణయిస్తుంది' అన్నాడు చంద్రశేఖరుడు ధ్రుఢంగా.

క్షణంలో అక్కడ పరిస్థితి మారిపోయింది.

శూరవర్మ కత్తి దూశాడు. ప్రహర సింహుడు కత్తిని ఎత్తాడు.

గంగాధర శర్మ నిశ్చలంగా కూచుని ఉన్నాడు. అతని ముఖంలో నిర్లిప్తత తాండవిస్తోంది.

'చంద్రశేఖరా, నాకు ఎవరిమీద ఎలాంటి వ్యామోహం లేదు. నేను ఒంటరిగానే శ్రీరంగం వెళతాను. కానీ ఎదుటివారి ఇష్టాన్ని గమనించకుండా వ్యవహరించటం రాక్షసత్వం' అన్నాడు.

చంద్రశేఖరుడు విసురుగా గంగాధర శర్మ వైపు కత్తిని కదిపాడు.

మెరుపులా శూరవర్మ ఆ కత్తిని గాల్లోనే అడ్డుపడ్డాడు.

'మీరు మధ్యలో రాకండి' తీవ్రంగా అన్నాడు చంద్రశేఖరుడు.

'ఇది మీ ఇద్దరి సమస్య కాదు. అందరి సమస్య' అన్నాడు శూరవర్మ.

'నేను గంగాధర శర్మనే నా మనస్సులో స్వీకరించాను' ప్రకటించింది పద్మిని నిస్సంకోచంగా.

అక్కడ గాలి ఘనీభవించినట్టయింది. అందరూ నిశ్చేష్టులయ్యారు.

●●●

**'పద్మిని తన నిర్ణయం స్పష్టంగా తెలిపింది.** ఇక దానిలో వాదోపవాదాలకు వివాదాలకు తావులేదు' కఠినంగా అన్నాడు శూరవర్మ.

ఎత్తిన కత్తిని దింపాడు చంద్రశేఖరుడు. అతడి కళ్ళల్లోని, క్రోధ భావన ఏమాత్రం తగ్గలేదు. ఊపిరి బుసలుకొడుతున్నట్టుంది. ఆవేశంతో శరీరం ఊగిపోతోంది.

గంగాధర శర్మ నిశ్చలంగా ఉన్నాడు. కానీ అతని అంతరంగం అల్లకల్లోలంగా ఉంది.

పద్మిని నిర్ణయం అతడిని ఆశ్చర్యపరుస్తోంది.

పద్మినితో తన ప్రవర్తన ఏనాడూ ఔచిత్య పరిధిని దాటలేదు. ఎన్నడూ పద్మినితో తాను అనుచితంగా ప్రవర్తించలేదు. అస్సలు ఆమెవైపు తాను సరిగ్గా చూడనూలేదు. మరి ఆమెకు తనపట్ల అలాంటి భావం ఎలా కలుగుతుంది?

పద్మిని పట్ల తనకు ఆకర్షణ లేదని కాదు ఆమె అంటే కుతూహలం లేదని కాదుకానీ, అది మామూలుగా ఒక యువతి పట్ల యువకుడికి ఉండే స్వాభావికమైన, ప్రాకృతికమైన కుతూహలం. పరిధిని ఏనాడూ దాటలేదు.

తనలో ఏం చూసి పద్మిని ఇలాంటి నిర్ణయం తీసుకుంది? గంగాధర శర్మ ఆలోచనలు తెగటంలేదు.

శూరవర్మ మనస్సు కూడా ఆందోళనమయం అయింది ఎందుకిలా జరుగుతోంది? చిన్న చిన్న విషయాలు, అప్రధానమైన అంశాలు, అసలైన విషయాలనుంచి దృష్టిని మళ్ళిస్తున్నాయి. ఒకవైపు శత్రువు ప్రచండవేగంతో తమ జీవితాలను కంబళించి వేస్తూంటే, మరోవైపు అప్రస్తుత అంశాల ఆధారంగా, కలసి పోరాడాల్సిన వారు తమలో తాము కలహించుకుంటున్నారు.

ఐకమత్యం అవసరమైన చోట అనర్ధాన్ని సృష్టిస్తున్నారు. శూరవర్మకు నిరాశగా అనిపించింది.

అక్కడ ప్రశాంతంగా ఉన్నది పద్మిని ఒక్కర్తే. తన నిర్ణయం సమంజసమైనదేనని ఆమె నమ్మకం.

చంద్రశేఖరుడు నెమ్మదిగా కత్తిదించాడు. అపుడు కానీ ప్రహరసింహుడు తన కత్తిని దింపలేదు.

'ఎవరేమనుకున్నా, ఎవరెంత అడ్డుపడినా, పద్మిని నాది. దాన్ని ఎవరూ మార్చలేరు' కసిగా అన్నాడు చంద్రశేఖరుడు.

నిశ్శబ్దం తప్ప చంద్రశేఖరుడి మాటలకు మరో ప్రతిస్పందన లేదు ఒకసారి అందరివైపు కసిగా చూసి, గిరుక్కున వెనక్కు తిరిగాడు చంద్రశేఖరుడు.

'ఎక్కడికి?'అడిగాడు గంగాధరశర్మ

'ఎక్కడికయితే నీకెందు?' కోపంగా అడిగాడు చంద్రశేఖరుడు.

'చంద్రశేఖరా, ఇది అందరం కలసి ఉండవలసిన సమయం' ఇంకా ఏదో చెప్పబోతున్న గంగాధర శర్మ చంద్రశేఖరుడు పెద్దగా నవ్వటంతో ఆగిపోయాడు.

'నీకు కావాల్సిన వన్నీ నీకు దొరుకుతున్నాయి కాబట్టి నువ్వు నీతులు చెపుతావు. అన్ని అర్హతలు ఉండీ ఏదో పొందలేని వాడిని నేను కడుపు మండేది నాకు' కసిగా అన్నాడు చంద్రశేఖరుడు.

'ఏమైంది నీకు? నీకేం నష్టం కలిగింది?' అయోమయంగా అడిగాడు గంగాధర శర్మ. వికటంగా నవ్వాడు చంద్రశేఖరుడు.

'చేసేవన్నీ చేసేసి అమాయకత్వం నటించకు. నువ్వు నా అన్నవైపోయావు. లేకుంటేనా?' అని కసిగా కత్తితో పక్కనే ఉన్న చెట్టును కొట్టాడు.

పద్మిని ఒక అడుగు ముందుకు వేసి, చంద్రశేఖరుడివైపు సూటిగా చూస్తూ చెప్పింది.

'చంద్రశేఖరా, ఇది నా స్వంత నిర్ణయం. దీన్లో వాదాలకు తావులేదు. ఈ విషయం ఎవ్వరికీ తెలియదు'

'జాణవి అసలు నువ్వే నన్ను మోసం చేశావు' అంటూ ఆమె పైకికత్తిని బలంగా విసిరాడు చంద్రశేఖరుడు.

మెరుపులా అతడి దాడినుంచి తప్పించుకుని, పక్కకు దూకి, పక్కన ఉన్న కత్తిని ఒకచేత్తో అందుకుని, దాన్ని మరో చేతిలోకి మార్చుకుని, చంద్రశేఖరుడి కత్తి వేటుకి కత్తిని అడ్డం పెట్టి, దాన్ని అతడి చేతిలోంచి ఎగరగొట్టింది.

అందరూ ఆశ్చర్యపోయేలా, కాలితో చంద్రశేఖరుడి కాలిని బలంగా తన్ని అతడిని పడవేసింది కత్తిని అతని మెడపై ఆన్చి నిలబడింది. అక్కడ ఉన్న అందరూ నిశ్చేష్టులయ్యారు.

'చంద్రశేఖరా, ఎదుటివారిని మనుషుల్లా పరిగణించి, వారి ఇష్టాఇష్టాలను గౌరవించగలిగేవాడే మనిషి. అలాకాక బలం ఉందన్న గర్వంతో, అందరిపై తన ఇష్టాయిష్టాలను రుద్దేవాడు పశువు. నీకు అర్ధమయిందా ఇప్పుడయినా, నేను మనిషితో బ్రతకాలనుకుంటున్నానని' అంది తీవ్రంగా చంద్రశేఖరుడు మాట్లాడలేదు. కానీ అతడి కళ్ళు నిప్పులు కురిపిస్తున్నాయి.

శూరవర్మ ముందుకు వచ్చి పద్మినిని పక్కకు పంపాడు. చంద్రశేఖరుడుని లేపి నిలబెట్టాడు.

చంద్రశేఖరుడు అక్కడ ఒక్క నిమిషం కూడా నిలబడలేదు. గబగబా అటునుంచి వెళ్ళిపోయాడు. అతడు ఊర్లోకి వెళ్ళలేదు. అడవి వైపు వెళ్ళాడు.

'తొందర పడ్డావు పద్మినీ' అన్నాడు శూరవర్మ.

పద్మిని మాట్లాడలేదు. మౌనంగా నిలబడింది.

గంగాధర శర్మ పద్మిని దగ్గరకు వచ్చాడు.

'పద్మినీ నువ్వు నాలో ఏం చూశావో, ఏమి ఆలోచించావో నాకు తెలియదు. కానీ నీ నిశ్చయం శాశ్వతమైనదయితే, నేను తిరిగి వచ్చేవరకూ ఎదురుచూడు. నేను వచ్చేవరకూ నీ నిర్ణయం మారకపోతే అపుడు ఆలోచిద్దాం. ఈలోగా నీకు నచ్చిన వారెవరయినా తారసపడితే నేను నీకు ప్రతిబంధంకాను' మృదువుగా చెప్పాడు.

'నేను మిమ్మల్ని అనుసరిస్తాను' అంది పద్మిని.

తల అడ్డంగా ఊపాడు గంగాధర శర్మ.

'నువ్వు నా దృష్టిని మళ్ళిస్తావు. నా దృష్టి నా లక్ష్యం పైన కాక నీ రక్షణ పైనే ఉంటుంది నాకు. అది ఇష్టంలేదు. అదీగాక'

'అదీగాక?' రెట్టించింది పద్మిని

గంగాధర శర్మ మౌనంగా ఉన్నాడు.

'మేము తక్కువ కులం వారిమనా?'

'కాదు. ఇక్కడ కులం ప్రసక్తే లేదు'

'మరి?'

'పద్మినీ నీ వయసు చిన్నది. నువ్వు ప్రపంచం ఏమీ చూడలేదు. నీ జీవితంలో నీకు తారసపడిన వ్యక్తులెందరు? దానికి తోడు ప్రస్తుత పరిస్థితులు అల్లకల్లోలంగా ఉన్నాయి. ఎవరికీ భద్రతలేదు. ప్రతి విషయంలోనూ అనిశ్చింతత తాండవం ఆడుతోంది. ఇలాంటి అల్లకల్లోల పరిస్థితులలో మనం సరిగ్గా ఆలోచించలేదు. తొందరపడి నిర్ణయాలు తీసుకుంటాం. నీదీ అలాంటి తొందరపాటు నిర్ణయమే. కాబట్టి కొన్నాళ్ళు నేను ఎదురుగా కనబడకపోతే, అపుడు నీకు వేరే ఎవరైనా తారసపడితే, అప్పటికీ నీ మనసు నాపైనే ఉంటే, నీ నిర్ణయం ఆవేశంలోనో, తొందరపాటుగానో తీసుకున్నది కాదని తెలుస్తుంది.' అన్నాడు గంగాధర శర్మ.

పద్మిని విచిత్రంగా నవ్వింది.

'మీకు ఆత్మ విశ్వాసంలేనట్టుంది. అది ఎదుటి వారిమీద అవిశ్వాసంలా పరిణమిస్తోంది. బహుశా, మగవారంతా ఇంతేనేమో!' అంది పద్మిని.

'పద్మినీ, నువ్వేమనుకున్నా నా అభిప్రాయం చెప్పాను. నేను నీ నిర్ణయాన్ని గౌరవించినట్టే, నువ్వు నా నిర్ణయాన్ని గౌరవించాలి. నేను శ్రీరంగం ఒంటరిగా వెళ్తాను. అది మారదు' అంటూ ప్రహార సింహుడి వైపు తిరిగాడు.

'ప్రహరా, పద్మినిని ఇప్పుడు కాపాడుతున్నట్టే కంటికి రెప్పలా కాపాడుతూండు. నేను వీలయినంత త్వరగా తిరిగి వస్తాను' అన్నాడు గంగాధరుడు.

ప్రహరసింహుడు తల ఊపాడు.

గంగాధరుడు, శూరవర్మకు నమస్కరించాడు.

'మీరు నాకు గురుతుల్యులు ఆశీర్వదించండి' అన్నాడు తలవంచి

శూరవర్మ నవ్వాడు.

అందరి వైపు ఒక్కసారి చూశాడు గంగాధర శర్మ. అతని చూపులు పద్మినిపై కాస్సేపు ఎక్కువగా నిలిచాయి. ఆమె రూపాన్ని కళ్ళల్లో సృష్టించుకున్నట్టు ఉన్నాయి అతని చూపులు. తరువాత నెమ్మదిగా భూమిని వంగి తలతో తాకాడు. వెనుతిరిగి ఊరికి వ్యతిరేక దిశలో నడవటం ఆరంభించాడు.

అందరూ మౌనంగా అతడు వెళ్ళిన వైపే చూస్తూ నిలబడ్డారు.

నెమ్మదిగా కనుచూపు మేర దాటి పోయాడు గంగాధర శర్మ.

ఒకరొకరుగా ఊర్లో వాళ్ళు వెనుతిరిగారు. వారంతా మూటలు సర్దుకోసాగారు.

అక్కడ నిలబడి గంగాధర శర్మ వెళ్ళిన దిశవైపే చూస్తుండిపోయింది పద్మిని.

ఆమె కళ్ళలో ఎలాంటి భావంలేదు.

ఆమె వెనకే రక్షగా నిలబడి ఉన్నాడు ప్రహరసింహుడు అతడి ముఖంలో ఎలాంటి భావంలేదు.

●●●

**ఆకాశంలో నక్షత్రాలు మిలమిలమంటున్నాయి.** చల్లటిగాలి ఉండి ఉండి వీస్తోంది. ఆ గాలికి, నిద్రలో మనిషి అటూ ఇటూ కదిలినట్టు ఆకులు కదులుతున్నాయి.

ఉండి ఉండి ఏవేవో ధ్వనులు వినిపిస్తున్నాయి. ఏవేవో పాకుతున్న శబ్దాలు వినిపిస్తున్నాయి. హఠాత్తుగా, రాత్రి నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ ఏవో జంతువులు కేకలు పెడుతున్నాయి.

ఓ చెట్టుక్రింద, ఎండుటాకుల పరుపుపై పడుకుని ఉన్నాడు గంగాధర శర్మ.

చెట్ల ఆకుల నడుమ నుండి కనిపిస్తున్న నక్షత్రాలను చూస్తున్నాడతడు. అతడికి నిద్రపట్టటంలేదు.

అతడి జీవితంలో తొలిసారి అతడు ఇలా ఒంటరిగా ఇల్లు వదిలి రావటం, ఇంటికి దూరంగా గడపటం ఇదే ప్రథమం. ఇంతకు ముందు శూరవర్మతో వెళ్ళినా, అప్పుడు తాను ఒంటరి కాడు. తనతో శూరవర్మతో ఉన్నాడు. చంద్రశేఖరుడున్నాడు, తోటి సైనికులు ఉన్నారు. ఇప్పటిలా తాను ఎప్పుడూ ఒంటరిగా లేడు.

గంగాధర శర్మ కళ్ళు నీళ్ళతో నిండాయి.

అప్పుడు తాను ఇంటికి ఎంతదూరం వెళ్ళినా, తన ప్రాణాలు ఇంట్లో అమ్మదగ్గరే ఉన్నాయి. ఇప్పుడు..

ఇప్పుడు తనకెవరూ లేరు. తన వారెవరూ లేరు. తనకోసం ఎదురు చూసేవారూ..

ఇక్కడ ఆగిపోయాయి గంగాధరశర్మ ఆలోచనలు

'పద్మిని'

ఎందుకో ఆమె పేరు తలుస్తూంటే ఒక మధుర భావన మనసులో కదిలింది.

ఆ భావన గంగాధర శర్మకు చిత్రంగా అనిపించింది.

మనిషి మనసు ఎంతో విచిత్రమైనది.

నిన్నటి వరకూ పద్మినిపై తనకు ఎలాంటి ప్రత్యేక భావనలేదు. ఆకర్షణ లేదు. కేవలం ఓ యువకుడికి, యువతి పట్ల ఉండే కుతూహలం తప్ప మరే భావన లేదు. తమ ఊళ్ళో ఉంటోంది. అనేక కష్టాలు అనుభవించింది అన్న ఆలోచన తప్ప మరే ఆలోచన లేదు.

కానీ, నిన్న ఆమె తనను వరించిందని, తనకోసం ఎదురు చూస్తుంటానని ప్రకటించినప్పటి నుంచీ, తన ప్రమేయం లేకుండానే ఆమెపై తనలో తనకే అర్థం కాని భావనలు జనిస్తున్నాయి.

ఆమె అలా అన్న తరువాత, తాను ప్రయాణం ఆపేసి, ఊళ్ళోనే ఉండిపోవాలన్న కోరిక బలంగా కలిగింది. ఇప్పుడు, ఆమె గుర్తుకు వస్తూ మనసులో మధురమైన బాధ కలుగుతోంది. వెనక్కి తిరిగి వెళ్ళిపోవాలన్న భావన బలంగా కలుగుతోంది.

ఎక్కడ నుంచి వస్తోందీ భావన? ఎలా కలుగుతోందీ భావన?

నిన్నటిదాకా లేని భావన ఇప్పుడు ఇంత హఠాత్తుగా, ఇంత తీవ్రంగా ఎలా కలుగుతోంది? ఏమిటీ విచిత్రం?

గంగాధర శర్మకు యవ్వనావిర్భావం కలిగినప్పటి నుంచీ ఓ సందేహం కలుగుతూండేది.

తమ ప్రబంధాలలో, గ్రంధాలలో వివాహాలకు ముందే యువతీ యువకుల నడుమ ప్రేమ జనించటం గమనించాడు.

రాముడిని, సీత స్వయంవరానికి ముందే చూసింది. ఆకర్షితురాలయింది.

శ్రీకృష్ణుడు, రుక్మిణిని ఆమె రాజ్యం నుంచి ఎత్తుకుని వచ్చాడు. నల దమయంతులు, శకుంతల దుష్యంతల వంటివారు ముందే ఒకరినొకరు చూసుకున్నారు.

కానీ, తానున్న సమాజంలో, ఇలా, వివాహోత్పూర్వ పరిచయాలు ఉండటం తాను గమనించలేదు.

తల్లిదండ్రులు తమ సంతానానికి తగిన జీవన సహచరుడి కోసం వెతుకుతారు. పూర్వపరాలు విచారించి వివాహం చేస్తారు. అంటే, ఇద్దరు అపరిచితులు, వివాహంతో జీవితాంతం ఒకరినొకరు తోడు అవుతారన్నమాట. ఇదే గంగాధర శర్మకు విచిత్రంగా అనిపించేది.

అసలు పరిచయం లేని వారు పెద్దల నిర్ణయంతో ఎలా కలిసి జీవించగలరు?

ఇప్పుడు పద్మిని తనను వరించిందని తెలియనంతవరకూ ఆమెపై తనకు ఎలాంటి ప్రత్యేక భావనలేదు. కానీ, ఆమె తనని వరించిందని తెలిసిన క్షణం నుంచీ ఏదో ప్రత్యేక భావన, ఆనందకరమైన ఆహ్లాదకరమైనదీ, మధురమైనదీ కలుగుతోంది.

ఎందుకని?

బహుశా, ఇది మానవ మనస్థత్వంలోనే ఉన్నట్టుంది. ఎవరినయినా తనవారు అనుకోగానే వారిపట్ల అనురాగం జనిస్తుంది. కలిసి జీవిస్తూ, జీవితపుటొడిదుడుకులను కలిసి అనుభవిస్తూ, సుఖదుఃఖాలను పంచుకుంటూ, కలిసి ఎదుగుతూంటే, వారిరువురి నడుమ దైవత్వాన్ని ప్రతిబింబించే ప్రేమ భావన జనిస్తుంది. ఇది ఆ దంపతులిరువురిని దైవభావనను గుర్తించేట్టు చేస్తుంది.

అందుకేనేమో, శివపార్వతులు, విష్ణు లక్ష్మీ దేవిలు, బ్రహ్మ సరస్వతి అంటూ త్రిమూర్తులు, తమ తమ ధర్మ పత్నులతో తమకు మార్గదర్శనం చేస్తున్నారు.

ఒక వ్యక్తి, స్త్రీ అయినా, పురుషుడయినా ఒంటరిగా అతడి జీవితం అసంపూర్ణం. స్త్రీ, పురుషులిరువురూ చెరి అర్ధభాగాలు. వారిరువురు కలిస్తేనే వ్యక్తి పరిపూర్ణమవుతాడు. పరిపూర్ణమయిన వ్యక్తి దాంపత్య ధర్మాన్ని నిర్వహిస్తూ, విద్యుక్త కర్మలను పాటిస్తూ, ఆధ్యాత్మిక బాటలో ప్రయాణించి తన జీవితాన్ని అర్ధవంతం చేసుకుంటాడు.

భగవంతుడిని చేరటానికి అన్నీ వదలి సన్యాసం స్వీకరించి భగవధ్యానంలో గడపటం ఓ మార్గమయితే, దాంపత్య ధర్మం నిర్వహిస్తూ, తనలోని భగవంతుడు గుర్తించి, తన విద్యుక్త కర్మలు నిర్వహిస్తూ నిష్కల్మషంగ, నిష్కామంగా వ్యవహరించటం మరో మార్గం.

ఒక్కసారిగా, ఏదో మెరుపులాంటి ఆలోచన మనసులోనే మెరిసిన భావన గంగాధర శర్మకు కలిగింది.

భగవద్గీత బోధించిన శ్రీ కృష్ణుడు జీవితాన్ని సంపూర్ణంగా అనుభవించాడు. జీవిత రసాన్ని దోసిళ్ళ కొద్దీ జుర్రుకున్నాడు. కానీ దేనికీ బద్ధుడు కాలేదు. ధర్మం, కర్తవ్యం తప్ప మరొకటి పట్టించుకోలేదు.

శ్రీరామ చంద్రుడు సైతం ధర్మ నిర్వహణకే ప్రాధాన్యాన్నిచ్చాడు.

కానీ, సత్యాన్వేషణలో గౌతమ బుద్ధుడు, సంస్కారాన్ని త్యజించాడు. గమనిస్తే, గతంలోని ఋషులూ, మునులూ అందరూ సంసారులే. అంటే, సంసారాన్ని త్యజిస్తేనే 'ముక్తి' అనే భావనను ఇంకా విశ్లేషించాల్సి ఉందా?

శంకరచార్యులవారు బ్రహ్మచారి. ఆయన ప్రపంచాన్ని 'మాయ' అని బుద్ధుడికన్నా ఓ అడుగు ముందుకేసి, సంసారం వైపే పోలేదు. కానీ రామానుజాచార్యుల వారు సంసారి. కర్తవ్య పరాయణకు ప్రాధాన్యం ఇచ్చారు.

అంటే సన్యాసి ప్రపంచాన్ని త్యజించి తన స్వీయ ముక్తి కోసం ప్రయత్నిస్తే, సంసారి, సుళ్ళు తిరిగే జీవన ప్రవాహంలో ఉంటూ సమస్త సమాజ అభివృద్ధికోసం, అచ్యున్నతి కోసం, 'ముక్తి'కోసం పాటుపడతాడు. చూస్తూంటే 'సన్యాసి' అవటంలో స్వార్ధం కనిపిస్తోంది.

సంసారాన్ని స్వీకరించటంలో 'త్యాగం' కనిపిస్తోంది.

సంసారి, తన సామాజిక బాధ్యతలు నెరవేరుస్తాడు. సృష్టి ముందుకు సాగటంలో తోడ్పడతాడు. తన సంతానం ద్వారా సృష్టి పరిణామక్రమం సక్రమంగా సాగటంలో దోహదం చేస్తాడు. మానవ సమాజం మరో అడుగు ముందుకు వేయటంలో తన వంతు బాధ్యత నిర్వహిస్తాడు.

అందుకేనా తమ దేవీదేవతలందరూ సంసారులు! తమ దేవతలంతా వివాహం చేసుకుని వివాహ వ్యవస్థలోని ఆధ్యాత్మికతను, బాధ్యతను, కర్తవ్య పాలనలోని మహాత్యాన్ని ప్రకటిస్తున్నారు.

ఈ ఆలోచన కలిగిన తరువాత గంగాధర శర్మకు పద్మిని పట్ల అనురాగం మరింత హెచ్చింది.

ఇంతవరకూ తనలో సర్వం త్యజించాలన్న కోరిక అంతర్లీనంగా ఉండేది. తాను శ్రీరంగం ప్రయాణించటంలోనూ ఈ సర్వం పరిత్యజించాలన్న మరణం ఆలోచన అంతర్లీనంగా ఉంది.

కానీ ఇప్పుడు తనకు జీవితాన్ని త్యజించాలని లేదు. తాను జీవించాలి. పద్మినిని వివాహం చేసుకుని, మానవుడిగా జన్మించినందుకు తన ధర్మాన్ని నెరవేర్చాలి.

తాను శ్రీరంగం ప్రయాణించేది కేవలం అక్కడి పండితుడు సుదర్శన సూరితో వాదించటానికేకాదు. అతడిని వాదించి ఓడించడానికి, జీవించటానికి.

ఈ ఆలోచన గంగధర శర్మకు ఉత్సాహాన్నిచ్చింది.

ఆకాశంలో తారలు నెమ్మదిగా, ఎంతో మృదువుగా అదృశ్యం అయ్యాయి. చూస్తూ చూస్తుండగానే ఆకాశం నల్లటి తెరను తొలిగించి నీలి బట్టలు ధరించసాగింది.

అంతవరకూ చీకటిలో నిశ్చలంగా నిద్రపోతున్న ప్రకృతి సూర్య కిరణాల స్పర్శతో జీవం పోసుకుని ప్రకటితమవసాగింది.

గంగాధర శర్మ హృదయం ఉప్పొంగింది.

ఈ ప్రపంచం ఎంతో అద్భుతమైనది. ఎంతో అందమైనది. ఈ ప్రపంచంలోని ప్రతి అద్భుతాన్ని మనిషి అనుభవించాలి. దాన్ని అర్థం చేసుకుని ఆనందించాలి. ఈ అనుభవాలు, ఆనందాలను అందిస్తున్న భగవంతుడిని అనుక్షణం స్మరిస్తూ భగవధ్యానంలో జీవితాన్ని సాగించాలి. కృతజ్ఞత పూర్వకంగా తన ధర్మాన్ని పాటించాలి. కర్తవ్యాన్ని నిర్వహించాలి. తద్వారా ముక్తిని సాధించాలి. అనంతమైన దివ్యానందాన్ని పొందాలి.

'వందేను శరదశృతం, జీవేమ శరదశ్శతం'

'విద్యుక్త కర్మలు నిర్వహిస్తూ నూరేళ్ళు ఆనందంగా జీవించాలి. ఓ మంత్రంగా జపించసాగాడు గంగాధర శర్మ.

●●●

చంద్రశేఖరుడికి ప్రతిక్షణం కోపం పెరిగిపోతోంది.

'మోసం! కుట్ర!'

ఇదంతా శూరవర్మ పని.

శూరవర్మకు మొదటి నుంచీ తానంటే ఇష్టంలేదు. ఎలాగయినా తనను తక్కువ చేయాలని ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ప్రతిగా గంగాధర శర్మను గొప్పవాడిగా చూపాలనుకుంటున్నాడు. ఎందుకంటే శూరవర్మకు తనంటే అసూయ.

తాను కత్తి యుద్ధంలో దిట్ట. ఇదీ శూరవర్మ అసూయకు కారణం. అందుకని పద్మినిని తనకు కాకుండా చేశాడు

గంగాధర శర్మ భీరువు. ఏదో ఆవేశంలో పదిమందిని చంపాడు కానీ, ఎన్నిమార్లు గంగాధర శర్మ పాములను, విషక్రిములను చూస్తూ భీరువులా నిలిచిపోతే, తాను అతని ప్రాణాలు కాపాడలేదు?

అలాంటి గంగాధర శర్మను పద్మిని ఎందుకు ఇష్టపడుతుంది? శూరవర్మ ఏదో చెప్పి ఉంటే తప్ప, గంగాధర శర్మను ఏ యువతి అయినా ఎందుకు ఇష్టపడుతుంది?

గంగాధర శర్మకు శాస్త్రాలు వల్లెవేయటం తప్ప ఏమీ తెలియదు. తాను కండలు తిరిగిన యోధుడు. ఎలాంటి ప్రమాదం నుంచయినా పద్మినిని రక్షించగలడు.

అలాంటి తనను కాదని, గంగాధర శర్మను పద్మిని ఇష్టపడటంతో శూరవర్మ కుట్ర తప్పని సరిగా ఉండి ఉంటుంది.

కసిగా, కత్తితో దారికిరువైపులా ఉన్న చెట్లను నరుకుతూ ముందుకు సాగుతున్నాడు చంద్రశేఖరుడు.

అతడి నడకకు ఓ గమ్యం లేదు. నిర్దిష్టమైన ప్రణాళిక లేదు. దారి ఎటు తీసుకువెళితే అటు వెళుతున్నాడు.

అడుగు అడుగుకీ కోపం పెరుగుతోంది. కసి ద్విగుణీకృతమవుతోంది. ఇంతలో ఎవరివో అరుపులు, కేకలు వినిపించాయి. దగ్గరలో ఏదో గొడవ జరుగుతోంది.

వెంటనే పొదలలో నక్కాడు చంద్రశేఖరుడు.

పిల్లిలా, శబ్దం కాకుండా, అడుగులో అడుగు వేస్తూ, కత్తి ఎత్తిపట్టుకుని ఆ వైపు చేరాడు.

పొదల మాటునుంచి తొంగి చూశాడు.

ఎదురుగా ఓ పది, ఇరవై మందితో ఓ వీరుడు పోరాడుతున్నాడు అక్కడ పడిన శవాల గుట్టను చూస్తే అతడు ఎంతో కాలంగా పోరాడుతున్నాడని, అప్పటికే వాళ్ళలో సగం మందిని చంపాడనీ తెలుస్తోంది. కానీ అతడు బలహీనమవటమూ తెలుస్తోంది.

ఇక ఆలస్యం చేస్తే లాభం లేదని చంద్రశేఖరుడికి అర్థమయింది. అప్పటివరకూ అతడిలో ఉన్న కసినీ, క్రోధాన్నీ వ్యక్తపరచే అవకాశం దొరికింది. ఒక వ్యక్తి పై ఇంతమంది పడి పోరాడటం, తనను అందరూ ఒంటరివాడిని చేసి అన్యాయం చేయటాన్ని గుర్తుకు తెచ్చింది. పెద్దగా అరుస్తూ వారి నడుమ దూకాడు చంద్రశేఖరుడు.

క్షణాలలో పరిస్థితి మారిపోయింది.

తలలు గాలిలోకి ఎగిరిపడుతున్నాయి. గొంతులోని అరుపు సగంలోనే ఆగిపోతోంది. ఎందుకంటే శరీరం నుంచి తల వేరైపోతోంది. శరీరం నిస్త్రాణ అయి నేల జారిపోతోంది.

కత్తికి మానవ శరీరం తగిలి, శరీరంలోకి కత్తి చొచ్చుకు పోతూ, శరీరాన్ని రెండు ముక్కలు చేస్తూంటే చంద్రశేఖరుడికి విచిత్రమైన సంతృప్తి కలుగుతోంది.

అతడి వేగం, దూకుడు ఎవరూ తట్టుకోలేకపోయారు.

మారిన పరిస్థితిని గమనించిన వారు ప్రాణాలు దక్కించుకోవటం కోసం పారిపోవాలని ప్రయత్నించారు. చంద్రశేఖరుడు వారినీ వదలలేదు. దాంతో కొందరు ఆయుధాలు పారేసి శరణువేడారు. వికటంగా నవ్వాడు చంద్రశేఖరుడు.

తనని వేడుకుంటున్న వారు శూరవర్మలా, గంగాధర శర్మలా కనిపించారు. వెంటనే వారి తలలను నరికేశాడు చంద్రశేఖరుడు. వికటట్టహాసం చేస్తూ 'శహభాస్' అన్నాడా వీరుడు, వీరవిహారం చేసిన చంద్రశేఖరుడి భుజం తట్టి 'నీలాంటి వీరుడిని నేనింతవరకూ చూడలేదు. సుల్తాన్ అల్లా ఉద్దీన్ ఖిల్జీ దగ్గర ఉండాల్సిన వాడివి ఇక్కడ ఏం చేస్తున్నావు?' అన్నాడతడు.

'ఎవరు మీరు? వీళ్ళెవరు మిమ్మల్ని చంపాలని ప్రయత్నిస్తున్నారు?' అతడివైపు పరిశీలనగా చూశాడు చంద్రశేఖరుడు.

అతడి మాట స్వచ్ఛంగా ఉంది. ముస్లింల యాసలేదు. కానీ అల్లాఉద్దీన్ ఖిల్జీ పేరు చెపుతున్నాడు.

అతడు చిన్నగా నవ్వాడు. 'అదంతా చెప్తాగానీ. ముందు నువ్వు నా ఆతిథ్యం స్వీకరించాలి' అన్నాడు.

'మీరెవరు?' అడిగాడు చంద్రశేఖరుడు మళ్ళీ.

'నా పేరు' అని ఆగి 'మాలిక్ కాఫర్' అన్నాడతడు గంభీరంగా.

**'మాలిక్ కాఫర్' అప్రయత్నంగా** ఆ పేరును పైకి అనేశాడు చంద్రశేఖరుడు. ఎందుకో అతని మోకాళ్ళు బలహీనమైపోయాయి. శరీరం వణకసాగింది. తన పేరు ప్రభావం చంద్రశేఖరుడిలో కలిగిస్తున్న సంచలనం మాలిక్ కాఫర్‌కు సంతృప్తి కలిగించింది. క్షణం క్రితం, తనను రక్షించటం వల్ల తాను చులకన అయ్యానేమో అన్న భయం పోయింది.

'అవును. నువ్వు రక్షించింది మాలిక్ కాఫర్‌నే. నేనింకా సాధించాల్సిన కార్యాలు బోలెడన్ని ఉన్నాయని అల్లా నన్ను రక్షించాడు, నిన్ను పంపి' నవ్వుతూ అన్నాడు మాలిక్ కాఫర్.

చంద్రశేఖరుడి నాలిక తడి ఆరిపోయింది. గొంతు పెగలటంలేదు.

శూరవర్మ ద్వారా, అతడి సైనికుల ద్వారా మాలిక్ కాఫర్ గురించి చాలా విన్నాడు చంద్రశేఖరుడు.

అల్లావుద్దీన్ ఖిల్జీ ఆంతరంగికుడు మాలిక్ కాఫర్. తిరుగులేని వీరుడు. శత్రువు గుండెలలో భీతిని కలిగించటమే కాదు, గుండె కొట్టుకోవటం ఆగిపోతుంది అతడి పేరు వినగానే. అలాంటి మాలిక్ కాఫర్ నా తాను రక్షించింది!

తన ప్రమేయం లేకుండా చంద్రశేఖరుడు, అతడి ముందు మోకరిల్లాడు. మాలిక్ కాఫర్ ఆప్యాయంగా అతడిని లేవనెత్తాడు.

ఇంతలో పెద్ద శబ్దంతో పలు తురుష్క సైనికులు అక్కడికి పరుగెత్తుకు వచ్చారు. వాళ్ళను చూస్తూనే మాలిక్ కాఫర్ ప్రవర్తన మారిపోయింది. ముఖంలో కాఠిన్యం ప్రవేశించింది. ఒకరకమైన అహంకారం, చులకన భావాలు కనిపించాయి.

'మీరంతా ఇంతవరకూ ఎక్కడ నిద్రపోతున్నారు?' గద్దించినట్టు అడిగాడు.

వాళ్ళు నీళ్ళు నమిలారు. కానీ సరైన సమాధానం ఇవ్వలేదు.

చంద్రశేఖరుడికి ఆశ్చర్యం అనిపించింది. వాళ్ళు వందమంది దాకా ఉన్నారు. మాలిక్ కాఫర్ ఒక్కడే కానీ ఒక్కడు వందమందిని గద్దిస్తూ, చులకన చేస్తూ మాట్లాడుతున్నాడు. ఒక్కడూ కిమ్మనటం లేదు.

వాళ్ళు తలచుకుంటే, వందమంది కలిసి, అతడిని దెబ్బతీయవచ్చు. కానీ, అతడు గద్దించి మాట్లాడుతూంటే, వాళ్ళు తలలు వంచుకున్నారు తప్ప నోరు విప్పటంలేదు.

చంద్రశేఖరుడికి, మాలిక్ కాఫర్ అంటే గౌరవం పెరిగిపోయింది.

'నాతో రా' అంటూ మాలిక్ కాఫర్ ముందుకు నడిచాడు.

వారంతా మాలిక్ కాఫర్‌కు వంగి సలాములు చేశారు. అంతేకాదు, మాలిక్ కాఫర్ వెనుక నడుస్తున్న చంద్రశేఖరుడికీ వంగి సలాము చేశారు. చంద్రశేఖరుడి ఛాతీ ఉప్పొంగింది. ఏదో తెలియని రీతిలో గర్వంగా అనిపించింది. అతని నడకలో ఠీవి ప్రవేశించింది.

●●●

సూర్యోదయం కాకముందే లేచాడు గంగాధర శర్మ. పారుతున్న నది నీటిలో కాలకృత్యాలు తీర్చుకున్నాడు. స్నానం చేశాడు. ఉదయిస్తున్న సూర్యుడికి వందనం చేశాడు. ఆర్ఘ్యం ఇచ్చాడు.

ఓ వైపు అతను తన విద్యుక్త కర్మలను యాంత్రికంగా నిర్వహిస్తున్నాడు. మరో వైపు అతని మనస్సులో రకరకాల ఆలోచనలు పరుగులెత్తుతున్నాయి.

సూర్యోదయ సౌందర్యానికి దిగ్భ్రాంతుడవుతున్నాడు. కిరణాలు సోకటంతోటే, మంత్ర దండం తాకగానే శిల్పానికిప్రాణం వచ్చినట్టు, జగతి సర్వం చంచలమయమవటం అద్భుతం అనిపిస్తోంది.

రివ్విరివ్వున ఎగురుతూ పలురకాల పక్షులు చేస్తున్న కలకలారావాలు అత్యంత ఆనందం కలిగిస్తున్నాయి.

మరో వైపు గలగల ప్రవహిస్తున్న నీటి చల్లదనం ఎంతో ఆహ్లాదంగా ఉంది. రకరకాల జంతువులు నీరు వెతుక్కుంటూ వచ్చి నీరు త్రాగుతున్నాయి. ఆ దృశ్యం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది.

కొన్ని పక్షులు ఉండి, ఉండి, నీటిలోకి దూకి, తలను మాత్రం నీటిలో ముంచి బయటకు తీసి విదిలిస్తున్నాయి. ఇంకొన్ని నీటిలో నిలిచి చేపలకోసమో, ఇతర క్రిములకోసమో వెతుకుతున్నాయి.

అది చూస్తూంటే ఏవో విచిత్రమైన భావనలు కలుగుతున్నాయి.

ప్రతి జీవి, స్పృహ వచ్చినప్పటి నుంచి ఆహారం కోసం వెతుకుతాయి. రోజంతా ఆహారం కోసమే వెతుకుతూ గడుపుతాయి. రాత్రికాగానే విశ్రమిస్తాయి. ఋతువులో సంభోగమిస్తాయి. పిల్లలను కంటాయి. తమ పనయిపోయిందన్నట్టు వెళ్ళిపోతాయి. వాటి జీవితానికీ మనిషి జీవితానికీ మౌలికంగా తేడాలేదు.

ఊహలు, ఆలోచనలు ఉన్నాయి కాబట్టి మనిషి, తన జీవితానికి లక్ష్యం ఏర్పరచుకుంటాడు. తన జీవితానికి అర్థం ఏమిటని వెతుకుతాడు. తనదంటూ ధర్మం, సిద్ధాంతాలను ఏర్పరచుకుంటాడు.

చుట్టూ చుశాడు గంగాధర శర్మ.

విశాల ఆకాశంలో పల్టీలు కొడుతూ విహరిస్తున్నాయి పక్షులు. నీటిలో వేగంగా ఈదుతూ, దూకుతున్నాయి చేపలు. ఎక్కడినుంచో బాతుల గుంపు వచ్చి నీటిలో తేలుతున్నాయి.

ప్రతి జీవికీ తన కర్తవ్యం తెలుసు. తన పని తెలుసు. ఉద్విగ్నతలు లేవు. ఆరాటాలు లేవు. కేవలం పొంచి ఉన్న ప్రమాదం గురించి తప్ప మరో బెంగ లేదు. అందుకే అవి హాయిగా విహరిస్తాయి. ఆడుకుంటాయి. పాడుకుంటాయి. మృత్యువు, మరో జీవిరూపంలో సమీపించినపుడు, తప్పించుకోవాలని ప్రయత్నిస్తాయి. కుదరనపుడు ఎదురు నిలిచి పోరాడతాయి. మృత్యువును స్వీకరిస్తాయి.

కానీ మనిషి?

ఇంతలో 'డుర్ర్ర్ర్' అని మనిషి పశువులను అదిలిస్తున్న శబ్దం వినిపించింది. గంగాధర శర్మ ఆ వైపు చుశాడు.

ఎవరో పిల్లవాడు కర్ర పట్టుకుని గొర్రెలను అదిలిస్తున్నాడు. అవి బుద్దిగా అతని బెదిరింపుకు లొంగిపోతున్నాయి. నీటివైపుకు వస్తున్నాయి.

అది చూస్తుంటే గమ్మత్తుగా అనిపించింది గంగాధరశర్మకు.

ఒక పిల్లవాడు, ఎన్ని గొర్రెలను అదుపులో పెడుతున్నాడు!

గొర్రెలన్నీ ఒకటయి, తిరిగబడితే, ఆ పిల్లవాడు ఎందుకూ పనికిరాడు. కానీ గొర్రెలు తిరగబడవు. కానీ.. మనిషి కూడా గొర్రెల్లాంటివాడే

మనిషికి వ్యక్తిత్వం ఉంది. స్వాతంత్ర్యం ఉంది. ఆలోచనలున్నాయి. స్వయంగా తెలుసుకోగల తెలివి ఉంది. కానీ మనిషి స్వచ్ఛందంగా ఎవరో ఒకరికి ఒదిగి ఉంటాడు. అది రాజుకు కావచ్చు, కుటుంబానికి కావచ్చు, ధర్మానికి కావచ్చు.. సంఘానికి కావచ్చు.

అలా లొంగినవాడు పాలితుడవుతాడు. లొంగనివాడు పాలకుడవుతాడు. కానీ కొన్ని వందల మంది పాలకులకు కొన్ని లక్షల మంది ప్రజలు లోబడీ ఉంటారు. ఆలోచిస్తూ ఆ పిల్లవాడిని సమీపించాడు గంగాధర శర్మ.

గంగాధరశర్మను చూస్తూనే పిల్లవాడు వినయంగా వంగి నమస్కరించాడు.

అతడి కాళ్ళమీద పడి 'ఆశీర్వదించండి సామీ' అన్నాడు.

గంగాధర శర్మ మనస్సు చిత్రంగా స్పందించింది.

ఆ పిల్లవాడి అమాయకత్వానికి జాలిపడాలో, బ్రాహ్మణ రూపంలో ఉన్న ప్రతివాడూ ఆశీర్వదించ దగ్గ శక్తి కలిగి ఉంటాడన్న గుడ్డి నమ్మకానికి ఆగ్రహించాలో, దేశమంతా ఒక పద్ధతిని, ఒక వ్యవస్థను ఏర్పాటు చేసిన సమాజ నిర్మాతలకు జోహార్లర్పించాలో తెలియలేదు.

అయినా పైకి 'దీర్ఘాయుష్మాన్ భవ' అన్నాడు. అలా అంటుంటే, అతని స్వరం వణికింది. ఆ పిల్లవాడిని దీవించే అర్హత తనకు ఉందా? అన్న సంశయం ఓ వైపు మనసును తాకుతోంది. మరోవైపు, ప్రస్తుత పరిస్థితులలో ఎవరి ఆయుష్షు ఎంతకాలమో ఎవరూ చెప్పలేరు. అలాంటప్పుడు, దీర్ఘకాలం జీవించమని దీవించటం అర్థరహితం.

ఇలాంటి ఆలోచనల వల్ల తన మాటల పట్ల తనకే విశ్వాసం లేదు.

అంతలో ఓ ఆలోచన మనసుని తాకింది.

***భారతీయ ధర్మంలో 'వాక్కు'కు ఎంతో ప్రాధాన్యం ఉంది. వాక్కు ప్రభావం, దానిని ఉచ్ఛరించిన వాడి మనస్సుపై ఆధారపడి ఉంటుంది. స్వచ్ఛమైన మనస్సుతో 'చెడు' పలికినా, దాని ప్రభావం మంచే అవుతుంది. దుష్ట భావనలు మనస్సులో దాచుకుని పైకి 'మంచి' మాట్లాడినా దాని వల్ల మంచి జరగదు.*** తన మాటపైన తనకే నమ్మకం లేదు. అలాంటప్పుడూ తన దీవెన శుష్క దీవెన తప్ప సత్ఫలితాన్నివ్వదు.

తన ప్రమేయం లేకుండానే గంగాధర శర్మ మనస్సులోంచి నిట్టూర్పు వెలువడింది.

ఆ పిల్లవాడు గంగాధర శర్మ వైపు చుశాడు.

'సామీ నా దగ్గర దక్షిణ ఇవ్వటానికేమీ లేదు. ఇది తప్ప' అంటూ చేతిలోని నాణేలను చూపాడు.

గంగాధర శర్మకు ఎలానో అనిపించింది. మంచి దీవెనకు కూడా ధనం దక్షిణలా ఆశించే స్థితికి దిగజారిందా సమాజం?

'ఇక్కడికి ఎంత దూరంలో ఉంది గ్రామం?' అతడి గుప్పెట మూసేసి అడిగాడు గంగాధర శర్మ.

గంగాధర శర్మ తనను తాకగానే, ఏదో అపచారం జరిగినట్టు వెనక్కు జరిగాడు పిల్లవాడు.

'దగ్గరలోనె ఉంది. ఈ కాలిబాట నడుస్తూ వెళితే వస్తుంది' జంకుతూ, గంగాధర శర్మవైపు విచిత్రంగా చూస్తూ చెప్పాడు.

అతడికి కృతజ్ఞతలు తెలిపి, ఆ పిల్లవాడు చూపిన బాటవైపు నడిచాడు గంగాధర శర్మ.

'సామీ..' పిలిచాడా పిల్లవాడు.

గంగాధర శర్మ ఆగి వెనక్కి తిరిగి చూశాడు, ప్రశ్నార్థకంగా.

'సామీ.. నన్ను తాకి తమరు స్నానం చేయలేదు?' ఏదో అపచారం జరిగినట్టూ ఆరోపిస్తూ అన్నాడా పిల్లవాడు.

గంగాధర శర్మకు కాస్సేపు ఆ పిల్లవాడు ఏమన్నాడో అర్థంకాలేదు. అర్థమయిన తరువాత, నెమ్మదిగా పిల్లవాడిని సమీపించాడు.

అతడు ఒక అడుగు వెనక్కు వేశాడు.

'నేను నిన్ను తాకాను. నువ్వెందుకు స్నానం చేయకూడదు?' అడిగాడు.

ఆ పిల్లవాడు అయోమయంగా చుశాడు గంగాధర శర్మవైపు. తరువాత మెల్లిగా అన్నాడు.

'సామీ.. తమరు శుభ్రంగా ఉంటారు. నేను..' అంటూ తనవైపు చూసుకున్నాడు. గంగాధర శర్మ నీటిలో చేతులు కడుక్కున్నాడు.

'నువ్వూ నీటిలో శరీరాన్ని శుభ్రం చేసుకో' అని ముందుకు సాగాడు.

ఆ పిల్లవాడు గంగాధర శర్మవైపు విచిత్రంగా చూస్తూ నిలబడ్డాడు.

●●●

'ఛీ..ఛీ.. మీదీ ఒక సమాజమేనా?' ఛీత్కరించాడు మాలిక్ కాఫర్.

మాములు పరిస్థితులలో చంద్రశేఖరుడికి కోపం వచ్చేది. కానీ మాలి కాఫర్ కథ విన్న తరువాత అతనికి కోపం కలగలేదు. జాలి కలిగింది. నిజంగానే తమ సమాజం పట్ల అసహ్యం కలిగింది.

ఆరోజు రాత్రి చంద్రశేఖరుడిని తన గుడారంలో పడుకోబెట్టుకున్నాడు కాఫర్. కాఫర్ హాయిగా నిద్రపోయాడు. కానీ చంద్రశేఖరుడికి నిద్రపట్టలేదు. రకరకాల ఆలోచనలు ముసురుకున్నాయి.

తాను ఎటుపోతున్నాడు? కోపంతో ఊరు వదిలి వచ్చాడు. ఇప్పుడు స్వచ్ఛందంగా తురుష్కుల సైనిక సమూహంలో చేరాడు. వీరంతా ఎక్కడికో యుద్ధానికి వెళ్తున్నట్టున్నారు. కొద్దికాలం క్రితం తురుష్క సమూహానికి వ్యతిరేకంగా పోరాడే తాను. ఇప్పుడు తాను వారిలో  ఒకడవుతున్నాడా?

ఉదయమవుతూనే చంద్రశేఖరుడికి సమస్య ఎదురయింది. కాలకృత్యాలు ఎలా? ఎవరిని అడగాలి? తానీ తురుష్క సమూహంలో ఉండి సంధ్యావందనం చేయగలడా? చేయవచ్చా?

మాలిక్ కాఫర్ నిద్రలేవగానే తన సమస్యను వివరించాడు.

మాలిక్ కాఫర్ చంద్రశేఖరుడిని చూసి నవ్వాడు. గుడారాలకు దూరంగా ప్రత్యేకంగా ఉన్న గుడారాలు చూపించాడు. గుడ్డలతో గదులు కట్టినట్టున్నాయి. 'అటువైపు' అన్నాడు.

చంద్రశేఖరుడికి అర్థం కాలేదు.

మాలిక్ కాఫర్ నిట్టూర్చాడు. 'ఇప్పుడు పరిస్థితి బాగాలేదు. ఒంటరిగా దూరం వెళితే ఏ ప్రమాదం, ఏ వైపు నుంచి ముంచుకు వస్తుందో తెలియదు. కొన్ని పరిస్థితులలో ప్రాణ రక్షణ చేసుకోవటం కూడా కుదరదు. అందుకని, సైనికులు నిస్సహాయ స్థితిలో ఉన్నప్పుడు వారికి వాటిల్లే ప్రమాదం నుంచి తప్పించేందుకు ఈ పద్ధతిని ఏర్పాటు చేశాను. అటు చూడు మోకాళ్ళ మీద కూచుని ఉన్నారు చూడు, నువ్వు లోపలకు వెళ్ళిరాగానే, వాళ్ళు శుభ్రం చేసేస్తారు' అని చూపించాడు.

ఆ మాట వింటూ, జరగబోయేది ఊహిస్తేనే చంద్రశేఖరుడి కడుపులోతిప్పినట్టయింది. వికారంగా, అసహ్యంగా అనిపించింది.

'వాళ్ళెవరు?' అడిగాడు చంద్రశేఖరుడు.

'వాళ్ళంతా క్రితం గ్రామంలో బందీలుగా దొరికినవారు. మతం మారటానికి ఇష్టపడనివారు. వారిని చంపటం కన్నా ఇలా ఉపయోగించుకోవటం మంచిదనిపించింది. లేకపోతే ఈ పని ఎవరు చేస్తారు? త్వరగా పనికానీ' అంటూ మరోవైపు వెళ్ళాడు మాలిక్ కాఫర్.

చంద్రశేఖరుడి అడుగు ముందుకు పడలేదు.

మలవిసర్జన అతి అసహ్యకరమైన, కానీ తప్పనిసరి పరిస్థితి శౌచానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ మల విసర్జన గురించి శాస్త్రం ఎన్నో నియమ నిబంధనలు విధించింది. అలాంటిది, మరొకరి మలాన్ని ఎత్తి శుభ్రం చేసేందుకు సిద్ధపడే మనుషులున్నారన్న ఆలోచనే భయంకరంగా ఉంది.

అయిష్టంగా ఆ వైపు కదిలాడు చంద్రశేఖరుడు. వద్దనుకుంటూనే అక్కడ ఒకరి పక్కన ఒకరు కూచున్న వారిని చూశాడు.

వారి కళ్ళల్లో ఎలాంటి భావం లేదు. అందరూ తలలు వంచుకుని కూచున్నారు. ప్రాణాలు కాపాడుకోవటం కోసం పశువులకన్నా 'నీచమై'న పనికి సిద్ధపడిన వారిని చూసి అసహ్యించుకుని, జాలిపడాలో, తమ ధర్మం మారడం ఇష్టంలేక, ధర్మాన్ని కాపాడుకోవటం కోసం జీవచ్ఛవాల్లా జీవించటానికి సిద్ధపడ్డవారి ధర్మ దీక్షకు మెచ్చుకుని, గర్వించాలో బోధపడటం లేదు చంద్రశేఖరుడికి తనపని పూర్తి చేసుకుని బయటకు వచ్చిన అంజి దృష్టి ఆ వరుసలో కూర్చున్న ఓ వ్యక్తిపై పడింది.

సర్ప దుష్టుడిలా ఆగిపోయాడు చంద్రశేఖరుడు!

అతడు, అతడు.. తనతో పాటు గురువుగారి దగ్గర విద్యాభ్యాసం చేసినవాడు. తనతోపాటు శూరవర్మ దగ్గర కత్తి యుద్ధం చేసినవాడు. తన సహాధ్యాయి. ఆ వ్యక్తి చంద్రశేఖరుడి వైపు నిర్భావంగా చూశాడు. అతడి కళ్ళల్లో జీవం ఉన్నట్టులేదు.

నెమ్మదిగా లేచి శుభ్రపరచే వస్తువులు పట్టుకుని, చంద్రశేఖరుడు బయటకు వచ్చి గుడ్డ గదిలోకి వెళ్ళాడు.

చంద్రశేఖరుడు నిలవలేకపోయాడు. అతడికి వికారంగా అనిపించింది. పరుగు ఆరంభించాడు. అంతలో, అతడి తల తిరిగినట్టయింది. వాంతి అయింది. తనని తాను శుభ్రం చేసుకుని తన గుడారంలోకి వచ్చాడు చంద్రశేఖరుడు.

నీరసంగా ఉంది. ఎందుకో, నిస్సత్తువగా, నిరాశగా అనిపిస్తోంది.

అంతలో మాలిక్ కాఫర్ అతడి గుడారంలోకి వచ్చాడు.

చంద్రశేఖరుడిని చూసి అడిగాడు. 'ఏమైంది, అలా ఉన్నావు?'

అతడలా అడగగానే చంద్రశేఖరుడి మనస్సులో అణచిపెట్టుకున్న భావనలు కన్నీటి రూపం ధరించి ఉధ్రుతంగా వెలికి వచ్చాయి.

వెక్కి వెక్కి ఏడుస్తున్న చంద్రశేఖరుడి వైపు వింతగా చూస్తూ నుంచున్నాడు మాలిక్ కాఫర్.

'ఎందుకా ఏడుపు?' అడిగాడు,

చంద్రశేఖరుడి ఏడుపు ఉధ్రుతం తగ్గిన తరువాత.

'వాళ్ళని చంపేసినా బాగుండేది' వెక్కిళ్ళ మధ్య అన్నాడు చంద్రశేఖరుడు. 'వాళ్ళల్లో నా సహాధ్యాయి ఉన్నాడు. నాకు అన్నం పెట్టిన మా ఊరి వాళ్ళున్నారు' అన్నాడు. 'ఏడువు... ఇంకా ఏడు..' కసిగా అన్నాడు మాలిక్ కాఫర్.

ఆశ్చర్యంగా తల ఎత్తాడు చంద్రశేఖరుడు.

'ఏడు. నువ్వేకాదు, ధర్మాన్ని పట్టుకుని వ్రేలాడే నీలాంటి తరతరాలు ఇలాగే కుళ్ళి కుళ్ళి ఏడవాలి' అని వికటంగా నవ్వాడు మాలిక్ కాఫర్.

'ఎందుకంత కసి?' అడిగాడు చంద్రశేఖరుడు.

చంద్రశేఖరుడి కళ్ళల్లోకి చూశాడు మాలిక్ కాఫర్.

'నా పేరు రామచంద్రుడు. ఒకప్పటి పేరు. అందరూ చాంద్ రాణ అని పిలిచేవారు. నుస్రత్ ఖాన్ సేనలు సౌరాష్ట్రపై దాడిచేసినప్పుడు నేను పట్టుపడ్డాను. నన్ను వదిలేయమని బ్రతిమలాడాను. ఏడ్చాను. మొత్తుకున్నాను. నుస్రత్ ఖాన్ మనసు కరిగి నన్ను వదిలేశాడు.'

ఆశ్చర్యంగా చూశాడు చంద్రశేఖరుడు. తురుష్కుడు, చేతికి చిక్కిన వాడిని వదిలేయటమా?

చంద్రశేఖరుడి ఆశ్చర్యం చూసి నవ్వాడు మాలిక్ కాఫర్. 'నుస్రత్ ఖాన్‌కు నా అందం నచ్చింది. నాఏడుపు అతడిని కరిగించింది. అందుకని వదిలేశాడు. కానీ నుస్రత్ ఖాన్ కు తెలుసు, నేను ఎక్కడికీ పోలేనని'

'ఎలా?'

'నేను తిరిగి మా వాళ్ళ దగ్గరకు వెళ్ళాను' అని ఆగాడు మాలిక్ కాఫర్. అతని కంఠం గద్గదికమయింది. తనని తాను అదుపులోకి తెచ్చుకుని మళ్ళీ చెప్పటం ఆరంభించాడు.

'మా వాళ్ళకన్నా నుస్రత్ ఖాన్ కరుణార్ధ్ర హృదయుడని తేలింది. నన్ను ఊళ్ళో అడుగు పెట్టనీయలేదు. వాళ్ళ దృష్టిలో తురక వాళ్ళ దగ్గర ఒక్క రాత్రి ఉన్న నేను మరణించినవాడితో సమానం అన్నారు.

నేను మద్యం ముట్టలేదు. మాంసం ముట్టలేదు. పచ్చి మంచినీళ్ళు ముట్టలేదు. నా మీద దయదలచి నన్ను వదిలిపెట్టారు. నేను ఏ ప్రాయశ్చిత్తం చేసుకోమన్నా చేసుకుంటానన్నాను. నాలికపై కాల్చిన కర్రతో వాత పెట్టించుకున్నానన్నాను. శూలారోషణం శిక్ష విధించమన్నాను. తోలు వలుచుకోమన్నాను. కానీ ఒక్కరి హృదయం కూడా కరగలేదు. నా తల్లిదండ్రులు కూడా నా ముందే నాకు శ్రాద్ధం పెట్టటానికి సిద్ధపడ్డారు. అప్పుడు, మళ్ళీ వెనక్కి తిరిగి వచ్చాను. నన్ను ద్వేషించేవారికన్నా నన్ను ప్రేమించే వారే నా వారు అని అర్ధం చేసుకున్నాను.'

'ప్రేమించేవారా?'

'అవును. నుస్రత్ నన్ను ఇష్టపడ్డాడు'

'ఛీ.'

కోపంగా చూశాడు చంద్రశేఖరుడి వైపు మాలిక్ కాఫర్.

'ఛీ..ఛీ.. నాకు కాదు. నీ సమాజానికి. నీ సమాజం విధించిన ఇనుప నియమ నిబంధనలకు. మనిషిని వదిలి శౌచానికి కర్మ కాండలకు పెద్ద పీట వేసిన నీ ధర్మానికి ఛీ.. నుస్రత్ నన్ను చేరదీశాడు. అల్లావుద్దీన్ ఖిల్జీకి నన్ను సమర్పించాడు. ఖిల్జీ నన్ను ప్రేమిస్తున్నాడు.'

'కానీ.. మీరు మగవారు..' అతి కష్టం మీద అన్నాడు చంద్రశేఖరుడు.

'హహహ. నేను వీరుడిని. శూరుడిని. అరివీర భయంకరుడిని. సనాధర్మ వినాశకుడిని. కానీ.. నా మగతనాన్ని నా కత్తిద్వారా ప్రదర్శిస్తున్నాను. దాంతో స్వైర విహారం చేస్తూ, నన్నీ స్థితికి తెచ్చిన ఈ దేవదేవతల మాన ప్రాణాలను హరిస్తాను. సకల భారతాన్నీ ఖిల్జీ పాదక్రాంతం చేస్తాను.' వికటంగా నవ్వాడు మాలిక్ కాఫర్.

చంద్రశేఖరుడికి అర్థమయీ అవనట్టుంది. అయోమయంగా ఉంది. అతడి ఆలోచనలు, ఊహలు, నిజాలను అర్థం చేసుకోలేక సతమతమవుతున్నయి.

ఇంతలో మాలిక్ కాఫర్, కత్తిని చంద్రశేఖరుడి మెడకు ఆనించాడు.

'నువ్వు. నా ప్రాణాలను కాపాడేవు. కాబట్టి నీ ప్రాణాలు తీయను. చెప్పు. మాతో పాటు, ఇస్లాం స్వీకరిస్తావా? లేక, నీ ధర్మం కాపాడుకుంటూ పెంట ఎత్తుతూ బ్రతుకుతావా?'

●●●

**'ఎంతవరకూ తమరి ప్రయాణం?'**

'శ్రీరంగం వరకూ!'

'శ్రీరంగమా?' ఆశ్చర్యం ధ్వనించింది స్వరంలో.

'అవును. శ్రీరంగంలో ప్రదర్శన సూరి అనే పండితుడు శ్రీ భాష్యానికి భాష్యం రాశాడు. అతడితో వాదించటానికి శ్రీరంగం వెళ్తున్నాను.'

గంగాధర శర్మ మాటలు వింటున్న ఆ ఊరి పెద్ద ముఖంలో ఆశ్చర్యం స్పష్టంగా కనిపిస్తోంది.

'నాకు సెలవా మరి?' అడిగాడు గంగాధర శర్మ.

ఊరి పెద్ద ఓ రకంగా చూస్తున్నాడు గంగాధర శర్మకు.

ఆ ఊరిపేరు 'శివానందం' ఉదయాన్నే ఊళ్ళో అడుగు పెట్టాడు గంగాధరశర్మ. అక్కడ జీవితం ప్రశాంతంగా ఉంది. ఇంకా తురుష్క తుఫాను తాకిడి ఆ ఊరి వరకూ రాలేదు.

అందరూ ఉదయానే ఎవరి పనుల్లో వాడు మునిగి ఉన్నారు. పరాచికాలు, సరసాలు ఆడుతూ పనులు సాగిస్తున్నారు.

ఊరి బయట, అంత ఉదయాన్నే పొలం పనులు ప్రారంభమయిపోయాయి. ఊళ్ళో అడుగుపెడుతూంటూనే గుడి నుంచి శంఖనాదం వినిపించింది.

ఆ ఊరికి కేంద్రం శివాలయం.

గంగాధర శర్మ శివాలయంలో శివుడి దర్శనం చేసుకున్నాడు. గుడిని చూస్తూంటేనే అత్యంత ప్రాచీనమైనదని తెలుస్తోంది.

'విక్రమాదిత్యుని కాలానికి చెందిన గుడి ఇది' ప్రసాదం ఇస్తూ చెప్పాడు పూజారి. అపుడే అక్కడ ఉన్న ఊరి పెద్ద గంగాధర శర్మను కుశల ప్రశ్నలడిగాడు. తమ ఇంట ఆతిధ్యం స్వీకరించమన్నాడు.

'సద్బ్రాహ్మణులకు సేవ చేసే భాగ్యం ప్రసాదించమన్నా'డు.

అతడి మాట, మన్నన, అతిధి సేవాతత్పరత గంగాధర శర్మను ముగ్ధుడిని చేశాయి. 'సద్బ్రామణుడు' అవటంతోటే గంగాధర శర్మ మనస్సులో ఒక బాధావీచిక ఎగసి పడింది.

'తాను సద్భ్రహ్మణుడా?' అతని కళ్ళ ముందు యుద్ధ దృశ్యాలు కదిలాయి. తన శరీరం సర్వం, తాను చంపిన వారి రక్తమాంసాలలో తడిసి ముద్ద అవటం గుర్తుకు వచ్చింది. తన శరీరమంటే తనకే అసహ్యంగా అనిపిస్తోంది. తాను సద్బ్రహ్మణుడు ఎలా అవుతాడు?

గంగాధర శర్మ ముఖంలో మారుతున్న భావాలను గమనించి ఆ ఊరి పెద్ద కారణం అడిగాడు.

'నేను సద్బ్రహ్మణుడను అవటం అటుంచి బ్రాహ్మణుడు అనదగ్గవాడిని కూడా కాదు' గొంతు గద్గదికమవుతూంటే చెప్పాడు గంగాధర శర్మ.

'అదేమిటి?'ఆశ్చర్యంగా అడిగాడతడు.

'నేను నియమనిష్టలను వదిలేశాను. శాస్త్ర పఠనం వెనక్కి వెళ్ళిపోయింది. కర్మకాండలు చేయటం లేదు. చివరికి కత్తి పట్టి యుద్ధం చేశాను. నిండుప్రాణాలను బలిగొన్నాను.' కంట్లో నీళ్ళు కదలాడుతూండగా చెప్పాడు గంగాధర శర్మ.

ఆ ఊరిపెద్ద గంగాధర శర్మను కూచోమన్నాడు.

మాములు భక్తులకు ఇబ్బంది కలగకుండా దూరంగా కూచున్నారు.

'మీరు బ్రాహ్మణులు. తెలివైనవారు. సకలం తెలిసిన వారు. మీకు నేను చెప్పదగినవాడిని కాకపోవచ్చు కానీ, మీకన్నా అనుభవం ఎక్కువగా ఉండటం వల్ల, సజ్జన సాంగత్యం వల్ల నేను గ్రహించిన విషయం ఒకటి చెప్తాను' వినయంగా అన్నాడతడు.

గంగాధర శర్మ నవ్వాడు. 'నా మనస్సులోని సంశయాన్ని తొలిగించే వారెవరయినా వారిని నేను గురుదేవునిలా గౌరవిస్తాను' అన్నాడు 'గురుదేవులు' అంటుంటే అతడి స్వరం గద్గదికమయింది.

'బ్రాహ్మణుడు అన్నది కొన్ని లక్షణాలను సూచించే పదం కొన్ని కర్మకాండలు జరపటం వల్ల, శాస్త్రపఠనం వల్ల, నియమ నిష్ఠల వల్ల మాత్రమే వ్యక్తి బ్రాహ్మణుడు కాడు. సత్యం వాక్పరిపాలన, విచక్షణ, సత్ప్రవర్తన, నిస్వార్థం, నిర్మోహం, తనదంటూ ఏమీలేకపోవటం, దేనిపైనా ఆశలేకపోవటం. ఇలాంటి కొన్ని లక్షణాలున్నాయి. వాటిని బట్టి బ్రాహ్మణుడు కానీ, పుట్టుకను బట్టి, వేషాన్ని బట్టి కాదు. అందుకే సత్యం పలికినందువల్లనే జాబాలిని గురువు బ్రాహ్మణుడిగా భావించాడు. నేను సైతం మీ ముఖంలో కనిపిస్తున్న నిర్మలత్వం, మీ నడవడిలోని స్వచ్ఛతను గమనించి బ్రాహ్మణుడన్నాను. నిజం చెప్పటం వల్ల సద్బ్రాహ్మణుడన్న పదం మీకు సరిపోతుంది' అన్నాడు నవ్వుతూ.

'కానీ.. జన్మవల్లనే కులం అని, తురుష్కుల బారిన పడితే కులం పోతుందని భావించి మనవారికే మనం దూర చేసుకుంటున్నాం' అన్నాడు గంగాధరశర్మ బాధగా.

'సమాజం నిత్య పరిణామ శీలి. పదాలు మారతాయి. పదాల అర్థాలు మారతాయి. భావాలు మారతాయి. అసలు భావం మరుగున పడుతుంది. అజ్ఞానం జ్ఞానాన్ని కప్పి వేస్తుంది, మేఘాలు సూర్యుడిని అడ్డుకున్నట్టు. ఈ అజ్ఞానం ఎక్కువకాలం నిలవదు. మీలాంటి వారు, నిజాన్ని ప్రచారం చేస్తూ సాగాలి. ప్రజలను జాగృతం చేయటం ద్వారా సమాజంలో చైతన్యం కలిగించాలి' అన్నాడు.

ఆ రోజు గంగాధరశర్మ అతడి ఆతిథ్యం స్వీకరించాడు. రోజంతా ఇద్దరూ అనేక విషయాలు చర్చించారు.

సాయంత్ర మవుతూంటే గంగాధరశర్మ సెలవు తీసుకుంటానన్నాడు. అప్పుడు తన ప్రయాణ లక్ష్యం వివరించాడు.

'చీకటి పడుతోంది. చీకటిలో ప్రయాణించే కన్నా వెలుతురులో ప్రయాణించటం మంచిది' అన్నాడు ఊరిపెద్ద.

గంగాధర శర్మ మాట్లాడలేదు. కానీ వీడ్కోలు పలికేముందు మాత్రం, ఆరంభం నుంచీ తనని వేధిస్తున్న సందేహాన్ని తీర్చుకోకుండా ఉండలేక పోయాడు. 'తురుష్క తండాలు ఊళ్ళమీద పడుతున్నాయి. సర్వం నాశనం చేస్తున్నాయి. మీరు చూస్తూంటే, వారిని ఎదుర్కోటానికి కాను, వారినుంచి మిమ్మల్ని మీరు రక్షించుకోటానికి గానూ, ఎలాంటి ప్రయత్నాలు చేస్తున్నట్టు లేదు.' అడిగాడు గంగాధరశర్మ.

ఊరి పెద్ద నవ్వాడు. 'మాకేం భయంలేదు. ఇన్నాళ్ళూ మా ఊరిని పరమ శివుడు కాపాడేడు. ఇకపై కూడా పరమశివుడు మమ్మల్ని కాపాడతాడు.' ఎంతో విశ్వాసంగా అన్నాడు.

అతడి విశ్వాసం ఎంత అసమజసమో గంగాధరశర్మ అనుభవ పూర్వకంగా గ్రహించాడు. తురుష్క కరవాలం ముందు సుడిగాలికి ఎగిరిపోయే ధూళిలా సర్వం నాశనం అయిపోతున్నాయి. మనిషి తన ప్రయత్నం చేస్తే దానికి దైవం తోడవుతుంది కానీ ఏ ప్రయత్నం లేకుండా సుడిగాలిలో దీపం పెట్టి భగవంతుడే కాపాడతాడంటే..

ఎందుకో అతడి నమ్మకాన్ని తప్పని తప్పించబుద్ధి కాలేదు గంగాధరశర్మకు. కొన్ని విషయాలలో ఎంతో లోతైన ఆలోచనలు దట్టంగా ముసురుతూండగా, ఆ ఊరిని వదిలి ముందుకు సాగాడు గంగాధరశర్మ. అతని ఆలోచనల దట్టమై జగతి అంతా పరుచుకున్నట్టు. వెలుతురు మాయమై చీకటి ముసురుకుంది.

●●●

తన మెడపై ఉన్న కత్తిని, మాలిక్ కాఫర్‌ను మార్చి మార్చి చూశాడు చంద్రశేఖరుడు. జరుగుతున్నది నిజం కాదు, కల అనిపిస్తోందతడికి. తాను ఒకరి ప్రాణాలు రక్షించాడో, రోజు తిరిగేలోగా, వాడే తన ప్రాణాలు తీసుకోటానికి సిద్ధంగా ఉండటం నమ్మశక్యంగా లేదు. 'హాస్యమా?' అడిగాడు చంద్రశేఖరుడు.

మాలిక్ కాఫర్ మాట్లాడలేదు. కత్తి మొనపై ఒత్తిడి పెంచాడు.

ముందు చంద్రశేఖరుడికి ఏమీ అనిపించలేదు. తరువాత మెడదగ్గర చీమ సన్నగా కుట్టినట్టు అనిపించింది. ఆ తరువాత వెచ్చగా రక్తం మెడనుండి భుజం మీదకు జారటం తెలిసింది. మాలిక్ కాఫర్ వైపు ఆశ్చర్యంగా చూశాడు.

'నీ ప్రాణాలు కాపాడినందుకు ఇదేనా కృతజ్ఞత?' ప్రశ్నించాడు.

మాలిక్ కాఫర్ నవ్వాడు. 'కృతజ్ఞత .. ఆ పదం పనికి రానిది. దాన్ని సనాతన ధర్మంతో పాటే వదిలేశాను. ఇప్పుడు నాకు తెలిసినది ఒకటే. ప్రాణం తీయటం... అదీ కాఫిర్ల ప్రాణాలు నువ్వు కాపాడేనని అనుకోవటం నీ అహంకారం. అది అల్లాదయ. ఇపుడు నీ ప్రాణాలు కూడా అల్లా దయ పైనే ఆధారపడి ఉన్నాయి.'

చంద్రశేఖరుడికి ఏమనాలో తోచలేదు.

ఇది అనూహ్యమైన పరిస్థితి. 'త్వరగా. నాకు ఎదురుచూసే సమయంలేదు' అని కత్తి మొనపై ఒత్తిడి పెంచాడు.

నొప్పి తెలుస్తోంది చంద్రశేఖరుడికి.

'ఇలా ఒత్తిడికి లొంగి నేను తాత్కాలికంగా నీకు లొంగినా, నా మనస్సు మాత్రం నీకు లొంగాలని లేదుకదా! మనస్ఫూర్తిగా లేని నమ్మకానికి విలువ ఏముంటుంది?' అడిగాడు చంద్రశేఖరుడు.

అతడు తప్పించుకునే మార్గం గురించి ఆలోచిస్తున్నాడు. ఎంతవద్దనుకున్నా అతడి దృష్టి జీవచ్ఛవాల్లా తలలు వంచుకుని 'పాయిఖానా' (శౌచకూపాన్ని పాయిఖానా అంటారని కొద్దిసేపటి క్రితమే చంద్రశేఖరుడికి తెలిసింది) ముందు కూచున్న వారివైపే వెళ్తోంది. ఇక్కడ మాలిక్ కాఫర్ తన మెడపై కత్తి పెట్టినా, వారి దృష్టి మాత్రం మల విసర్జనకు వెళ్ళే వారిపైనే ఉంది. వారు బయటకు రాగానే లోపలకు వెళ్ళి శుభ్రం చేయటం పైనే ఉంది. తాను అలా బ్రతకగలడా? అలా జీవితాన్ని వెళ్ళబుచ్చగలడా? తానేకాదు, రేపు తనకు వివాహమయితే తన భార్య, పిల్లలు కూడా తనలాగే ఇలాంటి వృత్తిలోనే జీవించాల్సి ఉంటుందా?

సనాతనధర్మంలోని మూర్ఖత్వం తనకు తెలుసు. ఎన్నో ఏళ్ళు కలిసి మెలసి ప్రాణప్రదంగా బ్రతికిన భార్యనే, అగ్నిసాక్షిగా జీవితాంతం కలసి ఉంటామని ప్రతిన పట్టిన వారే, తురుష్కుల తండాను లొంగి పోయారని స్వీకరించ నిరాకరించటం బ్రతికి ఉన్నా అంత్యక్రియలు జరపటం, శ్రాద్ధం పెట్టటం తాను చూశాడు. ఒక్కసారి పొరపాటు చేసే తరతరాలు ఆ శిక్ష ఫలితాన్ని అనుభవించటం తెలుసు. ఇప్పుడు తనని కూడా వెలివేస్తారు. తానే కాదు తన తరువాత తరాలు పెంటనెత్తే వాళ్ళయి పోతారు.

కొన్నాళ్ళకి తాను మరణించిన తరువాత, కొన్ని తరాల తరువాత వారికి అతను ఎవరో గుర్తే ఉండదు. జ్ఞానం ఉండదు.

చంద్రశేఖరుడి ఒళ్ళు జలదరించింది ఈ ఊహతోటే.

ఒకవేళ తాను ఇక్కడి నుంచి తప్పించుకుని వెళ్ళినా తనని తనుగా బ్రతకనివ్వరు. దానికన్నా తాను ఇస్లాంను స్వీకరించటమే మేలు. ప్రాణాలు నిలబడటమే వారు, గౌరవంగా బ్రతకవచ్చు. తాను పాలకులకు చెందినవాడవుతాడు. ప్రాణాలు అరచేత పట్టుకుని చెట్లు, పుట్టలు పట్టుకుని పారిపోవాల్సిన అవసరం ఉండదు. ఒక నిర్ణయానికి వచ్చాడు చంద్రశేఖరుడు. తల ఎత్తి మాలిక్ కాఫర్ వైపు చూశాడు.

అతడి కళ్ళల్లో నిర్ణయాన్ని చదివాడు మాలిక్ కాఫర్ నవ్వాడు. చంద్రశేఖరుడుని లేవదీసి హత్తుకున్నాడు. మరో చేత్తో మౌల్వికి సౌంజ్ఞ చేశాడు.

'సరైన నిర్ణయం తీసుకున్నావు' అభినందించాడు.

ఎందుకో తన నిర్ణయం పట్ల గర్వంగా అనిపించటంలేదు చంద్రశేఖరుడికి.

ఆ తరువాత అతని ప్రమేయం లేకుండా జరిగేవి జరిగిపోసాగాయి.

ఎవరో అతడి శిఖలను కత్తిరించేశారు. ఇంకెవరో ఏవేవో చేస్తున్నారు. ఇంతలో ఎవరో అతడి జంధ్యాన్ని కోసివేశారు. బొట్టు తుడిపేశారు. చంద్రశేఖరుడి ఒళ్ళు జలదరించింది. ఇన్నాళ్ళూ జంధ్యాన్ని పరమ పవిత్రంగా భావించాడు. అతి గౌరవంగా ప్రాణప్రదంగా

భావించాడు. ఇప్పుడు తన శరీరాన్ని వీడుతూంటే, ఒక అలివికాని భావన కదలాడింది. కానీ, వెంటనే ఎవరో తన బంధాలను తొలిగించినట్టనిపించింది. తనను కట్టి ఉంచిన పాశాన్ని ఎవరో తెంచి వేసి, తనకు స్వేచ్ఛ నిచ్చినట్టు అనిపించింది. శరీరం తేలికయినట్టనిపించింది. వికటాట్టహాసం చేయాలనిపించింది.

అంతా మోసం. జంధ్యం పవిత్రమని, అది తీసివేస్తే అనర్థం వాటిల్లుతుందని తనకు చెప్పిందంతా అబద్ధం. అంతా అబద్ధాలు. అంతా బూటకం. ఇప్పుడు తాను తన ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించవచ్చు. తాను మరో జన్మ ఎత్తినట్టు అనిపిస్తోంది. ఏదో తెలియని ద్వేషం పెల్లుబుకుతోంది. ఆ ద్వేషం తనలో పెల్లుబకపోతే తాను బ్రతకలేడని చంద్రశేఖరుడికి తెలుసు. ఆ విషం తన నరనరాన నిండక పోతే, తన మనస్సాక్షిని విషమయం చేయకపోతే తనకు శాంతి ఉండదని అతడికి తెలుసు. ఎందుకంటే, ఓ వైపు ఉత్తేజితుడవుతున్నా. తనని తాను అధముడిగా భావించుకుంటున్నా, మరోవైపు శౌచకూపం ముందు జీవచ్ఛవాల్లా ఉన్న వారివైపు చూడలేకపోతున్నాడు. వారి ముందు న్యూనత భావానికి గురవుతున్నాడు. వారు ధర్మం కోసం జీవచ్ఛవాలయ్యారు. తాను ధర్మాన్ని త్యజించి సజీవుడయ్యాడు. కసి ఓ ఉధ్రుతమైన ప్రవాహంలా నరనరాన పరవళ్ళు తొక్కుతోంది.

మాలిక్ కాఫర్, అతడి భుజం మీద చేయివేసి 'చాంద్ పాషా ఇప్పుడేం కావాలి కోరుకో' అడిగాడు.

అర్థం కానట్టు చూశాడు చంద్రశేఖరుడు. అర్థమైన తరువాత అప్రయత్నంగా అన్నాడు. 'పద్మిని.. పద్మిని కావాలి'.

●●●

**మళ్ళీ ఒంటరిగా నడక ప్రారంభించాడు గంగాధర శర్మ.** ఊరు దాటి అడవిలో ప్రవేశించాడు. అతడికి తనలో ఏదో మార్పు కలుగుతున్న భావన కలుగుతోంది. తనలో కలిగే ఈ మార్పు సమస్త భారతావనిలో సంభవిస్తున్న పరిణామాలు ప్రతిబింబిస్తున్నవన్న ఆలోచన కలుగుతోంది.

అతడు నడుస్తూ, తాను అంతవరకూ గ్రహించిన అనేక విషయాలను మననం చేసుకోసాగాడు. భారతీయ ధర్మానికి, తత్వానికి సంబంధించిన అంశాలను తనలో తాను తర్కించుకోసాగాడు. భారతీయ తాత్విక చింతన అభివృద్ధి పథాన్ని విశ్లేషించసాగాడు.

తరచి సూస్తూంటే సమాజ గతి, ప్రవాహ గతి ఒకటే అనిపిస్తున్నాయి అతడికి. ప్రవాహం ఆరంభంలో చిన్న నీటిపాయలా ఉంటుంది. రాను రాను నీరు వచ్చి చేరుతూండటం వల్ల వేగవంతమవుతుంది. జలపాతంలా దూకుతుంది. అడ్డు వచ్చిన దాన్ని కోసి వేస్తుంది. కోయలేని దాని చుట్టూ తిరిగి ప్రవహిస్తుంది. కానీ, కొంతదూరం ప్రయాణించిన తరువాత, కొత్తనీరు వచ్చి చేరకపోతే ప్రవాహ గతి మందగిస్తుంది. చివరికి ప్రవాహగమనం మళ్ళీ చిన్న చిన్న పాయలుగా చీలిపోతుంది. చివరికి అదృశ్యమై పోతుంది. ధర్మం కూడా ఇంతే.

ఆరంభంలో ఒక ఆలోచన కలుగుతుంది. అది రూపు దిద్దుకుని ఎదుగుతుంది. ఆ ఆలోచనను సమాజంలో కొందరు స్వీకరిస్తారు. ఇంకొందరు తిరస్కరిస్తారు. ఘర్షణ జరుగుతుంది. ఈ ఘర్షణను తట్టుకుని ఆ ఆలోచన అధికులను ఆకర్షిస్తే అది సిద్ధాంతంగా మారుతుంది. సిద్ధాంతంగా మారింది వ్యతిరేకతను తట్టుకుని ముందుకు సాగితే సంప్రదాయంగా మారుతుంది. అయితే, ఎప్పటికప్పుడు ఆ సంప్రదాయం, ఆ ఆలోచన పరిస్థితులకు అనుగుణంగా తనని తాను రూపాంతరం చెందించుకోకపోతే, నది పాయలుగా చీలినట్లు ఆలోచన అసలు రూపును కోల్పోయి వికృతమవుతుంది. ఇంతలో ఆ ఆలోచనను మరో శక్తివంతమైన ఆలోచన అణగద్రొక్కుతుంది. మళ్ళీ ఆలోచన ఎదుగుదల పతనం చక్రనేమి క్రమేణా సాగుతుంది.

ప్రస్తుతం భారతీయ సమాజం సంకట పరిస్థితిని ఎదుర్కొంటోంది. తనని తాను పునర్నిర్వచించుకుని, నూతన రూపు ధరించి, కొత్తనీరు చేరటం వల్ల ఊపందుకున్న నదిలా ముందుకు సాగాల్సి ఉంటుంది. ఇది జరిగితే సజీవ నదిలా నిలుస్తుందీ ధర్మం. అది జరగకపోతే ఎండిపోయే నదిలా ఈ ధర్మం కూడా అంతరిస్తుంది.

చివరి ఆలోచననే ఎంతో బాధాకరంగా ఉంది. ఆ ఆలోచన రావటమే అపచారంలో తోస్తోంది. ఇంతలో ఏదో ఊరు దగ్గర పడుతున్నట్టు తోచింది గంగాధర శర్మకు. అంతలో హఠాత్తుగా అడవి అంతమయింది. ఊరు ప్రారంభమయింది.

●●●

చంద్రశేఖరుడి గాధను మౌనంగా విన్నాడు మాలిక్ కాఫర్. సానుభూతి వ్యక్తపరుస్తూ చంద్రశేఖరుడి భుజంపై చేయివేశాడు.

'నీ బాధ అర్ధమైంది' అన్నాడు.

చంద్రశేఖరుడు మాట్లాడలేదు. అతడి మనసులో సంఘర్షణ జరుగుతోంది. తాను చేసింది తప్పో, ఒప్పో తెలియటంలేదు. కానీ, తన ప్రాణాలు నిలిచాయని తెలుస్తోంది. తనప్రాణాలు నిలుపుకోవటం మనిషి తక్షణ కర్తవ్యం. అందుకోసం ఏమైనా చేయవచ్చంటుంది శాస్త్రం.

అంతలో తాను తీసుకున్న నిర్ణయ ఫలితం, ప్రభావాలు ఒక్కసారిగా అతనికి అర్ధమయ్యాయి.

ఇపుడు తాను శాస్త్రం ప్రసక్తి తీసుకురావటానికి లేదు. తనను ఇస్లాంలోకి ఆహ్వానిస్తూ 'మౌల్వి' చెప్పాడు.

'ఇకపై తాను అల్లానే నమ్మాలని. అల్లానే ధ్యానించాలని. పరదేవతలను నమ్మటం, తలవటం కూడదన్నాడు. ఖురాన్ ఒక్కటే పవిత్ర గ్రంథమని నమ్మమన్నాడు. విగ్రహారాధన కూడదన్నాడు. విగ్రహారాధనను రూపుమాపటం, విగ్రహాలను ధ్వంసం చేసి, సర్వం ఇస్లాం మయం చేయుటం తమ పవిత్ర కర్తవ్యమన్నాడు. ఇకపై తాను 'శాస్త్రం' అన్నమాటను తలవకూడదు కూడా.

'నేను సుల్తాన్ అల్లావుద్దీన్ ఖిల్జీ ఆజ్ఞ ప్రకారం దక్షిణాదిపై దండయాత్రకు వెళ్తున్నాను. నాతోరా. మీ ఊరు దారిలోనే కదా, వీలయితే నీకు నీ పద్మిని అప్పగిస్తాను' అన్నాడు మాలిక్ కాఫర్.

'కానీ.. పద్మిని నన్ను ఇష్టపడటంలేదు' లో గొంతుకలో అన్నాడు చంద్రశేఖరుడు.

పెద్దగా నవ్వాడు మాలిక్ కాఫర్. 'నువ్వింకా చిన్నపిల్లవాడివి. నీకు తెలియదు. మనిషిని ఇష్టాయిష్టాల ప్రకారం ఎంచుకునే అవకాశం ఇవ్వకూడదు' అని కత్తి ఎత్తిపట్టుకున్నాడు. కత్తిని చంద్రశేఖరుడి మెడపై పెట్టాడు. 'నేను చెప్పింది చేస్తావా! ఛస్తావా?' అంతే.. అప్పుడు ఇష్టాయిష్టాలుండవు. చావు బ్రతుకులుంటాయి.' అన్నాడు.

బలహీనంగా తల ఊపాడు చంద్రశేఖరుడు.

●●●

ఊర్లో అడుగుపెట్టాడు గంగాధర శర్మ. తాను గతంలో చూసిన ఊరికీ, ఈ ఊరికి ఏదో తేడా ఉన్నదనిపించింది.

సాధారణంగా ఊర్లో అడుగుపెట్టగానే, ఎదురు పడ్డ వ్యక్తి, తన పుట్టుపూర్వోత్తరాలడుగుతాడు. పని అడుగుతాడు. ఎవరింట్లో ఆతిధ్యం లభిస్తుందో చెప్తాడు. కానీ ఈ ఊళ్ళో ఎవ్వరూ అతడిని పట్టించుకోవటంలేదు. అందరూ ఏదో పని ఉన్నట్టు హడావిడిగా పరుగెత్తుతున్నారు. వారంతా ఒకటే దిశలో పోతూండటం చూసి వారిని అనుసరించాడు గంగాధర శర్మ. ఎందుకో, ఆ ఊళ్ళో వాళ్ళని చూస్తూంటే, వారు అగ్రవర్ణాల వారిలా అనిపించలేదు. వారు బట్టలు కట్టిన విధానం, వారి ప్రవర్తనలలో దర్పం కనబడటం లేదు. వారి శరీరాలు కూడా కాయకష్టానికి అలవాటు పడ్డవాళ్ళలా ఉన్నారు.

వారందరి గమ్యం, ఆ ఊళ్ళో ఓ వైపున ఉన్న గుడిసెలాంటి కట్టడం అని గ్రహించాడు గంగాధర శర్మ. వారితో కలిసి వారితోపాటు అటు వెళ్ళాడు. దగ్గరకి వెళ్ళిన తరువాత గ్రహించాడు అది ఒక పవిత్ర స్థలం అని.

గమ్మత్తుగా అనిపించింది.

భారతీయ ధర్మంలో ఒకప్పుడు విగ్రహారాధన లేదు. తరువాత నిరాకార నిర్గుణ స్వరూపుడికి ఒక అస్పష్ట ప్రతీకాత్మక ఆకృతి ఏర్పడింది. సిద్ధాంతాలు, మంత్రాల ఆధారంగా జరిగే భగవదార్చనలో బౌద్ధం వల్ల అనేక మార్పులు సంభవించాయి. భగవంతుడికి రూపం ఏర్పడింది. మందిరాలు వెలిశాయి. ఇప్పుడు తన కళ్ళతో గంగాధర శర్మ మరో మార్పును చూస్తున్నట్టు గ్రహించాడు. సంకటంలో పడిన నదీప్రవాహంలోకి సరికొత్త నీరు వచ్చి చేరుతున్నదని గ్రహించాడు.

అక్కడికి వస్తున్నవారంతా గౌరవంగా, వరుసలో కూచుంటున్నారు. అందరూ నిశ్శబ్ధంగా ఉన్నారు. భక్తి భావంతో దేనికోసమో ఎదురు చూస్తున్నట్టున్నారు అందరూ.

గంగాధర శర్మకు అర్థం కాలేదు. ఇది గుడి అయితే పూజారి ఏడి? భగవంతుడి విగ్రహం ఏది? ఎందుకోసం వీరంతా ఎదురు చూస్తున్నారు?

వాళ్ళెవ్వరూ గంగాధర శర్మను ఏ మాత్రం గమనించటంలేదు. అతడెవరో తెలుసుకోవాలని ఎలాంటి కుతూహలం చూపటంలేదు.

ఇంతలో ఎక్కడి నుంచో మానవుల సమూహం ఏదో పాటపాడుతున్నట్టు తోచింది.

హఠాత్తుగా అక్కడున్న వారంతా ఒక్కసారిగా లేచి నిలబడ్డారు. సంభ్రమంగా, ఆత్రుతగా ఆ సవ్వడి వినిపించిన వైపు చూడసాగారు.

గంగాధర శర్మకు తనను ఎవ్వరూ ఎందుకని పట్టించుకోవటంలేదో? అక్కడ ఉన్నవారిలో అధికులు ఆ ఊరికి చెందిన వారిలా లేరు. వేరే ప్రాంతం నుంచి వచ్చినట్టున్నారు. వారి పక్కనే మూటలున్నాయి వారు ప్రయాణం చేసి వచ్చారనటానికి సూచనగా.

అందరిలా ఆ శబ్దాలు వినిపించిన వైపు చుశాడు గంగాధర శర్మ. రాను రాను వారు దగ్గరకు వస్తున్నట్టు పాట శబ్దం ధ్వని పెరగసాగింది.

ఇంతలో కొన్ని వందల మంది వ్యక్తులు పాటలు పాడుతూ, నృత్యం చేస్తూ రావటం కనిపించింది.

వారి పాట స్థానిక భాషలో ఉంది. ఆ పాటలో 'కృష్ణ' అన్న శబ్దం పదే పదే వినపడసాగింది.

అలా వచ్చి వారంతా నృత్యం చేస్తూ, పాడుతూ ఒక వరుసలో నిలబడ్డారు. అప్పుడు కనిపించింది గంగాధర శర్మకు వారందరి ఆనందానికీ, భక్తి పారవశ్యాలకూ కేంద్రం. నడుమున ఓ నడివయసు వ్యక్తి ఉన్నాడు. అతడి తలమీద ఓ విగ్రహం ఉంది. అతడు భక్తి పారవశ్యంతో కన్నీళ్ళు కారుస్తూ, నృత్యం చేస్తూ పాడుతున్నాడు. అతడు ఒక పదం పాడగానే మిగతా వారంతా ఆ పదాన్ని పలుకుతున్నారు. అతడు పాట పాడుతున్న భాష సామాన్యుల భాషలా ఉంది. దాన్లో అక్కడక్కడా సంస్కృత పదాలు దొర్లుతున్నాయి. దాన్ని బట్టి అతడు భక్తి పాటను పాడుతున్నాడని గ్రహించాడు గంగాధర శర్మ.

అతడు పారవశ్యంతో పాడుతూ, గది మధ్యకు చేరుకున్నాడు. తలపై ఉన్న విగ్రహాన్ని దింపి, గది మధ్యలో వ్రేలాడుతున్న ఉయ్యాలలో ఉంచాడు. అపుడు విగ్రహాన్ని చూశాడు గంగాధర శర్మ.

అది బాలకృష్ణుడి విగ్రహం. వెన్నముద్ద పట్టుకుని పాకుతున్నట్టున్న బాలకృష్ణుడి విగ్రహం. అతడు బాలకృష్ణుడికి స్నానం చేయించాడు. ఇప్పుడు ఉయ్యాల్లో ఊపుతున్నాడు. ఇప్పుడు వారందరికీ బాలకృష్ణుడు సజీవదైవం. విగ్రహంలో సజీవ మూర్తిని దర్శిస్తూ, భక్తి పారవశ్యాలను, అనుభవిస్తున్న అతడు పూజారి స్థానాన్ని ఆక్రమించాడు. భగవంతుడిని ప్రత్యక్షంగా అనుభవిస్తున్న మనిషి, దైవ సమానుడవుతాడు. కొన్నాళ్ళకు మనిషే దేవుడవుతాడు.

మారుతున్న కాలానికి అనుగుణంగా, తనని తాను రూపాంతమొందించుకుంటూ, సజీవంగా నిలవాలని ప్రయత్నిస్తున్న ధర్మస్వరూపం గంగాధర శర్మకు బోధపడసాగింది.

మహానది పాయలుగా చీలి, ఏ పాయకాపాయ, నీటిని కూడదీసుకుని ప్రవహం ఎదగటం, తద్వారా మహానది సజీవంగా నిలవటం అవగతమవుతోంది. గురువుగారు, తనతో భారత, రామాయణ గ్రంధాలు ప్రాంతీయ భాషలలోకి అనువాదమవుతున్నాయని అన్నారు. కాలం మారుతోంది. పరిస్థితులు మారుతున్నాయి. గతంలోలా తీరికగా ఒకో మంత్రాన్ని నేర్చుకుని వేదాధ్యయనం చేసే తీరికలెవరికీ లేవు. అంత భద్రత, ప్రశాంతత కూడా సామాజిక జీవనంలో లేదు. కాబట్టి, ధర్మాన్ని సామాన్యులకు చేరువ చేయకపోతే ధర్మం దెబ్బతినే పరిస్థితి వచ్చింది. అందుకని, అందరికీ అర్ధమయ్యే స్థానిక భాషలలోకి, ఆయా ప్రాంతాల సామాజిక, రాజకీయ పరిస్థితులననుసరించి, ప్రాచీన గ్రంధాలు అనువాదమవుతున్నాయి. అందరికీ చేరువ అవుతున్నాయి.

దాని ఫలితం ఇది.

ఇప్పుడు ఎవ్వరికీ శాస్త్ర గ్రంధాలను అధ్యయనం చేసే పరిస్థితులు లేవు. జీవికనే సమస్యగా పరిమణమించింది. ఇలాంటి పరిస్థితులలో, అగ్రవర్ణాలవారు పంతాలు, పట్టుదలలకు పోయి, తమ చుట్టూ గిరిగీసుకుని కూర్చుంటున్న పరిస్థితులలో, అగ్రవర్ణాల వారు పంతాలు, పట్టుదలలకు పోయి, తమ చుట్టూ గిరిగీసుకుని కూర్చుంటున్న పరిస్థితులలో, ధర్మాన్ని సజీవం చేసేందుకు నూతన శక్తిని నింపి, నూతన దిశను ఇచ్చే బాధ్యత ఇతర వర్ణాల పై పడింది. వారు వారి పరిధిలో తమ బాధ్యతను నిర్వహించే ప్రయత్నాలు చేస్తున్నారు.

మంత్రాల స్థానాన్ని భజనలు, గీతాలు ఆక్రమించాయి. యజ్ఞయాగాదుల స్థానాన్ని పూజలు, ఆక్రమించాయి. వేదాలకు ప్రత్యామ్నాయంగా పురాణాలలోని గాధలు ఎదుగుతున్నాయి. ఈ గాధలలో ఎవరికి తోచిన రీతిలో, వారి మనసుకు నచ్చి దైవం కేంద్ర బిందువుగా ఎదుగుతున్నాడు. ప్రజలలో, ధార్మిక భావనలు పెంపొందింపచేస్తున్నాడు. ధర్మాన్ని సజీవం చేస్తున్నాడు. కానీ కొన్నేళ్ళ తరువాత నది అదే అయినా నీరు మారినట్టు, శాఖ వృక్షంగా ఎదిగిన, తాకే వృక్షానికి శాఖనో, ఆ వృక్షాన్నే విస్మరించినట్టు, ఈ పాయలు, మహానదిని దాటిపోతాయా? లేక మహానదికి అనుబంధంగా ఉంటాయా?

గంగాధర శర్మ మనస్సులో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. అక్కడున్న వారంతా తన్మయులై, ఉర్రూతలూగుతున్నాయి.

ఇంతలో గంగాధర శర్మ భుజంపై చేయిపడింది. చూడగానే అగ్రవర్ణానికి చెందిన వాడని తెలుస్తోంది.

'మీరీ తక్కువ జనాల తైతక్కల నడుమ ఏం చేస్తున్నారు? బ్రాహ్మణ వాడ అక్కడుంది' అన్నాడు.

‘తక్కువ జనాలా?‘ అడిగాడు గంగాధర శర్మ.

‘తెలియటంలేదా? ఆ భజనలు, పాటలు, నృత్యాలు చుశారు కదా! అది పూజట, అది భక్తి అట! కుప్పిగంతులు పారవశ్యమట. చిట్టిమాటలు, భక్తిస్తోత్రాలు, వేదాంతపు మాటలు అట. ఏమైపోతోందో ఒక్కడికీ ఏమీ తెలియదు. తెలుకోవాలన్న ఆలోచన లేదు‘ గంగాధర శర్మను తన వెంట తీసుకు పోతూ దారంతా గొణుగుతూనే ఉన్నాడతడు.

గంగాధర శర్మ మనస్సులో ఆందోళన ప్రారంభమయింది. కొత్తపద్ధతులకు, పాత పద్దతులకు నడుమ సంఘర్షణ ఉంటుంది. ఈ సంఘర్షణ ఫలితం సమాజగతిని నిర్దేశిస్తుంది. ఇప్పుడు తమ సమాజంలో జరుగుతున్న ఈ సంఘర్షణ ఫలితం ఎలా ఉంటుంది?

ఇంతలో ఏదో మాట, పాటలాంటి శబ్దం పెద్దగా దీర్ఘంగా వినిపించింది.

‘అదేమిటి?‘ అడిగాడు గంగాధర శర్మ.

అతడు ముఖం చిట్లించాడు. ‘అది ఇస్లామీయుల ప్రార్ధన పిలుపు నమాజ్ అట. సరిగ్గా పూజ సమయంలోనే చెవులు చిల్లుపడేలా పిలుస్తారు. గంటలు మోగించవచ్చు, శంఖం ఊదవద్దు అంటారు. వాళ్ళు పాలకులు‘ అన్నాడు కసిగా. గంగాధర శర్మ వెనక్కు తిరిగి చూశాడు. అతడు కృష్ణుడి విగ్రహాన్ని పట్టుకుని కన్నీళ్ళు కారుస్తున్నాడు. హృదయానికి హత్తుకుంటున్నాడు. ఎదురుగా ఆ బ్రాహ్మణుడు దారి చూపిస్తున్నాడు. దూరంగా నమాజ్‌కు పిలుపు వినిపిస్తోంది. ఎందుకో గంగాధర శర్మ శరీరం వణకసాగింది. ఇన్ని విభిన్నమైన శక్తుల నడుమ ఈ సమాజం ఏ వైపు ప్రయాణిస్తుంది?

●●●

సూర్యాస్తమయమవుతోంది. మాలిక్ కాఫర్ సేనలు ప్రయాణానికి సిద్ధమవుతున్నాయి. చంద్రశేఖరుడి వైపు ప్రశ్నార్ధకంగా చూశాడు మాలిక్ కాఫర్.

చంద్రశేఖరుడి ముఖంలో అయోమయం స్పష్టంగా కనిపించింది. మాలిక్ కాఫర్ నవ్వాడు.

‘నీకు కొంతమంది సైనికులను ఇస్తాను. వెళ్ళు పద్మినిని పట్టుకునిరా. నేను దక్షిణ దేశాలను గెలుచుకునే దారిలో ఉంటాను. వచ్చి కలువు. కాకతీయుల గర్వమణచాలి. ఇంకా క్రిందకు వెళితే బోలెడంత ధనరాశులు మందిరాలలో కులుకుతున్నాయని విన్నాను.

ఇంతవరకూ ఇస్లాం ఆ ప్రాంతాల్లో అడుగుపెట్టలేదు. ఈ కత్తి అందగా ఇస్లాంను దక్షిణ దేశాలలో ప్రవేశపెడతాను. ఈ కత్తితో ఎవ్వరూ తాకని విగ్రహాలను ధ్వంసం చేస్తాను. మందిరాలను నేలమట్టం చేస్తాను. కాఫిర్ రాజుల మదం అణుస్తాను.'

చంద్రశేఖరుడి కళ్ళల్లో కదలాడుతున్న భయం, అసహ్య భావనలను చూసి వికటంగా నవ్వాడు మాలిక్ కాఫర్.

'చంద్రశేఖరా.. ఇది నేను చివరిసారి నీ పేరుతో పిలవటం. ఒకటి గుర్తుంచుకో ఇక నీకు వెనుతిరగటం అన్నది లేదు. నన్ను కాదని వెళితే నీ వాళ్ళు నిన్ను రానివ్వరు. నేను నిన్ను బ్రతకనివ్వను. నీకు వేరే మార్గం లేదు. నీవాళ్ళే కనక రానిచ్చే వాళ్ళే అయితే ఈనాడు నేను తురక రాజుల కామదాహాన్ని తీర్చే స్థితికి దిగజారే వాడినే కాను. కత్తితో విగ్రహాలను ధ్వంసం చేసి సనాతన ధర్మాన్ని సమూలంగా పెకిలించి వేయాలని కంకణం కట్టుకునే స్థితికి ఎదిగే వాడినే కాను' అన్నాడు. అతని కళ్ళల్లో కసితో పాటు సన్నని నీటి పొర కూడా కదలాడింది.

చంద్రశేఖరుడి నోరెండిపోయింది. ఇదేనా తన భవిష్యత్తు? ద్వేషంతో రాక్షసుడిలా జీవిస్తూ, అదే పవిత్ర దైవకార్యమని తనని తాను మోసం చేసుకోవటమేనా తన జీవితం?

కొందరు సైనికులు వచ్చి చంద్రశేఖరుడికి సలామ్ చేసి నిలబడ్డారు.

తల విదిలించాడు చంద్రశేఖరుడు. ఇదే తన జీవితం అయితే క్షణం క్షణం తిట్టుకుంటూ ఏడుస్తూ బ్రతికి లాభంలేదు. జీవితాన్ని ఆనందంగా అనుభవిస్తూ బ్రతకాలి. కత్తిని బలంగా పట్టుకున్నాడు.

తన ఆజ్ఞ కోసం సిద్ధంగా నిలబడ్డ సైనికుల వైపు చూశాడు.

కత్తిని ఎత్తి పట్టుకుని, వీరావేశంతో, గొంతు చించుకుని అరిచాడు 'అల్లాహో అక్బర్'

క్షణంలో ఆ ప్రాంతంలోని సైనికులందరి ఆవేశం మిన్నంటింది. నినాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది.

ఒక ఎగసి పడే కెరటంలా, సర్వం ముంచెత్తటానికి ఆకాశానికి ఎగసిన అలలా గుర్రాన్ని ముందుకు దూకించాడు చంద్రశేఖరుడు.

'మాలిక్ కాఫర్ సాబ్.. నాకు పద్మిని వద్దు. నేనూ మీ వెంట వస్తాను. కాఫిర్‌లను నా కత్తికి ఎర చేస్తాను' అన్నాడు.

మాలిక్ కాఫర్ నవ్వాడు.

●●●

సమాజం మారుతోంది. ధర్మ స్వరూపం మారుతోంది. ఎడారిలో మొక్కలకు ఆకులుండవు. ఎన్ని ఎక్కువ ఆకులుంటే నీరు అంతగా ఆవిరవుతుంది. కాబట్టి నీటిని దాచుకుని, ఆవిరవ్వని రీతిలో మొక్కలు రూపొందుతాయి. అదే నీళ్ళున్న చోట శాఖోపశాఖలుగా విస్తరిస్తాయి. నీరు లేని చోట ముడుచుకుని మూసిన గుప్పెటలా ఎదుగుతాయి. ఎలా ఎదిగినా వాటి లక్ష్యం ఒకటే. ప్రాణంతో ఉండటం. జీవితంతో ఉండటం. తరువాత తరానికి జీవాన్ని అందించటం సనాతన ధర్మం కూడా అలా సజీవంగా ఉండేందుకు పలురకాలుగా రూపాంతరం చెందుతోంది. ఎన్ని రకలుగా రూపాంతరం చెందినా తన మౌలిక లక్షణాన్ని మాత్రం సజీవంగా ఉంచుకుంటోంది.

తన చుట్టూ సంభవిస్తున్న పరిణామాలను చూస్తూంటే గంగాధర శర్మకు భారతీయ ధర్మ స్వరూపం బోధపడుతున్నట్టుంది. ఎందుకని ఈ ధర్మం అనంత కాలం నుంచీ సజీవంగా ఉంటోందో, అనంత కాలం వరకూ సజీవంగా ఉంటుందో అర్థమవుతున్నట్టుంది.

ఇప్పుడు అతడి ఎదురుగా కనిపిస్తున్న దానికీ వేదకాలం నాటి ధర్మానికీ పోలిక లేదు కానీ ఇప్పుడు కడుతున్న అంతస్తు పునాది వేదమే. వేదం ఆధారంగా ఎదిగిన భవంతిపై నూతన అంతస్తు నిర్మితమవుతోంది.

ఇప్పుడు యజ్ఞయాగాదులు చేసే సమయం ఎవరికీ లేదు. తీరికలేదు. ప్రాణానికి భద్రత లేదు. అందుకని పూజా విధానం మారింది.

యజ్ఞగుండాలకి ప్రతిగా దేవాలయాలు వెలిశాయి. దేవాలయాలకు భద్రత లేక పోవటంతో దేవాలయాల నిర్మాణ శైలి మారింది. పెద్ద పెద్ద కట్టడాలు పోయాయి. ఇళ్ళల్లో ఇళ్ళలాంటి దేవాలయాలు మొదలయ్యాయి.

నిరాకార నిర్గుణ పరబ్రహ్మ స్వరూప భావాన వెనుకబడింది. కళ్ళకు కనబడే దివ్యమంగళ స్వరూపం వైపు దృష్టి మళ్ళింది.

అదీ కఠినమవటంతో సులభంగా ధ్వనించగలిగే దేవతల సృష్టి జరుగుతోంది. వేదకాలంలోని దేవతల ప్రాధాన్యం తగ్గి పురాణాల ప్రాధాన్యం పెరుగుతోంది. మంత్రాలు నేర్వటం, వల్లెవేయటం కఠినం కావటంతో భజనలు, ప్రార్ధనల ప్రాధాన్యం పెరుగుతోంది.

ఋషులలా తపస్సు చేసే వీలు లేకపోవటంతో ఆధ్యాత్మికత అధికంగా ఉన్న సామాన్యులే దైవ స్వరూపులవుతున్నారు. సమాజ దృష్టిని ఆధ్యాత్మికత వైపు మళ్ళిస్తున్నారు. భారతీయ ధర్మాన్ని రూపాంతరమందిస్తున్నారు. కానీ సజీవంగా ఉంచుతున్నారు.

తన ఎదురుగా జరుగుతున్న మార్పులలో ప్రకృతి వికృతులు రెండూ గంగాధర శర్మ చూడగలుగుతున్నాడు.

మనుషులకు దైవత్వం ఆపాదించటం వల్ల దైవభావన అపహాస్యం పాలయ్యే ప్రమాదం ఉంది. ఎందుకంటే మనుషులు ఎంతయినా మనుషులే. వారి బలహీనతలు దైవానికి అంటుతాయి. వారి వల్ల ధర్మం ప్రజల దృష్టిలో దిగజారుతుంది.

మరో వైపు ఆధ్యాత్మకతలో దైవ స్వరూపాలుగా భావిస్తున్నా వారు కొంత కాలానికి తమ, మూలలను మరచి పోయే వీలుంది. తమని తాము ప్రత్యేకంగా భావించుకుని, భారతీయ ధర్మం అనే మహా వృక్షం నుండి ఉద్భవించిన శాఖలమని మరచి, తమని తాము ప్రత్యేక వృక్షంగా నమ్మేవీలుంది. కళ్ళు మూసుకున్నాడు గంగాధర శర్మ.

అతని కళ్ళ ముందు ఏవేవో దృశ్యాలు కదలాడుతున్నాయి.

మార్పు సహజం. అది జీవలక్షణం. మార్పుతో మారకపోవటం మరణసదృశ్యం.

ఈ మార్పు పట్ల అవగాహన సాధించి, భవిష్యత్తులో సంభవించే మరిన్ని మార్పులున్న సమాజాన్ని సిద్ధం చేయాలి.

భగవంతుడా, నా ధర్మం సజీవంగా ఉండటం కోసం పలు విధాలుగా జరుగుతున్న పోరాటాలలో నా పాత్ర ఏమిటి?

గంగాధర శర్మ మనస్సు ఒక్కసారిగా నిశ్చలమయిపోయింది. అలలతో అల్లకల్లోలంగా ఉన్న కడలిలో, ఎగిసిపడే అలలు అదృశ్యమైనట్టు తోచింది. అతడిని ఎదో తెలియని ప్రశాంతత ఆవరించింది.

అలా ఎంతసేపు నుంచున్నాడో అతడికి తెలియదు. ఏవేవో శబ్దాలవుతున్నాయి గాలి వీస్తోంది. వర్షం కురుస్తోంది. వెలుతురు వస్తోంది. చీకటి నిండుతోంది. ఇవేవీ పట్టనట్టు కూచుండిపోయాడు గంగాధర శర్మ.

ఎందుకో హఠాత్తుగా నిద్రనుండి మెలుకువ వచ్చినట్టయింది గంగాధర శర్మకు కళ్ళు తెరిచాడు.

సూర్యోదయమవుతోంది.

ఆకాశంలో సూర్యకిరణాల కుంచెలు విభిన్నమైన వింత వింత రంగులతో అలవికాని అందమైన చిత్రాలు గీస్తున్నాయి. ఆ చిత్రలేఖనాన్ని ఆనందంతో చూస్తూ తలలాడిస్తున్నాయి వృక్షతతులు. ఆకుల గలలు హర్ష ధ్వానాలలా ఉన్నాయి.

ఈ అందమైన దృశ్యానికి పరవశంతో పాటలు పాడుతున్నట్టున్నాయి పక్షుల కలకలంతో తన కర్తవ్యం బోధపడింది గంగాధరశర్మకు.

ఇంతలో అతడి దృష్టి తననే తదేకంగా చూస్తున్న ఆ యువతిపై పడింది. ఆమె వెనకే కత్తి పట్టుకుని రక్షణగా శిలలా నిలుచున్న ఆ యువకుడిపై పడింది.

గంగాధర శర్మ పెదవులపై చిరునవ్వు నిలిచింది.

'నన్ను వెతుకుతూ వచ్చావా పద్మినీ?' అడిగాడు గంగాధర శర్మ.

పద్మిని మౌనంగా అతడి వైపే చూడసాగింది. అతడిలో ఏదో మార్పు సంభవించింది. అదేమిటో ఆమెకు స్పష్టంగా తెలియటం లేదు.

ప్రహరసింహుడు నోరిప్పాడు.

'చంద్రశేఖరుడు తురుష్కులతో కలిశాడు. రాక్షసులు సైతం భయపడే క్రౌర్యం ప్రదర్శిస్తున్నాడు. '

'పద్మినిని నీకు అప్పగించటానికి వచ్చాను' అన్నాడు.

గంగాధర శర్మ ముఖంలో ఎలాంటి భావం కనబడలేదు.

'పద్మినీ నా జీవిత లక్ష్యం నిర్ణయించుకున్నాను. ప్రస్తుతం మన ధర్మ సంరక్షణ కోసం పోరాటం పలు భిన్న రూపాలలో సాగుతోంది. నేను కత్తి పట్టుకుని యుద్ధం చేయనని ప్రతిన పట్టాను. భౌతిక పోరాటం ప్రహరసింహుడిది నేను ఊరూ వాడా తిరుగుతాను.

భారతీయ తత్వాన్ని పాటల రూపంలో, కవితల రూపంలో సరళంగా స్థానికి భాషలలో రచిస్తాను. ప్రచారం చేస్తాను. నాజాతి జనులు మనసారా పాడుకునే సుందరగీతాల రూపంలో వేద విజ్ఞానాన్ని పొందుపరుస్తాను. కఠిన వేదాంత తత్వాన్ని రెండు మూడు పాదాలలో ప్రతిబింబించే సులభ సంక్షిప్త కవితలను సృజిస్తాను.

'పద్మినీ, ఈ సమాజంలో కుల భేదాలను, వర్ణ వివక్షతను రూపు మాపే ప్రయత్నం ప్రజల మనస్సాక్షిని తట్టి లేపుతాను. అన్ని భేదభావాలను మరచి అందరం ఒకటిగా నిలిచి మన ధర్మాన్ని నిలుపుకోవాల్సిన సమయం ఇది. నేను మాములు సంసారిగా జీవితం గడపలేను. నాదన్నదేదీ లేక, ధర్మ ప్రచార దీక్షలో దేశమంతా తిరుగుతాను. మహావ్యక్తుల తత్వాల పదఘుట్టనలకిగాసే ఒక ధూళి కణంలా నేను విహరిస్తాను. ప్రసరిస్తాను. నాతో రాగలిగితే రా. నేను నీకు సుఖాన్ని ఇవ్వలేను. ఎలాంటి భోగాలనివ్వలేను. కానీ ధర్మ ప్రచారం ద్వారా ధర్మ రక్షణ చేయటం వల్ల కలిగే సంతృప్తిని, మానసిక శాంతినీ నీకివ్వగలను. మన ప్రయత్నాల ఫలితం మనం చూడలేం కానీ తరతరాలపై మన ప్రభావం ఉంటుంది. మనం ఎవ్వరమో ఎవ్వరికీ తెలియదు. మన జీవితగాధలు తెలియవు. కానీ మన చర్యల ఫలితంగా, ధర్మ స్థాపన దీక్షలోని వేనవేల సమిధిలలో మనమూ ఒకటై భావితరాలకు వెలుగు అందుతుంది. అందుకు సిద్ధమైతే నాతో రా..' అన్నాడు.

గంగాధర శర్మ ముఖం వెలిగిపోతోంది. పద్మిని అడుగు ముందుకు వేసి అతడి చేయి పట్టుకుంది. ఇద్దరి వదనాలలో అలౌకికమైన ఆనందం కనిపిస్తోంది. వారి కళ్ళముందు సుందరమైన భవిష్యత్తు కనిపిస్తోంది.

తుఫానులు వస్తాయి. కానీ ఎక్కువ కాలం ఉండవు. వస్తాయి పోతాయి. మేఘాలు తొలగుతాయి. సూర్యుడు మళ్ళీ తన వెలుగులుతో జగతిని ఆనందమయం చేస్తాడు సనాతన ధర్మం వినూత్న రూపంలో ఓ గతిని ఆధ్యాత్మిక వెలుగులు ప్రసరిస్తూ, ప్రశాంతమయ జీవితాన్ని అందించే బంగారు భవిష్యత్తును దర్శిస్తున్నట్టు ఆనందం వారి కళ్ళల్లో కనిపిస్తోంది.

కత్తిని సిద్ధంగా పట్టుకుని తన కర్తవ్యాన్ని నిర్వహించేందుకు అడుగులు వేస్తూ వెళ్ళిపోయాడు ప్రహరసింహుడు.

●●●

**(సమాప్తం)**